First time in Telugu Literature
Western Classics Series - 7



## Dante

# The Divine Comedy



## డాంటీ

# డివైన్ కామెడి

స్వేచ్ఛానువాదం

డాక్టర్ లంకా శివరామప్రసాద్

**DANTE**

# The Divine Comedy

డాంటీ

# డివైన్ కామెడి

**Part - I**

## INFERNO

## (నరకాగ్ని లోకం)

స్వేచ్ఛానువాదం

**డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# The Divine Comedy

**Dante**

Translated by

**Dr. Lanka Siva Rama Prasad**

October 2012

All rights reserved

Translation Copyright @ 2012
by **Dr. Lanka Siva Rama Prasad**

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL
Andhra Pradesh - 506 002, INDIA
Mobile : 8897849442, 9177646501
Email: lankasrprasad@gmail.com

Available at :

**Vishalandhra Book House**
All Branches

Price : ₹ **250** **$ 6**

Cover Design & Post Script

**Gannu Suresh & P. Prakash**

Printed at :

**Vasavi Printers**
J.P.N. Road, Warangal. ✆ 0870-2426364

***This book is presented to...***

# ప్రస్తావన

పాపులకు నరకలోకంలో శిక్షలు విధించబడతాయనే సిద్ధాంతం దాదాపు అన్ని ప్రాచీన మతాల్లోనూ ఉన్నది. మనిషి మరణించాక ఆత్మ ఏమవుతుంది? అన్నది ఉపనిషత్తులలో ప్రధానాంశం కాగా, భాగవతం, దేవీభాగవతం లాంటి పురాణాలలో నరకలోకంలో పాపులకు విధించబడే శిక్షలు, రకరకాల అధోలోకాలు వర్ణించబడినాయి. అప్సరసలు, స్వర్గలోకపు సుఖాలు వీటికోసం మునుల తపస్సులు మనందరికీ తెలిసినవే! పునర్జన్మలపై విశ్వాసాలు, భగవంతుని కరుణ, ధర్మాన్ని రక్షించడానికి అవతారాలు ఎత్తడం మన సంస్కృతిలో, వాఙ్మయంలో భాగమై ప్రసిద్ధికెక్కినాయి.

'డాంటీ' రచన – The Divine Comedy అటువంటి ఎత్తుగడలతోనే ఉండి, మహాకవి వర్జిల్ స్ఫూర్తిగా అత్యద్భుతంగా సాగే రచన. భగవానుని బృహత్ పథకం (The Lord's grand design)లో Inferno (నరకాగ్నిలోకం), Purgatory (ప్రక్షాళనాలోకం), Paradiso (స్వర్గలోకం)లో పాపులు శుద్ధిచేయబడి దివ్యాత్మలుగా భగవానుని సన్నిధిలో ఎలా చేరతారో వర్ణించబడింది. గంగానది, ఇండియన్ల గురించి అనేకసార్లు చెప్పబడిన ఈ కావ్యంపై మన పురాణాల ప్రభావమో లేక మనపై వాళ్ల ప్రభావం ఉందో చెప్పడం కష్టం కాని, నరకలోకంలోని శిక్షలు, అజామిళుని కథలాంటి కథ, ఇవన్నీ మనల్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతాయి.

'డాంటీ' లోకానికి ఉత్తర సరిహద్దు 'గాంగెస్' (Ganges) గంగానది కావడం, ఇండియా అడవులతో పోలికలను చెప్పడం – డాంటీ కాలం (1265-1321 A.D.) నాటికి మనదేశానికి ఇటలీ – రోమ్ – ఫ్లోరెన్స్ మధ్య ఉన్న రాకపోకలను సూచిస్తున్నాయి.

ఒక్క ఆంగ్లభాషలోనే దాదాపు 90 అనువాదాలున్న డాంటీ అద్భుత రచన The Divine Comedy - మూడు భాగాలను ఒకే పుస్తకంగా సృజనలోకం తెలుగు పాఠకులకు అందిస్తున్నది. పాశ్చాత్య సాహిత్యాకాశంలో వెలసిన ఇంద్రధనుస్సులోని ఏడవ వర్ణంగా ఈ గ్రంథాన్ని తెలుగు సాహిత్యాభిమానులు విశేషంగా ఆదరిస్తారని సృజనలోకం మనసా, వాచా విశ్వసిస్తున్నది.

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# డాంటీ అలిఘీరి
## (DANTE ALIGHEIRI - 1265-1321)

అలిఘీరీ డెగ్లి అలిఘీరి, బెల్లాల కుమారుడు డాంటీ, 1265లో ఫ్లోరెన్స్‌లో జన్మించాడు. డాంటీ గురువు, స్నేహితుడు అయిన 'గిడో కావల్‌కాంటి' ఇతడిని కవిగా తీర్చిదిద్దాడు. ప్రేమ కవిత్వంతో మొదలైన డాంటీ రచనలల్లో Vita Nuova (New Life - 1293-1294) ప్రముఖమైనది. బియాట్రైస్ అనే యువతి ఇతడిని ప్రభావితం చేయగా వెలువడిన గొప్ప కవిత్వ రచన ఇది. తొమ్మిదేళ్ల వయసులో ఆమెను తొలిసారిగా చూసిన డాంటీ, ఆతని ఇరవై అయిదవ ఏట ఆమె మృతి చెందడంతో అతని కవిత్వం ఇహలోక, పరలోక భావనలతో విస్తృతమైంది.

డాంటీ ఫ్లోరెన్సులో సైనికుడిగా, నాయకుడిగా ఎదిగి న్యాయాధిపతుల్లో ఒకడైనాడు. అప్పటికే చర్చికి, రాజ్యానికి మధ్య ఘర్షణ తీవ్రతరమైంది. చర్చిని సమర్థించినవారు గ్యుల్ఫ్ (Guelfs), రాజరికాన్ని సమర్థించినవారు ఘిబెల్లైన్లు (Ghibellines)గా అంతర్యుద్ధాలు మొదలైనాయి. ఫ్లోరెన్సులో అవి రెండు కుటుంబాల మధ్య వివాదంగా బుయొన్ డెల్మాంటి (Buon delmonti), అమిడీ (Amidei)ల జగడంగా మారింది. డాంటీ పూర్వీకులు గ్యుల్ఫ్‌లు కావడంతో డాంటీ ఘిబెల్లైన్లకు వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొన్నాడు. తరువాత ఫ్లోరెన్సులో సెర్చి (Cerchi), డొనాటి కుటుంబాల మధ్య తగాదా గ్యుల్ఫెలను తెలుపు (Bianca-White), నలుపు (Nera-Black)లుగా విడదీయడంతో డాంటీ 'తెలుపు' పక్షాన ఉండి, ఫ్లోరెన్సు – పోప్ ఆధీనంలోకి (బొనిఫేస్) రాకుండా ప్రయత్నం చేసినాడు. బ్లాక్స్ (నలుపు) పక్షం అధికారంలోకి రాగా డాంటీకు నగర బహిష్కారం, మరణదండన విధించడంతో డాంటీ చనిపోయేంతవరకు ప్రవాసంలోనే గడపవలసి వచ్చింది.

ప్రవాసంలో ఉండగా Convivo (Banquet), Nonarchia వ్రాసిన డాంటీ 1307–1308 ప్రాంతంలో 'కామెడి' (The Divine Comedy was named by his admirers later) మూడు భాగాలుగా – 'Inferno, Purgatorio, Paradiso' గా రచించాడు. 1321లో వెనిస్‌కు సంప్రదింపుల విషయమై వెళ్లిన డాంటీ అస్వస్థుడై, రావెన్నా (Ravenna)కు తిరిగివచ్చి అక్కడే కన్నుమూసాడు. The Divine Comedy అతని కీర్తి ప్రతిష్ఠలను చిరస్థాయిగా నిలిచేట్లు చేసింది.

# విషయసూచిక

## Part - I - INFERNO (నరకాగ్నిలోకం)


| | |
|---|---|
| **Canto-1** | వర్జిల్‌ను కలిసిన బాటసారి (డాంటీ) |
| **Canto-2** | వెనుకంజ వేస్తున్న బాటసారికి ధైర్యం చెప్పిన వర్జిల్ |
| **Canto-3** | నరకలోకంలో వర్జిల్, డాంటీలు |
| **Canto-4** | నరకలోకపు మొదటి వలయం – లింబో |
| **Canto-5** | కామంతో కళ్లుమూసుకుపోయిన పాపులకు శిక్షలు |
| **Canto-6** | తిండిపోతులకు నరకలోకపు శిక్షలు |
| **Canto-7** | దురాశాపరులు పడే నరకయాతనలు |
| **Canto-8** | ఫ్లెగియాస్, ఫిలిప్పో అర్జెంటి |
| **Canto-9** | నాస్తికులు శిక్షింపబడే 'డిస్' నగరం |
| **Canto-10** | 'ఫారినాటా'తో డాంటీ సంభాషణ |
| **Canto-11** | ఏడవ వలయంలో అనాస్టాసియస్ గోరీ |
| **Canto-12** | హింసా ప్రవర్తకులకు శిక్షలు |
| **Canto-13** | బలవన్మరణం చెందినవారికి పడే శిక్షలు |
| **Canto-14** | దైవద్రోహులకు విధించబడే శిక్షలు |
| **Canto-15** | డాంటీ గురువు బ్రెనెట్టో లాటిని |
| **Canto-16** | ముగ్గురు మిలిటరీ మిత్రులు |
| **Canto-17** | కళాధ్వంసకులను శిక్షించే ప్రదేశం |
| **Canto-18** | కాముకులకు, స్త్రీలను వలలో వేసుకునేవాళ్లకు శిక్షలు |
| **Canto-19** | దేవుని సొమ్మును కైంకర్యం చేసినవారికి శిక్షలు |
| **Canto-20** | జ్యోతిష్కులకు విధించబడే శిక్షలు |
| **Canto-21** | ప్రజల, ప్రభుత్వ ధనభోక్తలకు శిక్షలు |
| **Canto-22** | నరకలోకపు పిశాచభటులు |
| **Canto-23** | ఆత్మ వంచకులకు శిక్షలు |
| **Canto-24** | దొంగలకు విధించబడే శిక్షలు |
| **Canto-25** | రూపాంతరం చెందిన ఆత్మలు, సర్పాలు |
| **Canto-26** | డయొమెడి, యులిసెస్‌లు |
| **Canto-27** | గిడొ డమాంటెఫెల్ట్రో చెప్పిన వృత్తాంతం |
| **Canto-28** | మతభ్రష్టులకు, మతాన్ని చీల్చేవాళ్లకు శిక్షలు |
| **Canto-29** | ఆల్కెమిస్టులకు, ఫోర్జరీ చేసేవాళ్లకు శిక్షలు |
| **Canto-30** | దొంగ నాణేలు చెలామణీ చేసేవాళ్లకు శిక్షలు |
| **Canto-31** | నమ్మకద్రోహం చేసేవాళ్లకు శిక్షలు |
| **Canto-32** | తమ దగ్గర బంధువుల్ని చంపినవాళ్లు అనుభవించే శిక్షలు |
| **Canto-33** | దయ నటించి మోసంచేసేవాళ్లకు శిక్షలు |
| **Canto-34** | మేలు చేసినవారికి కీడుచేసే దుర్మార్గులకు శిక్షలు |

## Canto - 1

**చీకటి అరణ్యంలో దారితప్పిన రచయిత, ఓ కొండను ఎక్కబోతుంటే, అడవి జంతువులు అడ్డువచ్చినాయి. అక్కడే అతడికి 'వర్జిల్' కనిపించి నరకలోకపు శిక్షలను తరువాత పర్గేటరీ (ప్రక్షాళనా లోకం)ని చూపిస్తానని వాగ్దానం చేస్తాడు. అక్కడ నుంచి బియాట్రైస్, రచయితను స్వర్గానికి నడిపిస్తుందని వర్జిల్ వివరించగా రచయిత రోమన్ మహాకవి వర్జిల్‌ను అనుసరిస్తాడు.**

# వర్జిల్‌ను కలిసిన బాటసారి (డాంటీ)

అశాశ్వతమైన మన మానవజీవిత మధ్యాంకంలో నేను ఓ చీకటి అరణ్యంలో, ఋజుమార్గాన్ని విడిచి, గమ్యం లేకుండా తిరుగుతూండగా నన్ను నేను కనుగొన్నాను. ఈ విషయాన్ని వివరించడం కూడా అంత సులభం కాదు. ఆ దుర్గమారణ్యం దట్టంగా, క్రూరంగా, గాఢాంధకారంగా ఉండి, అక్కడ నేను పడిన కష్టాలను మరల తలుచుకుంటేనే ఒళ్లు జలదరించగా దాదాపు మృత్యువంత భయంకరంగా నన్ను భయపెట్టింది.

ఎలా ఆ అడవిలోపలికి ప్రవేశించానో సరిగా గుర్తులేదు. ఏదో నిద్ర లాంటి బద్ధకం నా ఇంద్రియజ్ఞానాన్ని పోగొట్టగా నేను సత్యమార్గాన్ని వదిలి దారితప్పి, ఇదిగో ఈ కొండ పాదాల వద్దకు చేరుకున్నాను. నన్ను నానా రకాలుగా భయపెట్టి దాదాపు చంపినంత పనిచేసిన ఈ అరణ్యపు లోయ ఇక్కడితో అంతమైనట్లున్నది. వణుకుతున్న గుండెను అదిమి పట్టుకుని నేను అల్లంతదూరంలో ఓ వ్యక్తి కనిపించగా, నాకు చీకటిలో కాంతిరేఖ కనిపించినట్లై ఆతడివేపు నడిచాను. వెడల్పు భుజాలతో, భూమిపైబడిన కాంతికిరణాలతో వెలుగుతున్నవాడు, దారి తప్పి తిరుగుతున్నవాళ్లను కాపాడి రక్షిత ప్రదేశానికి తీసుకువెళ్లేవాడు, ఆ మార్గదర్శి నాకు కనిపించాడు.

నా గుండెల్లో దాక్కున్న భయమింకా పూర్తిగా పోలేదు.

అడవిలో గమ్యం లేకుండా తిరుగుతూ నానా యాతనలూ పడడంతో వచ్చిన ఆయాసమూ తగ్గలేదు. రొప్పుతూ, రోజుతూ, భారంగా ఊపిరి పీలుస్తూ కాస్త స్థిమితపడి కొండ ఎక్కడానికి ప్రయత్నించాను. అతడు ఆ కొండ మీద ఉన్నాడు. నిటారుగా ఉన్న ఆ కొండ ఎక్కబోతున్నానోలేదో ఏదో అలికిడి! చూద్దును గదా! భయంతో నా గుండె జలదరించింది! అదుగో కళ్లు మిలమిలా మెరుస్తూ చిరుతపులి! నేనటు చూడగానే మాయమయ్యింది. ముందుకు పోవడానికి భయంవేసి నేను వెనక్కి తిరిగాను.

ఉదయపు తొలిజాము సమయం. నక్షత్రాలింకా కనిపిస్తూనే ఉన్నాయి. సూర్యుడు తూర్పువాకిట అడుగు పెడ్తున్నాడు. అతడితోపాటే దివ్యప్రేమ కూడా అంతటా వ్యాపించి నాలో కొత్త ఆశను చిగురింపజేసింది. మాయమైన చిరుతపులి, ఉదయసంధ్య, చక్కటి కాలం నన్ను పరవశింపచేసే లోపునే భీకరంగా గర్జిస్తూ ఆకలిగొన్న సింహం, దాని వెనకే బక్కగా ఉన్న ఆడతోడేలు. ఆకలితో నకనక లాడ్తున్నట్లు నన్ను చూస్తుంటే, గాలి కూడా భయంతో గడ్డకట్టింది. ఒళ్లంతా వణుకుతుంటే, చెమటలు ప్రవాహంగా కారుతుండగా, గుండె దడదడ లాడుతుండగా వెనక్కి అడుగువేసిన నేను వెల్లకిలా పడిపోయాను. ఏదో అస్పష్టరూపం నాపై నీడను కమ్మింది. చానాళ్లపాటు మౌనంగా వుండి ఇప్పుడు వెలికివచ్చిన గొంతుతో ఆ వ్యక్తి ఏదో మాట్లాడినట్లనిపించి నేను పెద్ద కేక పెట్టాను– “నామీద దయ ఉంచు! నీవు ఆత్మవో! మనిషివో! ఎవరివైనా సరే నన్ను కాపాడు!”

అతడన్నాడు– “నేను ఇప్పుడు మానవరూపంలో ఉన్న ఆత్మను. మాంటువా దేశంలోని లోంబార్డ్ ప్రాంతపు వాళ్లు నా తల్లిదండ్రులు. జూలియస్ సీజర్ ఇంకా స్థిరపడని కాలంలో నేను పుట్టాను. ఆగస్టస్ సీజర్ ఆస్థానంలో కవి గాయకుడిని (Bard) నేను. మిథ్యాదేవతలను, కుహనా దేవుళ్లను నమ్మి పూజించిన కాలమది. నేను ఏంఖైసిస్ కుమారుడు ఈనియస్ జీవితం ఆధారంగా ‘ఈనీడ్’ కావ్యగానం చేసాను – ఇలియం (ట్రాయ్) నగరపు బురుజులు మంటల్లో తగలబడిపోతున్న రోజుల గురించి ఆ కావ్యం. అది సరే! ఇన్ని కష్టాలు పడుతూ నీవెక్కడికి పోతున్నావు? నీవెందుకు ఈ ఆహ్లాదకరమైన కొండ నెక్కుదామని అనుకుంటున్నావు? ఎక్కడైతే ‘వర్జిల్’ తన అద్భుత కావ్య ప్రవాహాన్ని సృజించాడో అక్కడికెందుకు వచ్చావు? వివరించు సుమా!”

నేను లేచి కూర్చుని అన్నాను– “మహేతిహాసాన్ని రచించి సాహిత్యాన్ని వెలుగులతో నింపిన మహాకవికి జయమగుగాక! నన్నెంతో ప్రభావితం చేసిన గ్రంథం అది. మహానుభావా! నీవే నా యజమానివి, మార్గదర్శకుడివి! (Master and guide) నీ మార్గం, నీ రచనామార్గంలో నేను నడుస్తున్నాను! ప్రభూ! అదుగో ఆ క్రూరమృగం నుంచి నన్ను కాపాడు. దానిని చూసి నా శరీరంలోని ప్రతి నరమూ, కణమూ భయంతో వణుకుతున్నవి. నాకు మార్గం చూపించు!”

నేను ఏడుస్తూ ఉండడం చూసి అతడన్నాడు– “నీవు ఈ దారి విడిచి వేరే దారిన పోయినా ఆ క్రూరమృగం నుంచి తప్పించుకోలేవు. అది నిన్ను చంపకుండా వదిలిపెట్టదు. దాని ఆకలి ఎంత తిన్నా తరగనిది. ఎందరినో అది వివాహపు ఉచ్చుల్లో పడవేసి నంజుకుతిన్నది. ఏదో ఒకరోజున ఓ వేటకుక్క వచ్చి దానిని కొరికి చంపగలదు.

అతడు ఈ భూమిపై ఉన్న అశాశ్వత సంపదలకు ఆశపడడు. ప్రేమకు, జ్ఞానానికి, సుగుణాలకు కట్టుబడే ఆతడి రాజ్యం రెండు లోకాల మధ్య ఉన్నది. అతని పాలనలో ఇటలీ నేల ఉజ్వలంగా ప్రభవిస్తుంది. ఏ నేలలోనైతే కామిలా కన్య (Camilla), నైసస్ (Nisus), యూరియాలస్ (Euryalus), టర్నస్ (Turnus)లు నేలకూలినారో, అక్కడే ఆ మహావ్యక్తి ప్రతి పట్టణంలోనూ పేట్రేగిన నరకాన్ని వేటాడి దివ్యజీవనాన్ని పునరుద్ధరిస్తాడు. నేను నీ అన్వేషణలో మార్గదర్శకుడిగా ఉండి, అనంతమైన ప్రదేశంలో నిన్ను తీసుకునివెళ్తూంటే – నీవు నరకయాతనలు పడ్తున్న ఆత్మల మూలుగులు, రోదనలు, చావుకేకలు వింటావు. అక్కడ రెండవ మృత్యువు (Second death)ను గమనించాక, ఆ చీకటి లోకాన్ని విడిచి, అగ్నిజ్వాలల మధ్య ప్రకాశిస్తున్న రెండవ లోకాన్ని చూసి ఆశలు చిగురించగా అక్కడ కొంతకాలం దివ్యాత్మలతో కాలం గడుపుతావు. నేను నిష్క్రమించాక నాకంటే ఉన్నతమైన ఆత్మ కలిగిన నీవు నీ సమయం వచ్చినప్పుడు పై లోకానికి పిలువబడతావు. ఆ సర్వశక్తిమంతుడైన ప్రభువు, దేవాధిదేవుడు (Almighty King) అతడిపై తిరుగుబాటు చేసిన నన్ను, నా ద్వారా ఎవర్నీ తన రాజ్యంలోకి తీసుకు రాకూడదని శాసించినాడు. తన శాసనాలతో, తన కోటలోని సింహాసనంపై కూర్చుని ఆతడు పరిపాలిస్తూంటాడు. "ఆహా! అతడు ఎన్నుకున్న వారెంత ధన్యులు! (O happy those, whom there he choses!)"

నేనన్నాను– "మహాకవీ! గాయకుడా! ఆ దేవుడి దగ్గరకు వెళ్లే దారిన నన్ను నడిపించు. ఈ భీకరారణ్యాన్ని వదిలి నేను సెయింట్ పీటర్ (Saint Peter) ద్వారాన్ని వీక్షించే అవకాశాన్నివ్వు. నీవు చెప్పిన ఆ దురదృష్టవంతుల కష్టాలను చూడనివ్వు! మార్గదర్శకుడా! నన్ను అనుగ్రహించు!"

మౌనంగా ఆతడు ముందుకు కదిలినాడు. నేను ఆతడిని అనుసరించాను.

**Canto - 2**

**ప్రార్థన ముగిసింది. కవులు తమ రచనలకు ముందు వ్రాసే దేవతా ప్రార్థన పూర్తి కాగానే డాంటీ తాను చేయవలసిన ప్రయాణాన్ని, దారిలో ఎదురయ్యే కష్టనష్టాలను అంచనావేసి తనకా శక్తి ఉన్నదా లేదా అని సందేహిస్తుండగా వర్జిల్ ఆతనికిచ్చిన ధైర్యంతో తనకు ప్రభువు, మార్గదర్శకుడు అయిన వర్జిల్‌ను అనుసరిస్తాడు.**

# వెనుకంజవేస్తున్న బాటసారికి ధైర్యం చెప్పిన వర్జిల్

సాయంకాల సమయమైనది. వెలుగు తీవ్రత తగ్గి నీడలు అలుము కుంటుండగా, జంతువులన్నీ తమ దైనందిన కార్యక్రమాల్ని ముగించి విశ్రాంతి తీసుకుంటున్నాయి. కాని నేను, నన్ను బాధిస్తున్న సందేహాల నడుమ కొట్టుమిట్టాడు తున్నాను.

సకల కళాధిదేవతలారా! మ్యూజెస్! ఓ ఉన్నతుడవైన ప్రభూ! మీ సహాయాన్ని కోరుతున్నాను. మనసా! నేను చూసిన విషయాలనన్నిటినీ లిఖించి భద్రపరుస్తున్నాను. వీటిలో మీ మహత్తు, ఉన్నతి వెలుగులోకి రాగలవు.

నేను వర్జిల్‌తో అన్నాను– "కవిగాయక చక్రవర్తీ! నీవు నా మార్గదర్శకుడివి! ఈ మహత్తర ప్రయాణానికి నేను అర్హుడనో, కాదో తెలీకున్నది. నా మనసును కల్లోల పరుస్తున్న ఈ సందేహాలను తీర్చగలవు. శాశ్వతులైన దేవతల మధ్యలోకి శరీరధారి 'ఈనియస్' ఎలా వెళ్లగలిగాడు? దేవతల ప్రభువు – దుష్టులకు శత్రువు ఎలా పక్షపాతాన్ని చూపించగలడు? మంచీ చెడులు రెండూ ఆతనినుండే ప్రవహించేట్లయితే, స్వర్గ సామ్రాజ్యాన్ని, రోమ్ రాజ్యాన్నీ పరిపాలించేది ఆతడే అయితే ఆతడు స్వర్గంలోనే ఎందుకు ఉంటున్నాడు? పీటర్ కూర్చునే స్థానమెక్కడ? ప్రసిద్ధికెక్కిన నీ కావ్య వృత్తాంతం అనంతరం, ఇప్పటి మతాధిపత్యం వరకు జరిగిన విశేషాలేమిటి? ఎవరు ఈ మానవ దేహాన్ని తన వాహకంగా (Chosen vessel) ఎన్నుకుని ప్రయాణం చేసి, మానవులలో విశ్వాసాన్ని పాదుకొలిపి ముక్తిమార్గానికి (Salvations way) ద్వారాన్ని తెరచినారు? నా ఆలోచన సమంజసమేనా? నేనెందుకిలా మధనపడు తున్నాను? నాకెవరు ఇలా ఆలోచించడానికి అనుమతినిస్తున్నారు? నేను అక్కడకు వెళ్లడానికి తగు అర్హతలున్నవాడినా? ఒకవేళ నాకు ఆ అర్హతలు లేనట్లయితే ఈ ప్రయాణం వ్యర్థమవుతుంది కదా! నేను నా మనోభావాల్ని సరిగా వెలిబుచ్చ లేకున్నానేమో? మహాజ్ఞానీ! నా సందేహాల్ని తీర్చి ప్రస్తుతం నేనున్న సంకట స్థితి నుంచి బయటపడవేసే భారం నీదే!"

ఆ ఉన్నతుడైన ఆత్మ ఇలా పలికాడు– “నీ మాటల్లో నిజమున్నది. ‘భయం’ నీ ఆత్మను ఆవహించి, గొప్ప నిర్ణయం తీసుకున్న నిన్ను వెనుకంజ వేయిస్తున్నది. సంధ్యాకాలపు చీకటిలో తచ్చాడే క్రూరమృగపు మిథ్యారూపంలా ఉండే భయాన్ని నీవు జయించాలి.

నేను ఎందుకు వచ్చాను, నేనేమి విన్నాను, నన్ను విచారం ఎలా అలుముకున్నదీ అవి నీకు వివరిస్తాను. నా వద్దకు ఓ అందాల కన్య వచ్చింది. ఆమె కనులు నక్షత్రాలకన్నా ప్రకాశవంతంగా వున్నాయి. ఆ దేవత ఇలా అన్నది– “మాంటువాకు చెందిన ఆత్మస్వరూపుడా! నీ కీర్తి ఈ ప్రకృతి, భూమి ఉన్నంతవరకూ, ఆచంద్రతారార్కమూ నిలిచి ఉంటుంది. కాని నీవు దారి తప్పిన సంగతి నీకు తెలుసునా! నన్ను ఒక స్నేహితుడు (Jesus) నీ క్షేమాన్ని వాంఛించి పంపినాడు. ఆతడు ఇటువచ్చేసరికే నీవు దారితప్పి చాలాదూరం వెళ్లిపోయావని, అందుచేత నా వాక్చాతుర్యంతో, సంభాషణతో నిన్ను ఒప్పించి, సరైన తన దారిలో ప్రవేశపెట్టమని ఆతడు ఆజ్ఞాపించగా నేను యిటు వచ్చాను. నాపేరు బియాట్రైస్ (Beatrice). నేను ఉండే ఆ ప్రదేశం ప్రేమతో, సంతోషంతో నిండి ఉన్నది. ఆ ప్రేమస్వరూపుడే నాకు వాక్కును అనుగ్రహించినాడు. నేను ఆతని దృక్కులలో నిలబడి ఆతనిని కీర్తిస్తాను”

నేను (వర్జిల్) పలికాను– “ఓ దేవతా! బియాట్రైస్! ఎవరి ప్రోత్సాహంతో ఈ మానవజాతి, విశాల విశ్వంలో చిన్ని భాగమై ప్రకాశిస్తుందో, వారి ఆజ్ఞను శిరసా వహించడం నాకు సంతోషమే! గతాన్ని గురించి నేను చింతించను. అయినా నీవా అనంతస్థానం నుండి ఈ జ్వాలాప్రదేశానికి వచ్చిన కారణాన్ని వివరించు తల్లీ!”

ఆమె అన్నది– “దేవుడు నన్ను దుఃఖాలకు, బాధలకు అతీతంగా మలచినాడు. ఈ కష్టాలు, అగ్నిజ్వాలలు నన్ను తాకవు. ఆ ఉన్నతమైన స్వర్గంలో ‘దయ’ (Mercy) అనే ఓ పవిత్రకన్య (a blessed dame = The Divine Mercy) దుఃఖిస్తూ ఉన్నది. ఆమె దుఃఖాన్ని తొలగించడానికి ల్యూసియా (Lucia=The enlightening grace of Heaven) సాయం కోరగా ‘కరుణ’ అనే ల్యూసియా వేగంగా వచ్చి అన్నది– “దేవుని కీర్తిచిహ్నమా! బియాట్రైస్! తనను మెచ్చుకునే అందర్నీ వదిలి నీ దగ్గరకు వస్తున్న ఈతడికి (డాంటే) నీ అనుగ్రహాన్నివ్వు. మృత్యుసముద్రంలో కొట్టుమిట్టాడుతున్న ఇతని విలాపమెంత జాలి గొలిపిస్తున్నదో గమనించు! భోగభాగ్యాలను అపేక్షించే మనుష్యులను వదిలి వేగంగా ఇటువచ్చిన ఈతనిని గమనించు. నీవు వెళ్లి ఆ మహాకవి వర్జిల్ మాటల ద్వారా ఈతడిని రక్షించు”

మిత్రమా! బియాట్రైస్ కన్నీళ్లు తుడుచుకుంటూ నా దగ్గరకు వచ్చి చెప్పినది నీ గురించి! ఆమె మాటలు విని నేను కొండపై నుంచి దిగి క్రూరమృగాలను చూసి భయపడ్తున్న నీ దగ్గరకు వచ్చాను. ఆ మృగం బారి నుంచి నిన్ను రక్షించాను. మరి ఇప్పుడెందుకు నీవు సందిగ్ధంలో ఉన్నావు? ఎందుకు వెనుకంజ వేస్తున్నావు? నీ గుండెలో గూడుకట్టుకున్న ఆ భయమేమిటి? ధైర్యాన్ని విడనాడకు! ముగ్గురు కన్యలూ (బియాట్రైస్, ల్యూసియా, మెర్సీ)లు నీకు అండగా వున్నారు. నా మాటలు నీకు ధైర్యాన్ని నూరిపోస్తాయి!" అన్నాడు నా మార్గదర్శకుడు వర్జిల్.

రాత్రి మంచుగాలికి ముడుచుకున్న పుష్పగుచ్ఛాలు, తెల్లవారే వెలుగు వేడిమికి విచ్చుకున్నట్లు, నాలో నూతన శక్తి ప్రవహించి ఉత్తేజితుడినయ్యాను– "నాపై ఎంత జాలి తల్లీ నీకు! నా కష్టాల్ని అర్థం చేసుకుని నన్ను గట్టెక్కిస్తున్నావు. మహాకవీ! ఆమె అర్థింపును మన్నించి నన్ను అనుగ్రహించినావు. నాలో నూతన శక్తిని ప్రవేశపెట్టి నన్ను ప్రయాణానికి సిద్ధం చేసినావు. నీవు ముందుకు నడువు, నన్ను నడిపించు! నీవే నా యజమానివి, మార్గదర్శకుడివి, నా ప్రభువువు!" అని నేను పలికాను.

అతడు ముందు, అతడి వెనుక నేను, ఆ దట్టమైన చీకటి అరణ్యంలోకి ప్రవేశించినాము.

## Canto - 3

**వర్జిల్, డాంటీలు నరకద్వారం వద్దకు చేరి అక్కడ వ్రాయబడివున్న భయంగొలిపే వాక్యాలను చదివినారు. అక్కడ శిక్షలను పూర్తి చేసుకున్నవారు మంచీ చెడుల మధ్య తేడా తెలియని నిరామయ స్థితిలో వుంటారు. అక్కడ నుంచి వాళ్లు ఎఖెరాన్ నది వద్దకు వచ్చి పడవ నడిపే 'కారాన్'ను చూస్తారు. డాంటీ ఆ దృశ్యాలను చూడగానే భయంతో వణుకుతూ ఒక విధమైన నిద్రాణమైన స్థితిలోకి జారుకుంటాడు.**

# నరకలోకంలో వర్జిల్, డాంటీలు

"నా ద్వారం నుండే మీరు కష్టాల నగరంలో అడుగుపెడ్తున్నారు!
నా ద్వారం నుండే మీరు శాశ్వత బాధల్లోకి చరిస్తున్నారు.
నా ద్వారం నుండే తరతరాల ప్రజలు తప్పిపోయినారు.
నా వస్త్రాన్ని నేసిన న్యాయదేవత నడిచేదిక్కడే!
నన్ను పెంచి పోషించేది ఆ అద్భుత దివ్యశక్తి,
అత్యున్నత జ్ఞానమూర్తి, అనాది ప్రేమ స్ఫూర్తి (ఆ త్రిమూర్తితత్వం)!
నా ఎదుట సృష్టింపబడినవేవీ నాకు పోలికకు రావు.
నేను శాశ్వత శక్తిని, శాశ్వతులనే మన్నిస్తాను!
**అడుగు లోనికి పెట్టేముందే, అన్ని ఆశలనూ వదులుకోండి!"**
"All hope abandon, ye who enter here!"

ఎదురుగా వున్న విశాలమైన శిలాతోరణంపై ఆ అక్షరాలు చెక్కబడి వున్నాయి. నేనన్నాను– "ఆర్యా! ఈ మాటలు ఎంతో కఠినమైన అర్థాన్ని స్ఫురింపజేస్తున్నాయి"

అతడు నన్ను అనునయిస్తూ అన్నాడు– "ఇది అపనమ్మకాన్ని, భయాన్ని వదలాల్సిన చోటు! నీకు నేను చెప్పిన మృతాత్మలు శిక్షలననుభవించే ప్రదేశం ఇదే! ఇక్కడే వాటికి రకరకాల శిక్షలు విధించబడతాయి. ఆ దురవస్థలో ఉండి జ్ఞానాన్ని కోల్పోయిన జీవాత్మలను చూద్దువుగాని" అని అతడు తన చేతినందించి, ప్రశాంతమైన చూపులతో నన్ను స్పృశించాడు. నాలోని భయం మాయం కాగా నేనాతడిని అనుసరించాను.

ఏడ్పులు, మూలుగులు, రోదనలు మిన్నుముట్టుతున్న ప్రదేశమిది. నాకూ దుఃఖమాగలేదు. అనేక రకాల భాషలు, యాసలు, పెడబొబ్బలు, దుఃఖాలాపాలు,

కోపపు పొలికేకలు, బొంగురు గొంతుకతో, పీలగొంతుకతో ఒకటే అరుపులు. కాళ్లూ చేతులు కొట్టుకుంటుంటే ఆ శబ్దాలు మరింత భీకరంగా వినరాసాగినాయి. ఎడారుల్లో ఎగుర్తున్న ఇసుక తుఫాను రేణువుల్లా ఆ చీకటి గుయ్యారాల్లో గందరగోళపు ధ్వనులు సుడిగాలుల్లా భయంకరంగా వీస్తున్నాయి.

భయం నన్ను క్రుంగదీస్తుండగా నేను అరిచాను– “మహాజ్ఞానీ! ఏమిటిది! ఎవరు వీరు? ఎందుకలా అరుస్తున్నారు?”

అతడన్నాడు– “జీవితంలో అటు మంచిగానీ, ఇటు చెడుగానీ చేయకుండా, కీర్తి, అపకీర్తులు లేక, తిరగబడిన దేవదూతల్లా, అటు దేవునికి సేవచేయక, ఇటు వ్యతిరేకించినట్లుగా ఋజువుకానివాళ్లు, స్వలాభాపేక్షాపరులైనవాళ్ల ఆత్మల కేకలవి. దేవుని ప్రకాశంపై మచ్చరాకుండా అక్కడనుంచి బహిష్కరించబడిన వీళ్లను, నరకం కూడా ఇంకా తన లోతుల్లోకి ఆహ్వానించలేదు. లేకుంటే శాపోపహతులైన ఈ తెగ విజయగర్వంతో ఉప్పొంగేవారు”

నేనడిగాను– “వాళ్లంతగా కేకలు పెడ్తున్నారే, ఏమి బాధిస్తున్నది వాళ్లని?”

అతడు సమాధానమిచ్చినాడు– “వీళ్లకా చావులేదు. ఇలా నరకంలో మగ్గాల్సిందే! నీచంగా బతుకుతూ మిగతావారిని చూసి అసూయ చెందుతూ, కీర్తిప్రతిష్ఠలు లేక, కరుణ, న్యాయం వీళ్లను కనికరించక – వాళ్ల వంక చూడకు! ముందుకు పోదాం, పద!”

నాకెదురుగా అల్లంత దూరంలో ఒక పతాక (Flag) అతివేగంగా పోతూ కనిపించింది. వెంటనే పొడుగాటి వరుసలో ఆత్మలు గోలగోలగా – ఇంతమందిని మృత్యువు పోగొట్టుకుందా అని ఆశ్చర్యపోయాను. వారిలో కొందరిని నేను గుర్తుపట్టాను.

వీళ్లు దుర్మార్గులు. దేవుడికి వ్యతిరేకులు. వీళ్లు నగ్నంగా పరిగెడ్తుంటే, కందిరీగల తుట్టె కదిలించగా అవి మీదపడి వీళ్ల బుగ్గల్ని కుడ్తుండగా రక్తం, కన్నీళ్లు కలిసి ప్రవాహంలా పారుతున్నాయి. కాళ్లదగ్గర అసహ్యమైన పురుగులు పాకుతున్నాయి.

ఇంకాస్త దూరంలో ఓ నదీతీరాన పెద్ద గుంపు నిలబడి ఉన్నది. నేను తొందరపడి ప్రశ్నించగా, నా మార్గదర్శకుడు చెప్పాడు– “అక్కడకు వెళ్లి చూద్దాం, పద! అదే ఎఖెరాన్ (Acheron) నదీ తీరం”. తీరం చేరేవరకు నేనిక నోరెత్తలేదు. మేమున్న చోటికి ఓ వృద్ధుడు మూడుకొయ్యల పడవ బల్లకట్టు (bark) నడుపుకుంటూ వచ్చి అరిచాడు– “దుష్టాత్మలారా! మీకు కష్టాలు రానూ! మీరు ఆకాశం చూడకపోనూ!

నేను మిమ్మల్ని ఆవలితీరం తీసుకుపోతున్నాను. అక్కడ శాశ్వతాంధకారంలో ప్రజ్వలించే అగ్ని, కోసుకుపోయే మంచులో తిరిగి చూద్దురుగాని! నీవు! బతికి ఉన్నవాడివి! ఇక్కడి నుంచి పో! మృతుల్ని వదిలి వెళ్లు!" నేను అక్కడి నుంచి కదల్లేదు. "మామూలు దారి నుంచి కాకుండా, వేరే మార్గంలోంచి వచ్చినట్లున్నావు. నిన్ను తీసుకువచ్చింది ఇతడేనా! అయినా మిమ్మల్ని తీసుకుపోవడానికి వేరే వేగంగా పోయే పడవ కావాలి!"

అతడితో 'వర్జిల్' అన్నాడు– "కారాన్! (Charon) నీవు ఆందోళన చెందకు! ఇది విధి నిర్ణయం! విధి, శక్తి ఒక్కటిగా ఉన్నచోట నిన్ను కోరేదేమీ లేదు!"

ఆ మాటలు వినగానే జ్వాలాసరోవరంపై పడవ నడిపే అతడు, కళ్లలో అగ్నివలయాలు సుళ్లు తిరుగుతుండగా, ఆ కారాన్ (Charon) మౌనం వహించాడు. ఒడ్డున ఉన్న ఆత్మలు, ఆతడి కేకలు వినగానే, రంగుమారి పళ్లు కొరుకుతూ, దేవుడిని తమను పుట్టించిన తల్లిదండ్రులను తిట్టుకుంటున్నాయి. అలా ఏడుస్తూనే ప్రతిమనిషీ ఆ నదిని దాటి అవతలి తీరం చేరాల్సిందే!

రాక్షసుడిలా కనిపించే 'కారాన్', మండుతున్న బొగ్గులా ఎర్రగా ఉన్న కళ్లతో వాళ్లందరినీ తన పడవపై ఎక్కించుకుని, ఎక్కడానికి సంశయించేవారిన తన తెడ్డుతో బాదుతూ తీసుకుపోతున్నాడు. శరదృతువులో (Autumn) ఆకులు ఒకదాని తరువాత ఒకటి రాలి నేలనంతా కప్పివేసినట్లు, ఆదాం దుష్ట సంతానం (Adam's evil brood) ఒకరి తరువాత ఒకరు, సైగ చేయగానే వచ్చే డేగపక్షిలా (each at a back, as falcon at his call) వస్తున్నారు. ఆ జేగురు మట్టిరంగు అలలపై ఒక పడవ ఆ తీరానికి చేరగానే మరొకటి ఇక్కడ ప్రత్యక్షమై ఆత్మలను ఎక్కించుకుంటున్నది.

నా మార్గదర్శకుడు (guide) అన్నాడు– "కుమారా! దేవుని ఆగ్రహానికి గురై ఇక్కడకు వచ్చి ఆవలి తీరానికి పోతున్నవాళ్లను అసహ్యించుకో నక్కరలేదు. స్వర్గలోకపు న్యాయం వాళ్లను అంకుశంలా పొడుస్తూ భయాన్ని కోరికగా మారుస్తుంది. అందుకే ఈ దారిని మంచి ఆత్మలు పోవు. 'కారాన్' మాటల్లోని అంతరార్థమదే!"

అప్పుడే ఆ చీకటి ప్రాంతం భయంకరంగా కంపించగా నా కనుబొమలలో చెమట కమ్మింది. భూమి దుఃఖిస్తూ బద్దలైన శబ్దం వినిపించి, మెరుపులా పిడుగుపాటుతో ఎర్రటి మండుతున్న అగ్నిశకలం భూమిని తాకినట్లనిపించి, నా సర్వేంద్రియాలూ స్తంభించగా, నా కళ్లకు చీకట్లు కమ్మి నేలపై కూలబడిపోయాను.

## Canto - 4

**భయంకరమైన ఉరుము శబ్దం విని డాంటీ మేలుకున్నాడు. వర్జిల్‌ను అనుసరిస్తూ నరకలోకపు మొదటి వలయమైన 'లింబో' (Limbo –సత్పురుషులు, జ్ఞాన స్నానానికి ముందు మరణించిన పిల్లలూ ఉండే ప్రదేశం) ను చేరుకున్నారు. అది దాటి రెండవ వలయంలోకి వెళ్లాల్సి వుంది.**

# నరకలోకపు మొదటి వలయం – 'లింబో'

ఓ బ్రహ్మాండమైన ఉరుము శబ్దం నన్ను గాఢనిద్ర నుండి మేల్కొల్పింది. వెంటనే లేచి నిలబడి, నేనెక్కడ ఉన్నానో తెలుసుకోవడానికి ప్రయత్నించాను. నేనున్నది విలాపాల లోయ (Lamentable Vale). లోతైన ఆ అగాథం అసంఖ్యాకమైన ఉరుముల శబ్దాలతో దద్ధరిల్లుతున్నది. నల్లటి దట్టమైన మబ్బులు కప్పిన ఆ అగాథపు లోతును నా కళ్లు అంచనా వేయ ప్రయత్నించాయి. "మనం ఆ అగాథంలోకి దిగుదాం పద!" అన్నాడు మహాకవి నాతో. – "నేను ముందు నడుస్తాను, నీవు నన్ను అనుసరించు!" – అతని వదనం పాలిపోగా (Pale) దానిని నేను గమనించి అన్నాను– "నీవే జంకుతున్న ఈ ప్రదేశంలోకి నేను పోగలనా?"

అతడన్నాడు– "అక్కడి ప్రజలు పడే తీవ్ర బాధలను గమనించి నా వదనం పాలిపోయినట్లు కనిపించింది గాని భయం వలన కాదు. నడువు! మనమింకా చాలా దూరం పోవాల్సి వున్నది"

అక్కడ అన్నీ మూల్గులే! అవి గాలిని వణికిస్తున్నాయి. అక్కడ చిత్రహింసలు లేవు. దుఃఖంతో కుములుతున్న అసంఖ్యాక జనం స్త్రీలు, పురుషులు, పసిపాపలు. నా మార్గదర్శకుడు తెలిపాడు– "వీళ్లు పాపులు కారు. పవిత్ర స్నానానికి (Baptism)కు ముందే మరణించిన వాళ్లు. విశ్వాసానికి మొదటి ద్వారం పవిత్రస్నానం కదా! పవిత్ర వాక్యాలు (Gospel) ప్రభవించకమునుపే పుట్టిన నాలాంటి దురదృష్టవంతులూ ఇక్కడ వున్నారు. చేయని తప్పుకు మేమీ ప్రదేశంలో ఉండాల్సి వచ్చింది. ఆశలేని జీవితమిది"

అతని మాటలను విన్నప్పుడు నా హృదయం బరువెక్కింది. ఈ 'లింబో' ప్రాంతంలో అనేకమంది సచ్ఛీలురున్నారన్నమాట. నేనడిగాను– "వీరికి విముక్తి లేదా! వీరు ఆశీర్వదింపబడతారా?"

ఆ మహాకవి అన్నాడు– "నేనిక్కడకు వచ్చిన కొత్తలో, శిరస్సుపై విజయ కిరీటాన్ని ధరించి మన రక్షకుడు (Puissant), ఆదాం, ఎబెల్, నోవా, మోసెస్, అబ్రహాం, డేవిడ్, ఇజ్రాయెల్, ఆతని తండ్రీ, ఆతని సంతానం, రాఛెల్, అటువంటివాళ్లు ఇక్కడకు వచ్చి వెళ్లారని విన్నాను కాని, ఏ మానవ ఆత్మా ఇంతవరకు రక్షింపబడలేదు"

అలా మాట్లాడుతూ మేము నడుస్తూనే ఉన్నాము. ఆ చీకటి ప్రదేశంలో నాకో చోట కొంత వెలుగు కనిపించింది. నేనడిగాను– "ఎవరు వీరు! వీరికి ఎంతో గౌరవం, ఉన్నత స్థానం లభించినట్లున్నదే!"

మహాకవి సమాధానమిచ్చినాడు– "వారి పేర్లు భూలోకంలో చిరస్థాయిగా వినిపించేవే! అంత ప్రఖ్యాతి చెందినవారు సుమా!"

అక్కడ నుంచి ఎవరో అంటున్నారు– "మహాకవికి అభివాదము! మనల్ని వదలివెళ్లి తిరిగివస్తున్న మిత్రునికి స్వాగతం!" నేనటు చూసాను. నలుగురు వ్యక్తులు మావేపే వస్తున్నారు. నా మార్గదర్శకుడన్నాడు– "వారిని నిశితంగా గమనించు! కుడిచేతిలో వంపుగా ఉన్న కత్తి పట్టుకుని నడుస్తున్నాడే, మిగతావాళ్లకు ప్రభువులా – అతడే హోమర్ (Homer). కవిగాయక చక్రవర్తి. పక్కనే ఉన్నది ఫ్లాకస్ (Flaccus) – వ్యంగ్యానికి మారుపేరు. ఇతడు నాసో (Naso). ఆఖరున వస్తున్నది ల్యూకాన్ (Lucan).

నేను ఆ మహా కవిగాయకుడిని అందరికన్నా ఎత్తుగా ఆకాశంలో సంచరించే కవిరాజును వీక్షించి ధన్యత చెందాను. వారు కాసేపు తమలో తాము ముచ్చటించుకుని నావేపు తిరిగారు. నాకు అభివాదం తెలుపుతూ, నన్ను తమలో ఒకడిగా చేర్చుకున్నారు. వారిలో నేను ఆరవ సభ్యుడిని. మాట్లాడుకుంటూ మేము వెలుగు అంచు మీద ఒక సుందరమైన భవనాన్ని చేరుకున్నాము. సప్త ప్రాకారాలతో, చుట్టూరా ప్రవహిస్తున్న ప్రశాంతమైన ఏటితో దుర్భేధ్యంగా ఉన్న ఆ కోటలోపలికి, ఏడు గోడలను దాటి, ఆ విజ్ఞులతో, నేనూ లోపలికి ప్రవేశించాను.

అక్కడ పచ్చటి పచ్చికమైదానంలో కొందరు అద్భుతమైన విషయాలను సాధికారంగా చర్చించుకుంటున్నారు. మేము కూడా ఒకచోట కూర్చుని అక్కడ ఉన్నవారిని గమనించినాము. అదుగో ఎలక్ట్రా (Electra), హెక్టార్, ఏంఖైసిస్ కుమారుడు ఈనియస్, సీజర్, కామిలా, పెంథెసిలియా, అటుపక్కన లాటినస్, లవీనియా, బ్రూటస్, టార్క్విన్, లుక్రెషియా, కాటో భార్య మార్సియా, జూలియా, కార్నిలియా, సుల్తాన్ సలాదిన్.

ఇంకోచోట – అందరూ గౌరవించే అరిస్టాటిల్, సోక్రటీస్, ప్లాటో, డెమొక్రిటస్, డయొజినెస్, హెరాక్లిటస్, ఎంపెడొక్లిస్, ఎనాక్సాగొరస్, థేల్స్, జెనొ, డయొస్కోరైడ్స్, ఆర్ఫియస్, లినస్, టుల్లీ, సెనెకా, యూక్లిడ్, టాలమీ, హిప్పొక్రెటస్, గాలెనస్, అవిసెన్, ఎవెరొయిస్ – వీళ్లందరూ ఉన్నారు.

మిగిలిన వారందరి గురించి చెబుతూ పోతుంటే మాటలు చాలవు. మా మిత్రులు వెళ్లిపోయాక, మహాకవి ముందు నడుస్తుండగా ఆ ప్రశాంత ప్రదేశాన్ని వదిలి తుఫానులతో అల్లకల్లోలంగా వున్న రెండవ వలయంలోకి ప్రవేశించాము. వెలుగు కనిపించని ప్రదేశమది.

## Canto - 5

**రెండవ వలయపు ముఖద్వారం వద్ద ఉన్న న్యాయాధిపతి మినాస్ (Minos), 'డాంటే'ను ఇక్కడికెలా వచ్చావని గద్దిస్తాడు. ఆ వలయంలో కామభోగ లాలసులు తీవ్రవాయు ప్రభంజనాలలో చీకటి గాలుల మధ్య అనంతంగా ఎగరవేయబడుతుంటారు. అక్కడ వాళ్లకు రిమిని దేశపు ఫ్రాన్సెస్కా కనిపిస్తుంది.**

# కామంతో కళ్లు మూసుకుని పాపులైన వారికి శిక్షలు

రెండవ వలయం చిన్నదే కాని అత్యంత దుఃఖభరితమైనది. అక్కడ నరకలోక న్యాయాధిపతి "మినాస్" (Minos) పాపుల నేరాలను సమీక్షిస్తూ, శిక్షలు విధిస్తున్నాడు. పాపాత్మ తనముందుకు వచ్చి నేరాన్ని ఒప్పుకోగానే, ఆతడు నేరానికి తగిన శిక్ష విధించి, శిక్షననుభవించే ప్రదేశానికి తన తోకతో చుట్టి విసిరివేస్తున్నాడు.

నన్నుచూడగానే– "నీవు, ఈ పాపుల ప్రదేశానికి ఎందుకు వచ్చావు? ఎవర్ని నమ్ముకుని ఇక్కడకు వచ్చావు? అని గద్దించాడు. నా మార్గదర్శకుడన్నాడు– "ఎందుకా ఆశ్చర్యం! ఇది విధి నిర్ణయం! దానిని ఆపాలని ప్రయత్నించకు! విధి, శక్తి ఒక్కటిగా ఉన్నచోట నిన్ను కోరేదేమీ లేదు!"

నాకు దూరంగా ఒకటే ఏడ్పులగోల వినిపించింది. రోదనలు, అరుపులు, బతిమాలడాలు, పెనుతుఫానులో వీస్తున్న గాలుల్లా, ఎగసిపడ్తున్న అలల్లా ఆర్తనాదాలు. గాలులు ఎగసిపడ్తూ వలయాలుగా సుళ్లు తిరిగి తమలో ఇముడ్చుకున్న వస్తువుల్ని నేలకు కొడ్తున్నవి. అవి మళ్లీ వచ్చేముందు ఎగసిపడ్తున్న ఆర్తనాదాలు, రోదనలు, పొలికేకలు, పెడబొబ్బలు... తిట్లూ, దేవుడినే శపిస్తున్న వాక్యాలూ–

నాకర్థమయ్యింది. ఇదే కాబోలు – కామంతో కళ్లు మూసుకుని చరించిన వాళ్లను శిక్షించే ప్రదేశం. కామాతురాణాం న భయం, న లజ్జా! అన్నట్లు వీళ్ల వివేకాన్ని కామం కప్పివేస్తుంది. – శీతాకాలంలో స్టార్లింగ్ (Starling) పక్షులు గుంపులు గుంపులుగా వలసపోతున్నపుడు, పెనుగాలి వాటిని అటూయిటూ పైకీ కిందకూ చెల్లాచెదరు చేయగా, విశ్రాంతి లేకుండా అరుస్తూ ఎగుర్తున్నట్లు, కొంగలు ఆకాశంలో బాధతో నిండిన గొంతుతో అరచుకుంటూ పోతున్నట్లు – ఆత్మలు అక్కడ బిగ్గరగా విలపిస్తున్నాయి.

నేనడిగాను– "అధ్యాపకా! ఎవరు ఈ చీకటి చెరలలో ఇలా కుములుతూ రోదిస్తున్నారు?"

ఆతడు సమాధానమిచ్చినాడు– "అందరికన్నా ముందున్నది అదిగో ఆ మహారాణి. సంపదల పొగరులో సిగ్గులేకుండా విచ్చలవిడితనాన్ని న్యాయబద్ధం చేసింది. తన కామాన్ని సమర్థించుకునేందుకు అటువంటి శాసనాన్ని చేసిన ఆ రాణి పేరు సెమిరామిస్ (Semiramis).

అదిగో ఆమె తన భర్త సైకియస్ అస్తికలపై ప్రమాణం చేసి, మాట తప్పి, అంతిమంగా కత్తితో పొడుచుకుని మరణించిన డిడొ (Dido) రాణి. ఆ తరువాత క్లియోపాత్రా, హెలెన్, ఎఖిల్లిస్, పారిస్, ట్రిస్టాన్, అలా వేలాదిమంది ప్రేమ, కామాల పేరుతో చరించినవాళ్లు... మహాకవి వారిపేర్లు చెబుతుండగానే నా దృష్టి ఇద్దరిపై పడింది. వారు నన్ను సమీపించగానే నేను నా మార్గదర్శకుని అనుమతితో వారిని ఎలుగెత్తి పిలిచి నిలువరించాను. వారు ఆగి మాతో మాట్లాడినారు– "ఓ సందర్శకులారా! మనలనందరినీ కరుణించే ఆ ప్రభువు మిమ్మల్ని అనుగ్రహించు గాక! పొ (Po) నదీ సముద్రంలో కలిసే చోట రవెన్నా (Ravenna) నా దేశం. ప్రేమ మా యిద్దరినీ కలిపింది. మా యిద్దరినీ కత్తికెరచేసింది. మరణంలో కూడా మేము ఒకరినొకరు వీడలేదు. కెయినా (Caina - The Place to which murderers are doomed) – మమ్మల్ని చంపినవాడి కోసం ఎదురుచూస్తున్నది" అని వాళ్లు వెళ్తుంటే నేను అటే చూడసాగాను.

మహాకవి అన్నాడు– "ఆమె ఫ్రాన్సెస్కా. ఆమె తండ్రి ఆమెను వికలాంగుడైన లాన్సియొట్టొకిచ్చి వివాహం చేసినాడు. అతడి సోదరుడు పావొలో (Paolo) అందగాడు. పావొలో, ఫ్రాన్సెస్కాలు ప్రేమలో పడినారు. వారి అక్రమ సంబంధాన్ని చూసిన లాన్సియొట్టొ వారిద్దరినీ ఒకేసారి పొడిచి చంపినాడు"

నేను ఆమెను పిలిచాను– "ఫ్రాన్సెస్కా! నీ ప్రేమ, అంతిమ ఘడియలు నాకు కన్నీటిని తెప్పిస్తున్నాయి. మీరు ప్రేమలో ఎలా పడ్డారో, సాంప్రదాయాన్ని ధిక్కరించి, అనైతికంగా ప్రవర్తించేంత గాఢమైన ప్రేమ మీలో ఎలా జనించిందో చెప్పగలవా!" అని అడిగాను.

ఆమె అన్నది– "ఆ రోజుల్ని గుర్తు తెచ్చుకోవడం కన్నా విషాదమింకేమున్నది? పక్కనే దురదృష్టం పొంచి ఉన్న సంగతి గమనించని స్థితి! ఒకరోజున మేమిద్దరం లాన్సెలాట్ (Lancelot - one of the Knights of the Round Table) గినెవర్

(Guinever)ల ప్రేమకథను చదువుతున్నాము. వారు ప్రేమలో ఎలా తనమునక లైనదీ చదువుతుంటే మా మనస్సు చలించింది. అప్పటివరకూ ఏ కల్మషమూ లేని మాలో కొత్త భావాలు ప్రవేశించి, కళ్లూ కళ్లూ కలిసి, ప్రేమ మైకం ప్రవేశించగా ఒకరినొకరు ముద్దాడినాము. ఆ చిరునవ్వులు, ఆలింగన చుంబనాలగాఢత మమ్మల్నెవ్వరూ విడదీయలేరన్నంత ప్రేమలోకి దించింది. ఆ పుస్తకం, రచయిత మా ప్రేమకు రాయబారులైనారు. ఇక చదవలేని రోజు ఓ రోజున మేము జీవితాన్నే పోగొట్టుకున్నాము"

అలా చెప్పి వాళ్లు దుఃఖిస్తూ నిష్క్రమించారు. నా మనసు ద్రవించి, హృదయం బరువెక్కగా, మృత్యువుకు దాదాపు సమానమైన స్థితిలో స్పృహతప్పి, శవంలా నేలపై పడ్డాను.

## Canto - 6

**కళ్లు తిరిచేసరికి ఆతడు మూడవ వలయంలో ఉన్నాడు. ఇది తిండిపోతులు (Gluttony) శిక్షలనుభవించే ప్రదేశం. వీళ్లకు శిక్ష ఊబిలో దిగబడి ఉండగా పై నుంచి వడగళ్లు, మంచు, రంగునీళ్లు ధారాపాతంగా కురుస్తుంటాయి. నరకలోకపు జాగిలం సెర్‌బెరెస్ (Cerberus) తన మూడు గొంతులతో చెవులు చిల్లులు పడేలా అరుస్తూ వాళ్లను ముక్కలు ముక్కలుగా కొరికి తింటూ ఉంటుంది. ఇక్కడే సియాకో అనేవాడు ఫ్లోరెన్స్ (Florence) గురించి జోస్యం చెబుతాడు. డాంటీ అడిగిన ప్రశ్నకు వర్జిల్ సమాధానమివ్వగా ఇద్దరూ నాల్గవ వలయంలోకి డుగుపెడతారు.**

# తిండిపోతులకు నరకలోకపు శిక్షలు

దుఃఖంతో మూర్ఛిల్లిన నేను కళ్లు తెరచి చూసేసరికి ఇది మరో కొత్త ప్రదేశం. కొత్త పీడనలు, నూతన క్లేశాలతో కేకలు పెడ్తున్న ఆత్మలు. ఎటుచూసినా ఆ మూడోవలయంలో నిర్విరామంగా, అనంతంగా కురుస్తున్న దట్టమైన, ఎముకలు కొరికేంత చల్లని వర్షపుజల్లులే! పెద్ద పెద్ద వడగళ్లు, రంగువెలసిన నీళ్లు, పొగచూరిన ప్రవాహాలు, అర్థరాత్రి, అపరాత్రి లేకుండా పారుతూనే ఉన్నాయి. అంతటా మురుగు వాసనే.

సెర్‌బెరస్ (Cerberus) నరకలోకపు జాగిలం, వికృత రూపంతో, మూడుతలలతో, మూడు గొంతులతో భయంకరంగా ఆ ఆత్మలపై అరుస్తున్నది. ఎర్రగా జ్వలిస్తున్న కళ్లు నల్లటి గడ్డం, పెద్ద పొట్ట వంపు తిరిగిన గోళ్లతో భీకరంగా కనిపిస్తున్న పాదాలు, ఆ కాలిగోళ్లతో అది అక్కడి ఆత్మలను చీల్చి ముక్కలు ముక్కలుగా కొరికి తింటున్నది. ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపునీటిలో చిక్కుకుని ఊరకుక్కలు ఊరకే అరుస్తున్నట్లు ఒకటే రభస.

అది మమ్మల్ని చూసి భయంకరంగా నోరు తెరిచి తన పదునైన కోరలు, దంతాలను చూపించి, తీక్షణ దృక్కులను మాపై ప్రసరిస్తుంటే నాకు వెన్నులో చలిబుట్టి వణికాను. నా మార్గదర్శి దోసిళ్లతో మట్టిని తీసుకుని దాని నోట్లోకి విసిరికొట్టినాడు. ఎన్నటికీ ఆకలి తీరని ఆ భయంకర శునకం (తన యజమాని చేయి విసరగానే ఏదో కబళం దొరికిందని, కోపాన్ని వదిలేసి, తోక ఊపుతూ ఆదరాబాదరాగా వెళ్లి ఆ కబళం మింగుతున్న కుక్కలా) సెర్‌బెరెస్ అక్కడ ఉన్న ఆత్మలను భయపెడ్తూ నా మార్గదర్శి విసిరిన మట్టిని మింగి నేలపై కూలబడింది.

ఆ తుఫాను గాలికి అక్కడున్న ఆత్మలు ఎగిరిపోగా ఉన్న ఖాళీస్థలంలోకి మేము అడుగు పెట్టినాము. ఆ ప్రదేశమంతా నేలపై చెల్లాచెదరుగా ఉన్న ఆత్మలతో నిండి వున్నది. మేమటు వెళ్లగానే ఒక ఆత్మ లేచి కూర్చుని నన్ను పలకరించింది– "నీవు ఆత్మల మధ్య తిరుగుతున్నావు! నీవెవరో నాకు తెలుసు"

నేనన్నాను– "బహుశా ఆందోళన చెందుతూన్న నీకు నేను తెలిసినవాడిలా కనబడుతూ ఉండవచ్చును. కాని నేనెన్నడూ నిన్ను చూడలేదు. పోనీ నీవెవరో, ఎందుకిలా ఇక్కడ నరకయాతనలు పడుతున్నావో వివరించు. నీవు బాధలు పడ్తున్న పద్ధతి రోతపుట్టిస్తున్నది"

ఆ ఆత్మ అన్నది– "అసూయతో అంచుల దాకా నిండిన నీ నగరంలో ఒకప్పుడు నేనూ బాగా బతికినవాడినే! నన్ను మీరు సియాక్కొ (Ciacco=Pig) అని పిలిచేవాళ్లు. తిండిపోతుగా బతికినందుకు నాకీ శిక్ష విధించబడింది. ఈ గాడ్పు దెబ్బలకు అలిసిపోయాను. నేనిక భరించలేను"

నేనన్నాను– "సియాక్కొ! నీవు పడ్తున్న నరకయాతన నన్ను దుఃఖంలో ముంచెత్తుతున్నది. మన నగరానికి ఏమి ముప్పు వచ్చిపడింది? ముక్కలైన ఫ్లోరెన్స్ నగరంలోని ప్రజల పరిస్థితి ఏమిటి?"

అతడన్నాడు– "రక్తపాతమే! అడవుల్లోంచి వచ్చినవాళ్లు నగరంలోని వాళ్లను నరికి పారవేస్తారు. మూడు సూర్యసంవత్సరాల కాలంలో వాళ్లు వీళ్లవుతారు. ఫ్లోరెన్స్ నగరం బియాంచి తెలుపు (Bianchi), నెరి నలుపు (Neri)గా విడిపోయింది. అడవుల్నుంచి వచ్చినవాళ్లు వెరి డి కెర్కి (Veri de Cerchi) ఆధ్వర్యంలో నెరి (Neri) ప్రజల్ని గెంటివేశారు. 'నెరీ' ప్రజలు బియాంచిపై ఆధిక్యాన్ని ప్రదర్శించారు. దురాశ (Avarice), అసూయ (Envy), గర్వం (Pride) మూడు నిప్పురవ్వలై అందరి హృదయాలను కాల్చివేసాయి"

అతడు బాధతో మూల్గుతుండగా నేనన్నాను–

"ఫారినాటా, టెగ్గియాయో, గియాకొపొ, అరిగొ, మొస్కాన, వీళ్లెలా ఉన్నారు? దేవుని వెండికప్పు వీరికందిందా లేక నరకలోకపు విషపాత్ర చేజిక్కిందా? వారికేం జరిగింది?"

అతడన్నాడు– "వాళ్లు దుష్టాత్మలై, అగాధం అట్టడుగున కొట్టుమిట్టాడు తున్నారు. అటు వెళ్లినపుడు వారిని చూడవచ్చును. నీవు భూమిపైకి తిరిగి వెళ్లినాక,

నా గురించి ప్రస్తావించు, మిత్రమా! ఇక నేను మాట్లాడేందుకేమీ లేదు” అలా అని అతడు నేలపైకి ఒరిగి మళ్లీ లేవలేదు.

నా మార్గదర్శకుడన్నాడు– “అదుగో దేవదూతల బాకాధ్వని! మహాశక్తి ఇక్కడికి అడుగుపెట్టినప్పుడు వీళ్లు ఈ బాధల నుంచి విముక్తులై, మరల శరీరధారులవుతారు. ఆకాశపు కప్పును అనంత ప్రళయ కాలపు ధ్వని చీల్చివేయడాన్ని వారు వింటారు”

మేము ఆ ఆత్మలు, వర్షపు మడుగులున్న ప్రదేశాన్ని దాటిపోతుండగా అడిగాను– “అంతిమతీర్పు చెప్పబడినాక ఈ బాధలు మరింత ఎక్కువవుతాయా లేక తగ్గి, నశిస్తాయా? ఇంకా తీవ్రమవుతాయా?” అని ప్రశ్నించాను.

అతనన్నాడు– “నీ జ్ఞానాన్ని ప్రశ్నించు. (Consult thy knowledge) సెయింట్ ఆగస్టీన్ చెప్పలేదా మంచివాళ్ల సంతోషమూ, చెడ్డవాళ్ల బాధలూ పెరుగుతాయని – ప్రతి వస్తువూ ప్రతికార్యమూ లోపరహితంగా ఉన్నపుడు మంచీ చెడుల వ్యత్యాసం అందరికీ అవగతమౌతుంది. ఈ మానవతెగ ఇంకా ఆ దశకు చేరుకోలేదు”

మేము అనేక మలుపులున్న దారిన మాట్లాడుకుంటూ నడచి అక్కడ ఉన్న మెట్లపై నడుస్తూ కిందికి వెళ్లినాము – అక్కడ మహాశత్రువు ‘ప్లూటో’ (Pluto) ఉన్నాడు.

**Canto - 7**

**నాల్గవ వలయం ప్లూటో ఉన్న ప్రాంతం. అది లోభులూ, దురాశా పరులకు, దారితప్పినవాళ్లూ శిక్షించబడే ప్రదేశం – అక్కడ ఆత్మలు భారీ బరువులు మోస్తూ ఒకరినొకరు తిట్టుకుంటున్నారు. ఇక్కడ డాంటేకు అర్థమవుతుంది – 'అదృష్టం కొద్దీ వచ్చి భౌతిక పదార్థాల విలువ శూన్యమని' – అయిదవ వలయంలో వాళ్లకు స్టిజియన్ సరస్సులో నానా బాధలు, శిక్షలననుభవిస్తున్నవారు కనిపించారు. అక్కడ ఉన్న ఓ ఎత్తైన బురుజువద్దకు వీళ్లు వెళ్లారు.**

# దురాశాపరులు పడే నరకయాతనలు

"ఆః! నేను! సాతాన్! సాతాన్!" – అరిచాడు ప్లూటస్ – ఏదో ఘోరప్రమాదం జరగబోతున్నట్లు ఆందోళన నిండిన గొంతుతో. దేనికీ వెరవని నా మార్గదర్శకుడు, దయగల ముని, నాతో అన్నాడు– "భయపడకు! ఆతని శక్తి నిన్ను క్రిందకు వెళ్లకుండా ఆపలేదు" అని నాతో పలికి ప్లూటస్ వేపు తిరిగి అన్నాడు– "శాంతించు! శాపగ్రస్తుడవైన వృకమా! నీ ఆగ్రహం నీలోనే వ్యాపించి నిన్ను ఆరగించును గాక! మేము ఇటు వెళ్లడమనేది దైవనిర్ణయం! ఆ మహాదేవదూత స్వర్గలోకపు ప్రతీకారాన్ని దారితప్పిన తొలివ్యక్తి (first adulterer) సాతానుపై గుమ్మరించడం గుర్తులేదా?" ఆ మాటలు వినగానే అంత భయంకరాకారుడూ తెరచాప కొయ్య విరిగి కిందకు పడ్డట్టు నేలపై పడినాడు.

మేము అక్కడ నుంచి కిందికి దిగి నాల్గవ వలయంలోకి వెళ్లాం! అక్కడ న్యాయమూర్తి మరిన్ని దారుణమైన శిక్షలను పాపులకు విధించినాడు. కారిబ్డిస్ (Carybdis) సుడిగుండం ఒక్కసారి గాలిలోకి లేపిన అలల్లా, ఇక్కడి ఆత్మలు పైకి లేచి కిందకు పడ్తున్నారు. వాళ్లు పెద్దపెద్ద బరువులను ఆయాసపడుతూ మోస్తూ ఒకరు అట్నుంచి, మరొకరు ఇటునుంచి వగరుస్తూ వెళ్తూ ఖచ్చితంగా మధ్యకు రాగానే ఎవరూ పక్కకు తప్పుకోక ఒకరినొకరు గుద్దుకుని దొర్లుకుంటూ బయల్దేరిన స్థానానికే పోయి మరలా రావడం, మధ్యకు వచ్చి గుద్దుకోవడం "కళ్లు కనపడడం లేదా, ఎందుకంత పోగుచేస్తావు? అని ఒకడంటే – నీకళ్లేమైనాయి, ఎందుకలా పారవేస్తావు?" – అని రెండవవాడు – ఈ పాట అనంతంగా సాగుతూనే ఉన్నది.

నా ప్రశ్నకు సమాధానమిస్తూ ఆ తపస్వి అన్నాడు– "మొదటి జన్మలో వాళ్లు వక్రబుద్ధులుగలవారై విపరీతంగా ధనం సంపాదించారు. అంతా వృధా! ఇక్కడ అవిశ్రాంతంగా, రాళ్లు మోస్తున్నారు. జుట్టు తీయించుకుని గుండు తలల్తో ఉన్నవాళ్లు కనిపిస్తున్నారే! వాళ్లు అత్యంత దురాశాపరులు. ఆ దురాశ పోప్, కార్డినల్స్ వంటి మతాచార్యులనే మింగివేసింది"

"ఏదైనా అవసరం వలన అలా వారు పాపాలకు ఒడిగట్టారా" అని నేను అడగగా ఆ మహాజ్ఞాని అన్నాడు– "వృథా ఆలోచన నీది! అప్పుడూ దురాశతో లోభత్వంతో క్రూరులైనవారు అదే ఇప్పుడు వాళ్లని కళంకితులుగా చేసింది. జ్ఞానాన్ని తృణీకరించి దురాశతో ధనం కూడబెట్టిన వాళ్లు ఇటువంటి శిక్షలను అనుభవించక తప్పదు. సమాధుల నుంచి వీళ్లు మూసి బిగబట్టిన పిడికిళ్లతో, తలకు గుండు కొట్టించుకుని, వస్తారు. అందమైన ప్రపంచంలో అత్యంత హేయమైన చెడును పోగుచేస్తారు. కుమారా! చూసావా! అదృష్టదేవత తీరు! చంచలమైన, అనిశ్చితమైన ఆమె ప్రాపుకోసం ఎన్ని దుష్కార్యాలను చేసినారో చూడు! ఇప్పుడు ఆ చందమామ వెనక ఉన్న ధనసంపదనంతా ఇచ్చినా, వీళ్లు కాసింత విశ్రాంతిని సంపాదించలేరు"

నేనడిగాను– "ప్రభువు ఆశీస్సులను తన కాలిగోళ్లతో తన్నుకుపోయే ఈ అదృష్టం ఎలాంటిది?"

ఆ మహాకవి సమాధానమిచ్చినాడు– "ఆ ప్రభువు సర్వజ్ఞాని, అనేక శాసనాలను రూపొందించి స్వర్గభూలోకాలను ఇచ్చినాడు. ఆ వెలుగురేఖల సాయంతో మనం జీవితాలను సక్రమమార్గంలో నడుపుకోవాలి. కాని కాలప్రవాహంలో వచ్చిన మార్పులవల్ల దురాశ పచ్చగడ్డిలో పాకుతున్న పాములా, అన్నిచోట్లకూ వెళ్తూంటే కొన్నిరాజ్యాలు ఉచ్ఛస్థితిలోకి రాగా కొన్ని కూలిపోతున్నాయి. ముందుచూపు ఉన్న దేశాలు న్యాయబద్ధమైన పరిపాలనతో సుఖసౌభాగ్యాలతో తులతూగుతాయి. అదృష్టం వీటన్నిటినీ నియంత్రిస్తూ పరిపాలన సాగిస్తుంది. ఆమె చేసే మార్పులకు విరామం ఉండదు. అవసరం ఆమెకు వేగాన్నిస్తుంది. కృషిలేకుండా అవకాశంపై ఆధారపడిన వారు ఆమెను నిందిస్తారు. కాని ఆమె ఆశీర్వదించబడిన దేవత. ఆమె ఉన్నచోట భోగభాగ్యాలు వెల్లివిరుస్తాయి.

మాట్లాడుకుంటూ మేము కిందకు దిగుతున్నాము అక్కడ మాకు కుతకుత లాడుతున్న శబ్దాలతో ఓ 'బావి' కనిపించింది. అది స్టిజియన్ మురికి నీటి ప్రవాహమే! ఆ లోతుల్లో నాకు నగ్నంగా ఉన్న ఓ గుంపు కనిపించింది. ఆగ్రహంతో మండుతున్న కళ్లతో వాళ్లు తమ వాడిగోళ్లతో ఎదుటివాళ్ల తలలు రొమ్ములు కాళ్లూ చేతుల్ని కోసి పడేస్తున్నారు.

నా ఉపాధ్యాయుడన్నాడు– "వాళ్లే కాక ఈ మురికినీటి అడుగున అసంఖ్యాక ఆత్మలున్నాయి. వాటి మూల్గులు, ఆక్రందనలే ఈ వేడి బుడగలు. 'సూర్యుడున్న ఆ చక్కటి ప్రదేశంలోనూ వృథాగా మేము దుఃఖించాము. ఇక్కడా ఈ చీకటి ప్రదేశంలోనూ అనంతంగా దుఃఖిస్తూనే ఉన్నాము" – అంటూ రోదిస్తున్నాయి ఆ ఆత్మలు. ఆ మురికినీళ్లలో పడిలేస్తూ, ఆ కల్మశాన్ని, జిగటనూ మింగుతూ ఉమ్ముతూ ఉన్న వాళ్లను చూసీ చూడనట్లు గమనిస్తూ ఎత్తైనా ఓ బురుజు వద్దకు మేము చేరుకున్నాము.

## Canto - 8

**ఫ్లెగియాస్ బురుజు నుంచి వచ్చిన సంజ్ఞతో 'కారన్' తన పడవలో ప్రయాణీకులిద్దరినీ ఆవలి తీరానికి చేరుస్తాడు. అక్కడ వాళ్లకు 'ఫిలిప్పో అర్జెంటి' తాను అనుభవిస్తున్న నరకయాతనను వర్ణిస్తాడు అక్కడ నుంచి వాళ్లు 'డిస్' నగరానికి రాగా, పిశాచాలు వారిని లోనికి అడుగుపెట్టనీయకుండా ద్వారాల్ని మూసివేస్తాయి.**

# ఫ్లెగియాస్, ఫిలిప్పో అర్జెంటి

మేము ఆ ఎత్తైన గోపురం వేపు తలెత్తి చూసాము. అది దీపగృహం (Light House). దానిలో రెండు ఆకాశదీపాలు (Cressets) వేలాడుతున్నాయి.

నా మార్గదర్శకుడన్నాడు– "అది ఆ మురికినీళ్లపై పయనించే నావపైనున్న దీపం. ఈ చిత్తడినేలలో ఏర్పడే పొగ అడ్డం రాకుంటే నీవే కళ్లారా చూద్దువుగాని"

విల్లు నుంచి దూసుకుపోయిన బాణం తీవ్ర వేగంతో పోయి చెట్టు బెరడుకు గుచ్చుకుని ఆగినట్లు, మా వద్దకు ఆ పడవ వచ్చి ఆగింది. పడవ నడిపేవాడు అరుస్తున్నాడు– "పతనంచెందిన ఆత్మా! వచ్చావా! 'ఫ్లెగియాస్! ఫ్లెగియాస్!' అని ఆతడు నావచేరిన తీరం పేరు చెబుతున్నాడు. (Phlygeas = తన కుమార్తె కరొనిస్‌ను బలాత్కరించిన అపోలోకు ఎదురుతిరిగి, అపోలో దేవాలయాన్ని తగలబెట్టిన ఫ్లెగియాస్‌ను, అపోలో, పర్వతంగా మార్చి టార్టరస్ పాతాళానికి నెట్టివేసినాడు)

నా ప్రభువు అన్నాడు– "మేం ఈ మురికి నీటిమీదుగా ఆవలి ఒడ్డు చేరాలి" అని ఆతడు ఆ దొనెపై (Skiff) ఎక్కి నన్నూ ఎక్కమన్నాడు. అలల్ని కోసుకుంటూ ఆ పురాతన పడవ మృతప్రవాహంపై పోతుండగా ఒక ఆత్మ ఆ మడుగులోంచి లేచి అడిగింది– "ఎవరు మీరు? ఈ ఘడియలో ఇటు వెళ్తున్నారు?"

నేనన్నాను– "నా సంగతి నీకెందుకులే గాని, నీవెవరవు? ఇంత మురికి మడుగులో ఏం చేస్తున్నావు?"

అతడు దుఃఖిస్తూ అన్నాడు– "నేను విచారం ప్రకటిస్తున్నాను" అంటూ పడవపైకి రాబోతుంటే నా ప్రభువు ఆ ఆత్మను "పో! నీ తోటి కుక్కల మధ్యకు" అని నెట్టివేసినాడు. అయినా ఆ ఆత్మ నన్ను వదలక, నా మెడచుట్టూ చేతులు వేసి, నన్ను ముద్దుపెట్టుకున్నాడు. నేనన్నాను– "ఇంత మురికిలో నీవు కప్పబడినా నేను నిన్ను గుర్తుపట్టాను"

అతడన్నాడు– "ఎందరో ప్రభువులు, రాజులు, ఆ లోకంలో ఘనత వహించిన వాళ్లు, ఇక్కడ ఈ మురికి నీళ్లలో పందుల్లా పొర్లుతున్నారు" అతడి మాటలు పూర్తికాక

మునుపే అనేకమంది ఆత్మలు– “అదుగో ‘ఫిలిప్పో అర్జెంటి’! (Filippo Argenti) అని అరుస్తూ అతడి మీదకు విరుచుకుపడుతుండగా ఆతడిని విలాపాల మధ్య అక్కడే వదిలి మేము ఒడ్డుకు చేరినాము.

నా మార్గదర్శకుడన్నాడు– “ఆ వచ్చేది ‘డిస్’ (Dis) నగరం. అక్కడి జనం మహా క్రూరులు. ఆ చిన్నిగోపురంలోని మంటలు నరకలోకపు శీతాగ్నులు”

మమ్మల్ని ఆ ఇనుపకోట ద్వారం వద్ద ఆపి నావికుడు అన్నాడు– “అదే ద్వారం! పడవ దిగండి!.” మేము ఆ ద్వారం వద్దకు వెళ్లాము. అక్కడ ఓ వేయిమంది నావేపు తీవ్రంగా చూస్తూ “ఎవరితడు? మృత్యువు ఈతనిని ముట్టుకోకుండా ఇక్కడకు ఎలా రాగలిగాడు?”

మహాజ్ఞాని ఒక సంజ్ఞ చూపగానే వాళ్ల కోపం తగ్గింది. “నీవు లోపలకు రావచ్చు, కాని అతడు ఈ నరకలోకపు చీకటిదారుల్లో కొట్టుకుపోనీ! ఇక్కడకు రావడం తెలిసిన వాడు పోవడం తెలుసుకోలేడా!” వాళ్లు తిట్లూ, కేకలూ వినేసరికి నాకు కాళ్లూ చేతులూ చల్లబడ్డాయి. నేనిక్కడకు రాకుండా ఉంటే బాగుండేది కదా అనిపించింది.

“నా మార్గదర్శకుడా! నీవు నన్ను ఇప్పటికి ఏడుసార్లు రక్షించావు! ఆకలిగొన్న తోడేలు నుంచి, కారాన్, మినాస్, సెర్‌బెరెస్, ప్లూటస్, ఫ్లెగియాస్, ఫిలిప్పో అర్జెంటి – ల నుంచి బయటపడవేసినావు. ఇక్కడ నన్ను వదిలి వెళ్లవద్దు! ముందుకు వెళ్లడం అసాధ్యమైతే వెనక్కు వేగంగా వెళ్లిపోదాం!”

నా ప్రభువు అన్నాడు– “భయం వద్దు. మనల్ని ఎవరూ అడ్డగించలేరు. మన ప్రయాణం దైవనిర్ణయం! నాకోసం కాసేపు నిరీక్షించు. ఇంతలో కాస్త విశ్రాంతి తీసుకో! నేనిప్పుడే వస్తాను” అని వెళ్లినాడు.

అతడు వస్తాడా, రాడా అని నేను తర్జనభర్జనలు పడేలోపునే, ఆతడు వారితో ఏం చెప్పాడో, ఏమిస్తానన్నాడో తెలీదు కాని వాళ్లు ఒక్కుమ్మడిగా వెనక్కి జరిగి తలుపులు మూసుకున్నారు. నిరాశతో ఆ మహాకవి తలదించుకుని ఒక్కో అడుగూ మెల్లగా వేస్తూ నా దగ్గరకు వచ్చినాడు. అతనిలో కోపం ప్రస్ఫుటంగా కనిపించింది. “ఎవరు నన్ను ఈ కష్టాల లోకంలో తిరగకుండా నిరోధించ చూసినది? వారు మనకు పెట్టిన అడ్డంకులను తొలగిస్తాను. వాళ్ల మొండితనం నాకేమీ కొత్తకాదు. ఆ తలుపులకు గడియలేదు. ఆ ద్వారపు కమానులోని వంపు కప్పు (arch)కు ఒక మృత్యుశాసనం వేలాడుతున్నది చూడు! అదుగో! ఈ దిగువన ఉన్న వలయాలను దాటుకుంటూ, ఒక్కడే వస్తున్నాడు. అతడు తన శక్తితో మనకు ఈ లోకాన్ని చూపించగలడు”

## Canto - 9

**నరకలోకపు ఫ్యూరీ దేవతలను చూసిన తరువాత డాంటీ, వర్జిల్‌లు నాస్తికులు, మతభ్రష్టులు శిక్షింపబడే 'డిస్' నగరానికి వెళ్తారు. అక్కడ మతభ్రష్టులను తీవ్రమైన అగ్నులతో ఉన్న సమాధులలో వేల్చడాన్ని చూసిన పిమ్మట వారిద్దరూ రాతి గోరీల (Sepulchre) మధ్య నుంచి ఆ నగరం వెలుపలకు వస్తారు.**

# నాస్తికులు శిక్షింపబడే 'డిస్' నగరం

'డిస్' నగర ద్వారము మూయబడగా వెనక్కు వచ్చిన నా మార్గదర్శకుడు నా పాలిపోయిన వదనాన్ని చూసి అన్నాడు– "భయపడకు! వాళ్లు తలుపు మూసినా మనం వెళ్లేందుకు ఎన్నో మార్గాలున్నవి. మనకు సహాయం చేయడానికి ఎవరన్నా వచ్చే సమయం దగ్గరపడింది"

నాకెందుకో ఆ రెండు వాక్యాల్లో ఏదో తేడా కనిపించింది. అడిగాను– "ఆర్యా! ఇంతకుముందెవరైనా ఈ అగాధపు అడుగుల్లోకి అడుగుపెట్టి మరలా వెనక్కు వెళ్లగలిగారా!"

అతడన్నాడు– "చాలా తక్కువ! ఎరిక్తొ (Erictho) మంత్రగత్తెను పాంపే (Pompey) కుమారుడు సెక్సటస్ (Sextus) తన తండ్రి, సీజర్‌ల మధ్య యుద్ధంలో ఎవరు గెలుస్తారో కనుక్కోడానికి నియోగించగా ఆమె నన్ను ఆవాహన చేసి జూడాస్ వలయంలో ఉన్న ఒక ఆత్మను అడిగేందుకు ఇక్కడకు పంపింది. నాకు ఈ దారి తెలుసు. అందుచేత గాభరా పడకు. దుఃఖనగరాన్ని చుట్టుముట్టి ఉన్న మురికి సరస్సును దాటడమంత సులభం కాదు"

ఆతడు అలా చెబుతూనే ఉన్నా నా దృష్టి అంతా ఆ దీపగృహం నుండి వస్తున్న మంటలపైననే ఉన్నది. మరుక్షణంలో మా ముందు ముగ్గురు ఫ్యూరీస్ (Furies = ఆగ్రహోనల దేవతలు) రక్తంతో తడిచిన దేహాలతో, స్త్రీలలా కనిపిస్తున్నా, రాక్షస రూపాలతో, వారి చుట్టూరా ఆకుపచ్చని హైడ్రాలు మెలికలు తిరుగుతుండగా, వాళ్ల తలపై శిరోజాలకు బదులు విషసర్పాలు బుసలు కొడుతుండగా, భయంకరంగా కేకలు పెడ్తున్నారు.

ఆ ముసలి మంత్రగత్తెలను ఎరిగున్న మహాకవి నాతో అన్నాడు– "వీళ్లే ఫురీస్ అనబడే ఎరిన్నిస్‌లు (Furies=Erinnies) ఎడమ పక్క ఉన్నది మెగిరా (Megaera), కుడిపక్క మీద పడ్తున్నట్లున్నది ఎల్లెక్టొ (Allect), మధ్యలో ఉన్నది టిసిఫొని (Tisiphone)"

ఆ పిశాచదేవతలు ఒకదానిని ఒకటి తడుముతూ భయంకరంగా నవ్వుతుంటే నేను నా రక్షకుడైన కవిగాయకుడి వెనక్కి నక్కి భయభయంగా చూడసాగాను. "మెడుసా! త్వరపడు! వీడిని ఎడమాంటైన్ శిలగా మారుద్దాం!" అని అవి అరుస్తున్నవి. "థిసియస్ తప్పించుకున్నా వీడిని వదలద్దు!"

నా మార్గదర్శకుడన్నాడు– "వాటివేపు చూడకు! ఆ గార్గాన్‌ను చూశావా నీవు పైలోకంలోకి వెళ్లే అవకాశాన్ని శాశ్వతంగా కోల్పోతావు" అంటూనే ఆతడు స్వయంగా నన్ను తన వెనక దాచాడు.

అప్పుడే తీరంలో ఓ భీకరమైన శబ్దం, పెను అలలు బండరాళ్లపై విరుచుకు పడినట్లు, తీరాలు వణికి, నదుల గట్లు కదిలి, ధూమవాయువులు ప్రకోపించినాయి. పెనుగాలికి అడవిలోని వృక్షాలు విరిగి, నేలకూలి, దూరంగా విసిరేయబడ్డట్టు, సుడిగాలి ప్రతాపానికి జంతువులు, పశువులు, పశుపాలకులు కొట్టుకుపోయినట్లు – ప్రళయ భయంకరమైన సవ్వడులు.

నా మార్గదర్శకుడు నా కళ్లను మూసిన ఆతని చేతులను తొలగించాడు– "అదుగో! ఆ ప్రాచీన నురగ ప్రాంతంవేపు నీ దృష్టిని సారించు! ఎక్కడైతే పొగ పైకి పోతోందో అటు!" ఎవరో ఒక మహావ్యక్తి స్టిజియన్ శీతల మురికి ప్రవాహాలపై పాదాలకు నీరంటకుండా నడుస్తూ మావేపు వస్తుండగా, ఆతనికి అభివాదం చేయమని నా మార్గదర్శకుడు కోరినాడు. అతడు ఆ కోట ద్వారం వద్దకు వచ్చి తన మంత్రదండంతో ఆ తలుపులను తాకగానే, అవి భళ్లున తెరచుకున్నాయి.

"స్వర్గభ్రష్టులారా! తిరస్కరించబడిన వ్యక్తులారా! ఎప్పటినుంచి మీకీ ధైర్యం, తెగువ, మొండితనం మళ్లీ మొదలైనాయి? మిమ్మల్ని చావగొట్టి, కోరలు పీకితేనే గాని సౌమ్యంగా ఉండరా? విధి నిర్ణయం తెలవదా! మీ నరకలోక జాగిలం గతి ఏమయ్యింది? జాగ్రత్త!" అని గద్దించి ఆతడు మాతో ఏమీ మాట్లాడకుండానే ఆ ప్రవాహం మీదుగా వెళ్లిపోయాడు.

మేము ఇప్పుడు లోపలికి వెళ్తుంటే మమ్మల్ని ఆపినవారు లేరు. ఆ విశాలమైన కోటలోపల కూడా అంతా దుఃఖమయమే!బాధలే! ఆర్లెస్ మైదానంలో నిశ్చలంగా ఉండే రొనె (Rhone) నది దగ్గర, లేదా క్వార్నారొ అగాధం వద్ద పొలా తీరాన, ఇటలీ సరిహద్దుల ప్రాంతంలో అసంఖ్యాకంగా ఉన్న గోరీల (Sepulchres)లా, ఆ కోటలోని గోరీల (ఇటుక సమాధుల)లో నిర్విరామంగా రగుల్తున్న అగ్నిజ్వాలలు, ఆ మంటలపై కాలుతూ హాహాకారాలు చేస్తున్న ఆత్మలు. వాటి దీనాలాపాలు, ఆర్తనాదాలు, మూలుగులూ–

నా గురువు అన్నాడు– "వీళ్లు మతభ్రష్టులు, పాషండులు, నాస్తికులు. వాళ్ల అనుయాయులు. అవి వాళ్ల సమాధులే! ఎలా పాతిపెట్టబడినవి అలాగే ఉంటాయి. కాని వాటిలోని మంటల తీవ్రత వేరుగా ఉంటుంది"

మేమిద్దరం కుడివేపుకు తిరిగి ఆ గోరీల మధ్య నుండి ప్రాకారాన్ని దాటి వెలుపలికి వస్తున్నాము.

## Canto - 10

**తన మార్గదర్శకుడి అనుమతి తీసుకుని డాంటీ, మండుతున్న సమాధులలో నరకయాతన పడుతున్న ఇద్దరు వ్యక్తులతో సంభాషిస్తాడు. ఫారినేటా అనే ఆత్మ – డాంటీ ఫ్లోరెన్స్ నుంచి బహిష్కరింపబడతాడని జోస్యం చెబుతూ, నరక లోకంలోని ఆత్మలు భవిష్యత్తు గురించి చెప్పగలవు కాని, ఇప్పుడు జరుగుతున్న విషయాలను భూలోకం నుంచి కొత్తగా వచ్చిన వాళ్లు మాత్రమే చెప్పగలరని వివరిస్తాడు.**

# ఫారినాటాతో డాంటీ సంభాషణ

అక్కడ ఉన్న ఓ రహస్యమార్గం నుంచి గోరీలకు గోడలకు మధ్య నడుస్తూ న్నప్పుడు నేనడిగాను– "సుగుణమూర్తీ! ఈ గోరీలలో ఎవరుంటారు? వీటి తలుపులు తీసి ఉన్నాయే! వీటిని గమనించే వారెవ్వరూ ఇక్కడ లేరుకదా!"

అతనన్నాడు– "జోసాఫాట్ (Josaphat) లోయలో అంతిమ తీర్పు రోజున ఇవన్నీ మూయబడతాయి. ఇక్కడ ఎపిక్యూరస్ (Epicurus), అతని అనుయాయు లుంటారు.

మా మాటలను వింటున్న ఒక ఆత్మ ఆ సమాధిలో నుంచి తల, రొమ్ముల వరకు శరీరం కనిపిస్తుండగా అన్నాడు– "ఓ టుస్కన్! జ్వాలానగరంలో వెళ్తున్న పథికుడా! నాదీ నీదేశమే!"

అతడు 'ఫారినాటా' (Farinata). ఫ్లోరెన్సులో గ్లిబెల్లైన్ వర్గానికి నాయకుడు. గ్యుల్ఫి వర్గాన్ని ఓడించినవాడు. అతడన్నాడు– "ఒకసారిగాదు, రెండుసార్లు వాళ్లని ఓడించి నలుదిక్కులకూ తరిమినా మళ్లీ మళ్లీ వచ్చేవాళ్లు!"

పక్కనే ఇంకో ఆత్మ మోకాళ్లపై లేచి నన్ను అడిగింది. "ఈ చీకటిఖైదు నుంచి బహుశా ఈ మహానుభావుని దయతో బయటపడతావనుకుంటాను. ఇంతకీ నా కుమారుడేడీ? నీతో కన్పించడే!" అన్నాడు అతడు 'కావల్‌కాంటె కావల్‌కాంటి' (Cavalcante Cavalcanti). అతని కుమారుడు గిడొ (Guido) నా స్నేహితుడు.

నేనన్నాను– "నేను తిరిగి వస్తానని అతడు ఎదురుచూస్తుంటాడు. నీ కుమారుడు గిడో (Guido)కు ఇటువంటి ప్రదేశం ఇష్టం ఉండదు" అని నేను మౌనం వహించాను. కాని అతడు నా మాటలు అర్థం చేసుకోకుండానే– "ఏమిటీ నా పుత్రుడు మరణించాడా! పగటి కాంతి అతని కళ్లపై ఇక పడదా?" అంటూనే సమాధిలో పడిన అతడు మళ్లీ లేవలేదు.

ఇంతలో ఫారినాటా (Farinata) అన్నాడు– "యాభై నెలల్లోపుగానే వాళ్లు ప్రవాసం నుంచి మళ్లీ ఫ్లోరెన్స్ నగరానికి వచ్చారు. నగరాన్ని ధ్వంసం చేద్దామని వాళ్లనుకున్నప్పుడు నేను మాన్‌ఫ్రెడి (Manfredi) రాజు సైన్యం సహాయంతో 'గ్యుల్ఫి' లందరినీ ఊచకోత కోసినమాట నిజమే! అర్బియానది నీళ్లు రక్తవర్ణంలోకి మారిందీ సత్యమే!"

నేనడిగాను– "మీకు భవిష్యత్తులో జరిగేవి తెలుస్తాయా?"

అతడన్నాడు– "ఆ మహాశక్తివంతుడైన ప్రభువు ఆశీస్సులతో కొన్ని విషయాలు తెలుస్తాయి. ఈ క్షణపు సంఘటనలు మాత్రం తెలియవు"

నేనన్నాను– "నేను సరైన సమాధానం చెప్పకముందే కావల్‌కాంటి సమాధిలో పడిపోయాడు. అయినా నీ వల్ల నాకు కొన్ని విషయాలు తెలిసాయి"

నా మార్గదర్శకుడు పిలవడంతో నేను వెళ్లబోతుంటే అతడన్నాడు "నాతో పాటు ఇక్కడ వేయిమందికన్నా ఎక్కువే ఉన్నారు. రెండవ ఫ్రెడరిక్, లార్డ్ కార్డినల్, ఇంకా అనేకమంది"

నేను మహాకవి దగ్గరకు రాగా ఆతడన్నాడు– "నీవు విన్న విషయాలను నీలోనే దాచుకో! నీవు నీ నగరంలోకివెళ్లి, ఆమె ముందు నిలబడి ఉన్నప్పుడు రేపు ఎవరు అక్కడ ఉండేదీ నీకే తెలుస్తుంది"

అక్కడ నుంచి ఎడమవేపుకు తిరిగి, ప్రాకారాన్ని దాటి, దగ్గర్లోనే వున్న లోయవేపు, పెద్దగా ధ్వనిచేస్తూ ఆవిరి, పొగలు జిమ్ముతున్న ప్రాంతంవేపు నడుస్తున్నాము.

## Canto - 11

**ఏడవ వలయం దగ్గర 'దాంటే' – పాషండుడైన అనాస్టాసియస్ గోరీని చూసినాడు. మూత తీసివున్న ఆ సమాధి నుంచి వచ్చిన దుర్వాసనా ధూమాలు ఉక్కిరి బిక్కిరి చేసినాయి. – వర్జిల్ అతనికి మిగిలిన మూడు వలయాలు ఏర్పడి వున్న తీరును వివరించినాడు. వడ్డీవ్యాపారం (Usury) చేయడం దైవధిక్కారమేనని పేర్కొంటూ మరిన్ని వివరాలు మాట్లాడుకుంటూ వారు ఏడవ వలయం నుంచి నిష్క్రమిస్తారు.**

# ఏడవ వలయంలో అనాస్టాసియస్ గోరీ

కాళ్లు పెడితే కోసుకుపోయేంత పదునుగా ఉన్న రాళ్లున్న తీరం వేపు, బాధల తీవ్రత మరింత ఎక్కువై ఆత్మలు దారుణంగా కుయ్యాలిస్తున్న దగ్గరకు చేరుకున్నాము. అక్కడ అగాధం నుంచి వస్తున్న దుర్వాసనా ధూమాలు ఆకాశానికెగస్తూ ముక్కుపుటాలనదరుగొడ్తుండగా, ఆ తెరచి ఉన్న ఇటుక సమాధి (గోరీ) వద్ద వ్రాసి ఉన్న అక్షరాలను చదివాము. "ఫొటినస్ (Photinus)చే ఋజుమార్గం నుంచి లాగబడ్డ పోప్ అనాస్టాసియస్‌ను ఇముడ్చుకున్న ప్రదేశాన్ని నేను!"

మా నాసికలు, శరీరం ఆ దుర్వాసనకు అలవాటు పడినాక నా మార్గదర్శకుడిలా అన్నాడు– "ఈ కరకు రాళ్లలోపల ఇంకో మూడు అంతర్ వలయాలున్నాయి. అక్కడా దుఃఖ పూరితమైన ఆత్మలు రకరకాలైన నరకయాతలను అనుభవిస్తూ ఉండడం నీవు చూడవచ్చును.

అన్ని చెడుకార్యాలకన్నా దేవలోకపు దృష్టిలో అతిక్రూరమైనది గాయపరచడం. బలంతోనో, మోసంతోనో ఇతరును గాయపరిచి ఇతరుల దుఃఖాలకు కారణం కావడం అతిపెద్ద నేరం. 'మోసం' చేయడం (Fraud) అనేది మానవులకున్న ప్రత్యేక దుర్లక్షణం. వీళ్లకు విధించబడే శిక్షలతిదారుణంగా ఉంటాయి. హింసలో పాల్గొన్నవాళ్లు మొదటి అంతర్ వలయంలో ఉంటారు. మానవుడి హింసా విధానాలు దేవునికి, తన పొరుగువానికి, తనకు హానిని కలిగిస్తాయి. మృత్యువు, హింసతో కూడిన మరణం, నెప్పితో కూడిన గాయాలు వీటిని తన పొరుగువాడికి కలిగించినవాడు; దొంగలు, దోపిడీదార్లు, వీళ్లందరినీ రకరకాల గుంపులుగా ఉంచి మొదటి వలయంలో శిక్షిస్తారు.

తనకు తాను గాయం చేసుకునేవాడిని, హింసించుకునేవాళ్లను, చంపుకున్న వాళ్లను రెండవ అంతర్‌వలయంలో ఉంచి శిక్షిస్తారు.

దేవుని శక్తిని విమర్శించినవారిని, దైవదూషకులను దైవ ద్రోహులను, ప్రకృతి విరోధులను, సోడొమ్ (Sodom), కాహర్ (Cahor) (వడ్డీవ్యాపారస్తులుండే ప్రదేశం) లాంటి ప్రాంతపు వాళ్లను ఈ మూడవ అంతర్వలయంలో శిక్షిస్తారు.

'మోసం' అంతరాత్మను విషపురుగుల్లా కుద్తుంది. ఎదుటివాళ్లు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేసి చరించే వాళ్లను, ప్రకృతి సహజమైన ప్రేమను ధ్వంసించేవాళ్లను మోసగాళ్లు, మాయగాళ్లు, తాంత్రికులు, ఇంద్రజాలికులు, దొంగలు, అబద్దాలకోరులు, దేవుని సొమ్ము అపహరించినవాళ్లు (Simony), కామపీడితులు, అవినీతిపరులు వీరందరినీ తరువాత వలయంలో చూడగలవు. వీళ్లందరూ విశ్వబిందువు వద్ద ఆ చిన్ని కక్ష్యలో, 'డిస్' ప్రాంతంలో అనంతంగా శిక్షింపబడ్తారు.

నేనడిగాను– "ఆర్యా! బద్దకస్తులను, స్థూలకాయులను, వానతో, తుఫానుతో కొట్టుకుపోతున్నవాళ్లని, వాగుడుకాయలు, వీళ్లందరూ ఎక్కడ శిక్షింపబడతారు? ఈ సుఖాభిలాషులు (Carnal), తిండిపోతులు (Gluttunous), దురాశాపరులు (Avaracious), దారితప్పిన వాళ్లు (Prodigal), కోపిష్ఠివాళ్లు (Wrathful), దుఃఖజీవులు (Gloomy) వీళ్లు 'డిస్' నగరంలో శిక్షింపబడరా?"

అతడన్నాడు– "తెలిసీ తెలియని మాటలివి (Dotage). మూడు విషయాలు స్వర్గ శాసనాలకు విరుద్ధమని తెలుసును కదా. ఆత్మనిగ్రహ రాహిత్యం (Incontinence), ద్వేషం (Malice), మూర్ఖత్వం (Brutishness) – ఈ మూడు లక్షణాలతో బతికిన వాళ్లకు అంత తీవ్రమైన శిక్షలుండవు. అందుకే వీళ్లను మిగతా పాపులు నరకయాతన లనుభవిస్తున్నచోట ఉంచడం లేదు"

నేనన్నాను– "మహాజ్ఞానీ! నా సందేహాలు చాలా వరకు తీరినాయి. కాని వడ్డీవ్యాపారం (Usury) దేవుని మంచితనానికెలా వ్యతిరేకమో అర్థం కాలేదు"

అతడన్నాడు– "జ్ఞానం తెలిపేదేమిటంటే దైవస్వరూపుని నుండి ప్రకృతి, ప్రకృతి నుంచి కళలు అనుకరిస్తూ ప్రవహిస్తాయి. విద్యార్థి తన గురువు వద్ద నేర్చుకున్నట్లు మానవుడు ప్రకృతి వద్ద ఇచ్చిపుచ్చుకోవడం నేర్చుకోవాలి. మానవుని జీవనానికి సౌభాగ్యానికి ప్రకృతి, దేవుడు కారణమని ఆదికాండంలో తెలుపబడి లేదా! వడ్డీవ్యాపారి (Usurer) ప్రకృతి సూత్రాలకు విరుద్ధంగా ప్రవర్తిసున్నాడు. అతని ఆశలు శ్రమపై కాకుండా, ఇతరుల శ్రమను దోచుకోవడంలో ఉన్నాయి. మానవుడు చెమటోడ్చి, తన రొట్టెను సంపాదించుకోవాలని గదా దైవశాసనం!

అదుగో అటుపక్క మీనరాశి (Pisces), క్షితిజరేఖ (Horizon) దగ్గర వాయువ్య దిశలో 'ఛార్లెస్ నాలుగు చక్రాల రథం' ఆకాశాన్ని అలంకరించినాయి. మనం ముందుకు వెళ్దాం!"

## Canto - 12

**ఏడవ వలయంలో హింసకు పాల్పడిన వాళ్లను శిక్షించే ప్రదేశానికి వెళ్తారు. అక్కడ కాపలాగా ఉన్న మినోటార్ (నరవృషభాన్ని), ఆ వలయానికి దిగువ ప్రవహిస్తున్న రక్తపుటేరు వద్ద నరకయాతనలను అనుభవిస్తున్న ఆత్మలను చూస్తారు. అక్కడ వీళ్లపై విరుచుకుపడిన సెంటార్లను చిరాన్ సాయంతో వర్జిల్ నిలువరించినాడు.**

# హింసాప్రవర్తకులకు శిక్షలు

అక్కడ రాళ్లు ఎంత పదునుగా ఉన్నాయంటే 'ఆల్ప్స్' పర్వతాలు వాటిముందు దిగదుడుపే! కొండశిఖరం పైనుంచి భూకంపం వలన బండరాయి పగిలి, ఒకపక్క సముద్రపు అలలచే నిరంతరం మోదబడి, రెండోపక్క ఎడిస్ ప్రవాహం సాగుతున్నట్లు, నీళ్లతో, నాచుతో దుస్తరంగా, పదునుగా ఉన్న ఆ కొండచరియ పక్కనే ఉన్న లోతైన చీకటి అగాధం దగ్గర మేము ఆ క్రెటె నగరపు అపఖ్యాతి చెందిన నరవృషభాన్ని (Minotaur) చూసాము. ఆ రాక్షసుడు మమ్మల్ని చూడగానే పళ్లు పటపట కొరుకుతూ, కోపంగా ఊగిపోతూ మావేపు రాబోయాడు.

అతడివేపు తీక్షణంగా చూస్తూ నా మార్గదర్శకుడు తీవ్రంగా అన్నాడు– "నిన్ను పైలోకంలో మట్టికరిపించిన ఏథెన్స్ ప్రభువు థెసియస్ (Theseus) వచ్చాడు అనుకున్నావా! రాక్షసుడా! వెళ్లిపో! Avaunt! నీ సోదరి దగ్గర రహస్యాలను నేర్చుకుని కాదు, ఇప్పుడు నీవు పడే నరకయాతనలను చూడడానికి అతడు వస్తున్నాడు! పో! Monster, avaunt!"

ఆ నరవృషభం మావేపు దూకేలోపలే మేము ఆ పక్కనే ఉన్న దారిలోకి పరిగెత్తి కిందకు వెళ్లిపోయాము. మినోటార్ కోపంగా అరుస్తూనే ఉన్నాడు.

మహాకవి అన్నాడు– "క్రితంసారి నేను వచ్చినప్పుడు ఈ బండరాయి లేదు. బహుశా ప్రేమతో నిండిన ప్రపంచంలో అశాంతి అల్లర్లు ఎక్కువై హింసలతో పైలోకం కంపించినపుడు కొండశిఖరాలు కదిలి ఈ బండరాయి దొర్లుకుంటూ పడినట్లుంది. ఇటు చూడు! ఇదే రుధిర ప్రవాహం! రక్తపుటేరు. హింసకు పాల్పడ్డవాళ్లు దీనిలోనే మునిగి తేలుతుంటారు.

ఎందుకు భూలోకంలో జీవించే కొద్దికాలం హింసా ప్రవృత్తిలో కీర్తి కనకాల కోసం రక్తపు కూడు తినడం. ఆ తరువాత నరకాన్ని చేరి అనంతకాలం రక్తపుటేర్లలో మునిగి తేలుతూ నరకయాతనల ననుభవించడం?

మేం వెళ్తున్న దారికి అవతల మైదానంలో సెంటార్లు (Centaurs) పరిగెడ్తూ తమ తిరుగులేని బాణాల్తో కాపలా కాస్తుంటారు. మమ్మల్ని చూసి ఓ మూడు సెంటార్లు బాణాలను మాపై ఎక్కుపెట్టి– “ఎవరు మీరు? ఈ అగాధంలోకి ఏ కారణంగా వచ్చినారు? వెంటనే సమాధానమివ్వండి! లేదా ఈ బాణాలు మిమ్మల్ని నేలకూలుస్తాయి!” అంటూ మాపై విరుచుకుపడబోయారు.

నా మార్గదర్శకుడన్నాడు– “మేము చిరాన్ (Chiron)ను కలవడానికి వస్తున్నాము. మీ తీరు ఆనాడూ ఈనాడూ దుందుడుకుగానే ఉన్నది” అంటూ వాళ్లను నిలువరించి ఆ సెంటార్లను చూపిస్తూ – “ఇతడు డియనీరా (Deianira) కోసం ప్రాణత్యాగం చేసిన నెస్సస్ (Nessus). మధ్యలో ఉన్నది ఎఖిల్లిస్ (Achilles) గురువైన చిరాన్ (Chiron). అటుపక్కన కోపిష్టి ఫొలస్ (Pholus). వీళ్లు కాక వేలాదిమంది సెంటార్లు తమ బాణాలతో, రక్త ప్రవాహం నుంచి బయటకు లేస్తున్న ఆత్మలను, పడగొట్టి వాళ్లను శిక్షిస్తుంటారు.

చిరాన్ నన్ను చూడగానే బాణాన్ని గురిపెట్టి తన పక్కనే ఉన్నవాళ్లతో అంటున్నాడు– “ఆ వెనక వస్తున్నవాడిని చూసారా! అతడు నడుస్తుంటే అతని కాళ్లకు తగిలిన రాళ్లు కదుల్తున్నాయి. ఆత్మలకు బరువుండదు?”

నా మార్గదర్శకుడన్నాడు– “చిరాన్! నీవన్నది నిజమే! అతడు బతికే వున్నాడు. దైవనిర్ణయం వలన ఆతడు ఈ విషాద వలయాలను వీక్షిస్తున్నాడు. నేను దుష్టాత్మను కాను. అతడు దొంగ కాదు! మామీద దయ ఉంచి మమ్మల్ని ఈ రక్తపు రేవును దాటి వెళ్లేందుకు సాయం చేయగలవు”

చిరాన్ ఆజ్ఞాపించాడు– “నెస్సస్! వీరికి సాయం చేయి!”. నెస్సస్ మా వెంట రాగా మేము రుధిర ప్రవాహపు ఒడ్డుకు చేరినాము. దానిలో కనుబొమల వరకు మునిగి తేలుతున్న అనేక ఆత్మలు, వాటి కేకల్తో, మా చెవులు దద్దరిల్లిపోయాయి. నెస్సస్ అన్నాడు– “వీళ్లంతా నియంతలు. అడుగో అలెగ్జాండర్! ఇతడు డయొనైసియస్ (సిసిలీని కష్టాలపాలు చేసినాడు). అతడు అజ్జొలినొ (Azzolino), ఆ పక్కన ఒబిజ్జొ (Obizzo of Este), ఇటు హెన్రీ (Killed by Guyde Montefort)”

నేను వాళ్లలో చాలామందిని గుర్తుపట్టాను.

ఆ సెంటార్ నెస్సస్ అన్నాడు– “ఇంకా చాలామంది హింసాకాముకులు ఈ నెత్తుటి ప్రవాహంలో కనుబొమల వరకు మునిగి అనంతకాలం ఇలా నరకయాతన పడుతూనే ఉంటారు. అక్కడ అట్టిలా, సెక్టస్, పిర్రస్, రిమిని, పాజ్జొ – వీళ్లంతా భూలోకంలో యుద్ధాలలో రక్తాన్ని ఏరులుగా పారించినవాళ్లే”

నెస్సస్ మమ్మల్ని రేవు దాటించి తాను వెళ్లిపోయినాడు.

## Canto - 13

**ఏడవ వలయంలోని రెండవ అంతర్వలయంలో - బలవన్మరణం చెందిన వాళ్ల ఆత్మలు కణుపులతో గరుకు బెరడులున్న చెట్లుగా ఉండగా వాటిపై 'హార్పీస్' అనే పిశాచపక్షులు గూళ్లు కట్టుకుని ఉంటాయి. లానొ, గియాకొమొ, ఫ్లోరెన్సులు తమ గోడు వినిపిస్తారు.**

# బలవన్మరణం చెందినవారికి పడే శిక్షలు

నెస్సస్ అటు తీరం చేరుతూ ఉండగానే మేము ఇటువేపు వున్న అరణ్యంలోకి ప్రవేశించాము. ఈ దారిన ఎవ్వరూ వెళ్లినట్లు లేరు. పచ్చని పచ్చిక కనిపించదు. మొక్కల ఆకులు బూడిద రంగులో ఉన్నాయి. అన్నీ ముళ్లపొదలే. కాయలు పళ్లకు బదులు అన్నీ విషపు ముళ్లే! సెసినా (Cecina) నది కార్నెటొ (Carneto) పట్టణానికి మధ్య ఉన్న చిట్టడివి కూడా దీనితో పోలిస్తే మెతకగానే అనిపిస్తుంది.

ఈ అడవి చెట్లపైననే హార్పీస్ - పిశాచ పక్షులు (Harpies) గూళ్లు కట్టుకుని నివసిస్తాయి. ఇవే పక్షులు స్ట్రోఫేడ్స్ (Strophades) దగ్గర ట్రోజన్లను కలవరపరచినది. పెద్ద వెడల్పాటి ముక్కులు, మానవ శిరస్సు, పెద్ద వంపులున్న కాలిగోళ్లు, పెద్ద పొట్ట, పెద్దపెద్ద రెక్కలు టపటపా కొట్టుకుంటూ దాదాపు ఏడుస్తున్నట్లున్న అరుపులతో భయాన్ని కలిగిస్తుంటాయి.

దయగల అధ్యాపకుడు నాతో అన్నాడు- "చుట్టూరా చూడు! ఇది మాటల్లో చెప్పలేనిది! కళ్లతో చూస్తేగాని నమ్మలేనిది" నాకు ఆ చెట్ల పొదల మధ్యలోంచి ఎన్నో గొంతులు వినవచ్చినట్లు అనిపించింది - ఆతడు చెప్పినట్లు వెళ్లి ఒక చెట్టుకొమ్మను విరిచాను! ఆ కొమ్మ విరిగిన భాగం నుంచి రక్తం బొట్లు బొట్లుగా రాలింది. ఆ చెట్టు ఆగ్రహంగా అన్నది- "ఎందుకు నా కొమ్మను విరిచావు? నీ హృదయంలో జాలీ, దయా ఏకోశానా లేవా? మేమూ ఒకప్పుడు నీలాంటి మనుష్యులమే! ఇప్పుడు ఇక్కడ పాతుకుపోయాము! సర్పాల ఆత్మల్లా ఉన్నా నీ చేతులు మమ్మల్ని తాకకపోయేవి!" ఆ చెట్టు 'హిస్' మంటూ చేసిన ఆర్తనాదాలూ మాటలూ గాలిలో ప్రకంపనాలు చేస్తూ దూసుకుపోయాయి.

భయంతో వణికిపోతూ నేను నా చేతిలోని కొమ్మను జారవిడిచాను. మహాకవి అన్నాడు- "ఓ గాయపడిన ఆత్మా! ఆతడలా చేయకపోతే నీ ఉనికిని, నా వాక్యాలలోని సత్యాన్ని ఆతడు అర్థం చేసుకునేవాడు కాదు. ఇది నా అనుమతితో ఆతడు చేసినాడు.

దానికి నేనుకూడా బాధపడ్తున్నాను. అయినా, ఇది వివరించు, పైలోకంలో ఏ నేరం చేసావని నీవిక్కడ ఇలా శిక్షింపబడ్తున్నావు? ఇతడు పైలోకానికి వెళ్లాక నీ కీర్తిని ఉగ్గడించగలడు"

ఆ వృక్షం సమాధానమిచ్చింది– "నీ మాటలు నాకు స్వాంతనను చేకూర్చాయి. నా పేరు పిట్రొడెల్లె విగ్నె. ఒకప్పుడు నేను 'ఫ్రెడరిక్' రాజు నమ్మకాన్ని చూరగొన్నాను. నా అధికారానికి అంతు ఉండేది కాదు. అసూయ అనే వేశ్య అందరినీ లోబర్చుకొనగా వాళ్లు నన్ను రాజద్రోహిగా ముద్రవేసి తప్పుడు సాక్ష్యాలు సృష్టించి నన్ను నేరస్థుడిగా ఋజువు చేసారు. శిక్షగా నా కళ్లు పొడిపించి అంధుణ్ణి చేయగా, నేను చర్చిగోడలకు తలకొట్టుకుని మరణించాను.

నీవు పైలోకానికి వెళ్లేట్లయితే నా ప్రభువుకు విన్నవించు. నేను ఎటువంటి నేరాన్నీ చేయలేదని. నాపై పడిన మచ్చను తొలగించు. ఇతరుల అసూయ నా కళ్లు పోగొడితే, నేను నాకు నేను అన్యాయం చేసుకున్నాను"

నా మార్గదర్శకుడన్నాడు– "ఆలస్యం చేయక, ఇంకేమన్నా అడగాలనుంటే అడుగు. ఇన్ని కీళ్లతో నిర్మింపబడిన శరీరంలో ఆత్మ ఎలా అంటుకుని ఉంటుంది, తెలిస్తే చెప్పగలవా"

అతడన్నాడు– "శరీరం నుంచి విడివడిన ఆత్మ మినాస్ ఉన్న వలయానికి చేరుకుంటుంది. దానికి ఏ ప్రాంతమూ ఇవ్వకపోతే – అక్కడ మొలకెత్తి మొక్కగా, క్రమేపీ పెద్ద వృక్షంగా రూపొందుతుంది. హార్పీస్ పిశాచపక్షులు దానిపై కూర్చుని మరింత బాధను పీడనను కలిగిస్తాయి. బలవంతంగా మరణించినవాళ్ల ఆత్మ వాళ్ల చెట్లనీడనే ముళ్లకు వేలాడుతూ ఉంటుంది. శిక్ష పూర్తయ్యాక మరలా శరీరధారులమవుతాము.

మేము ఆ మాటలు వింటూండగానే – అడవిపంది వెంటబడగా పారిపోతూ ఎవరో అరుస్తున్నట్టు చప్పుడు. వాళ్ల అడుగుల కింద ఆకులు నలుగుతున్న ధ్వనులు. ఎవరో ఇద్దరు వ్యక్తులు (ముళ్లపొద మనుష్యులు) నగ్నంగా పరుగెత్తుతున్నారు. వాళ్ల వంటి నిండా ముళ్లరక్కులు – "పరుగెత్తు! చావు ముంచుకొస్తోంది! పరిగెత్తు!" – "లానో! (Lano) అంత వేగంగా పరిగెడ్తే ఎలా? నీ కీళ్లు ఎలా సహకరిస్తున్నాయి?" పరిగెత్తి ఆయాసం ముంచుకురాగా – ఒక పొద, ఒక మనిషి కలిసి ఒక పొదలోమనిషి వాళ్లను తరుముతూ నల్లటి ఆడకుక్కలు (Mastiff)లు.

వేటకుక్కల్లా అవి వాళ్లమీద పడి చీల్చి చెండాడి, విందుభోజనంలా తిని మిగిలిన కాళ్లూ చేతులూ ఎత్తుకుపోయాయి. నా మార్గదర్శకుడు నన్ను అడవిలోకి తీసుకువెళ్లి రక్తమోడుస్తున్న పొదలనడిగాడు "గియొకొమొ! ఏమిటిది? ఏం తప్పు చేసావని నీకీ శిక్ష విధించబడింది?" అని అడిగాడు. అప్పుడే ఆ వనంలోంచి పెద్ద కేక వినిపించింది.

'లానో' తన ధనాన్ని వృధాచేసి సైనికుడిగా ఇష్టం లేని యుద్ధంలో మరణించాడు. 'గియొకొమొ' తన ఆస్థుల్ని నాశనం చేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు – ఈ ఫ్లోరెన్స్ వన నగరం ఒకప్పటి మార్స్ దేవునికి చెందినది. ఇప్పుడు సెయింట్ జాన్ పేరు మీదుగా పునర్నిర్మించబడినది. కాని యుద్ధదేవుని శాపం వలన ఎప్పుడూ ధ్వంసమవుతూనే వున్నది. వరదల వల్ల, అట్టిలా (Attila) దండయాత్ర వలన, అంతర్యుద్ధాల వలన ఎప్పుడూ మరణాలే! నా కొమ్మలనుంచీ రాలే ఆకుల్లాగా వీళ్లు రాలి శిక్షింపబడుతున్నారు. ఆనాడు నా ఇంటి దూలానికే ఉరితాడు వేలాడదీసు కున్నాను. అందుకే ఈ గాయాలూ, రక్తమూ!

**Canto - 14**

**ఏడవ వలయంలోని మూడవ అంతర్వలయంలోకి ఇద్దరు కవులూ ప్రవేశించారు. కాళ్లు కాలిపోయేంత వేడి ఇసుక. ఇక్కడ దైవద్రోహులకు, ప్రకృతి విధ్వంసకులకు, కళలను నాశనం చేసేవారికి శిక్షలు విధింపబడతాయి. వాళ్లపై అనంతంగా అగ్నికణాలు పైనుంచీ రాలిపడుతూండగా కాళ్లకింద వేడి ఇసుక బాధలను మరింత ఎక్కువ చేస్తుంటుంది. అక్కడనుంచి వాళ్లు 'క్రెటె'లోని 'ఇడా' పర్వతం వద్ద ఉన్న విగ్రహపు పగుళ్ల నుంచి ధారాపాతంగా కురుస్తున్న కన్నీళ్లు పిల్లకాలువగా ప్రవహించి నరకలోకపు నదీప్రవాహాలుగా మారడాన్ని చూస్తారు.**

# దైవ ద్రోహులకు విధించబడే శిక్షలు

నేను ఆ చెట్టుకింద ఆకులు పోగుచేసి ఉంచగానే ఆకులు స్వస్థానానికి చేరడంతో రక్తపు చుక్కలు కారడం ఆగిపోయింది. అక్కడ నుంచి మేము ఏడో వలయం లోని ఆఖరి అంతర్వలయమైన మధ్యభాగం చేరుకున్నాము. మూడోభాగం చుట్టూరా రెండవ అంతర్వలయంలోని విషాద వృక్షాలు, రోదనల పొదలు వివిధ రకాల శబ్దాలు చేస్తూ మనసును పిండేస్తున్నాయి. ఆ ప్రదేశమంతా పొడి, వేడి ఇసుక. ఆరోజుల్లో 'కాటో' (Cato) నడిచిన ప్రదేశమేమో! ఇది అంతా స్వర్గలోకపు ప్రతీకారమా!

నగ్నంగా ఉన్న ఆత్మలు అక్కడ రకరకాలుగా – కొందరు పడుకుని, కొందరు కూర్చుని, అనేకులు అటుయిటూ పచార్లు చేస్తూ, ఏకధాటిగా ఏడుస్తూ నానా రకాల శిక్షలననుభవిస్తున్నారు.

ఆ కాలే ఇసుక మీదకు, ఆల్ప్స్ పర్వతాలపై మంచు పడినట్లు, అగ్నికణాలు ధారాపాతంగా పడ్తుండగా అమితమైన వేడి పుట్టి, గాలి ఒక్క రవ్వంతా లేని ఇండియా వేసవికాలంలా మండిపోతున్నది. ఈజిప్టు రాజు అమ్మాన్ కుమారుడి సైన్యంపై విరుచుకుపడిన జ్వాలాకణాల్లా అవి ఇసుకలో పడి మండుతుండగా ఇసుక వేడి, జ్వాలల వేడితో ఆ శిక్షలననుభవిస్తున్నవాళ్లు ఘోరమైన బాధలను అనుభవిస్తున్నారు. కింద అంగారాలు పైన అగ్నికణాలు, మధ్యలో ఆత్మలు.

నాకేదో గుర్తుకు వచ్చి నేనడిగాను– "గురువర్యా! నిన్ను చూడగానే – ఒక్క ఆ ద్వారం వద్ద ఉన్న ఆత్మలు మినహా – ఏ బాధనూ లెక్కచేయని ఆత్మగా గుర్తించారే అందరూ ఎందుకని?"

ఆతడన్నాడు– "నేను బ్రతికివున్నపుడూ అలానే ఉన్నాను. నేను ఆఖరి క్షణాల్లో 'మాంగిబెల్లో'లో ఉన్నపుడు 'జోవ్' దేవుడు నాపై పిడుగులు కురిపించి కూడా నాపై

తన పగను సరిపడా తీర్చుకోలేకపోయినాడు" – కపాన్యూస్ (Capaneus)! నీవూ అంతే కదా! నీకోపం ముందు ఏ శిక్షా నిలువలేదు!

"వీళ్లు థెబన్ నగరాన్ని ముట్టడించిన ఏడుగురు వీరులు. దేవుణ్ణి తిరస్కరించిన వారు" – నాతోరా! అయినా నీవు ఇసుకపై కాలుపెట్టకుండా ఆ పొదల వెంబడే నడువు!

నేను పొదలనుంచి ప్రవహించి ఇసుకలో పారుతున్న ఎర్రటి రక్తప్రవాహాన్ని, రోదనల స్వరాల్ని గమనించాను.

అతడన్నాడు– "క్రెటె' అనే దేశం ఒకప్పుడు సముద్రం మధ్య ప్రశాంతంగా, స్వచ్ఛంగా ఉండి, ఒక ప్రజారంజకుడైన ప్రభువు పరిపాలనలో భోగభాగ్యాలతో తులతూగుతుండేది. అక్కడి 'ఇడా' పర్వతం, ఆకుపచ్చని వనాలతో సెలయేర్లతో శోభిల్లుతుండేది. అక్కడే శాటరన్ భార్య రియా (Rhea) తన కుమారుడిని రహస్యంగా పెంచింది. ఆ పసిపాప ఏడ్పుని, వనకన్యల అరుపుల్తో వినపడకుండా చేసింది. ఆ పర్వతం దగ్గరే ఒక బ్రహ్మాండమైన విగ్రహం వున్నది. స్వర్ణంతో చేసిన శిరస్సు, వెండి రొమ్ము, చేతులు, ఇత్తడితో చేసిన శరీరం, స్టీలుతో చేసిన మిగతా భాగాలూ, కాళ్లూ, ఒక్క కుడిపాదం మాత్రం మట్టితో చేయబడింది.

ఒక్క బంగారపు శిరస్సు తప్ప మిగిలిన భాగాలన్నిటిలో పగుళ్లు ఏర్పడినాయి. ఆ పగుళ్లలో నుంచి కన్నీళ్లలా నీరు ధారాపాతంగా ప్రవహించి అక్కడి గుహలో చేరుతున్నాయి. ఆ జలప్రవాహమే ఎఖెరాన్ (Acheron), స్టిక్స్ (Styx), ఫ్లెగెథాన్ (Phlegethon) నదులుగా ప్రవహిస్తుంది. వాటి అడుగున లోతుగా ప్రవహించే కొసిటస్ (Cocytus) నది, వాటితో కలిసి ఏర్పడే సరస్సు – నీవే చూద్దువు గాని!"

నేనన్నాను– "మనలోకంలోంచి ఈ నదులు వచ్చేట్లయితే ఇవి ఇక్కడ ఎలా ప్రవహిస్తున్నాయి?"

అతడన్నాడు– "ఇవి గుండ్రంగా, వలయంగా ఉండడం నీవు గమనించే వున్నావు. ఇంకా మనం ప్రయాణించినకొద్దీ అనేక కొత్త విషయాలు కనిపిస్తాయి"

నేనడిగాను– "ఫ్లెగెథాన్, లెథెల ప్రవాహాలెక్కడ?"

అతడు సమాధానమిచ్చాడు– "లెథె' ప్రవాహం ఇక్కడ కనిపించదు. ఆత్మలు తమ శిక్షలననుభవించాక, పైకుబికే 'లెథె' ప్రవాహం ద్వారా పైలోకానికి చేరుకుంటారు.

మనం ఈ ప్రదేశాన్ని వదిలి వెళ్లాల్సిన సమయం ఆసన్నమైంది. నన్ననుసరించు. మంటలు తగలని అంచుల వెంబడే నడువు"

**వాళ్లలా నడుస్తూ ఒక మట్టిగుట్ట దగ్గరకు వచ్చేసరికి కొన్ని ఆత్మలు అటువేపు వచ్చాయి. వీళ్లు ప్రకృతికి కీడు చేసినవాళ్లు. డాంటేకు తన పూర్వ గురువు 'బ్రెనెట్టో లాటిని' కనిపించగా ఆతనితో పూర్వాపరాలు మాట్లాడుతాడు.**

# డాంటే గురువు 'బ్రెనెట్టో లాటిని'

అడవిని దాటి చాలాదూరం వచ్చిన మాకు ఎత్తైన మట్టిదిబ్బ కనిపించింది. ఫ్లెంట్, బ్రుజెస్ మధ్య సముద్రపు అలల్ని తట్టుకోడానికి నిర్మించబడ్డ రాతిగోడ (Pier)లా, లేదా పడువన్లు తమ పట్టణాలను, కోటలను రక్షించుకోడానికి బ్రెంటా పొడుగూనా, కియారెంటానా పైన నిర్మించుకున్న గోడలా, మరీ అంత ఎత్తూ, లావూ లేకుండా ఉన్న ఆ దిబ్బల దగ్గరకు చేరుకుని ఆ గోడ దిగువన ఉన్న ఆత్మలను చూసినాము. వాళ్లు మావేపు దర్జీ తన సూదిరంధ్రం వేపు చూసినంత తీక్షణంగా మా వంక చూసినారు. వారిలో ఒకడిని నేను గుర్తుపట్టాను. "అయ్యా! బ్రెనెట్టో!" అని అరిచాను. నేను నా మార్గదర్శకుడి అనుమతితో ఆతడితో మాట్లాడ సాగాను.

తనతో వచ్చినవాళ్లను వెళ్లమని అతడు అక్కడనే ఆగినాడు. అతనన్నాడు– "ఫెసొలె నుంచి వచ్చిన ఆటవికులు నన్ను సర్వనాశనం చేసినారు. మంచికిపోతే చెడు ఎదురైంది. పీతలు ఫిగ్ పళ్లను ఆశించక పురుగులను వెదకునట్లు, వాళ్లు తమ బుద్ధులను మార్చుకోరు.

నేను గ్యుల్ఫ్ పక్షం పనిమీద స్పెయిన్ రాజు వద్దకు వెళ్లి తిరిగి వచ్చేసరికి నా మిత్రులు ఓడిపోయారని తెలిసి, ఆ విచారంలో దారితప్పి అడవిలో తారట్లాడ సాగాను. ఆ తోటలో సుగుణవతి (Virtue) తన నలుగురు కుమార్తెలు సౌజన్యం (Courtesy), ఔదార్యం (Bounty), విశ్వాసం (Loyalty), రాజసం (Prowess) వాళ్ళిచ్చిన ఆతిథ్యాన్ని గైకొని, వారిచ్చిన సలహాతో కొండలు, గుట్టలు, మైదానాలూ, పొలాలు, ఏర్లు, వంతెనలు దాటి అందమైన పూదోటలున్న లోయలోకి ప్రవేశించాను. అది మన్మధవనం. దానినే ఆనందవనం అంటారు. అక్కడ మన్మధుడు (Cupid), నలుగురు సుందరీమణులతో (ప్రేమ (Love), ఆశ (Hope), భయం (Fear), కోరిక (Desire)) విహరిస్తూ ఉంటాడు. అక్కడ నాకు ఓవిడ్ (Ovid) కలిసి ప్రేమ గురించి వివరించి అక్కడి నుంచి తప్పించుకునే మార్గం తెలిపినాడు."

అతడు ఆ విషయం చెప్పగానే అన్నాను– “మీ కథ నాకు ఓ దారి చూపించింది. అందమైన కన్య రూపంలో ఉన్న ఆ ఆలోచనను నేను భద్రపరచు కుంటాను. హాస్యగాడి చేతిలో ఖనిత్రంలా (తవ్వుకోల), ప్రతి విషయానికి దానికి అనువైన దారి ఉంటుంది”

నా మార్గదర్శకుడన్నాడు– “మంచి విషయాల్ని వినేవాడు వాటిని జాగ్రత్తగా గుర్తుంచుకుంటాడు”

నేను బ్రెనెట్టోను తన పరివారంలో ముఖ్యుల గురించి చెప్పమనగా అతడన్నాడు– “వీళ్లంతా మతాచార్యులు (Clerks) చదువుకున్నవారు. పేరున్నవారు కూడా! ప్రిసియన్ అక్కార్సో కుమారుడు – ఫ్రాన్సెస్కో; ఆండ్రియా డిమొజ్జి – ‘సర్వాడి సర్వి’ – వాళ్లలో ముఖ్యులు. నేను వెళ్తున్నాను. అదుగో మరో గుంపు వస్తున్నది. ప్రకృతిని నాశనం చేసిన వీళ్లకు ఒక్కక్షణం విశ్రాంతి దొరికితే నూరు సంవత్సరాలు మంటలు వీళ్లను కాలుస్తూనే వుంటాయి. కాసింత గాలి వీచి కాలిన గాయాల మంటలు ఉపశమించే వీలు లేదు. వారితో నాకు సరిపడకపోవచ్చును. నేను నీకు నా నిధి (Tresor) – నా కావ్యాన్ని ఇస్తున్నాను. దానివల్ల నేను మరల బతుకుతాను”

అలా పలికి ఆతడు వెరొనా పరుగు పోటీలో పోటీదారుడిలా పరిగెడ్తూ అదృశ్యమయ్యాడు. పరుగుపందెంలో అతడు ఓడిపోడు. ఆతడు ఖచ్చితంగా ‘విజేత’!

## Canto - 16

**ఆ గోడ వెంబడే నడుస్తూ వాళ్లు ఎనిమిదవ వలయం వద్దకు వెళ్తున్నారు. మిలిటరీ దుస్తులలో ఉన్నవాళ్లు 'డాంటే'ను తమ నగరంవాడిగా భావించి పలుకరిస్తారు. ఆ ప్రవాహం అక్కడ నుంచి ఎనిమిదవ వలయం లోతులకు పోతుండగా తొంగిచూసిన 'డాంటే'కు ఓ రాకాసి కనిపిస్తుంది.**

# ముగ్గురు మిలిటరీ మిత్రులు

ఆ ప్రవాహం ఏడవ వలయం నుంచి ఎనిమిదవ వలయపు లోతుల్లోకి పడుతూ తేనెటీగల గుంపులా సవ్వడి చేస్తున్నది. అక్కడే మాకు తుఫాను బారి నుంచి తప్పించుకోడానికి వేగంగా పోతున్నట్లు ముగ్గురు సైనికదుస్తుల్లో వున్నవాళ్లు పరిగెద్తూ మావేపు వచ్చారు. డాంటేను చూడగానే– "నిన్నూ నీ దుస్తులను చూస్తే మన చెడిపోయిన నగరపు వాసిలానే కనిపిస్తున్నావే! ఎవరు నీవు?" అన్నారు.

వాళ్ల శరీరం నిండా గాయాలే! పాతవి, కొత్తవి, మంటల వల్ల కాలగా ఏర్పడినవి. నా మనసు విషాదంలో మునిగింది. మేము ఆగగానే వాళ్లు మా చుట్టూరా చక్రంలా పరిభ్రమించసాగినారు. నగ్నంగా ఉన్నవాళ్లు ఒంటినిండా నూనె పూసుకుని మా చుట్టూ తిరుగుతూ ఏడుస్తున్నారు.

వాళ్లలో ఒక వ్యక్తి మాట్లాడినాడు– "నరకలోకపు మట్టిపై కూడ అపాయం లేకుండా నడుస్తున్నవాడా! నా ముందు ఉన్నవ్యక్తి గ్వాల్డ్రాడా (Gualdrada) ధీరవనిత మనవడు 'గిడొగ్విర్రా' (Guido guerra). ఇతడు 'గ్యుల్ఫ్' పక్షానికి విజయం సాధించి పెట్టినవారిలో ముఖ్యుడు. ఇతడు 'అల్డొ బ్రాండి' (Aldo brandi). నాపేరు 'రస్టిక్యుసి' (Rusticucci). మేము చేసిన విధ్వంసానికి ఇలా శిక్షింపబడినాము. ఫ్లోరెన్స్ నగరం ఇప్పుడు శిధిలాలుగా మారింది. మిత్రుడా! నీవు పైలోకంలోకి వెళ్లినపుడు మా గురించి నాలుగు మంచిమాటలు వ్రాయగలవా!" అంటూనే వలయంగా తిరుగుతున్నవాళ్లు మమ్మల్ని విడిచి వేగంగా పారిపోయారు.

నేనూ, నా మార్గదర్శకుడూ మాటలుకూడా వినిపించనంత రొదచేస్తున్న ఆ నీటి ప్రవాహం వద్దకు వెళ్లాము. ఆ ప్రవాహం ఏదో అగాధంలోకి పడ్తున్నట్లుండగా, నా మార్గదర్శకుడు నా నడుముకు పటకాలా కట్టుకున్న తాడును అడిగి తీసుకుని ఆ లోతులోకి విసిరాడు.

అతనన్నాడు– "ఏ పనిచేయాలన్నా ముందుచూపు అవసరం. త్వరగా రా! నీవు చూస్తేనే గాని నమ్మలేని విశేషమున్నది!"

ఆ నీటిలోంచి, నా గుండె జల్లుమంటుండగా, ఓ వికృతరూపం ఈదుకుంటూ వస్తున్నది. రాళ్లకు కట్టిన తాడు సాయంతో పైకెక్కి వస్తున్నట్లో, కింద నీరు పైకుబకగా ఆ నీటిపై తేలుతూ వస్తున్నట్లుగానో ఆ భయంకర మృగం మావేపే వస్తున్నది.

## Canto - 17

**గెర్యాన్ రాక. కళాద్రోహులు శిక్షింపంబడుతున్న ప్రదేశం అక్కడ నుంచి లోతుల్లో కనపడింది. గెర్యాన్‌ను సముదాయించి ఇద్దరూ ఎనిమిదవ వలయంలోకి దిగుతున్నారు.**

# కళాధ్వంసకులను శిక్షించే ప్రదేశం

"అదుగో! చూడు! ఆ రాకాసిమృగం తన విషపు కొండితో ఎంత భయంకరంగా కనిపిస్తుందో! గోడల్ని, కంచెల్ని విరగగొట్టి, పర్వతాలపై ఎగబాకి, దాని చెత్తతో అది అడుగుబెట్టిన చోటును నాశనం గావిస్తుంది" అంటూ, నా మార్గదర్శకుడు దానిని తీరం చివరకు రమ్మని పిలిచాడు. బయటకు అది సౌమ్యంగా కనిపిస్తున్నది. తల, సగం శరీరం నీటి వెలుపల ఉన్నా, మిగతా సర్పరూప శరీరమంతా నీటిలోనే ఉన్నది. ఒంటినిండా పొలుసులే! పెద్దపెద్ద కాలిగోళ్లు, టర్కులు, టార్టార్‌లూ ధరించే వస్త్రాలకన్నా మెరుస్తున్న రంగులతో, 'అరాఖ్నె' తన రాట్నం వద్ద వడికే నూలు కన్నా అందమైన వర్ణాలతో, అది జర్మన్ కర్షకుడిలా, బీవర్ జంతువులా అది నీటి అంచున ఉన్నది. నీటిలోంచి అప్పుడప్పుడూ బయటకు కనిపిస్తున్న తోక, తోక చివరభాగం తేలుకొండిలాంటి విషపు మొన చీలినది, ఈ రాకాసిమృగాన్ని చూడగానే నా కాళ్లూచేతులూ వణికాయి. అతడన్నాడు– "మనం ఇప్పుడు ఆ క్రూరజంతువు వద్దకు వెళ్తున్నాము" – నాపై ప్రాణం పైనే పోయింది. అయినా తమాయించుకుని కాలుతున్న ఇసుకను దాటి పది అడుగులు వేసానోలేదో, ఆ అగాధం దగ్గర ఇసుకపై కూర్చుని ఉన్న ఆత్మల గుంపు కనిపించింది.

నా మార్గదర్శకుడన్నాడు– "నీవు వెళ్లి వాళ్లతో మాట్లాడదలుచుకున్నట్లయితే వెంటనే వెళ్లు! త్వరగా రావాలి సుమా! నేను ఈలోగా ఈ మృగాన్ని శాంతపరుస్తాను"

ఆ గుంపు ఏడవ వలయంలోని వాళ్లే. కింద ఇసుక కాల్తుండగా కాసేపు ఆ కాలిపై, కాసేపు ఈ కాలిపై నిలబడ్తూ ఆ బాధకు కళ్లనీళ్లు కారుస్తూ ఏడుస్తున్నారు. గజ్జికుక్క వంటిపై పుండ్లుపడి దోమలు, ఈగలు, జోరీగలు కుడ్తుంటే కాసేపు నోటితో, కాసేపు కాలితో గోక్కోవడానికి ప్రయత్నిస్తున్నట్లున్నది వాళ్ల పరిస్థితి.

వాళ్లను నేను గమనించసాగాను. ఒక వ్యక్తి మెడలో రంగురంగుల సంచి వేలాడ్తున్నది. దానిపై ఏవో చిహ్నాలు, ఇంకో అతడి దగ్గర పసుపు సంచి, నీలి అంచులతో ఉండి సింహపు బొమ్మతో ఉండగా, ఇంకొకడు రక్తవర్ణపు సంచిపైన తెల్లటి బాతు చిహ్నం. ఇంకొకడి తెల్లటి సంచిపై నీలివరాహం – అతడన్నాడు

"నీవిక్కడేం చేస్తున్నావు? వెళ్లిపో! ఇతడు 'విటాలియానో'; నేను పడువా దేశస్థుడిని. వీళ్లు ఫ్లోరెన్సు వాసులు. పిలవండి– మూడుగొర్రెల బొమ్మ సంచి వున్న యువరాజును!" – అతడు అలా అరుస్తూ మూతివంకరగా తిప్పుకుంటూ, నాలుక బయటకు రాగా పశువు తన ముక్కురంధ్రాలను నాలుకతో తుడుచుకుంటున్నట్లు ఆతడు చేస్తుండగా నేను భయపడి వెనక్కు వచ్చాను. వాళ్లు వడ్డీవ్యాపారస్తులు కళలకు వ్యతిరేకులు. ఆ యువరాజు 'గియొవాని బుజామొంటి' – మహాక్రూరుడు.

అప్పటికే నా మార్గదర్శకుడు ఆ క్రూరమృగపు వీపుపై కూర్చున్నాడు– "మనం చాలా దిగువకు వెళ్లవలసి ఉంది. భయపడకు! నిన్ను ఈ తేలుకొండి ఏమీ చేయదులే! రా! కూర్చో!" అన్నాడతడు.

నేను భయపడుతూ వుండడం చూసి ఆతడు నన్ను తన చేతుల్తో పొదివి పట్టుకున్నాడు– "గెర్యాన్! పద! మమ్మల్ని దిగువకు తీసుకువెళ్లు! ఈ భారం నీకు కొత్తగా ఉండవచ్చును. కాని జాగ్రత్తగా తీసుకువెళ్లాలి సుమా!" అన్నాడు.

ఆ మృగం తన దౌడలను గాలిలో ఆడిస్తూ, నీటిలో ఈల్ చేపలా ఈదుతూ పోతుండగా, – అగ్నిజ్వాలల్లో పోతున్న ఫీథాన్ (Phaethon)లా, మైనం కరిగి రెక్కలు ఊడి క్రిందపడిపోతున్న ఇకారస్ (Icarus)లా – నేను భయంతో అల్లల్లాడి పోయాను.

ఆ రాకాసి మృగం నన్ను పట్టించుకోకుండా సాగిపోతూనే వున్నది. చల్లని గాలి మాపై ఈడ్చికొడుతుండగా, నా కుడిపక్క జలపాతం హోరు, నీళ్లు పెద్దపెట్టున తుళ్లిపడ్తున్న శబ్దం, క్రిందికి చూస్తునుగదా! అగ్నిజ్వాలలు, రోదనలూ, విలాపాలు, మేము దిగుతున్న కొద్దీ ఎటువేపు చూసినా ఆర్తనాదాలే! నరకయాతనల భీభత్స దృశ్యాలే! నేను వణుకుతున్న నా కాళ్లను చేతుల్తో గట్టిగా పట్టుకున్నాను.

వేటగాడు, ఆకాశంలో గిరికీలు కొడ్తున్న తన డేగను, 'వెంటనే కిందికి రా!' అని ఆజ్ఞాపిస్తే అది దూసుకువచ్చి ఆతని చేతిపై సుతిమెత్తగా వాలినట్లు, మమ్మల్ని మోసుకుంటూ వచ్చిన గెర్యాన్ ఓ కొండరాతి పక్కన ఆగింది. దానిమీద నుంచి విల్లు నుంచి విడివడిన బాణాల్లా మేము గట్టుమీదకు చేరుకున్నాము.

## Canto - 18

**ఎనిమిదవ వలయం పదిభాగాలుగా, భూమిలోకి చొచ్చుకుని వచ్చిన సముద్రపు శాఖలుగా విడదీయబడి ఉన్నది. వేర్వేరు రకాల పాపులు వాటిల్లో శిక్షింపబడుతున్నారు. ఈ ఖండికలో స్త్రీలను వలలో వేసుకునేవాళ్లు, పొగడ్తలతో ఇతరులను ఉబ్బించేవాళ్లకు శిక్షలు వర్ణింపబడినాయి.**

# కాముకులకు, స్త్రీలను వలలో వేసుకునేవాళ్లకు శిక్షలు.

నరకలోకపు లోతులలో 'మాలెబొల్గె' (Malebolge) అనే ఇనుప రజనుతో మరకలు పడినప్రదేశమున్నది. దాని మధ్యభాగంలో లోతైన పెద్ద అగాధమున్నది. ఈ ఎనిమిదవ వలయం అగాధం నుంచి వచ్చిన శాఖలతో పదిభాగాలుగా ఉండి, చుట్టూరా కాలుపెడితే కోసుకుపోయే రాళ్లు, రప్పలతో అడుగుపెట్టడానికి వీలులేనిదిగా ఉన్నది. కోటగోడల చుట్టూ అగడ్తలు, పోవడానికి వంతెనలు, కాలిబాటలతో అత్యంత పటిష్ఠంగా ఉన్న దుర్గనగరాలు కూడ వీటికి సరిరావేమో!

గెర్యాన్ పైనుంచి దిగి మేము ముందుకు నడుస్తుండగా నా కుడిపక్క కొత్త బాధలు, కొత్త కష్టాలు, దుఃఖాలతో నగ్నంగా ఉన్న ఓ గుంపు కొందరు అటువేపు, కొందరు ఇటువేపు (వంతెన దాటి తలోదిక్కూ పోతున్న రోమన్ సైనికుల్లా) తిరిగి ఉండగా, కొమ్ములున్న పిశాచాలు వాళ్లను కొరడాలతో బాదుతున్నాయి. ఒక్క దెబ్బ చాలు బోర్లాపడడానికి, ఇక రెండోదీ, మూడోదీ అడగనక్కరలేదు.

వాళ్లలో ఎవరో నాకు తెలిసిన వ్యక్తికనపడగా నేను నా మార్గదర్శకుడి అనుమతితో, తన మొహం దాచుకుంటున్న వ్యక్తి వద్దకు వెళ్లి పలుకరించాను– "నీవు 'వెనెడికొ' (Venedico)వు కదా! ఎందుకీ శిక్ష అనుభవిస్తున్నావు?"

అతడన్నాడు– "నాకిష్టంలేకపోయినా నీకు నేను జవాబు చెబ్తున్నాను. నేను నాసోదరి 'ఘిసొలా' (Ghisolla)ను ఫెర్రారా ప్రభువు 'ఒబిజ్జొ' (Obizzo) కు ఎరవేసాను. బంగారం సంపాదించడమే ఆశయంగా నేను అటువంటి దుష్కార్యాలు చేసాను"

అతడలా చెబ్తుండగానే కొరడా పట్టుకున్న పిశాచం ఆతడిని చెళ్లున చరచి– "పోరా! తార్పుడు వెధవా! ఇక్కడ ఆడవాళ్లు అమ్మకానికి లేరు!" అని అరచినాడు.

మేము అక్కడ నుంచి పక్కనే ఉన్న రాతి వంతెన వద్దకు చేరుతుండగా, అటుపక్క నుంచి ఓ గుంపు మావేపు వస్తున్నది. వాళ్ల శరీరం నిండా కొరడా దెబ్బల గాయాలే!

నా మార్గదర్శకుడన్నాడు– "వాళ్ల మధ్యలో రాజసం ఉట్టిపడుతూ ఉన్నాడు చూసావా అతడే జేసన్ (Jason)! కొల్కస్ (Colchos) బంగరు ఉన్ని గొర్రెను గెలుచుకున్నవాడు. అక్కడ నుంచి లెమ్నాస్ ద్వీపం వెళ్లి అక్కడ మగవాళ్లందరినీ చంపిన స్త్రీలను మాయమాటలతో వశపరచుకుని వాళ్లను గర్భవతుల్ని చేసి వాళ్లను అక్కడే వదిలేసి, తన అనుచరులతో వెళ్లిపోయినాడు. హెప్సిపైలీ ఒక్కతే తన తండ్రిని కాపాడుకున్నది. ఇక్కడే మెడియా (Medea)కు ఆతడు కలిగించిన గాయాలకూ శిక్ష విధించబడుతున్నది. వీళ్లందరూ అటువంటి మోసగాళ్లే!"

మేము అక్కడ నుంచి ఎనిమిదవ వలయంలోని రెండవ భాగానికి వెళ్లాము. అక్కడ కొందరు ముక్కుపుటాలను ఎగబీలుస్తూ, మొహాలపై చేతులతో కొట్టుకుంటూ ఏడుస్తున్నారు. అక్కడ తెల్లటి నురగ గడ్డకట్టి పొరలుపొరలుగా ఉండి దుర్వాసన వేస్తున్నది. అక్కడ ఓ గుంపు పెంటకుప్పల మధ్య పడి ఉన్నారు. వాళ్లలో ఒకడిని నేను గుర్తుపట్టాను. వాడి వంకే తదేకంగా చూస్తుంటే అతడన్నాడు– "ఇక్కడ ఇంతమంది నాకన్నా అసహ్యంగా ఉంటే నన్నెందుకు మిర్రిమిర్రి చూస్తావు?"

నేనన్నాను– "నిన్ను చూస్తే నాకు పరిచయం ఉన్నవాడిలా కనిపిస్తున్నావు. నా జ్ఞాపకశక్తి సరైతే నీవు లుక్కా దేశపు 'అలెస్సియో ఆర్ట్' (Alessio art)"

"అవును నేనే!" అన్నాడతడు నెత్తి బాదుకుంటూ. "నేను మితిమీరిన పొగడ్తలతో అందరిని ఉబ్బించేవాడిని. స్త్రీలను పొగిడి నన్ను పెళ్లిచేసుకోమని కోరేవాడిని. అందుకే నాకీ దుస్థితి పట్టింది" అని వాపోతున్నాడు.

నా మార్గదర్శకుడన్నాడు– "ఇటురా! అక్కడ కనిపిస్తున్న స్త్రీని చూడు! కాసేపు కూర్చుని, కాసేపు నిలబడి వయ్యారాలొలకబోస్తున్నదే! ఆమె పేరు థాయిస్ (Thais). థ్రాసోఆమెకు కానుకను పంపి అంగీకారం ఉన్నట్లేనా, కృతజ్ఞతలు చెప్పవా అని అడిగితే ఆమె అంటున్నది– 'ఎందుకుచెప్పనూ! నిరాకరించే అవకాశమే నాకివ్వలేదుగా' అని తలాడిస్తున్నది అంగీకారంగా! బంగారం కోసం సింగారం ఆమెది"

## Canto - 19

**ఎనిమిదవ వలయంలో మూడో ప్రదేశం. ఇక్కడ మతాన్ని దుర్వినియోగం చేసే వారికి శిక్షలు విధించబడతాయి. ఒక పెద్ద రంధ్రంలో తలక్రిందులుగా ఉన్న వ్యక్తి కాళ్లు మాత్రమే బయటకు కనపడతాయి. పాదాలపై అగ్గిమంటలు. డాంటీను తీసుకుని మహాకవి వర్జిల్ ఆ రంధ్రపు అడుగు భాగానికి వెళ్తాడు. పోప్ నికొలాస్-5, మిగతా మతాచార్యులు, తప్పులు చేసినవాళ్లు శిక్షల ననుభవిస్తూ కనపడతారు.**

# దేవుని సొమ్మును కైంకర్యం చేసిన వారికి శిక్షలు

సైమన్ మాగస్! నీవు దుఃఖించెదవు గాక! నీవూ నీ అనుయాయులు డబ్బూ దస్కానికి, బంగారానికి ఆశపడి, దేవుని సొమ్ములను దోచుకోడానికి అపమార్గాలను పట్టినారు! నీ చావుబాజా మోగేది ఈ మూడవ ప్రదేశంలోనే! అక్కడ పిల్లకాలువ మధ్యలో కొండగట్టు వున్నది. ఇటువంటి ప్రకృతి సహజమైన దృశ్యాలను సృష్టించిన ఆ భగవానుని ఏమని పొగడగలను!

ఆ శిల జీవించి ఉన్నట్లే కనిపిస్తున్నది. ఆ శిల అడుగునంతా రంధ్రాలే. నేనొకసారి సెయింట్ జాన్ గోపురం దగ్గర ఉన్న ఇటువంటి రంధ్రంలోనే ఓ పసివాడు పడిపోతే దానిని పగలగొట్టి వాడిని రక్షించాను. బాప్టిజం – పవిత్రస్నానానికి వాడే రంధ్రాన్ని పగలగొట్టినందుకు నన్ను కొందరు ఆక్షేపించారానాడు!

ఆ రంధ్రాల నుండి పైకి పొడుచుకువచ్చినట్లున్న కాళ్లు. అరికాళ్లు, పాదాలు అగ్నితో మాడుతున్నవి. ఆ బాధకు తాళలేక మోకాళ్ల వద్ద చటుక్కున వంగుతూ లేస్తూ అవి విపరీత ధ్వనుల్ని చేస్తున్నవి. నేనన్నాను– "గురువర్యా! ఈ పాదాలెవరివి? మిగతా వారికన్నా అధికమైన అగ్నిజ్వాలలతో దహింపబడుతున్నవి?"

ఇద్దరం కలిసి దిగువకు వెళ్లినాము. నా మార్గదర్శకుడు ఇరుకైన సందులోకి కేకపెట్టాడు– "ఎవరయ్యా నీవు? భూమిలోకి పాతిపెట్టబడిన కట్టుగొయ్య (Stake)లా ఉన్నావు? ఓపిక ఉంటే సమాధానమివ్వు!"

"వచ్చేసావా! అప్పుడే! బోనిఫేస్! (Boniface)! నీతులు నిజమనుకుని నేను చానాళ్లు పవిత్రంగా వున్నాను. నీవు ధనాన్ని సంపాదించావు. అధికారాన్ని పొంది దుర్వినియోగం చేసావు!"

అతడు నన్నే అంటున్నాడనుకుని ఏమీ అర్థం కాక కొయ్యబారిపోయాను. అప్పుడు మహాకవి నన్ను గదమాయించాడు– “అతనికి అర్థం అయ్యేలా చెప్పు! అతడు పొరపాటు పడ్తున్నాడని” – నేను వెంటనే అలా చేసాను. కాళ్లూచేతులు కొట్టుకుంటూ ఆ ఆత్మ పలికింది– “మరి నీకేం కావాలి? దుస్తులిచ్చిన అధికారంతో నేను నా కుక్క అరుపులు అరిచాను. అరుగో నాకన్నా ముందే తమ అధికారాల్ని దుర్వినియోగం చేసినవారు. ఆ ‘బోనిఫేస్’ ఇక్కడకు వచ్చే సమయమయ్యింది. మాకన్నా వాడికే తీవ్రమైన శిక్ష పడ్తుంది. వాడు కొత్త జేసన్! ఫ్రాన్సు ప్రభువు నుంచే వాడు పరిహారాన్ని వసూలు చేసినాడు”

నేనిక ఆగలేకపోయాను– “నీవు చెప్పు! సెయింట్ పీటర్ నుంచి మన ప్రభువు ఏమి కానుకలనడిగినాడు? అతనికి స్వర్గద్వారపు తాళపుచెవులనే ఇచ్చినాడుకదా! ప్రభువు అడిగిందల్లా ‘నన్ను అనుసరించు! Follow me!’ అనేకదా! ఇంకెవరన్నా తీసుకున్నారా? బంగారం! వెండి! మాథ్యూస్ సంపాదించినవాటిని పంపకాలు చేసుకున్నారా? మీ దొంగ సంపాదనలకు తగిన శిక్షే విధించబడింది. నేనింతకంటే ఎక్కువగా దూషించి ఉండేవాణ్ణి! మీ పేరాశ ఈ ప్రపంచాన్ని దుఃఖంలో ముంచింది. మంచివాళ్లను మీ పాదాలకింద నలిపి, చెడ్డవాళ్లను పైకెత్తేట్లు చేసింది. నీలాంటి దొంగ గొర్రెలకాపరులను ఆ ప్రభువు గమనిస్తూనే వున్నాడు. ధనాన్ని, బంగారాన్ని నీవు దైవాలుగా పూజిస్తూంటే నీకూ విగ్రహారాధకుడికి తేడా ఏమిటి? అతడు ఒక్కదేవుణ్ణే పూజిస్తుంటే నీవు వందలమందిని పూజిస్తున్నావు. ఓ కాన్స్టాంటిన్! నీవు సిల్వెస్టర్కిచ్చిన లాటెరాన్ కానుక ఎంత దుస్థితికి దారితీసిందో!”

నేను ఆ మాటలనేసరికి అతడు మిన్నకున్నాడు. నా మాటలను విని సంతోషించిన నా మార్గదర్శకుడు నన్ను తన హృదయానికి అదుముకుని ఆ దిగువ నుంచి పైకి తీసుకువచ్చినాడు. నన్ను ఆ పక్కనే ఉన్న కొండమార్గంపై నిలబెట్టినాడు. దానిపై కొండగొర్రెలు కూడా ప్రయాణించలేవేమో! కాని అక్కడ నుంచి మాకు ఒక లోయ కనిపించింది.

## Canto - 20

**ఎవరైతే బ్రతికున్నపుడు జోస్యం, భవిష్యత్తు చెప్పడానికి ప్రయత్నించారో వాళ్లకు ప్రత్యేకమైన శిక్ష - వాళ్ల తల వెనక్కు తిరిగి ఉండగా పాదాలు ముందుకు నడుస్తుంటాయి. అందుచేత వాళ్లకిప్పుడు ముందుచూపుండదు. అందుకని అనంతకాలం వెనక్కు నడుస్తూనే వుంటారు. ఏంఫియారస్, టిరెసియాస్, అరున్స్, మాంటోలు ఆ శిక్షననుభవిస్తున్నారు.**

# జ్యోతిష్కులకు విధించబడే శిక్ష

ఆ లోయలోంచి వస్తున్న వాళ్లను చూడగానే నా మనసు క్షోభపడింది. వాళ్లు తమలో తామేదో ధ్యానం చేసుకుంటూ, ఎవరికీ అర్థంకాని భాష అది, మౌనంగా విలపిస్తూ వస్తున్నారు. అయితే పరీక్షగా చూడగా వాళ్ల తలలు ఇటు, కాళ్లు అటు తిరిగి వున్నాయి. ముందుకు చూడాలంటే వెనక్కి నడవాల్సిందే!

వాళ్లను చూసి నాకు దుఃఖం ముంచుకొచ్చింది. ఒకరాతిని ఆనుకుని నేను కూలబడ్డాను. నేను విలపిస్తుంటే నా మార్గదర్శకుడన్నాడు– "ఎందుకు ఏడుస్తున్నావు? దైవ నిర్ణయాన్ని నీ దుఃఖంతో ముంచేద్దామనుకుంటున్నావా! సరే ఇటుచూడు! ఇతడు ఏంఫియారస్ (Amphiaraus). థెబెస్ వద్ద భూమి నోరుతెరిచి ఈతనిని మింగింది. అతని పక్కన టిరెసియాస్ (Tiresias) - స్త్రీగా మారిన పురుషుడితడు. అడుగో 'లూనీ' చలువురాతి కొండల వద్ద ఉండిన 'అరున్స్' (Aruns); ఆమె 'మాంటో' (Manto) టిరెసియాస్ కుమార్తె. ఆమె పేరుమీద వెలసిన ఆ పట్టణం పేరు మాంటువా! అది వర్జిల్ స్వంత ప్రదేశం. మాంటో తన భర్త గతించినాక అనేక దేశాలు తిరిగిచివరకు 'బెనాకస్' చేరుకున్నది. బెనాకస్ ప్రవాహం, 'మిన్సియో' నదిగా 'గోవెర్నో' వద్ద 'పో' నదిలో కలుస్తుంది. మాంటో అక్కడ నివాసమేర్పరచుకుని అక్కడే చనిపోగా, అక్కడి ప్రజలు ఆమె అస్తికలపై నగరాన్ని నిర్మించారు. అదే 'మాంటువా'!

ఇక్కడే 'పినామొంటె' అనేవాడు 'కసోలోడి' రాజును మాయమాటలతో సైన్య సహాయం అందకుండా చేసి చివరకు ఆ రాజరికాన్ని కూలదోసి తానే రాజైనాడు. మోసం కలకాలం సత్యాన్ని దాచి ఉంచలేదు. ఏదో ఒకనాడు నిజం బయటపడ్తుంది. దుష్టులకు తగిన శిక్ష విధించబడ్తుంది.

అదుగో అటుచూడు! అతడు యూరిపైలాస్, ఇతడు కాల్కాస్! ఆ సన్నటివాడు మైఖేల్ స్కాట్! అతడు గిడొబొనాట్టి. ఇతడి సలహా లేకుండా 'గిదొడ మొంటెఫెల్ట్రొ' యుద్ధానికే వెళ్లేవాడు కాదు. అతడు 'అస్డెంటె'. పర్మాలో చెప్పులు తయారుచేసేవాడు. తరువాత జ్యోతిష్కాన్ని వృత్తిగా స్వీకరించినాడు.

వీళ్లుకాక మంత్రగత్తెలు, ఇంట్లో కూర్చుని మగ్గం నేయక మంత్రతంత్రాలు నేర్చుకుని మారణహోమాల్ని సృష్టించినారు"

అని నా మార్గదర్శకుడు– "అక్కడ చూడు చందమామలోని మానవుడు నడినెత్తికి వచ్చినాడు. మనకు ఆ చంద్రిక చేసిన సాయం వల్లనే, చీకటి అడవుల్లోంచి సురక్షితంగా మనం బయటపడినాము" అన్నాడు.

మాట్లాడుకుంటూ మేము ముందుకు పోతున్నాము!



CANTO XVII. THIRD ROUND OF THE SEVENTH CIRCLE: OF THOSE WHO HAVE DONE VIOLENCE TO ART. GERYON. THE USURERS. – DESCENT TO THE EIGHTH CIRCLE.

## Canto - 21

**ఎనిమిదవ వలయంలోనే అయిదవ ప్రాంతానికి పోతూ వాళ్లు వంతెన కింద నల్లని మండుతున్న తారులో మరిగిపోతూ ఆక్రందనలు చేస్తున్న వాళ్లని చూసారు. వస్తుమార్పిడి చేసి లాభాలు గడించిన వాళ్లు, ప్రజల, ప్రభుత్వ సొమ్మును అపహరించిన వాళ్లకు అదే శిక్ష!**

# ప్రజల, ప్రభుత్వ ధన భోక్తలకు శిక్ష

మేము ఆ వంతెన కింద వస్తున్న ఆక్రందనలు ఏవిటా అని ఆసక్తితో తొంగిచూసే సరికి అక్కడ నల్లని మరుగుతున్న తారులో పడి కొట్టుకుంటూ ఆక్రందనలు చేస్తున్న గుంపు కనిపించింది. చీకటి కొట్టంలా ఉన్నదా ప్రాంతం.

వెనెషియన్ నౌకలను సముద్ర ప్రయాణానికి అనువుగా చేసేందుకు వాడే నల్లని తారులా కుతకుత ఉడుకుతున్నది ఆ ప్రాంతం. నావలు నిర్మించే వాళ్లు, వాళ్లు వాడే కొయ్యదుంగలు, పక్కలకు వాడే వంపు చెక్కలు, కొందరు చుక్కానిని, కొందరు తెడ్లను, కొందరు తెరచాప కొయ్యల్ని, కొందరు తాళ్లను, తెరచాపలను సిద్ధం చేస్తూ, నౌకా నిర్మాణ విద్య, దైవదత్తమైనదాన్ని వినియోగించేవాళ్లతో, వాళ్ల చుట్టుపక్కలే చిన్నచిన్న గుట్టల్లా పడివున్న తారుముద్దలు – అలా మేము చూసిన ప్రాంతం కనిపించింది. నేను వాళ్లను మరింత దగ్గరగా చూద్దామని వంతెన అంచుకుపోబోగా నా మార్గదర్శకుడు నన్ను తనవేపుకు లాగినాడు. నా వెనుక నల్లటి పిశాచి, దారుణమైన చూపుల్తో, రెక్కలు రెపరెపలాడిస్తూ, అతివేగంగా మావేపు వచ్చాడు. ఆతడి భుజంపై ఓ పాపిని వేసుకుని వాడు జారకుండా చీలమండల దగ్గర గట్టిగా పట్టుకున్నాడా పిశాచి.

“ఎవరు మీరు నా వంతెనపై? మోసగాళ్లలా ఉన్నారే! చూడండి! నా భుజంపైన ఉన్నవాడు శాంటా జిటా (Santa zita) బృందంలో ఒకడు. వాడిని కిందకు విసిరి మిగతా వాళ్లను తీసుకురావాలి. ఒక్క ‘బొంటురొ’ (Bonturo) తప్ప అందరూ అక్కడే ఉన్నారు. వీళ్లు లుక్కా ప్రాంతపు పెద్దలు, న్యాయాధిపతులు. ప్రజా ధనాన్ని మింగేసిన ఘనులు. - "of 'no' for Lucre there an 'ay' is quickly made" వీళ్లు లేదు, కాదు అన్నారంటే, ఏదో కొంత ముట్టజెప్పాక, అదే ‘అవును’ సరే అవుతుంది.

భయంకరమైన కుక్కలాగా వాడు అటూయిటూ పరిగెత్తుతూ, తన భుజాలపై ఒకడిని మోసుకురావడం వాడిని ఆ రాళ్లలోకి, తారులోకి వంతెనపై నుంచి విసిరి కొట్టడం, ఇలా క్షణం తీరిక లేకుండా పనిచేస్తూనే ఉన్నాడు. కింద పడ్డవాళ్లని వంతెన కింద తారులో ముంచెత్తుతూ శిక్షిస్తున్న పిశాచులు అరిచారు "ఇక్కడ పవిత్రుల దృష్టి సోకదు. సెర్కియో అలలపై తేలినట్లు కాదు ఇక్కడ" అంటూనే వాళ్లు వంతెన మీద నుంచి పడినవాళ్లను నూరు కొక్కేలతో పట్టుకుని, వంటవాడు మాంసఖండాన్ని పట్టుకుని గంగాళంలో ముంచి పైకి తేలకుండా పట్టుకున్నట్లు వాళ్లు కేకలు పెడ్తున్న వ్యక్తులను తేలకుండా తారులో ముంచుతున్నారు.

నా మార్గదర్శకుడన్నాడు– "నీవు ఆ కోసురాయి పక్కన దాక్కుని చూడు! వాళ్లు నిన్నెంత తిట్టినా, సవాళ్లు విసిరినా రెచ్చిపోకు. నేనిప్పుడే వస్తాను" అంటూ అతడు ముందుకు వెళ్లాడు. అతడిని చూడగానే ఒంటరిగా వెళ్తున్నవాడిపై కుక్కలు ఎగబడినట్లు, పక్కనుంచి తమ ఆయుధాలను ఆతనిపై గురిపెట్టి వాళ్లు అతనివేపు వస్తున్నారు.– "నాపై మీ దుష్టశక్తులు పనిచేయవు. మీలో ఒక్కడు వచ్చి ఏం చేయగలడో రమ్మను"

"మలకోడా! నీవు వెళ్లు!" వాళ్లు అరిచారు.

మహాకవి అన్నాడు– "మలకోడా! దైవనిర్ణయం, ఇచ్ఛా లేకుండా నేనిక్కడకు వస్తానని ఎలా అనుకున్నావు? నేను, నాతో నా మిత్రుడు ఈ ప్రాంతాలకు సందర్శకులుగా వెళ్లడం విధి నిర్ణయం!"

వాడు తన చేతిలో ఉన్న చిత్రహింసలు పెట్టడానికి వాడే ఆయుధాన్ని కిందపడేసి తన అనుయాయులతో అన్నాడు– "ఇతడిని దండించే హక్కు మనకు లేదు. ఆ కొండరాళ్ల మధ్య దాక్కున్నావే, నీవు కూడా ఇటు రావచ్చును"

నేను నా మార్గదర్శకుడివేపు పరిగెత్తుకుని వస్తుంటే వాళ్లంతా సైనికుల్లా కలిసి నావేపు రావడం చూసి నాకు భయం వేసింది. వాళ్లలో ఒకడంటున్నాడు– "వీడిని నా కొక్కెంతో కొట్టనా?", రెండవవాడు– "నీ గురి తప్పుతుంది" అన్నాడు.

వాళ్ల నాయకుడు వాళ్లవేపు తిరిగిఅరిచాడు– "స్కార్‌మిగ్లియోన్! ఆగు!"

మాతో అన్నాడు– "ఇంకా మీరు ముందుకు అడుగువేస్తే ఈ రాళ్లు మీ బరువును భరించలేవు. అటునుంచి వెళ్లండి! పన్నెండు వందల అరవై ఆరేళ్లనాటి నుంచి మూతబడిన దారి అది. (డాంటే తన 35వ ఏట, గుడ్‌ఫ్రైడే నాడు, క్రీస్తుశకం

1300 వ సంవత్సరంలో నరకలోక ప్రయాణం చేసినాడు) నేను నా అనుచరుల్ని మీతో పంపుతాను వాళ్లు మిమ్మల్ని సురక్షితంగా తీసుకువెళ్తారు. ఆలిచినో (Alichino), కాల్కాబ్రినా (Calcabrina), కాగ్నాజ్జో (Cagnazzo) మీరు ఇటురండి! బార్బరిసియా (Barbariccia) నీవు లిబికొక్కొ (Libicocco), డ్రాగినాజ్జో (Draghinazzo)లతో పదిమందిని తీసుకుని అటువెళ్లు! కోరల 'సిరియాట్టొ' (Ciriatto), కోపాల గ్రఫియాకెన్ (Graffiacane), ఫార్ఫారెల్లొ (Farfarello), పిచ్చి 'రుబికాంట్' (Rubicant) మీరు తారుమడుగు ప్రాంతాన్ని సంరక్షించండి! వీళ్లు పదిమందీ ఈ బాటసారుల్ని వాళ్లడిగిన ప్రదేశానికి తీసుకువెళ్తారు.

నేనన్నాను– "ప్రభూ! వీళ్ల ఆకారవికారాలు చూస్తుంటే నా గుండెల్లో గుబులు పుడ్తున్నది. ఆ కోరదంతాలు, కొమ్ములు, చింతనిప్పుల్లాంటి కళ్లు, వాళ్ల బుసబుసలు, నాకు భయం వేస్తున్నది. వీళ్లతో వెళ్లడం క్షేమమేనా?"

వణుకుతున్న నన్ను ఆతడు సముదాయించాడు– "భయపడకు! వాళ్ల తీరే అంత! నరకలోకపు భటులెలా ఉంటారనుకున్నావు? వీళ్లను చూసే పాపాత్ములు సగం చస్తారు"

వాళ్లతో కలిసి మేము ఓ రాతి కట్టడం మీదుగా వెళ్లి ఎడంవేపు తిరిగాము. ఆ పిశాచభటులు, తమ నాలుకలను పళ్ల మధ్య ఉంచి నొక్కుతూ తమ నాయకుడి సూచనకు ఎదురుచూడగా అతడు ఓ అసభ్యమైన కేకపెట్టి సంజ్ఞ చేసినాడు.

**Canto - 22**

**నరకలోకపు భటుల్తో కలిసి వెళ్తుండగా అదే అగాధంలో మరో గుంపు కనిపిస్తుంది. పిశాచ భటుల్నుంచి తప్పించుకుపోవాలనుకున్న సియామ్‌పొలో (Cimpolo) అనేవాడి ప్రయత్నం ఏమయ్యిందో, వాడిని ఎలా అడ్డుకున్నారో...**

# నరకలోకపు పిశాచ భటులు

అరెజ్జొ మైదానాలలో శిబిరాలను తరలిస్తూ సైనికులలో కొందరు అశ్వికులు యుద్ధాలకు పోతూ, కొందరు పారిపోతూ, సందడిగా ఉన్నట్లుగా, కొందరు యుద్ధ వ్యూహాలతో, కొందరు దళాలు దళాలుగా శిక్షణ పొందుతూ, కొన్నిచోట్ల యుద్ధవిద్యా ప్రదర్శనలు, ద్వంద్వయుద్ధాలు, యుద్ధబాకాల శబ్దాలు, భేరీభాంకార ధ్వనులు, గంటల చప్పుళ్ళు, కోట బురుజులపై నుంచి కానవచ్చే దీపకాంతి సూచనలూ, ఇక్కడివి, ఇతర దేశాల నుంచీ నేర్చుకున్నవీ తంత్రాలనుపయోగిస్తూన్న సైనిక శిబిరాల్లోని సైనికులకన్నా – ఈ పదిమంది, బాబోయ్! భయంకరంగా ఉండి, ఒక్కోసారి చర్చిలోని సాధుసంతుల్లా, పానశాలలోని తిండిపోతుల్లా – ఈ నరకలోక భటులు పరమ భీభత్సంగా ఉన్నారు.

సముద్రంలో డాల్ఫిన్లు రకరకాల విన్యాసాలు చేస్తూ నావికుల కంటబడినట్లు, అక్కడో గుంపు మాకు కనబడింది. నీటిలో సగం వరకు మునిగి ఉన్న కప్పల్లాగా వాళ్లు అలల్తో వెనక్కి కొట్టుకుపోతుంటే ఒకడు అక్కడే ఉండిపోగా గ్రాఫియాకాన్ అనే నరకలోక భటుడు వాడిని జుట్టుపట్టుకుని ఈడ్చుకు వస్తుండగా భటులు కేకలు పెట్టినారు– "రూబికాంట్! నీ వాడి గోళ్లతో వాడి చర్మాన్ని ఒలిచిపారేయ్!"

ఆ దురదృష్టవంతుడు 'సియామ్‌పొలో' (Ciampolo). అతని తండ్రి విచ్చలవిడిగా ధనాన్ని ఖర్చుచేయగా, తల్లి ఆతడిని రాజకొలువులో ఉంచింది. తరువాత అతడు థిబాల్ట్ (Thibault) ప్రభువు దగ్గర పనిచేస్తూ ప్రజల సొమ్మును, ప్రభుత్వపు ధనాన్ని స్వాహా చేసినాడు.

'సిరియాట్టొ' అనబడే నరకలోకపు భటుడి నోటికి ఇరువేపులా అడవి పందికి ఉన్నట్లు కోరలున్నాయి. వాడు సరాసరి వెళ్లి అడవి ఎలుకలా ఉన్న ఆ అభాగ్యుడిని తన కోరలతో చీల్చి గాయం చేసినాడు. బార్బరిసియా అనేవాడు "నేను వీడిని నా శూలంతో గుచ్చి పైకెత్తుతాను! మీరేమన్నా అడగాల్సింది ఉంటే అడగండి" అన్నాడు

నా మార్గదర్శకుడడిగాడు– "ఈ నేరంలో నీతోపాటు ఇంకెవరైనా పాలు పంచుకున్నారా?" – అతడన్నాడు– "ఆ తారుపొరల కింద ఇంకొకడున్నాడు. ఈ శూలమూ, నఖమూ నన్నింక భయపెట్టలేవు"

'లిబొకొక్కొ' అన్నాడు– "వీడితో ముచ్చట్లు చాలు" – అంటూనే వాడి చెయ్యి దొరకబుచ్చుకుని కీళ్ల దగ్గర ఊడగొట్టినాడు. మిగతా వాళ్లూ వీడిమీద పడబోతుంటే వాళ్ల నాయకుడు వారించినాడు.

వాడన్నాడు– "నాకంటే ఘనుడు గొమిటా (Gomita) సన్యాసి. అతడు తన రాజునే వంచించి శత్రువులను విడిపించి, వారి నాయకుడై, వారి దగ్గరా ధనం గుంజి, చివరకు రాజును కూలదోసినాడు. అతడికితోడు 'లొగొడొరొ' నాయకుడు మైఖేల్‌జాంఛె (Michael Zanche) – వీడికి నేను దొరికితే చిత్రవధ చేస్తాడు."

భటుల నాయకుడన్నాడు– "పిట్టా! ఎగిరిపో!" సియామ్‌పోలో పారిపోబోతూ– "మీరు అడిగితే నేను లొంబార్డ్, టుస్కన్ ఆత్మలను రప్పిస్తాను. నేను ఈ ఈల వేయగానే ఏడుగురు పైకివస్తారు. ప్రజల డబ్బు దోచుకునేవాళ్లం మేమంతా ఒక కట్టుగా ఉంటాము" అన్నాడు సియామ్‌పోలో (Ciampolo).

కాగ్నాజో, అలిచినోలు వాడిని ఆటపట్టిస్తూ అన్నారు– "నీ సంగతి మాకు తెలుసు. మాయలమారివి నీవు! నిన్ను కిందపడేసి మేము నిన్ను పట్టుకుంటాము. నీ ప్రయత్నం నీవు చేయి!" అంటూ వాళ్లు వాడితో కొత్త ఆట ప్రారంభించారు.

వాడు వీలుచూసుకుని ఒక్క ఉదుటున పరిగెత్తసాగినాడు. వాడు ముందు, వీళ్లు వెనక! దేగను తప్పించుకోడానికి నీటిలో మునిగిన నీటికోడిలా 'సియామ్‌పొలో' పారిపోతూనే ఉన్నాడు. వాడి వెనుక కాల్‌కాబ్రినా! ఇద్దరూ వెళ్లి తారుమడుగులో పడినారు. వారిద్దరకూ మధ్య 'అంపైర్'లా వేడి తారు.

ఆ నరకలోక భటులు రెండు పక్కలనుంచీ వస్తూ పాపులను వేటాడుతూ, శిక్షిస్తుండడం గమనించిన మేము ఆ ప్రాంతాన్ని వదిలి ముందుకు వెళ్లినాము.

**Canto - 23**

**కోపంతో ఊగిపోతున్న ఆత్మలు 'డాంటీ' వెంటబడగా 'వర్జిల్' ఆతడిని కాపాడుతాడు. ఆరవ ప్రదేశంలో ఆత్మవంచకులకు శిక్షలు విధించబడతాయి. వాళ్లు అగాధం చుట్టూరా ప్రదక్షిణాలు చేస్తూనే ఉండాలి. వాళ్ల తలలపై పైకి మెరుస్తూ లోపల విపరీతంగా బరువున్న సీసపు తలపాగాలు, టోపీలు ఉన్నాయి. అక్కడ వారికి బొలొగ్నా ఋషీ సన్యాసులిద్దరు కనిపిస్తారు. నేలపై శిలువ వేయబడివున్న కైయాఫాస్ అనేవాడి మీదుగా అందరూ నడుస్తుంటారు.**

# ఆత్మవంచకులకు శిక్షలు

మౌనంగా, ఒంటరిగా మేము వెళ్తుంటే మాకు దారిలో అక్కడక్కడా కొందరు సన్యాసులు కనిపించారు. నాకు ఏసోపు (Aesop fables) కథ గుర్తుకొచ్చింది. ఎలుక, కప్పల కథ అది. కప్ప ఎలుకను మడుగు అవతలి గట్టుకు తీసుకువెళ్తానని చెప్పింది. దాని అసలు ఉద్దేశం ఎలుకను ముంచేయ్యడమే! ఈలోగా 'డేగ' ఒకటి ఆ రెండింటినీ తన్నుకుపోయింది. ఆలోచనలూ అంతే! ఒకటి తరువాత ఒకటి గొలుసు కట్టులా వస్తూనే ఉంటాయి.

నాకు ఆ పిశాచభటుల భయం పోలేదు. వాళ్లు వెనకనుంచి వచ్చి నన్నెక్కడ చీల్చి చంపేస్తారనన్న భయం క్షణక్షణం అధికం కాసాగింది. నా ఆందోళనను గమనించి నా మార్గదర్శకుడన్నాడు– "అద్దంలో ప్రతిబింబంలాంటిది నీకున్న భయం! అయినా నేనున్నానుగా!"

అంతలోనే మామీదకు ఏదో రెక్కలున్న పక్షి దూసుకురాబోగా, మంటల శబ్దానికి, వేడికి ఉలికిపడిలేచిన తల్లి తన బిడ్డను రొమ్ముకు పొదుముకున్నట్లు, తనకన్నా తన బిడ్డ రక్షణ ముఖ్యంగా ఆమె అత్యంత జాగ్రత్తగా ఉన్నట్లు – నా మార్గదర్శకుడు నన్ను చేతుల్లో చంటిపిల్లాడిని ఎత్తుకున్నట్లు ఎత్తుకుని పైనుంచి వరదలా పడ్తున్న నీటిధార నుంచి నన్ను తప్పించి వడివడిగా మెట్లు దిగినాడు. మా వెనకనే ఆ నీటిప్రవాహం, జలచక్రాల ఆకులపై పడ్తున్న గొట్టపు నీటిలా అడుగు అడుగునూ ముంచెత్తుతూ వచ్చి, మేము ఆఖరి మెట్టు దాటగానే అయిదవ కాలువలోకి ప్రవహించింది.

అక్కడ మాకు మరొక గుంపు రకరకాల రంగులు పూసుకుని, ఏడుస్తూ అటూఇటూ పచార్లు చేస్తున్నారు. వాళ్ల నెత్తిమీద ముసుగులు, టోపీలు కళ్లను దాటి

కోలోన్ (Cologne)లోని మునుల్లా ఉన్నారు. వాళ్ల ఒంటిపై బంగారు వర్ణపు దుస్తులు, లోపల లోహమయమై బరువుగా ఉండి, వాటి బరువుకు వారు అణిగిపోతున్నారు. ఫ్రెడరిక్ చక్రవర్తి దుస్తులు వీటితో పోలిస్తే తేలికగానే ఉంటాయి.

మమ్మల్ని టుస్కన్లుగా (Tuscans) భావించి వారిలో ఇద్దరు మాతో మాట్లాడినారు. "ఖుషీ సన్యాసులుగా' పేరుబడ్డ (Joyous friars of Bologna) కటలానొ (Catalano), లొడెరింగొ (Loderingo)లము మేమే!"

ఇంతలో నా కంటికి నేలపై శిలువ వేయబడివున్న వ్యక్తి కనిపించాడు. అతడి శరీరంలోకి మూడు కొయ్య ముక్కలు దిగబడి వున్నాయి.

'కటలానొ' అన్నాడు– "అతడే ఫరిసీయులకు (Pharisees) పలువురికి బదులు ఒక వ్యక్తికి శిక్ష విధించడం ఉచితమని బోధించినది. ఈ దారినిండా ఇతనితోపాటు ఆ కుట్రలో పాల్గొన్న వాళ్లంతా ఇలా శిలువలు వేయబడి వున్నారు. ఇతడి పేరు కెయాఫాస్ (Caiaphas). ఇతడి భార్య తండ్రి 'అన్నాస్' కూడా వీరితోనే ఉన్నాడు".

వర్జిల్ అతడినడిగాడు– "ఇక్కడి నుంచి బయటకు పోయే మార్గమేదైనా ఉన్నదా! మీరు చెప్పడం న్యాయసమ్మతమైతేనే తెలపండి! మేమింకా చీకటిలోకపు భటులను ఇబ్బంది పెట్టదలుచుకోలేదు"

అతడన్నాడు– "మహావలయంలో తిరుగుతూ ఉన్న గుండ్రటి బండరాయి దగ్గర్లోనే పైకప్పు శిధిలమై ఉన్నది. కాని జాగ్రత్తగా వెళ్లండి"

నా మార్గదర్శకుడన్నాడు– "పాపులను తన కొక్కేలతో వేలాడదీసేవాడు మమ్మల్ని హెచ్చరించి పంపినాడు"

ఆ సన్యాసి పలికాడు– "దుష్టపిశాచి చేసే ఎన్నో పనుల్ని మాటల్ని నేను బొలొగ్నా (Bologna)లో విన్నాను. వాటిలో ఒకటి– 'అతడు అబద్ధాలకోరు, అసత్యాలకు తండ్రి! – He is a liar and the father of lies".

మేము అక్కడి నుంచి బయల్దేరుతుండగా నాకెందుకో నా మార్గదర్శకుడి మోముపై కోపం కనిపించింది.

## Canto - 24

**ఏడవ ప్రదేశంలోకి చేరుకున్న డాంటీ, తన గురువు వర్జిల్‌తో కలిసి అక్కడ దొంగలకు విధించబడే శిక్షలను చూసినాడు. విషసర్పాలు, ప్రాణాంతకమైన పాములు పాపులను కరుస్తూ బాధపెడ్తాయి. పిస్టొయియాలోని సెయింట్ జేమ్స్ చర్చిలోని విలువైన పాత్రలు, వస్తువుల్ని కొల్లగొట్టిన 'వాన్నిఫ్యుసి' (Vanni Fucci) ఆ నగరానికి, ఫ్లోరెన్సు నివాసులకూ రాబోయే ఆపదల గురించి చెబుతాడు.**

# దొంగలకు విధించబడే శిక్షలు

కొత్త సంవత్సరం తొలిరోజులు జనవరి నెల - ఇంకా సూర్యుడు కుంభరాశిలో ఉన్నాడు - రాత్రింబవళ్లు సమానంగా ఉండి, గ్రామంలో చిన్నిరైతు (పాలేరు) తన శీతాకాలపు ఆహారపు నిల్వలు అయిపోతుండగా ఇంటిబయటకు వచ్చి చూస్తే అంతటా తెల్లగా మంచు! ఏం చేయాలో తోచక అటుయిటూ పచార్లు చేస్తున్న అతడు వసంతకాలం రాగానే తన గొర్రెల మందను, కొంకి కర్రను తీసుకుని విప్పారిన ముఖాలతో బయల్దేరినట్లు, నా మార్గదర్శకుడివదనం క్రమేపీ యధాస్థితిలోకి వచ్చి ప్రసన్నంగా కనిపించింది. వంతెన కూలిన భాగానికి మేము రాగానే అతడు నన్ను తన చేతుల్తో పైకెత్తి అటుపక్క అంచును అంది పుచ్చుకునేలా సాయం చేసినాడు. అక్కడ నుంచి నిట్టనిలువుగా ఉన్న కొండను జాగ్రత్తగా రాళ్ల సందుల్లో కాళ్లు వుంచి కొంచెం కొంచెంగా ఎక్కుతూ మొత్తానికి కొండపైకి చేరాను. పైకి చేరేసరికి ఆయాసం, దమ్ము, గుండెదడ. కాసేపటికి అన్నీ తగ్గినాయి.

అతడన్నాడు- "ఇక్కడ అసలు ధైర్యం కావాలి. మెట్లు దిగడం, నీడలో నడవడం తేలికే! సాహసవీరుడికే కీర్తిదక్కేది. లేకుంటే మానవుడు గాలిలో దుమ్ములా, అలలపై నురుగులా, ఒక అవశేషంలా మిగిలిపోతాడు"

నాలో కొత్త ఉత్సాహం పొంగుకువచ్చింది- "గురువర్యా! నేనిక భయం మాట తలవను" మేము ఏడు, ఎనిమిది ప్రదేశాల మధ్య అగాధాన్ని చేరేసరికి, ఆ లోతుల్లో నుంచి ఓ పెద్ద కేక వినిపించింది.

అక్కడ ఓ గుంపు వాళ్ల మధ్యలో చుట్టూరా విషసర్పాలే! అది సర్పాలలోయ. రకరకాల ఆకారాలు, బుసలు కొడుతూ, విషాన్ని జిమ్ముతూ, మెలికలు తిరుగుతూ ఎక్కడ చూసినా ప్రాణాంతకపు పాములే! లిబియా ఇసుక ఎడారుల్లో కూడా ఇన్ని

సర్పాలను చూడమేమో! జాకులస్, పరియాస్, ఛెలిడర్, సెంక్రిస్, యాంఫిబీనా లాంటి అనేక రకాలు – ఇథియోపియా, ఎరిథ్రియన్ సముద్రాల దగ్గర్లో కూడా ఇన్ని పాములు కనిపించవు.

ఆ గుంపుకు లోయ నుంచి బయటపడే వీలు లేదు. ఆ సర్పాలను వెళ్లగొట్టడానికి హిలియోట్రొపి (Heliotrope) వాళ్ల కందుబాటులో లేదు. వాళ్లను కదలనీకుండా సర్పాలే తాళ్లులా వాళ్ల కాళ్లుచేతుల్ని కట్టివేసినాయి. నాకు దగ్గర్లో ఉన్న వ్యక్తిని ఓ పొడపాము (Adder) మెడకు చుట్టుకుని ఊపిరాడకుండా నొక్కుతూ మంటలు కక్కుతున్నది. నా చేతిలోని ఈ కలం 'O' గాని 'i' గాని రాసేంత సేపులోనే అతడు మంటల్లో మండి బూడిదగా నేలరాలి మరలా పోగుపడి వ్యక్తిగా యధారూపుకు వస్తున్నాడు. అయిదు వందల ఏళ్లకోసారి మంటల్లో కాలిపోయి పునరుజ్జీవనం పొందే అరేబియన్ ఫీనిక్స్ పక్షిలా, బతికి ఉన్నంత కాలం గడ్డిపరకనైనా, మొక్కనైనా తినక గుగ్గిలాన్ని (Frankincense), అమోమమ్ సుగంధాలను పోగు చేసుకుని వాటిని చితిగా ఏర్పరచుకుని కాలిపోతుంది. మరల పునరుజ్జీవనం పొంది అటుయిటూ దిక్కులు చూస్తున్న పక్షిలా – ఈ వ్యక్తి సర్పాల పొగమంటల్లో కాలిపోయి మరల యధారూపు పొందుతున్నాడు.

“నీవెవరు?” అని మహాకవి ప్రశ్నించగా అతడు చెబుతున్నాడు– “నా పేరు ‘వాన్నిఫ్యుసి’ (Vanni Fucci). పిస్టొయియా నగరంలో గాడిద బతుకు బతికి చివరకు ఈ అగాధంలో ఇరుక్కుపోయాను’”

నేనన్నాను– “నాకు తెలిసినవాడు ఇతడైతే వీడు పరమ దొంగ! రక్తపిపాసి!”

వాడన్నాడు– “నన్ను గుర్తుపట్టినావా! నీవు చెప్పే విషయాలను కాదనే అధికారం నాకు లేదు. నేను చర్చిలోని పాత్రలను వస్తువులను కొల్లగొట్టినాను.

అయితే నేను చెప్పేది వినండి! పిస్టోయియా దుఃఖంలో మునగబోతోంది. ఫ్లోరెన్సు శాసనాల్ని, ప్రజల్ని మారుస్తుంది. వాల్డిమాగ్రాలో యుద్ధదేవుడు ‘మార్స్’ (Mars) ఉత్పాతాలను సృష్టిస్తాడు. ‘పిసెనొ’ మైదానాలను తుఫాను ముంచెత్తుతుంది. బియాంకొ వరదల్లో నేలమట్టమవుతుంది. ఇది నా జోస్యం. మీ హృదయాలు విషాదంతో చిల్లులు పడునుగాక!”

**ఫ్యుసి దైవనింద చేయడంతో సర్పాలు ఆతడిని నలిపివేస్తాయి. ఆల్‌సైడిస్ (హెర్క్యులిస్) పశువుల్ని దొంగిలించిన కాకస్ (Cacus) సెంటార్ రూపంలో ఎగుర్తూ పారిపోతున్న 'ఫ్యుసి'ని వెంబడిస్తాడు. ఆ తరువాత దాంటీకు ముగ్గురు స్వదేశీయులు కనిపిస్తారు.**

# రూపాంతరం చెందిన ఆత్మలు, సర్పాలు

అలా జోస్యం చెబుతూనే 'వాన్ని ఫ్యుసి' చేతులు పైకెత్తి అరిచాడు– "దేవుడా! వీళ్లను తీసుకుపో!" వెంటనే ఒక సర్పం వాడి మెడచుట్టూ మెలికలు తిరుగుతూ– "నోరు మూసుకో, వాచాలుడా" అన్నది. మరొహటి వాటి చేతులపైకెగబాకి రెండు చేతుల్ని వంచి కదలకుండా చేసింది.

నేను ఇన్ని వలయాల్లో క్షోభిస్తున్న అనేక ఆత్మలను చూసాను గాని వీడిలా దేవుడిపై మరగబడుతున్నవాడిని చూడలేదు. థెబస్ నగరంలో తలకిందులుగా పడ్డవాడు కూడా ఇలా అరవలేదు.

'వాన్ని ఫ్యుసి' సర్పాల నుంచి తప్పించుకుని పారిపోబోగా వాడిని తరుముతూ ఓ సెంటార్ వెంటబడింది. "ఏడీ! ఎక్కడా నీచుడు?" మారెమ్మ చిత్తడినేలల్లో తిరిగే సర్పాలు ఈ సెంటార్ పొట్టదగ్గర కదుల్తున్నాయి. మానవరూపంలో ఉన్న శిరస్సుకు దిగువ ఆ సెంటార్ భుజాలపై ఉన్న డ్రాగన్ సర్పం అగ్నిజ్వాలల్ని వెదజల్లుతున్నది.

నా మార్గదర్శకుడన్నాడు– "ఈ సెంటార్ పేరు కాకస్ (Cacus). అవెంటైన్ కొండగుహలో రక్తాన్ని మడుగులుగా పారించినవాడు. ఆల్‌సైడిస్ (హెర్క్యులిస్) పశువుల్ని దొంగిలించి నూరు దెబ్బలు తిని మరణించినవాడితడే!" మేం మాట్లాడుతూ ఉండగానే ఆ సెంటార్ ఆ దొంగను వెంటాడుతూ పోయింది.

ఈలోగా మా దగ్గరకు మూడు ఆత్మలు వచ్చాయి. నేను మాట్లాడే బోయేంత లోపునే నన్ను మహాకవి వారించినాడు. ఇంతలోనే ఓ ఆరడుగుల సర్పం అధాటున వాళ్లలో ఒకడిపై దూకి వాడిని తన కోరలతో రెండు బుగ్గలను పట్టుకున్నది. దాని శరీరం అతడి చేతుల్ని మెలితిప్పి పొట్టను చుట్టుకుంటూ, రెండు తొడల్ని బంధించి, తోక వెనక్కు తిరిగి ముళ్లువేసినట్లు వేస్తూ ఆతడిని మృత్యు పరిష్వంగంలో బిగదీయ సాగింది. ఐవీ (Ivy) లత కూడా ఓక్ వృక్షాన్ని (Oak) అంత గాఢంగా పెనవేయలేదు.

క్రమేపీ ఆ సర్పం, ఆత్మ ఇద్దరూ కాగితం కాలినట్లు కాలి తెల్లటి బూడిదలామారి అదృశ్యమయ్యారు. ఆ ఆత్మపేరు సియాంఫా (Cianfa).

ఆ పక్కనే ఉన్న ఆత్మలు అనుకుంటున్నాయి– “అగ్నెల్లో (Agnello) నీవెట్లా మారదామనుకుంటున్నావు?” అంతే వాడి రెండు తలలు ఒకటై, రెండు ఆత్మలు ఒకటిగా కలిసిపోయాయి. నాలుగు చేతులు రెండుగా, ఛాతీ, పొట్ట, తొడలు, కాళ్లూ అన్నీ రూపాంతరం చెందినాయి. ఇప్పుడు ఆ వింతజంతువు రెండుగా చీలి ఒకదాని కెదురుగా ఒకటి! ఏడ్డర్ (Adder) విషసర్పం నల్లటి మిరియపు గింజల్లా మెరుస్తున్నట్లు అది దీనివేపు, ఇది దానివేపు జ్వాలారుణ నేత్రాలతో పొగలు కక్కుకుంటూ రెండూ కలిసి పొగగా మారి అదృశ్యమయ్యాయి.

సబెల్లస్, నసిడియస్‌లు ఈ సర్పాల గురించి వర్ణించినవారే! ఓవిడ్ (Ovid) – కాడ్మస్, అరెథ్యూసాలను సర్పం, నీటిబుగ్గల రూపంలో వర్ణించినాడు. కాని ఎవ్వరూ ఇలా సర్పాలు రూపాంతరం చెందడం వర్ణించలేదు.

ఆ విచిత్ర జంతువులు తమ రూపాల్ని, తన శరీరాల్ని కోల్పోతూ చివరకు చర్మంగా, తొక్కలుగా పొగగా మారి అదృశ్యమై మరలా ఆత్మలుగా పుట్టుకొస్తున్నారు. వాళ్లలో ఒకడు నిలబడ్డాడు. ఇంకొకడు బోర్లాపడే ఉన్నాడు. నిలబడ్డవాడి మొహం చెవులవేపు గుంజుకుపోయి, క్రమేపీ ముక్కు, నోరు, కళ్లు ఏర్పడసాగినాయి. క్రింద పడివున్న వాడు నత్త తన కొమ్ముల్ని గుంజుకుంటున్నట్లు వాడూ తన మొహాన్ని గుంజుకుంటూ క్రమేపీ కలిసి ఉన్న ఇద్దరూ విడిపోయి విడివిడి ఆత్మలుగా మారినారు. నిలబడ్డవాడు అన్నాడు– “నేను పాకినట్లు బుయొసో (Buoso)! నువ్వూ పాకుతూ పో!”

ఇటువంటి వింత విషయాల్ని నేనింతకు ముందెన్నడూ చూడలేదు సరిగదా వినలేదు కూడా!

ఆ ముగ్గురిలో రూపాంతరం చెందకుండా ఉన్నది సియాన్‌కాటొ (Scian Cato). అతడు ఫ్లోరెన్స్‌లో ఒకప్పుడు పెద్ద గజదొంగ.

## Canto - 26

**ఏడవ ప్రదేశం నుంచి ఎనిమిదవ ప్రాంతానికి పోబోతూ వాళ్లు కుడివేపుకు చూడగా అక్కడ అసంఖ్యాకమైన మంటలు ఒక్కొక్కదానిలో ఒక్కొక్క మనిషి మలమలమాడుతూ కనిపించారు. ఒక్క మంటలో మాత్రం డయొమెడిస్, యులిసెస్‌లు కనిపించగా, యులిసెస్ తన మరణవృత్తాంతాన్ని వివరిస్తాడు.**

# డయొమెడిస్, యులిసెస్‌లు

"ఫ్లోరెన్స్! వర్ధిల్లు! నీ కీర్తి అన్ని దిశలా, నింగీ, నేల, నీటిపై అనంతంగా వ్యాపించును గాక! అలాగే కొందరు నీ సంతానం, దోపిడీదారులై (Plunderers) నీ కీర్తిని నరకలోకంలోకి కూడా తెచ్చినారు. వారిలో ముగ్గురి గురించి నేను వివరిస్తాను. తెల్లవారుఝామున వచ్చే కలలు నిజమవుతాయేమో, ఫ్లోరెన్స్! నీకు కష్టకాలం దాపురించింది"

నా మనసు దిగులుతో నిండి ఉండగానే నేను నా మార్గదర్శకుడితో కలిసి కొండరాళ్ల ఆసరాతో క్రిందికి దిగి వచ్చాను.

సూర్యుడిపై మబ్బుల ముసుగు లేదు. చీకటిపడే సరికి ఈగలు పోయి దోమలు రాజ్యమేలుతున్నాయి. రైతు కొండగట్టుపై పడుకుని మిణుగురు పురుగులను లెక్కబెడ్తున్నాడు. అవి లోయలో, అతని ద్రాక్షతోటలోకి పరిగెడ్తున్నవి. అటువంటి సమయంలో ఎలిజా (Elijah) రథం స్వర్గంవేపు వెళ్తూ మినుకు మినుకుమని కనిపించినట్లు ఆ అగాథం నిండా అనేక కదిలే మంటలు కనిపించాయి. ఒక్కొక్క మంటలో ఒక్కొక్క పాపి, (దొంగతనం చేసిన వాడు) ఉన్నాడు. నా మార్గదర్శకుడన్నాడు– "అదుగో అక్కడే డయొమెడిస్, యులిసెస్‌లు శిక్షలననుభవిస్తున్నది. వాళ్ల తొందరపాటుకు, పగకు, ఆగ్రహానికి, మాయాగుర్రపు కుట్రకు శిక్షలవి. అయితే ఆ గుర్రాన్ని చూసే ఈనియస్, మంటల్లో తగలబడిపోతున్న ట్రాయ్ నగరాన్ని విడిచి ఇటలీ చేరి రోమన్ సామ్రాజ్యస్థాపనకు బీజం వేసినాడు.

డయొమెడిస్, యులిసెస్ ఉన్న అగ్నిజ్వాల మావేపు రాగానే మహాకవి అన్నాడు– "ఎవరు మీరు? ఒకేమంటలో ఇద్దరు శిక్షననుభవిస్తున్నారు? మీకు మృత్యువు ఎలా సంభవించిందో మీలో ఒకరు చెబితేనే గాని మీరిక్కడి నుంచీ పోలేరు"

గాలిలో దీపంలా ఊగిసలాడ్తున్న ఆ మంటల్లో ఉన్న యులిసెస్ తన వృత్తాంతాన్ని వివరించసాగినాడు– “కెయిటా ద్వీపంలో నన్ను తన శక్తులతో ఒక్క సంవత్సరంపైగా అట్టిపెట్టుకున్న సిర్సె (Circe) నుండిశలవు తీసుకుని నేను ఇల్లు చేరుకున్నాను. తరువాత కొన్నాళ్లకు మరల సముద్ర ప్రయాణం మీద మనసై ఇబెరియా, మొరాకొ, సార్డినియన్ ద్వీపాలను దాటి, జిబ్రాల్టర్ సంధిని దాటి, హెర్క్యులిస్ గీచిన గీటు దాటి ఇంకా ముందుకు పోయాము. కుడిపక్క సెదిల్లె కనిపిస్తున్నా మేము ఎడంపక్కకు వెళ్లివెళ్లి భూమి అంచుకు చేరుకున్నాము. దూరంగా ఓ పర్వతం కనిపించగా అటువేపు నౌకలను మళ్లించి కాస్త స్థిమితపడేలోపుగానే, ఆ నేలమీద నుంచి వచ్చిన పెద్ద సుడిగాలి మా నౌకను మూడుమార్లు గాలిలోకి అలలతోసహా లేపింది. నాలుగోసారి నౌక తలకిందులు కాగా ఓ పెద్ద అల మమ్మల్ని మింగివేసింది”

**వాళ్లు వెళ్లిపోయాక మన కవుల ముందుకు 'గిడొద మాంటె ఫెల్ట్రొ' ఉన్న అగ్నిమంట వచ్చింది. గిడొ తానెందుకు ఇలా శిక్షింపబడుతున్నాడో వివరిస్తాడు.**

## 'గిడొవొ డ మాంటెఫెల్ట్రొ' చెప్పిన వృత్తాంతం

సిసిలియన్ లోహపు ఎద్దు తన కంచుకంఠంతో అరచినట్లు ఆ తరువాత వచ్చిన మంటల్లోని గొంతు బిగ్గరగా ధ్వని చేసింది. "మీరుగనక రోమాగ్నా గురించి తెలిసినవాళ్లయితే అక్కడేం జరుగుతుందో చెప్పండి!

మహాకవి అన్నాడు– "ఇతడు లాటియన్! నీ గురించి వివరించు. రోమాగ్నా సంగతి ఇతడు చెబుతాడు"

నేనన్నాను– "రోమాగ్నా'లో యుద్ధం లేనిదెప్పుడు? 'పొలెంటా' గరుడపక్షి చూపులు సెర్వియాను దాటినాయి. 'ఎర్రుకియో' శునకాలు మొంటాగ్నాను బలితీసుకున్నాయి. లమొనె నగరం, శాంటెర్నొలు పక్షాలు మారుస్తూ, పగానొ సింహపు నీడలో దాగుడుమూతలాడుతున్నాయి. అదిసరే నీవెవరవు, ఏమిటీ చెప్పు!"

అతడు వివరించాడు– "నాపేరు 'గిడొ డ మాంటె ఫెల్ట్రొ' నేను సెయింట్ ఫ్రాన్సిస్ అండన పేరు గడిద్దామనుకున్నాను. ప్రధాన అర్చకుడు సింహపు రాజసమున్న నాలో తన మాటలతో నక్కకుండే మాయబుద్ధుల్ని ప్రవేశపెట్టినాడు. ఇంతలో ఫరసీయుల నాయకుడు (Pharisees) బొనిఫేస్-VIII క్రిస్టియన్లపై యుద్ధాన్ని ప్రకటించినాడు. 'కాన్‌స్టాంటిన్' తన కుష్టువ్యాధిని నయం చేసుకోడానికి 'సిల్వెస్టర్' సాయం తీసుకున్నట్లు – నన్ను పిలిచి అన్నాడు – 'భయం వద్దు. నేను నిన్ను పాప విముక్తుణ్ణి చేస్తున్నాను. ఆ 'పెనెస్ట్రినో'ను నిర్మూలించు. నాకు స్వర్గలోకపు ద్వారాలను తెరచుటకు, మూయుటకు అధికారము, తాళపు చేతులు ఇయ్యబడినవి"

అతని మాటలువిని నేనన్నాను– "తండ్రీ! మీరు నన్ను పాపం నుంచి విముక్తుడిని చేసేట్లయితే నేను మీరు కోరిన విధంగా చేస్తాను. మంచిమాటలతో, వాగ్దానాలతో మీరు 'పెనెస్ట్రినో' కుటుంబాన్ని మీ దారిలోకి తెచ్చుకొండి. వాళ్లు మీ వలలో పడ్డాక శాశ్వతంగా నిర్మూలించండి"

నేను మరణించాక సెయింట్ ఫ్రాన్సిస్ నన్ను చూసి దుఃఖిస్తూ 'ఈతని సలహా ఎంత వినాశనాన్ని తెచ్చిందో ఇతడికర్థం కాదు' అనుకుంటూ ఆతడే నన్ను స్వయంగా మినాస్ (Minos) వద్దకు తీసుకువెళ్లినాడు.

మినాస్ తన తోకను నాచుట్టూ ఎనిమిదిసార్లు తిప్పి, మెలికలు చుట్టి, కోపంగా అన్నాడు– "ఇతడు తప్పు చేసాడు! శిక్ష అనుభవించవలసిందే!" అని నన్నిక్కడికి విసిరేసాడు"

అతడి చుట్టూరా ఉన్న మంట ప్రజ్వరిల్లింది. మేము చూస్తూండగానే ఆతడు ఆ కదుల్తున్న మంటతోపాటు కనుమరుగైనాడు. మేమిద్దరం తరువాత ప్రదేశానికి ప్రయాణం మొదలుబెట్టినాము.

## Canto - 28

**తొమ్మిదవ ప్రాంతంలో అపవాదు సృష్టికర్తలు, మతాన్ని చీల్చేవారు, నాస్తికులు శిక్షలననుభవిస్తూ కనిపిస్తారు. అక్కడ కవులకు అన్యమతస్తులు, పియరొాడ మెడిసినా, క్యూరియొ, మొస్కా, బెర్ట్రాండ్ డి బొర్నెలు కనిపించారు.**

# మతభ్రష్టులకు, మతాన్ని చీల్చేవాళ్లకు శిక్షలు

అక్కడ గుమికూడిన గుంపుకు ఉన్న గాయాలను, రక్తాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. వాటిని వివరించడానికి ఆలోచన, సంభాషణ రెండూ అశక్తులౌతాయి. ట్రోజన్ల చేతిలో మరణించి వాళ్ల రక్తంతో ప్రశాంతమైన 'అపూలియా' నేలను తడిపిన హన్నిబాల్ (Hannibal) సైనికుల్లా, నేపుల్స్‌ను ఆక్రమించి రక్తపుటేరులు పారించిన రాబర్ట్ గిస్‌కార్డ్ (Robert Guiscard) పటాలంలా, అపూలియన్ సైనికుల మోసం వల్ల ఛార్లెస్ (Charles of Anjou) దళం చేతికి చిక్కి అసంఖ్యాకంగా మరణించి ఇప్పటికీ దొరుకుతున్న ఎముకలతో సెపెరానొ (Ceperano) నేలను నింపిన 'మాన్‌ఫ్రెడి' ఫ్రెంచి సైనికుల్లా, టాగ్లియాకోజా అనేవాడు ఆయుధాలు లేకుండా చిక్కిన వృద్ధుడు అలార్డో చేతిని పొడిచి, మరోచేతిని నరికి పారేసినట్లు, అక్కడ ఉన్న వ్యక్తులందరూ చేతులు లేక కొందరు, పొట్టలో, పక్కల రంధ్రాలతో పేగులు కనబడుతూ, రొమ్ములు చీల్చబడి గుండె కనిపిస్తూ ఘోరంగా కనిపిస్తున్నారు.

నా ముందు అన్యమతస్థుడొకడు గడ్డం గొంతువరకు రెండుగా చీలి పరిగెడ్తున్నాడు. రకరకాల గాయాలతో మరికొందరు, వీళ్లంతా బతికి ఉన్నపుడు మతాన్ని చీల్చినవాళ్లు (Schismatics), అపవాదుల్ని (Scandals) విత్తినవాళ్లు, పాషండులు (Heretics).

మేము ఇటురాగానే ఓ అదృశ్యవ్యక్తి మమ్మల్ని తన కత్తితో పొడిచి గాయాలు చేస్తుంటాడు. బాధపడుతూ కాస్తదూరం వెళ్లేసరికి గాయాలు మూసుకుపోతాయి. మరల ఇటు వచ్చేసరికి మరలా కత్తిపోట్లు, గాయాలు... ఇలా నిరంతరం మేము నరకయాతనలు పడుతూనే ఉన్నాము. మరి మీరెవరు?" అని వాళ్లలో ఒకడు మమ్మల్ని అడిగాడు.

నా మార్గదర్శకుడన్నాడు– "ఇతడింకా మరణించలేదు. నేను ఇతనికి నరక లోకపు వలయాలను చూపిస్తున్నాను. నా మాటలు సత్యం. నమ్మండి!"

ఓ వందమంది నా చుట్టూ మూగినారు. వాళ్లన్నారు– "తనను తాను ప్రవక్తగా ప్రకటించుకుని తనతోపాటు అనేకమంది బలవన్మరణానికి కారణమైన

డొల్సినొ (Dolcino) నీకు కనిపించాడా! వాడిని నొవర్రా ప్రజలేంచేసినారు? వాడికి తెలియజేయి ప్రజలు వాడిని సజీవంగా తగలబెడ్తారని" అన్నాడొకడు.

"బొల్గొనా (Bolgona) లో ప్రజల్ని వర్గాలుగా చీల్చిన పీరో (Piero)కు చావు తప్పదని హెచ్చరించు" అన్నాడింకొకడు.

"ఫానొ నగరపు బిడ్డలైన గిడొ, ఏంజెలోలను 'రిపాని' నియంత మాల్‌టెస్టినో విందుకు ఆహ్వానించి కుట్రచేసి, వెళ్లేదారిలో 'కట్టొలికా' వద్ద నీళ్లలో ముంచి చంపివేస్తాడని – నీవు పైలోకంలోకి వెళ్లగానే తెలియజేయి" అన్నాడు మరొకడు.

"ఇతడు క్యురియొ (Curio) – సీజర్‌ను 'రిమిని' దగ్గర అంతర్యుద్ధానికి ప్రోత్సహించిందితడే! ఇతడు మాట్లాడలేడెందుకంటే ఇతని గొంతుకు గాయం ఉన్నది. నాలుక కోయబడింది" అన్నాడు ఇంకొకడు.

గ్యుల్ఫ్ (Guelph), ఘిబెల్లైన్ (Ghibelline) వర్గాల మధ్య దారుణ హత్యలకు, యుద్ధాలకు కారణమైనది మాటతప్పిన 'బ్యున్‌డెల్ మాంటె' హత్యే కదా! అతడు నిశ్చయమైన అమిడి (Amidei) కుటుంబంలోని అమ్మాయిని కాదని 'డొనాటి' కుటుంబంతో సంబంధం ఏర్పరచుకున్నాడు. వాగ్దానభంగం చేసినందుకు మోస్కా (Mosca) అమిడి కుటుంబాన్ని రెచ్చగొట్టి 'The thing once done, there is an end' అంటూ 'బ్యున్‌డెల్ మాంటె' (Buondel monte) హత్యకు పురికొల్పినాడు" – అదే టుస్కన్ తెగలో దుఃఖానికి బీజం వేసిన 'మోస్కా'ను నేనే!" అని ఇంకొకడన్నాడు. అతడి రెండు చేతులు నరకబడి నెత్తురు ధారలా ప్రవహిస్తున్నది.

నా కళ్లముందు తలలేని మొండెం నడుస్తుంటే జుట్టుకు వేలాడుతూ తల, దానిని తన మెడపై పెట్టుకుంటూ– "నాపేరు బెర్ట్రాండ్! జాన్ ప్రభువుకు మోసపూరితమైన సలహా ఇచ్చి, తండ్రిపై తిరుగుబాటు చేయించాను. వాళ్లను విడదీసినందుకే నా తల ఇలా విడిపోయింది. ఇదే నరకలోక న్యాయం"

**పదవ ప్రదేశంలోకి ఇద్దరు మిత్రులూ నడిచారు. అక్కడ రసవాదులకు, ఫోర్జరీ చేసేవాళ్లకు శిక్షలు విధించబడతాయి. చీకటిలో ఏమీ కనిపించక వాళ్లు కొండదిగి కిందకు చూస్తే అక్కడ రకరకాల వ్యాధులతో, చీడపీడలతో యాతనలను అనుభవిస్తున్న వాళ్లు కనబడినారు.**

# ఆల్కెమిస్టులకు, ఫోర్జరీ చేసేవాళ్లకు శిక్షలు

అసంఖ్యాకంగా ఉన్న ఆ వ్యక్తులను నేను నిశితంగా పరిశీలిద్దామని అనుకుంటుండగానే నా మార్గదర్శకుడన్నాడు– "ఇరవై రెండు మైళ్ల పొడుగున్న లోయ. ఇలా ఎంతకాలం చూస్తూ నిలబడతావు? చంద్రుడప్పుడే కిందికి దిగుతున్నాడు. మనకాట్టే సమయం లేదు! పద వెళ్దాం!"

నేనన్నాను– "ఆర్యా! ఆ గుహలో నుంచి నాకు పరిచితమైన గొంతు – బహుశా నా రక్తసంబంధీకుడనుకుంటాను – వినిపిస్తోంది. అందుకే ఒకింత ఆలస్య మవుతున్నది"

మహాకవి అన్నాడు– "అతని గురించి నీ ఆత్మదుఃఖపడరాదు. అతడు బెల్లో నగరపు 'గెరి'. అతడిని సాకెట్టి (Sacchetti) కుటుంబానికి చెందినవాళ్లు చంపినారు"

మాలెబొల్గె (Malebolge)లో ఆఖరి ప్రాంతమైన పదవ ప్రదేశంలో ఎక్కడ చూసినా ఏడ్పులు, ఆర్తనాదాలే. వల్దిచియానాలోని లాజర్ గృహంలోని రోగ పీడితులు జులై నుంచి సెప్టెంబరు మాసాల్లో సార్దినియా, మారెమ్మ చిత్తడి నేలల నుండి వీచే విషగాడ్పులకు గజగజ వణుకుతూ నానా అరుపులు అరుస్తున్న విధంగా, ఆ ప్రదేశమంతా దుర్వాసనతో, కుళ్లి కంపుకొడ్తున్న అవయవ భాగాలనుంచి స్రవిస్తున్న ద్రవపదార్థాలతో అసహ్యంగా, రోతగా ఉన్నది.

ఫోర్జరీ చేసేవాళ్లకు, న్యాయమూర్తి, అక్కడ నరకయాతనలు పడేలా శిక్ష విధించినాడు. ఆ మురికి (Murky) లోయలో ఒకరిమీద ఒకరు పడుతూ లేస్తూ దేకుంటూ, పాక్కుంటూ, లెక్కకు అందరానంత మంది అక్కడ శిక్షలననుభవిస్తున్నారు.

నేను ఆ గుంపులో ఇద్దరిని గుర్తుపట్టాను. వాళ్ల ఒళ్లంతా ఏదో చర్మవ్యాధి. పొడుగాటి గోళ్లతో వాళ్లు క్షణం తీరిక లేకుండా గోక్కుంటూనే ఉన్నారు. చేపల పొలుసుల్లా వాళ్ల చర్మం పొరలు పొరలుగా, పొట్టుగా రాలి పడ్తున్నది.

మా ప్రశ్నలకు సమాధానంగా వాళ్లన్నారు– “మేము ఇద్దరం లాటియం ప్రాంతపు వాళ్లమే! నేను ‘అరెజ్జో’కు చెందిన ‘గ్రిఫొలినో’, అతడు కపొచియో – సియనా ప్రాంతపు వాడు. “నేను సియానా ప్రాంతపు అల్బెరోకు నాకు ఆకాశయానం తెలుసని డీడాలస్‌లా ఎగరవచ్చని నమ్మించాను. నా మోసం బయటపడి వాళ్లు నన్ను తగలబెట్టి చంపినారు” అన్నాడు ‘గ్రిఫొలినొ’. కాని ‘మినాస్’కు తెలుసు నేను ‘రసవిద్య’ (Alchemy)ను ఉపయోగిస్తానని. అందుకే నాకీ శిక్ష విధించాడు”

“సియానాలో ఇవన్నీ నమ్మేవారున్నారా?” అని నేను ప్రశించాను. రెండో వ్యక్తి కపొచియొ (Capocchio) అన్నాడు– “స్ట్రిక్కా, నిక్కొలొ సాలింబెని, కాసియా (Caccia), అబ్బాగ్లియాటొ వీళ్లంతా దారితప్పినవాళ్లు. కులాసాగా బతుకుతూ రకరకాల ప్రయోగాలు చేసినారు. వంటలలో లవంగాలను వాడడం దగ్గర్నుంచీ అనేక రకాల పరిశోధనలు చేస్తుండేవారు. నాపేరు కపొచియొ – నేను లోహాన్ని బంగారంగా మార్చే విద్య తెలిసినవాడిగా నీకు తెలుసు. ప్రకృతిని నా కళతో అనుకరించడానికి ప్రయత్నించాను”

**ఆ ప్రదేశంలోనే రకరకాల మోసగాళ్లు, దొంగ నాణేలను ముద్రించి చలామణీ చేసేవాళ్లు, మారువేషాలు వేసి మోసం చేసేవాళ్లు శిక్షింపబడ్తున్నారు. అనేక రకాల వ్యాధులు వారినిపీడిస్తుండగా అక్కడే అవస్థలు పడుతున్నారు.**

# దొంగ నాణేలు చెలామణి చేసేవాళ్లకు శిక్షలు

సెమెలె (Semele) కొరకు మరుగుతున్న హృదయంతో జునొ దేవత, థెబన్ల రక్తం కళ్లజూసేందుకు ఆతృతపడ్తున్నట్లు, అథమాస్ (Athamas)ను పిచ్చికోపం ఆవహించింది. తన చేతుల్లో, తన భార్య చేతుల్లో ఉన్న పసిబిడ్డలను రక్షించుకుంటూ – "పక్కకు జరగండి! నేను ద్వారాల వద్ద ఆ సివంగిని దాని పిల్లల పని పడతాను" అంటూ తన వాడి గోళ్లతో ఆ సింహపు పిల్లను పట్టుకుని రాతికేసి బాదినాడు. అంతే ఆ సివంగి తన రెండోపిల్లతో సహా నీటిలో మునిగిపోయి అదృశ్యమైంది.

విధి వక్రించి ట్రాయ్ ప్రభువు ప్రియామ్ రాజు ససైన్యంగా మరణించగా, బందీగా ఉన్న హెకుబా, తన కళ్లముందే తన కుమార్తె పాలిక్జెనా (Polyxena), కుమారుడు పాలిడోరస్‌లు బలి ఇవ్వబడగా, అంతులేని దుఃఖంతో ఆమె పిచ్చికుక్కలా అరుస్తూ అటుయిటూ తల్లడిల్లింది.

వీళ్లందరికన్నా ఎక్కువ వ్యాకులతతో, తెల్లగా పాలిపోయిన వదనాలతో నేను ఇద్దరు నగ్నంగా ఉన్న ఆత్మలను చూసాను. కొట్టం నుంచి విడివడ్డ పందుల్లా ఉన్న వాళ్లలో 'కపొచియొ' (Capocchio)ను స్కిచ్చి (Schicchi) ఆత్మ తన కోరలతో కొరికిపట్టి ఈడ్చుకుపోయింది. దానిని చూస్తూ 'అరెజ్జొ'కు చెందిన 'గ్రిఫొలినొ' (Grifolino) వణకసాగినాడు.

'స్కిచ్చి' ఎవరని నేనడుగగా అతడు చెప్పినాడు– "అది ప్రాచీన మిర్రా (Myrrha) ఆత్మ. తన యజమానికోసం మంటల్లో ఆహుతైనవాడు. అతని పేరు గియాని స్కిచ్చి – అతడు తన విచిత్ర వేషధారణతో ఎవరి రూపాన్నైనా ధరించగలడు. సైమన్ డొనాటి అతడిని 'బ్యునొ డొనాటి' రూపు దాల్చేలా చేసి తనను (సైమన్) అతడికి వారసుడిగా ప్రకటింపజేసుకున్నాడు. అందుకు ప్రతిఫలంగా 'స్కిచ్చి'కు అశ్వాలలో కెల్లా ఉత్తమమైన (Lady of the herd) ఆడగుర్రం (mare) బహూకరించ బడింది" ఆ మాటలు చెప్పి అతడూ మాయమైనాడు.

ఆ పక్కనే నాకు– ఒక కాలు తొడవరకు లేని వికలాంగుడు, జలోదరంతో, పొట్ట ఉబ్బి, సన్నటి కాళ్లు చేతులు, ఎండి వంకర్లు తిరిగిన పెదాలు – అతడు అన్నాడు– "నాపేరు ఆడమొ (Adamo)! నామీద జాలి తలచి ఒక్క చుక్క నీరివ్వండి! కాసింట్యో పచ్చికమైదానాల దగ్గర పాకే సెలయేరు, ఆర్నొ ప్రవాహాలు నా కళ్లముందు మెదుల్తున్నాయి. కాని ఏం లాభం! గొంతెండిపోతున్నది. నాలుక తడారిపోతున్నది. నేను చేసిన తప్పు అంతా ఆ రొమెనా (Romena) ప్రభువుల మాట విని (గిడొ, అలెస్సాండ్రొ, అఘినుల్ఫొ) – ఫ్లోరెన్స్ నాణేలను దొంగతనంగా ముద్రించాను. ఆ దొంగ నాణేల వ్యవహారంలో పట్టుబడగా నన్ను సజీవంగా తగలబెట్టినారు. ఇప్పుడు బ్రాండా నీటిబుగ్గ నా కళ్లముందు కనిపిస్తున్నా కనీసం ఓ నీటిచుక్క నా నోటికందదు. నా కాళ్లు విరిగిపోయినాయి. నూరు సంవత్సరాలకు ఒక అంగుళం కూడా కదలడం లేదు. అయ్యో! మూడు కారట్ల లోహంతో ఫ్లోరెన్స్ నాణేల్ని ముద్రించి ఎంత తప్పుపని చేసాను!"

నేనడిగాను– "నీ పక్కనే ఉన్నవాళ్లెవరు? అక్కడే పడి పొగలు కక్కుతున్నారు?"

అతనన్నాడు– "నాకూ తెలీదు! నేను ఈ అగాధంలో పడినప్పటి నుంచి వాళ్లిక్కడే ఉన్నారు. ఆమె హీబ్రూ యువకులపై నిందవేసిన స్త్రీ. ఆమె పొటిఫర్ (Potiphar) భార్య. రెండవవాడు 'సినాన్' (Sinon). మారువేషంలో వచ్చి ట్రోజన్లను మోసం చేసినవాడు" – ఆ మాట వినగానే 'సినాన్' పిడికిలి బిగించి 'ఆడమొ' పొట్టమీద గుద్దినాడు. 'ఆడమొ' వాడి మొహంమీద చరిచినాడు.

సినాన్ అన్నాడు– "మంటల్లో కాలిపోతూ కూడా అబద్ధమే చెప్పావు నీవు!" 'అడమొ' సమాధానమిచ్చాడు– "కొయ్యగుర్రం గురించి నీవు నిజం చెప్పావా?" సినాన్– "నీ పొట్టలో నీరుచూడు! నీ పెదాలు చూడు! నీ చేతులు చూడు! నర్సిస్సస్ (Narcissus) అద్దంలో ప్రతిబింబం నీవు!" అన్నాడు వ్యంగ్యంగా.

వాళ్ల వాగ్యుద్ధాన్ని గమనించి నా మార్గదర్శకుడు కోపంగా అన్నాడు– "ఇక చాలు ఆపండి!"

కలలో తనకు ఆపద సంభవించగా, మెలకువ రాగానే అది కల అని గ్రహించి నిట్టూర్పు విడిచినవాడిలా, నేనూ వాళ్లను అక్కడే వదిలి నా మార్గదర్శకుడి వేపు నడిచాను. అతడన్నాడు– "ఎప్పుడూ నీ సమయాన్ని అటువంటి వాగ్యుద్ధాల మధ్య వృధా చేయకు. నేనెప్పుడూ నీ పక్కనే ఉంటానని భావించి వెంటనే బయటపడు!"

**Canto - 31**

**పెద్ద కొమ్ముబూర శబ్దం వినగానే బాటసారులిద్దరూ తొమ్మిదవ వలయం వేపు వెళ్లినారు. దానిలో మరో నాలుగు అంతర్వలయాలున్నవి. వీటిలో మోసగాళ్లకు శిక్షలు విధించబడ్తాయి. మొదటి అంతర్వలయంలో ఉన్న మహాకాయులలో ఒకడు ఏంటియస్. వారిని తన చేతులలో తీసుకువెళ్లి ఆ వలయపు అడుగున ఉంచినాడు.**

## నమ్మకద్రోహం చేసేవాళ్లకు శిక్షలు

అతడి మాటలు ముందు నన్ను గాయపరచినట్లున్నా తరువాత అవే నా రుగ్మతను తొలిగించాయి. ఎఖిల్లిస్; అతని తండ్రి యొక్క జావెలిన్ – ముందు గాయపరచినా, తగిలినవాడికి స్వస్థత చేకూర్చినట్లు – ఇప్పుడు నా మనసు నెమ్మదించింది.

కష్టాలలోయ నుంచి మేము నిశ్శబ్దంగా మట్టిగుట్టను దాటినాము. అప్పుడే ఓ కొమ్ముబూర ఊదిన శబ్దం, ఉరుము కన్నా భయంకరంగా వినబడింది. ఛార్లమైన్ (Charlemain) పవిత్ర యుద్ధాన్ని ఆపుదల చేసి ఒర్లాండో (Orlando) తనకు మహాకాయుడు జాట్మండ్ (Jatmund) ఇచ్చిన కొమ్ముబూర ఊదినప్పుడు కూడా ఇంత శబ్దం రాలేదు. అక్కడ చీకటిలో ఎక్కడ చూసినా పెద్ద బురుజులే! నేను నా మార్గదర్శకుడిని ప్రశ్నించాను.

అతడన్నాడు– "అవి కోట బురుజులు, గోపురాలు కావు! వాళ్లు మహాకాయులు (Giants). ఈ గోతిలో బొడ్డువరకు మునిగి ఉంటారు". 'జోవ్' దేవుడు వాళ్లకు శిక్ష విధించినట్లు అక్కడ భీకరంగా ఉన్న వాళ్లను చూడగానే నా గుండె భయంతో వణికింది.

వాళ్లలో ఒకడు ముప్పై పెద్ద అరచేతులతో అతడి కటి ప్రదేశం నుంచి శిరస్సు వరకు కొలత వేయవచ్చు. ముగ్గురు పొడుగాటి వాళ్లు ఒడ్డునుంచి ఒకళ్లమీద ఒకళ్లు నిలబడితే వాడి జుట్టు అందుతుంది. 'రాఫెల్ బెయామెత్, సబిఅల్మి' – అని అరుస్తున్నాడు.

నా మార్గదర్శకుడన్నాడు– "ఇతడు నిమ్రాడ్ (Nimrod) ఇతని భాష ఇప్పుడెవ్వరికీ అర్థం కాదు"

ఎడమపక్క రాయి విసిరేంత దూరంలో ఇంకో పెద్ద 'జెయంట్' కనిపించాడు. అతడి చేతులు గొలుసులతో కట్టివేయబడి ఉన్నాయి. 'జోవ్'నే మల్లయుద్ధంలో సవాలు చేసే మొనగాడితడు. ఇతడి పేరు ఎఫియాల్టెస్ (Ephialtes).

నేనడిగాను– "బ్రయారియస్ ఇక్కడున్నాడా?"

అతడన్నాడు– "లేదు! అక్కడ సంకెళ్లు లేక స్వేచ్ఛగా ఉన్నవాడి పేరు ఏంటియస్ (Antaeus).

ఏంటియస్, అతడు వస్తుంటే నరకకూపం కంపించసాగింది. నాకు కళ్లలో చావుభయం పొంగుకొచ్చింది. కాని అతనికి కట్టబడి ఉన్న తాళ్లను చూసి కొంత ధైర్యం రాగా, నేను మహాకవి అతడి వద్దకు నడిచాము.

"అదృష్టపు లోయలో, స్కిపియో (Scipio)కు కీర్తినందించినవాడా! అతని ఖడ్గం 'హన్నిబాల్' సైన్యాన్ని పరుగులెత్తించేలా సాయపడినవాడా? నీ చేతుల్తోనే గదా భూమిపుత్రులు విజయాన్ని చేజిక్కించుకున్నది. ఆ చేతుల్తోనే మమ్మల్ని 'కొసిటస్' (Cocytus) నది దగ్గర దింపు. ఇతడు పైలోకంలో నీ ఘనతను చాటిచెప్పగలడు" అన్నాడు నా మార్గదర్శకుడు.

అంతటి మహాకాయుడు ఏంటియస్ తన చేతితో మహాకవిని (హెర్క్యులిస్, ఏంటియస్‌ను పట్టుకున్నట్లు) పట్టుకోగా, ఆ నెప్పిని భరించిన నా మార్గదర్శకుడు నన్ను తన చేతుల్తో సున్నితంగా పైకి లేవనెత్తినాడు. కాంసెండా గోపురంలా ఉన్న ఆ మహాకాయుడు ఏంటియస్ (Antaeus) మమ్మల్ని జాగ్రత్తగా – ల్యూసిఫర్, జుడా (Lucifer, Juda) లాంటి వాళ్లుండే చోట దించి, తాను మరల రాజసంగా ఉండే తెరచాప కొయ్యలా ఠీవిగా నిలబడినాడు.

## Canto - 32

**పదవ వలయంలో రెండవభాగం - శీతల ప్రాంతం కెయినా, ఏంటినోరాలుగా విభజింపబడింది. అక్కడ డాంటే ఇద్దరు ఆత్మలతో సంభాషించి అక్కడ వాళ్లు పడే బాధలను తెలుసుకుంటాడు.**

# తమ దగ్గర బంధువుల్ని చంపినవాళ్లనుభవించే శిక్షలు

నేనెంత గాఢంగా వ్రాయడానికి ప్రయత్నించినా అక్కడ ఆ నరకయాతనల ముందు నా వర్ణనలన్నీ పసిపిల్లల భాషలే! వాళ్లు నా ఈ కావ్యగానానికి సహకరిస్తున్నారు. థెబెస్‌లోని ఆంఫియాన్ కథలా సత్యానికి నా సంభాషణలు రూపాన్నిస్తున్నాయి.

అడవి మేకల మందలా, మహాకాయుల కాళ్ల దగ్గర అసంఖ్యాకంగా పడివున్న ఆ దీనులను చూస్తే నా గుండె తరుక్కుపోతున్నది. నా కాళ్లకింద నీరు గడ్డకట్టి మంచుపొరలా ఘనీభవించి ఉన్నది. ఎవరో అరిచారు– “చూసుకుని నడువు!”

ఆస్ట్రియన్ డాన్యూబ్ నదిపై శీతాకాలంలో గడ్డకట్టిన మంచుపొరలా నా పాదాలకింద ఉన్న పలచని పొర కింద రెండు తలలు శిరోజాలు కలిసి ఉన్నవి కనిపించాయి. అవి తలలు తిప్పి నాకేసి చూస్తున్నప్పుడు పిచ్చికోపంతో పోట్లాడు కుంటున్న అడవి మేకల్లా కనిపించాయి.

వాళ్ల పేర్లు అలెస్సాండ్రో, నెపోలియన్. వీళ్లు ఆల్బెర్టో ఆల్బెర్టి కుమారులు. ఒకళ్లనొకళ్లు చంపుకున్న ఘనులు. ఆ పక్కన మోర్డ్‌రిక్ (Mordrec). తండ్రి ఆర్థర్ రాజునే ఎదిరించినవాడు. అక్కడ ఫొకాసియా (Focaccia), తన చినాన్న (Uncle)ను పై పగతో ఘోరాలు చేసినవాడు; మాస్కెరోని (Mascherone) కూడా అంతే! తన చిన్నాన్నను చంపినవాడు. కమిస్సియెనె (Camiccione) తన బంధువు యుబెర్టినోను చంపించాడు. కార్లినో తన వాళ్లనే మోసం చేసినాడు. బొకా (Bocca) మోసంతో ‘గ్యుల్ఫ్’ వర్గాన్ని మొంటా పెట్రొ వద్ద ఓడేట్లు చేసినాడు.

‘బొకా’ నన్ను గుర్తుపట్టనట్లు వెళ్లిపోతుంటే నేనాతడి జుట్టు పట్టుకు లాగి వాడిని నిందించాను. వాడన్నాడు– “నీవు ఏమైనా రాసుకో! గుర్తుంచుకో! ఈ మాటలను అనిపిస్తున్నది ఫ్రెంచివాళ్ల స్వరం”

వాడికి తోడుగా వాలంబ్రోసా అబ్బాట్ (Abbot), ఘిబెల్లైన్ పక్షానికి అనుకూలంగా మతపరమైన తీర్పులు చెప్పేవాడున్నాడు.

బుయొసొ (Buoso) ఘిబెల్లియన్లను మోసం చేసి 'గైడిమాంట్‌ఫోర్ట్'కు సాయం చేయగా, క్రెమోనా పట్టణవాసులు అతని కుటుంబాన్ని మొత్తం చంపివేసారు.

గియాన్ని పొల్దానీరీ ఘిబెల్లిని పక్షాన ప్రజల అధినేతగా ప్రకటించుకుని తనకు, తన పక్షానికి ద్రోహం చేసినాడు.

అందరికంటే ద్రోహి 'గనెల్లాన్' (Ganellon) - ఇతడు 'ఛార్లెమాగ్నె'ను మోసం చేసినవాడు.

'ట్రిబాల్‌డొల్లొ' తన ఫెంజా (Faenza) నగర తలుపుల్ని తెరిచి నిద్రపోతున్న ప్రజలను శత్రువులకప్పజెప్పినాడు"

మేము వీళ్లందరిని వదిలి ముందుకు పోతుంటే నాకింకో ఘోరమైన దృశ్యం కనిపించింది. అక్కడ రెండు ఆత్మలు, ఒకదాని తలను ఇంకోటి మింగుతూ, ఆకలిగొన్నవాడు రొట్టెను నోటిలో కుక్కుకున్నట్లు కనిపించింది. టిడియస్ (Tydeus) తన నోటితో మెనాలిప్పస్ (Menalippus) తలను కొరుకుతూన్నట్లున్న దృశ్యాన్ని చూసి నేను నా మార్గదర్శకుడిని అడిగాను– "ఏమిటీ ఘోరం?"

**Canto - 33**

**పదవ వలయంలో మూడోభాగం - టొలోమియా (Ptolomea). ఇక్కడ దయనటించి మోసం చేసేవాళ్లకు శిక్షలు విధించబడ్డాయి. వారికి 'అల్బరిగొ పి మాన్‌ఫ్రెడి' కనిపించి, శిక్ష అనుభవించి వెళ్లినవాడి శరీరం ఇంకా పైలోకంలో సజీవంగా ఉండడం గురించి చెబుతాడు.**

# దయ నటించి మోసం చేసేవాళ్లకు శిక్షలు

అతడు తన నోటిలో ఉన్న వాడి తలను వదిలి నావేపు చూసి అన్నాడు– "వీడెంత మోసగాడో తెలుసా నీకు! వీడు చేసిన ద్రోహం తలుచుకుంటే నాలో ఆగ్రహం పెల్లుబికి వీడి తలను కొరికెయ్యాలనిపిస్తుంది. నాపేరు యుగొలినొ (Count Ugolino). అతడు ఆర్చిబిషప్ రగ్గిరి (Ruggieri). అతనిని నేను ఎంతగానో నమ్మాను. నన్ను, నా పిల్లల్ని పీసాగోపురం (Tower of Pisa)లో బంధించి ఆకలితో మాడి మరణించేలా చేసినాడు. ఆ తొమ్మిది రోజులూ మాకు నరకం కాదూ! ఎందుకు నీకళ్లు అప్పుడే వర్షిస్తున్నాయి. ఏం జరిగిందో నేను చెబుతాను విను.

ఆరోజు పీసా గోపురంలో బంధించబడి వున్న మాకు ఆహారాన్ని తెచ్చే సమయం దాటింది. భోజనం రాలేదు. నాకర్థమయ్యింది గోపురానికి తాళాలు వేసేశారని. ఒక్కమాట మాట్లాడకుండా, ఒక్క కన్నీటిచుక్క కార్చకుండా నేను శిలలా ఉండిపోయాను. వాళ్లు ఏడుస్తూనే ఉన్నారు. చిన్నవాడు ఏన్‌సెల్మ్ (Anselm)– "ఎందుకలా ఉన్నావు తండ్రీ! ఏమయ్యింది నీకు?" అన్నాడు. ఆ పగలూ, రాత్రి మౌనంగానే ఉన్నాను. తెల్లవారింది. ఆ నలుగురి మొహాల్లోనూ నన్ను నేను చూసుకున్నాను. వాళ్ల చేతుల్ని ప్రేమగా కొరుకుతుంటే వాళ్లన్నారు– "తండ్రీ! ఈ దేహాలు మాకు మీవల్ల వచ్చినవే! మీ ఆకలికి ఉపయోగపడితే మంచిదే" అన్నారు. నేను ఆరోజూ, మరుసటిరోజూ నిశ్శబ్దంగా ఉండిపోయాను. నాల్గవరోజు నా పాదాల దగ్గరే గాడ్డొ (Gaddo) మరణించాడు. అయిదు, ఆరో రోజుల మధ్యలో మిగతా ముగ్గురూ మరణించారు. నాకు కళ్లు కానరాక చూపు మందగించి అటూయిటూ తడుముకుంటూ, చనిపోయిన పిల్లల్ని పేరుపేరునా పిలుస్తూ కేకలు పెట్టాను. ఉపవాసం దుఃఖాన్ని మరిపిస్తుందన్నట్లు అది నా దుఃఖాన్ని తొలగించింది"

అని మరల ఆతడు తన అర్చిబిషప్ తలకాయను కొరకబోయినాడు. కుక్క బొమికను నమిలినట్లు ఆతడు తన పగను వెలిబుచ్చుతున్నాడు.

పీసా! ఎంత అవమానం! నీకు "యుగొలినో" పై కోపం ఉంటే ఆతడిని శిక్షించవచ్చు! కాని ముక్కుపచ్చలారని ఆ పిల్లలు ఏ తప్పు చేశారని ఆ ఘోర శిక్ష వాళ్లకు! బ్రిగాటా, యుగుస్సియోని, గాడ్డో, ఏన్‌సెల్మ్‌ల గురించి నేను కావ్యగానం చేస్తాను. వారి మృతిపై విలాప గీతాన్ని విరచించి వారి ఆత్మలకు శాంతి కలిగిస్తాను.

కొంతదూరం మేము వెళ్లేసరికి ఆ మంచుపొరల మధ్య నుంచి ఒక వ్యక్తి కేకపెట్టినాడు– "నాపేరు 'ఆల్బెరిగొ డి మాన్‌ఫ్రెడి (Alberigo). విషవనంలో పండ్లను కోయజూసినవాడిని నేను"

"నీవు చనిపోలేదా!" అని అడిగాను నేను.

"నా దేహానికేమైతే నాకేమి సంబంధం! నాకు దానితో పనిలేదు. ఈ టొలొమియా (Ptolomea) ప్రాంతపు శక్తి అటువంటిది. ఆత్మ దేహాన్ని వీడగానే ఒక్కోసారి ఆ దేహంలోకి మరో ఆత్మ ప్రవేశించవచ్చును. బ్రాంకా డొరియా సంగతి తెలుసా నీకు"

నేనన్నాను– "బ్రాంకా డోరియా మరణించలేదు"

కాని నాకు తెలుసు– ఈ 'ఆల్‌బెరిగొ' తన సహచరుల్ని విందుకు పిలిచి, పండ్లను వడ్డించమనగానే, ఆ సూచన ప్రకారం అతని అనుచరులు విందుకు వచ్చిన వారిని చంపడం; టొలొమియా పేరు వచ్చిన టాలమీ, అబూబస్ (Abubus) కుమారుడు సైమన్‌ను, అతని కుమారులను హత్య చేయడం, బ్రాంకా తన భార్య తండ్రి మైఖెల్ జాంఛె (Michel Zanche)ను చంపడం ఇవన్నీ తెలిసిన విషయాలే!

వాడన్నాడు– 'మైఖెల్ జాంఛె శరీరంలో ఇప్పుడు ఒక దుష్టాత్మ ప్రవేశించి ప్రతీకారం తీర్చుకుంటున్నది"

నాకు కళ్లు తిరిగాయి. ఈ మనుష్యులు ఏం సాధిద్దామని ఇన్ని ఘోరాలు చేస్తున్నారు? ఆత్మ కొసిటస్ నదిలో మునుగుతున్నా శరీరం ఇంకా భూమిపైన జీవించే ఉన్నది కదా!"

**తొమ్మిదవ వలయంలోని ఆఖరి ప్రాంతంలో - తమకు మేలుచేసిన వారికి కీడుచేసినవారు శిక్షలు అనుభవిస్తారు. అక్కడ మధ్యలో 'ల్యుసిఫర్' (Lucifer) ఉండగా, ఆ మాయావి వెనక ఉన్న రహస్యమార్గం ద్వారా డాంటే, వర్జిల్ భూలోకంలోకి చేరి ఆకాశంలోని నక్షత్రాలను వీక్షిస్తారు.**

# మేలు చేసినవారికి కీడు చేసే దుర్మార్గులకు శిక్షలు

"నరకలోకపు సామ్రాట్టు తన రాజలాంఛనాలతో కనిపించే దగ్గరకు వచ్చినాము. జాగ్రత్తగా గమనించు" అన్నాడు నా మార్గదర్శకుడు. ఆకాశం నిండా నల్లటి మబ్బులు కమ్మి, పెనుగాలులు వీస్తూ, రాత్రి నీడలు భూమిపై పడ్తున్నట్లు, దూరంగా గాలిమర (Wind mill) గాలుల ధాటికి వేగంగా వీస్తుండడాన్ని నేను ఊహించి ఆ గాలి వేగానికి తట్టుకోడానికన్నట్లు నేను నా మార్గదర్శకుడి వెనుక దాగాను.

ఆ ప్రాంతంలో రకరకాల గాజు అరల్లో శిక్షలననుభవిస్తున్నవారు రకరకాల భంగిమలలో, నిలబడి కొందరు, కూర్చుని, పడుకుని, పాదాల దగ్గరకు ముఖం వచ్చేట్లు అర్ధచంద్రాకారంగా కొందరు ఇలా వాళ్లు యాతనలు పడుతున్నారు.

నా మార్గదర్శకుడన్నాడు– "ఇక్కడ నీవు గుండెను దిటవుచేసుకో! ధైర్యంగా ఉండాలి సుమా!"

నేనెంత భయపడ్డానో మాటలతో వర్ణించ వీలుకాదు. నేను బదికున్నానా, చచ్చిపోయానో తెలీదు. అతడిని చూసి నేను కొయ్యబారిపోయాను. ఆ విషాద సామ్రాజ్య చక్రవర్తి సగం మంచులో దిగబడి ఉన్నా, ఆతని భుజాలు నా శరీరంకన్నా లావుగా, దృఢంగా ఉన్నాయంటే ఆతడి మొత్తం ఆకృతిని ఊహించండి! ఒకప్పుడు ఎంతో అందంగా ఉన్న అతడు ఇప్పుడు పరమ వికారంగా ఉన్నాడు. అయినా తన సృష్టికర్తనే సవాలు చేసి, తృణీకరించాడు. అతడి వల్లనే మనకిన్ని కష్టాలు!

అతడికి మూడు ముఖాలున్నాయి. ఒకటి సింధూర వర్ణంలో (Vermilion) ఉన్నది. కుడిపక్కది పాలిపోయిన పసుపుపచ్చగా, ఎడమ పక్కది నీలివర్ణంలో (నైలునది రంగులో) ఉండగా, పెద్దపెద్ద రెక్కలు, నౌకలపై తెరచాపలంత విశాలంగా, గబ్బిలపు రెక్కల్లా నల్లగా, వాటిని అతడు గాలిలో రెపరెపలాడిస్తున్నాడు. ఆ రెక్కల నుంచి వెలువడిన మూడు వాయువులు 'కోసిటస్'ను గడ్డకట్టిస్తున్నాయి. ఆరు కళ్ల నుంచీ అతడు కన్నీరు కారుస్తున్నాడు. ఆ కన్నీళ్లు రక్తపు నురగలతో అతడి మూడు గడ్డాల మీదగా ప్రవహిస్తున్నాయి.

అతడి దవడలు కదిలినప్పుడల్లా ఒక పాపి అతడి దంతాల మధ్య నలుగుతున్నాడు. అలా ప్రతిసారి ముగ్గురేసి పాపులు పటపటా ఆతని పళ్లమధ్య నలుగుతున్నారు. ఆ పాపుల వెన్నుపైనున్న చర్మం చప్పుడు చేస్తూ చీలి చిరిగిపోతున్నది.

నా మార్గదర్శకుడన్నాడు– "ఆపైన ఉండి అందరికంటె ఎక్కువ శిక్ష అనుభవిస్తున్నవాడు 'జుడాస్' (Judas=యూదా). ఆ రెండవవాడు బ్రూటస్ (Brutus), మూడవవాడు కాస్సియస్ (Cassius). మనం చూసింది చాలు. పద!" అన్నాడు వర్జిల్.

మేము ఇద్దరమూ జారుతూ, కోసుకుపోతున్న మంచు, రాళ్లమధ్య జాగ్రత్తగా ఊపిరి బిగబట్టుకుని అడుగులు వేస్తున్నా నా మార్గదర్శకుడి పాదాల కింద రాయి జారి పడనేపడింది. అతడన్నాడు రొప్పుతూ– "మనం ఈ దుష్ట ప్రదేశం నుంచి వెంటనే వెళ్లిపోవాలి". నేను అతడిని అనుసరిస్తూ వెనక్కి తిరిగి చివరిసారిగా ల్యుసిఫర్ (Lucifer) వేపు చూసాను. అతడి కాళ్లు ఇప్పుడు పైకి ఉన్నాయి.

నేనింకా కూర్చునే ఉండడం గమనించిన మహాకవి అన్నాడు– "మనం ఇంకా చాలాదూరం ఈ దుస్తరమైన మార్గంలో పయనించాలి. ఇంకో గంటన్నర సమయంలో సూర్యుడు వస్తాడు. ఇక్కడంతా చీకటే. మురికి నేల. ఈ అగాధం నుంచి బయటపడదాం!"

నేనన్నాను– "మార్గదర్శకుడా! తప్పుకు ఆస్కారం లేకుండా నేను కొన్ని మాటలనేందుకు అనుమతినివ్వు. అక్కడి మంచు ఏమయ్యింది? ల్యూసిఫర్ కాళ్లు పైకి తిరిగాయి కదా! సాయంకాలం నుంచి ఉదయంవరకు సూర్యుడు ఎక్కడ తిరిగాడు?"

అతడన్నాడు– "భూమిని తవ్వుతున్న కీటకం వెళ్లేదారిని మనం అనుసరించి మనం రెండవ అర్ధగోళానికి వచ్చియున్నాము. దానికిందనే ఒకప్పటి మానవుడి నివాసమున్నది. పాదాలు నిలిచివున్న ప్రదేశం జుడెక్కా (Judecca). స్వర్గం నుంచి మానవుడు పతనం చెంది ఇక్కడ పడినాడు. ఆ ప్రదేశమంతా ఇప్పుడు సముద్రాలచే ఆవరింపబడియున్నది. సూర్యుడు అటు ఉదయించి ఇటు సాయంకాలం అస్తమిస్తాడు".

బీల్‌జెబబ్ (Belzebub) చుట్టూ ఉన్న నరకలోకపు సమాధి (Vaulted Tomb) కూడా ఈ నరకాగ్నిలోకమే! దానిని చూడలేము కాని, రాళ్లలో ప్రవహిస్తున్న నీటి శబ్దం వల్ల ఊహించుకోగలము. ఆ ప్రవాహం ఏర్పరచిన దారిగుండా నా మార్గదర్శకుడు, నేను, మరల భూప్రపంచం వేపు వస్తున్నపుడు ఆ సొరంగపు వలయాకార ద్వారం నుంచి – అద్భుత దృశ్యం – ఆకాశ దీపాలు మనోహరంగా వెలుగుతూ మమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేసాయి. దూరంగా అదుగో! ఆకాశం!



Dante-Divine-Comedy



Dante_Beatrice_Paradiso_Canto_31

**DANTE**

# The Divine Comedy

**డాంటీ**

# డివైన్ కామెడి

**Part - II**

## PURGATORIO

## (ప్రక్షాళనాలోకం)

స్వేచ్ఛానువాదం

**డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# విషయసూచిక

## Part - II - PURGATARIO (ప్రక్షాళనాలోకం)


| | |
|---|---|
| **Canto-1** | ప్రక్షాళనా లోకం దగ్గర 'కాటొ'తో డాంటీ, వర్జిల్‌లు |
| **Canto-2** | ప్రక్షాళనాలోకం వేపు పయనం |
| **Canto-3** | చర్చిని, దేవుని ధిక్కరించి చివరిలో పశ్చాత్తాపం పొందినవారికి శిక్ష |
| **Canto-4** | నిర్లక్ష్యంతో పశ్చాత్తాపాన్ని అంతిమ క్షణాల వరకు వాయిదావేసేవాళ్లు. |
| **Canto-5** | హింస వలన మరణిస్తూ ఆఖరి క్షణాల్లో దేవుని స్మరించేవాళ్లు |
| **Canto-6** | చనిపోయినవారి ఆత్మశాంతికి చేసే ప్రార్థనల ఫలితం |
| **Canto-7** | చక్రవర్తులు, రాజుల ఆత్మలు తిరుగాడే చోటు |
| **Canto-8** | దేవదూతలను చూసి పారిపోయిన సర్పం |
| **Canto-9** | పర్గేటరీ గేటును తెరిచే రెండు తాళపు చెవులు |
| **Canto-10** | గర్వాంధులకు శిక్షలు (The Prideful - Terrace-1) |
| **Canto-11** | ఇహలోక కీర్తికాంక్ష అనే మాయ (Vanity) |
| **Canto-12** | గర్విష్ఠులకు ఉదాహరణలు |
| **Canto-13** | అసూయాపరులకు శిక్ష |
| **Canto-14** | అసూయాపరులైన కెయిన్, ఎగ్లారాస్‌లు |
| **Canto-15** | అత్యంత సహనశీలురకు ఉదాహరణలు |
| **Canto-16** | కోపపు పొగతో మండిపడినవాళ్లకు నల్లటి పొగ - శిక్ష |
| **Canto-17** | ప్రేమకు సప్తపాపాలకు గల సంబంధం |
| **Canto-18** | సోమరితనానికి శిక్ష |
| **Canto-19** | అత్యాశాపరులకు, లోభులకు శిక్ష |
| **Canto-20** | అత్యాశాపరులకు ఉదాహరణలు |
| **Canto-21** | స్టాటియస్ - వర్జిల్ - డాంటీ |
| **Canto-22** | దుబారా వ్యయం చేసేవారికి (Prodigality) శిక్ష |
| **Canto-23** | తిండిపోతులకు శిక్ష |
| **Canto-24** | ఈవ్, సెంటార్లు, గిడియాన్ సైన్యం |
| **Canto-25** | కామోద్రేకులకు శిక్ష-1 |
| **Canto-26** | కామోద్రేకులకు శిక్ష-2 |
| **Canto-27** | భూలోక స్వర్గం వేపు ప్రయాణం |
| **Canto-28** | దివ్యవనంలో లెథె ప్రవాహం |
| **Canto-29** | అద్భుతమైన ఊరేగింపు |
| **Canto-30** | డాంటీ - బియాట్రైస్ |
| **Canto-31** | డాంటీకు ప్రాయశ్చిత్త స్నానం |
| **Canto-32** | ఆదాం వృక్షం - రూపుమారిన రథం |
| **Canto-33** | బియాట్రైస్ చెప్పిన జోస్యం |

## Canto - 1

**నరకాగ్ని లోకం నుంచి బయటకు వచ్చిన సంతోషంతో డాంటీ తనకు కుడిపక్కన ఉన్న ప్రక్షాళనా (Purgatorio) ద్వీపాన్ని చూస్తాడు. ఆకాశంలో వెలుగుతున్న నాలుగు నక్షత్రాల్ని గమనించిన డాంటేకు తనకు ఎడంపక్కన 'కాటొ' (Cato) కనిపించి, ప్రక్షాళనా లోకంలోకి వెళ్లేముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించినాడు. వర్జిల్ మహాకవి 'డాంటీ'ను సముద్రతీరానికి తీసుకువెళ్లి డాంటీ ముఖాన్ని మంచుతో శుభ్రం చేసి, రెల్లుగడ్డితో అతనికి రక్ష కడ్తాడు.**

# ప్రక్షాళనాలోకం దగ్గర కాటొతో డాంటీ, వర్జిల్‌లు

మానవుని ఆత్మకంటిన మాలిన్యాన్ని తొలగించి, స్వర్గలోకపు గమనానికి ఆతడిని సంసిద్ధం చేసే ద్వీపానికి నేను వెళ్లబోతున్నాను. జ్ఞానపు తెరచాప పైకెత్తబడగా, ప్రశాంతమైన అలలపై నా నౌక, ఈ కల్లోల నరక సముద్రాన్ని విడిచి ప్రక్షాళనా ద్వీపం వేపు పయనిస్తున్నది.

ఓ సకల కళాధిదేవతలారా! నవదేవతలు మీరు! మీ తొమ్మిదిమంది జ్ఞాన దేవతలను నేను భక్తితో అనుసరిస్తూ ఈ కావ్యగానం చేస్తున్నాను. ఇతిహాస కావ్యాలకు రాణి కాలియోపె (Calliope) నన్ను అనుగ్రహించునుగాక. మీతో శపించబడి బొమ్మజెముడు కాకుల్లా (Magpie) మారిన పీరస్ (Pierus) కుమార్తెల స్వరాలిందు రాకుండునుగాక!

తూర్పు నీలమణి వన్నెలు ప్రశాంతతను ప్రతిఫలిస్తున్నాయి. నరకలోకపు చీకటి విషాదలోకాన్ని వదిలి వస్తుంటే ప్రేమతో నిండిన వీనస్ (శుక్రగ్రహం) మీనరాశి (Pisces)తో ముచ్చటలాడుతున్నది.

కుడిపక్కన భూతలస్వర్గంలో మన తొలి మాతాపితలకు (Adam & Eve) తొలుత కనిపించి పాపకార్యం తరువాత మాయమైన నాలుగు నక్షత్రాలు – వివేకం (Prudence), స్థైర్యం (Fortitude); ఆత్మనిగ్రహం (Temperance); న్యాయం (Justice) మరల నాకిప్పుడు కనిపిస్తున్నాయి. వెయిన్ (Wain) నక్షత్రరాశి (Ursa Major) అప్పుడే అదృశ్యమైనట్లున్నది. ఇంతలో నా పక్కన ఓ వృద్ధుడు, జ్ఞాన సంపన్నుడు, వెండిలా మెరుస్తున్న తెల్లటి వెంట్రుకలతో పొడుగాటి గడ్డంతో మునిలా భాసిస్తున్నవాడు, ఆ నాలుగు నక్షత్రాల కాంతి ఆతనిపై పడగా అతి ప్రకాశవంతంగా వెలుగొందుతున్నవాడు – ఆతడిని సూర్యసమానంగా భావించి నేనాతనికి నమస్కరించాను.

అతడన్నాడు– "ఎవరు మీరు? ఆ శాశ్వత కారాగారం నుంచి, శిలా ప్రవాహపు దారిలో పారిపోయి వస్తున్నారా? నరకలోకపు చట్టాలు ధ్వంసమైనాయా?

లేక స్వర్గం కొత్త శాసనాలను ప్రవేశపెట్టిందా? గాఢాంధకారపు అగాధం నుంచి మిమ్మల్నెవరు ఈ వెలుగులోకి తీసుకువచ్చినారు? మీరెందుకు నా గుహ ముందు నుంచి వెళ్తున్నారు?"

నా మార్గదర్శకుడు నన్ను మోకాళ్లపై వంగి ఆతనికి నమస్కారం చేయమని ఆదేశించగా నేనట్లే చేసాను. ఆ మహాకవి 'కాటొ' (Cato) వృద్ధుడితో అన్నాడు– "నాఅంతట నేను ఇతడిని తీసుకుని ఇటు రాలేదు. స్వర్గలోకపు కన్య ఇతడికి సాయం చేయమని నన్ను కోరింది. నేనాతనికి నరకాగ్నిలోకపు అన్ని ప్రాంతాలను చూపించాను. మేము రావడం మీకభ్యంతరం లేకపోతే మీ అధీనంలో ఉన్న ఈ ప్రక్షాళనా లోకాన్ని (Purgatorio), ఆతడు చూడగలడు. స్వేచ్ఛ (Liberty) కోసం యుటికా (Utica)లో ప్రాణత్యాగాన్ని చేసిన మీరు మాకు చిరస్మరణీయులే! ఇతడు సజీవుడు! నన్ను 'మినాస్' (Minos) న్యాయదండం స్పృశించదు. మీరు అమితంగా ప్రేమించిన మార్సియా (Marcia) ప్రేమ సాక్షిగా నేను మిమ్మల్ని అర్థిస్తున్నాను. ఓ పావనుడవైన ఆత్మరూపమా! మాకు ఈ ప్రక్షాళనా లోకపు ఏడు ప్రాంతాలను చూసేందుకు అనుమతినివ్వు! మమ్మల్ని అనుగ్రహించు!"

కాటో పలికాడు– "మార్సియా ఇప్పుడు 'లెథె' ప్రవాహానికి ఆవల వున్నది. స్వర్గలోకపు దేవత నీకు అనుమతి ఇచ్చినప్పుడు నన్ను పొగిడి కార్యాన్ని సాధించాల్సిన అవసరం లేదు. అతడికి సన్నటి రెల్లుగడ్డి (Reed) పోచను నడుముకు కట్టు. అతని మొహాన్ని మంచుతో కడిగి శుభ్రం చేయి. తెల్లవారిన తరువాత సూర్యకాంతి వెలుగులో ఈ కొండను ఎక్కడానికి అనువైన దారి కనిపించగలదు".

ఆ మహామేధావి అదృశ్యమైనాడు. నా మార్గదర్శకుడు నా వద్దకు వచ్చి అన్నాడు– "కుమారా! నన్ను అనుసరించు! మనం కొంత వెనక్కు వెళ్లి సరైన దారిని చేరుకోవాలి!"

ఉదయకాంతి వెలుగు తీవ్రతకు వణుకుతున్న సముద్రపు ప్రవాహాన్ని నేను గమనించాను. మేము కొంత దూరం నడిచి కొండపైకి వెళ్లేదారివేపు వెళ్లినాము.

నా మార్గదర్శకుడు ఆకుపచ్చని పచ్చికపై అలుముకున్న మంచును తన దోసిళ్లతో తీసి నా ముఖాన్ని కడిగినాడు. ఆ మంచుబిందువులు, కృతజ్ఞతతో నిండిన నా కన్నీళ్లతో కలిసి ప్రవాహంలా జాలువారినాయి. నరకలోకపు విషాదం నల్లగా మార్చిన నా వదనాన్ని ఆ మంచుబిందువులు కడిగి శుభ్రం చేయగా నా మోము ప్రకాశవంతమైనది.

అతడు అక్కడున్న రెల్లుగడ్డి నుంచి పోచలను తెంపి నా నడుముకు కట్టినాడు. ఆశ్చర్యం! ఒక గడ్డిపోచను పీకుతుంటే మరొకటి అదేచోట వెంటనే ప్రత్యక్షమవుతున్నది.

## Canto - 2

**ప్రక్షాళనా ద్వీపానికి ఆత్మలను తీసుకువస్తున్న నౌక వారికి కనిపించింది. డాంటే ఆ ప్రయాణీకుల్లో తన మిత్రుడైన 'కాసెల్లా'ను గుర్తుపట్టినాడు. అతడు తన పాటతో ఆనందపరుస్తుండగా, 'కాటొ' సమయం వృథా చేయవద్దని హెచ్చరించడంతో డాంటే, వర్జిల్‌లు కొండవేపు వెళ్తారు.**

# ప్రక్షాళనాదీపం (Purgatory) వేపు పయనం

జెరూసలెం ఉత్తరాన, పర్గేటరీ (ప్రక్షాళనాద్వీపం) దక్షిణాన, గంగానది తూర్పున, పడమట జిబ్రాల్టర్ అగ్రం – డాంటే ప్రపంచానికి సరిహద్దులు కాగా జెరూసలేంలో సూర్యుడు అస్తమించినప్పుడు ప్రక్షాళనా ద్వీపంలో సూర్యోదయ మవుతుంది. జెరూసలెంలో సాయంకాలం ఆరుగంటలైతే గంగానది దగ్గర అర్ధరాత్రి, పర్గేటరీ (ప్రక్షాళనా లోకం)లో ఉదయం ఆరుగంటలు, జిబ్రాల్టర్ వద్ద మిట్టమధ్యాహ్న సమయం.

ఉదయ సంధ్య అరోరా (Aurora) తెలుపు వదనం క్రమేపీ ఎర్రగా మారుతున్నది. మేము నీటి ఒడ్డున సెద దీరుతున్నాము. పడమటి దిక్కునుంచి ఏదో కాంతి మావేపు వస్తున్నది. క్రమేపీ ఆ కాంతి విస్తృతం కాగా ఆ రూపం రెక్కలు విప్పుకుంటున్నట్లు కనిపించింది. నా గురువర్యుడన్నాడు– "దేవదూత వస్తున్నాడు. మోకాళ్లపై కూర్చుని నమస్కరించు. ఆతనికి నౌకలూ, తెరచాపలూ అక్కరలేదు. తన రెక్కల సాయంతోనే సుదూర తీరాలను ఆతడు అధిగమించగలడు. మానవుని శిరోజాల్లా రూపుమారేవి, మాసేవీ కాదు ఆ రెక్కలకున్న అందమైన ఈకలు"

అలలపై తేలివస్తున్నట్లున్న ఆ నౌకపై ఆతడు మమ్మల్ని సమీపించినాడు. ఆతని కాంతి కన్నులకు మిరుమిట్లుకొలుపగా నేను వినమ్రుడనై మోకాళ్లపై కూర్చుని అభివాదం చేసాను. ఆ నౌకపై ఉన్న నూరు ఆత్మలు– "In Exitu Israel de Aegupto" – అని ఒకే గొంతుతో గానం చేస్తున్నారు. ఆ ఆత్మలు దిగగానే ఆ దివ్యుడు వేగంగా నౌకలో వెళ్లిపోయాడు.

వాళ్లు మమ్మల్ని చూడగానే పర్వతానికివెళ్లేదారి అడిగారు. మహాకవి 'మాకూ కొత్తే' అని సమాధానమిస్తుండగా వాళ్లు నేను జీవించిఉన్న మానవుడనని గమనించి ఆశ్చర్యంతో నావేపు వస్తూండగా వారిలో ఒకతను అందరికంటే ముందు వచ్చినాడు. మూడుసార్లు అతనితో కరచాలనం చేయబోయాను. కౌగలించుకోబోయాను. అంతా

వాయువై, శూన్యాన్ని స్పర్శించినట్లే ఉండినది. అతడన్నాడు– "మిత్రమా! నేను శరీరంతో ఉన్నప్పుడు నిన్నెంత ఇష్టపడేవాడినో ఇప్పుడూ అంతే! అయినా ఇక్కడికెందుకు వచ్చినావు?"

"కాసెల్లా! (Casella)' – నేను నిన్ను గుర్తుపట్టాను" అని నేను బిగ్గరగా అరిచాను.

అతడన్నాడు– "ఎవర్ని, ఎప్పుడు, ఎలా తీసుకువెళ్లాలో నిర్ణయించే అతడు, మూడు నెలల నిరీక్షణ తరువాత నన్ను తన నౌకలోకి అనుమతి ఇచ్చినాడు" అంటూ అతడు తన సహజరీతిలో అద్భుతమైన పాటను– "నా మనసు ప్రేమతో నిండి వున్నది" – అని గానం చేయగా అందరూ మంత్రముగ్ధులై ఆతని స్వరమధురిమలో మైమరచిపోయారు.

ఇంతలో వయోవృద్ధుడు, మహాజ్ఞాని 'కాటో' (Cato) ప్రత్యక్షమై– "ఏమిటి ఆలస్యం చేస్తున్నారు? ఇక్కడ పాటలు పాడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారా! త్వరగా వెళ్లి కొండనెక్కి మీ బద్ధకాన్ని వదిలించుకోండి" అని గద్దించినాడు.

అంతే! ఆ ఆత్మలన్నీ – గింజలు తింటున్న పావురాలు, ఎవరో విసిరిన రాయి చప్పుడుకు పరారైనట్లు – ఒక్కుమ్మడిగా పర్వతం వేపు పోయినారు. మేమూ నెమ్మదిగా వారిని అనుసరించినాము.

## Canto - 3

**తన మార్గదర్శకుడు తనని వదిలి వెళ్లాడేమోనని భయపడ్తున్న డాంటీకు 'వర్జిల్' కనిపించగా భయం అనుమానం తొలిగి ఇద్దరూ పర్వత పాదాల వేపు వెళ్లినారు. కొందరు ఆత్మలు చూపిన దారిలో వారు వెళ్తూండగా వాళ్లలో ఉన్న నేపుల్స్ రాజు 'మాన్‌ఫ్రెడి' ఆత్మ, తన ఆఖరి ఘడియలను తన కుమార్తె అరగాన్ రాణి 'కొస్టాంజా'తో వివరించమని 'డాంటీ'ను కోరుతాడు.**

# చర్చిని, దేవుని ధిక్కరించి చివరిలో పశ్చాత్తాపం పొందినవారికి శిక్ష

అందరమూ పర్వతపు దిక్కుగా పరిగెత్తగా నేను కొద్దిసేపటి తరువాత నలుదిక్కులకూ చూసాను. ఎక్కడా నా మార్గదర్శకుడి జాడలేదు. అతడు నన్ను వదిలి వెళ్లిపోయాడా! నా అలసత్వంపై ఆతనికి కోపం వచ్చిందా? అనుకుంటూండగానే పైనుంచి సూర్యుని కాంతి నాపై పడి నీడ కనిపించింది. మిగతా ఆత్మలకు నీడలు లేవు. శరీరధారులనే గదా ఛాయ అనుసరించేది. అలా ఆలోచిస్తూ నేను పక్కకు తిరిగేసరికి నా మార్గదర్శకుడు పక్కనే ఉన్నాడు. కాని ఆతని నీడ కనిపించలేదు.

ఆతడన్నాడు– "ఎందుకు అపనమ్మకం చెందుతున్నావు? నేను నీ పక్కనే ఉంటానని నీకు తెలుసుగదా! నా శరీరం 'బ్రుండుసియం' నుంచి 'నేపుల్స్'కు మార్చబడినది. అయినా శరీరం లేని ఆత్మలు బాధలననుభవించేలా ఆ మహోన్నత శక్తిమంతుడి శాసనం. ఆతడి శక్తిని అంచనావేయడం ఈ మానవ జ్ఞానానికి అందితే 'మేరి' మాత – 'ఆతడి'ని కనే అవసరం ఉండేది కాదు. అరిస్టాటిల్, ప్లాటో లాంటి వాళ్లెందరో అదే జిజ్ఞాసతో వృథాగా జీవనం గడిపారు"

అలా మాట్లాడుకుంటూనే మేము – టర్బియా, వెరిసిల మధ్య ఉన్న కోసుకుపోయే అంచులు, రాళ్లున్న కొండకన్నా దుస్తరమైన పర్వతం వద్దకు చేరుకున్నాము. ఎలా ఎక్కాలా అని మధనపడ్తూ ఉండగానే అక్కడ మాకో ఆత్మల గుంపు కనిపించింది. వాళ్లు – గొర్రెల గుంపులో ముందుగా ఒకటో, రెండో గొర్రెలు ముందుకు వచ్చి మార్గంవేపు చూస్తుండగా మిగతావి భయంభయంగా వెనకనే నిలబడి దిక్కులు చూస్తున్నట్లు – ఆ ఆత్మల గుంపు నుండి ఒక ఆత్మ ముందుకు రాగా తరువాత అందరూ గుమికూడినారు. వర్జిల్ అన్నాడు– "ఆశీస్సులను పొందిన ఆత్మలారా! అదృష్టవంతులారా! పర్వతం వేపు వెళ్లే దగ్గర దారి చూపండి. కాలం

విలువైనది కదా! ఈతడు స్వర్గలోకపు ఆశీస్సులతో జీవించి ఉండగానే ఇక్కడకు రాగలిగినాడు. ఆతని శరీరపు నీడను మీరు గమనిస్తున్నారు కదా!"

వారిలో ముందు నిలబడిన ఆత్మ నావేపు తిరిగి అన్నాడు– "నాపేరు మాన్‌ఫ్రెడి (Manfredi). రాణి కొన్స్టాంజా మనవడిని. నీవు భూలోకానికి తిరిగి వెళ్లగానే నా కుమార్తె – సిసిలీ, అరగాన్ రాజుల తల్లి అయిన చిన్న కోన్స్టాంజాతో ఈ నిజాన్ని వివరించు. నేను తప్పులు చేసాను. పోప్ క్లెమెంటె నాపై యుద్ధాన్ని ప్రకటించగా ఆ యుద్ధంలో నాకు కనుబొమ మీద, రొమ్ముపైన తగిలిన కత్తిపోట్లతో మరణించాను. బెనెవెంటో వంతెన వద్ద ఉన్న నా సమాధిపై ఇప్పుడు పెద్ద రాళ్లగుట్ట ఉన్నది. ఎవరైతే పవిత్ర చర్చికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తారో, వాళ్లు పశ్చాత్తాపపడినా, వాళ్లు వ్యతిరేకతా కాలానికి ముప్పైరెట్ల సమయం నిరీక్షించవలసి వస్తుంది. కేవలం ప్రార్థనలు మాత్రమే కొంతవరకు ఆ శిక్షను తగ్గించగలుగుతాయి. నీవు ఈ విషయాన్ని నా కుమార్తెకు వివరించు. ఆ విధంగా మిగతావాళ్లకు నా కథ గుణపాఠం అవుతుంది"

## Canto - 4

**ఇరుకైన దారిలో పర్గేటరీ పర్వతాన్ని అధిరోహిస్తూ ఒక మూల విశ్రాంతి తీసుకుంటున్నపుడు, డాంటీ, తమకు ఎడమవైపున సూర్యుడు ఉండడాన్ని చూసి ఆశ్చర్యపోతాడు. ఆ తరువాత ప్రయాణంలో, కనిపించిన ఆత్మలలో డాంటీకు పరిచయమున్న 'బెల్ అక్వా' తన శిక్షను గురించి వివరిస్తాడు.**

# నిర్లక్ష్యంతో పశ్చాత్తాపాన్ని అంతిమ క్షణాల వరకు వాయిదా వేసేవాళ్లు.

సంతోషమో, దుఃఖమో మనల్ని వివశుల్ని చేసినప్పుడు, సంగీతమో, దృశ్యమో మనల్ని మైమరపించినపుడు కాలం గడుస్తున్న సంగతే మనకు గుర్తుకురాదు. కాలగమనాన్ని గుర్తించే శక్తికన్నా మనస్సును ఆక్రమించుకున్న శక్తి బలమైనది.

ఆ మార్గం ఎంత ఇరుకుగా ఉందంటే సాన్‌లియొ నుంచి 'నౌలి' కి, కాకుమి నుంచి బిస్మాంటోవాకు కాలినడకన పోవచ్చునుగాని ఈ దారిని పోవాలంటే మొండితనం, కోరికల రెక్కలు కావాలి. ఎంత నడిచినా తరగని దారి! నాకు ఆయాసం వచ్చింది. నేనన్నాను– "గురువర్యా! కొంచెంసేపైనా ఆగకపోతే నేనిక్కడే ఒంటరిగా నిలబడిపోతానేమో!". అతడన్నాడు– కుమారా! అదుగో ఆ ఎత్తైన సమతలం మీద కూర్చుందాం! పద!" నానా కష్టపడి పైకి ఎక్కి కూర్చుని కాస్త స్థిమితపడి, వచ్చిన దారివేపు చూసాను.

అదిగో ఆది తీరం. ఇప్పుడు ఆకాశంలో నా ఎడమ వేపున సూర్యుడు! వెలుగు రథం మాకూ, ఉత్తరదిక్కుకూ మధ్య పోతున్నది. అతడన్నాడు– "కాస్టర్, పొల్లక్స్ (మిథునరాశిలో కవలలు)లు సూర్యుడితో కలిసి ప్రయణిస్తున్నారు. జియాన్ పర్వతానికి ఇరువేపులా అర్ధగోళాలున్నాయనుకో, సూర్యుడి కుమారులు ఫీథాన్ (Phaethon) తన తండ్రి రథాన్ని తీసుకుని అడ్డదిడ్డంగా నడిపినప్పుడు, జ్యూస్ దేవుడు అతడిని తన పిడుగులతో చంపిన రోజుల్లో, ఫీథాన్ రథమార్గం – ఆ ఖగోళమార్గం ఈ పర్వతానికి ఉత్తరం వేపున ఉంటే, అదే జియాన్ పర్వతానికి దక్షిణ దిక్కున ఉన్నట్లు కనిపిస్తుంది.

నేనన్నాను– "భూమధ్యరేఖ మనకు ఇక్కడ నుంచి శీతల ఉత్తరాన ఉన్నట్లుంటే మన పూర్వీకులైన హీబ్రూలకు అది దక్షిణంగా వేడి ప్రదేశాలవేపు వున్నట్లు కనిపించిందని నాకు అర్థమయ్యింది. మీకు అభ్యంతరం లేకపోతే మనమింకెంత దూరం పోవాలో చెప్పగలరా?"

అతడన్నాడు– “ఈ పర్వతం ఎక్కడం మొదట్లో కష్టంగా పోనుపోను తేలికవుతుంది. అక్కడ నడక నల్లేరుపై సాగుతుంది. అక్కడ విశ్రాంతి తీసుకుందువు' గానిలే”

ఇంతలో మాకో స్వరం వినిపించింది– “అక్కడకు వెళ్లేలోపు ఇక్కడే కాసేపు సేదదీరడం ఉత్తరం!”

మేము అటు ఇటూ చూసేసరికి పెద్ద రాతిస్తంభం వెనక నీడలో కొందరు ఆత్మలు కనిపించారు. వారిలో ఒకడు ఎంతో అలిసిపోయినవాడిలా తలను మోకాళ్ల మధ్యలో పెట్టుకుని తన చేతుల్తో కాళ్లను పాదాలకు పైన పట్టుకుని కూర్చుని ఉన్నాడు.

నేనన్నాను– “అతడిని చూడు! సోమరితనం ఇతడి సోదరిలా ఎలా కూర్చున్నాడో!”

ఆత్మ అన్నాడు– “అంత శక్తివుందా! మరి కొండెక్కు!”

నేను అతనివంక తేరిపార చూసాను. నేనన్నాను– “సూర్యుడు నీ ఎడమ పక్కగా వెళ్తుండడం గమనించావా? బెల్ అక్వా! ఎవరన్నా దారి చూపించేవారి కోసం ఎదురుచూస్తున్నావా లేక నీ పాత అలవాట్లలోకి పడిపోయినావా?”

అతడన్నాడు– “కొండెక్కినా ఏం ప్రయోజనం? అక్కడ దేవదూత నన్ను లోపలికి వెళ్లనివ్వడం లేదే! నేను బతికి ఉన్నపుడు పశ్చాత్తాపపడకుండా ఎన్నిరోజులు కాలం గడిపానో అన్నిరోజులు నేనిక్కడే ఇలా ఎదురుచూస్తూ ఉండాలి. ఎవరిదైనా కరుణతో నిండిన హృదయం నా గురించి ప్రార్థన చేస్తే నాకు కొంత శిక్ష తగ్గుతుందేమో! మిగతా ప్రార్థనల వలన ఫలితమేమున్నది? ఎవరు నా గురించి ప్రార్థిస్తారు? స్వర్గమే నన్ను పట్టించుకోవడంలేదే!” అతడు భారంగా నిట్టూర్పులు విడుస్తున్నాడు.

ఇంతలో నా మార్గదర్శకుడు వచ్చి అన్నాడు– “మొరాకోలో రాత్రి సమయం. ఇక్కడ సూర్యుడు అత్యున్నత (మెరిడియన్) స్థితిని చేరుకున్నాడు! మనం వెళ్లే సమయమయ్యింది!”

## Canto - 5

**ఈసారి మన బాటసారులకు మరో గుంపు కలుస్తారు. వీరు దౌర్జన్య పూరితమైన మరణం సంభవించేముందు పశ్చాత్తాపపడినవాళ్లు. అటువంటి వారిలో ముగ్గురు వ్యక్తులు తమ గురించి వివరిస్తారు.**

# హింస వలన మరణిస్తూ ఆఖరి క్షణాల్లో దేవుని స్మరించేవాళ్లు

మేం ముందుకు పోతుంటే నా వెనుక ఇద్దరు ఆత్మలు గుసగుసలాడుతున్నారు– "ఆ వెనక వెళ్లేవాడిని చూసావా! సూర్యకాంతి వాడిలోనే ఆగిపోతోంది. ఖచ్చితంగా అతడు జీవించి ఉన్నవాడే!" అప్రయత్నంగానే నా నడక మందగించింది.

నా మార్గదర్శకుడన్నాడు– "వాళ్ల మాటలు నీ కాళ్లకు బంధాలు కారాదు. నీవు ఓ స్థిరమైన బురుజువలె ఉండాలి కాని గాలివానకు ఒరిగిపోయేట్లుండరాదు. పక్క విషయాలపై మనస్సు నిలిపేవాడు తన అసలు లక్ష్యాన్ని చేరుకోలేడు"

ఇంతలో మాకల్లంత దూరంలో ఓ గుంపు మావేపే వస్తూ వాళ్లు నన్ను చూసి ఆశ్చర్యపోయి వాళ్లలో ఇద్దరిని విషయం కనుక్కురమ్మని నా వద్దకు పంపినారు. అప్పటివరకు 'Miserere' పాటను గానం చేస్తున్నవాళ్లు నేను బతికి ఉన్నానని తెలియగానే పాటను ఆపి నాతో మాట్లాడడానికి ఉత్సుకత చూపినారు.

నా మార్గదర్శకుడి సలహాతో నేను ఆగకుండా నడుస్తూనే వాళ్లు చెబుతున్నది వినసాగాను. వాళ్లలో ముగ్గురు ఇట్లా అన్నారు–

"మేమంతా హింస వలన మరణించినవాళ్లమే. మా ఆఖరి క్షణాల వరకు పాపాలు చేసినాము. ఆ ఆఖరిగంటలో స్వర్గం మాపై కరుణించగా మేము పశ్చాత్తాపంతో దేవుని ప్రార్థించినాము. పశ్చాత్తాపం (Repenting), క్షమ (Forgiving) లతో మేము దేవుని ఆశ్రయాన్ని అర్థించినాము. అతడు మాలో దేవుని చూడాలని, ఆతని క్షమకై నిరీక్షించే కోరికను మాలో ఉత్పన్నం చేసినాడు".

దారిలో ఒకడన్నాడు– "నీవు ఛార్లెస్ రాజ్యానికి రోమాగ్నాకు మధ్య దేశానికి (ఫానొ=Fano) వెళితే నా గురించి నిజం తెలియజేయి. నాపేరు జాకొపొ. ఒకప్పుడు బొలోనా (Bologna) న్యాయాధిపతిని. అజ్జొ డి ఎస్టె నన్ను ఏంటినార్ రాజ్యమైన పడువా (Paduva) దగ్గరలో హత్య చేయించినాడు. నేను పడువా, వెనిస్‌ల మధ్య

ఉన్న 'మీరా' (Mira)కు బదులు 'ఒరియాకొ' (Oriaco) చిత్తడి నేలల వేపు వెళ్లి అక్కడ బురదలో చిక్కుకుని హంతకుల చేతిలో హతమైనాను.

రెండవ వాడన్నాడు– "నాపేరు బువాన్ కాంటి (Buoncante). నేను ప్రసిద్ధ ఘిబెల్లైన్ నాయకుడు 'గిడొ డ మాంటెఫెల్ట్రొ' కుమారుడను. కంపాల్డినో వద్ద 'గ్యుల్ఫె' (Guelphe)ల చేతుల్లో అర్కియానో (Archiano) ఏటివద్ద గొంతు నుంచి రక్తం కారుతుండగా ఆఖరి క్షణాల్లో 'మేరీ మాత'ను స్మరిస్తూ ప్రాణాలు వదిలాను. నా ఆత్మను దేవదూత తీసుకుని వస్తుండగా నరకలోకపు భటుడు అరిచాడు– "దేవదూతా! ఇతడు నరకానికి పోవల్సినవాడు. వాడి జీవితంలో మొట్టమొదటిసారి 'మేరీమాత'ను తల్చుకుని, కన్నీటిబొట్టు రాల్చి, ప్రాణాలు వదిలినాడు. నీవు ఆత్మను తీసుకుపో! నేనీతడి శరీరానికి శిక్షవేస్తాను" అని అతడు గాలిని, ఆవిరిని ఆవాహన చేసి ఆ లోయనంతా నింపి మబ్బులను సృష్టించి, పెనుగాలిని తుఫానుగా మార్చి నా శరీరాన్ని నెట్టుకుంటూ వెళ్లి అర్నొ (Arno) నదిలో పడవేయగా ఆ గంభీరమైన నది ఒడ్డున ఇసుక మేటలో నా శరీరం కప్పబడింది.

మూడవ ఆత్మ అన్నది– "నీవు ఈ యాత్ర ముగిసిన పిమ్మట ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకునేప్పుడు నన్ను గుర్తుకు తెచ్చుకో! నాపేరు లా'పియా' (La Pia). సియన్నాలో పుట్టాను. మారెమ్మ (Maremma) నగరంలో నా భర్త నన్ను నా యింటి వరండాలో నుంచి నేలపైకి నెట్టగా నేను కిందపడి మరణించాను"

**Canto - 6**

**'బ్రతికి ఉన్నవాళ్లు చేసే ప్రార్థనలు చనిపోయినవాళ్లకు ఎలా ఉపయోగ పడ్తాయి?' అని డాంటీ తన మార్గదర్శకుడిని అడుగుతాడు. హింస వల్ల మరణించిన వారు మరికొందరిని, వర్జిల్ మిత్రుడు సొర్డెల్లొను డాంటీ కలుసు కుంటాడు.**

# చనిపోయినవారి ఆత్మశాంతికి చేసే ప్రార్థనల ఫలితం

"పాచికల ఆట' (Zara - Dice game) ముగిసింది. ఓడిపోయినవాడు ఒంటరిగా, దిగులుగా కూర్చుని తను పాచికలు ఇంకెలా విసిర్తే బాగుండేదో అని చింతిస్తున్నాడు. జనం అంతా గెలిచినవాడి చుట్టూ 'బెల్లం చుట్టూ ఈగల్లా' మూగినారు. విజేతకు కుడిఎడమల వెనకా ముందూ వాళ్లే! నన్ను మరచిపోకు అని ఒకడంటే, నేను ఎప్పుడూ నీ పక్షమే అంటూ మరొహడు! గెలిచినవాడు ఆగకుండా నడుస్తూనే అందరి మాటలు వింటున్నాడు" నా పరిస్థితి అలానే ఉన్నది. వాళ్లందరికీ వాగ్దానాలు చేస్తూ నేను ముందుకు నడుస్తూనే ఉన్నాను.

అతడు న్యాయాధిపతి 'బెనిన్ కాసా'. ఘినో సోదరుడు బందిపోటుగా బంధించబడగా మరణదండన విధించినందుకు ఘినో (Ghino) న్యాయాధిపతి తల నరికి చంపినాడు.

'గస్సియో' అనే ఇతడు తన శత్రువులను తరుముతూ నదిలో మునిగి చనిపోయాడు.

అతడు ఫెడెరిగొ – గ్యుల్ఫిల చేతుల్లో మరణించిన వాడు, ఇతడు ఫారినాటా – యుగొలినో చేతుల్లో మరణించినా ఇతడి తండ్రి 'మార్జుక్కొ' హంతకుడిని క్షమించినాడు.

ఆర్సొ (Orso)ను అల్బెర్టొ చంపగా ఇద్దరి తండ్రులు – నెపొలియన్, అలెస్సాండ్రోలు ఒకరినొకరు చంపుకున్నందుకు నరకంలో మంచుపొరల కింద శిక్షననుభవిస్తున్నారు.

అసూయా, ద్వేషాలు వీరిని ఎంతకైనా తెగించేట్లు చేస్తాయి. ఫ్రాన్సు రాజుకు ఇష్టుడైన 'పైయర్ డి లాబ్రొస్సె' – వైద్యుడు, సలహాదారుడు. అతడు ఫిలిప్స్ రెండవ భార్య 'మేరీ'ని ఫిలిప్స్ మొదటి కుమారుడిపై విషప్రయోగం చేసిందని నిందించగా, ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఆమె రెండేళ్ల తరువాత ఆతడిని రాజద్రోహం నేరం క్రింద ఉరి తీయించింది.

నేను నా మార్గదర్శకుడిని అడిగాను– "నీవు నీ రచనలో పాలిన్యూరస్, ఈనియస్‌ను తనకోసం ప్రార్థించమని ప్రాధేయపడితే సిబిల్ తిరస్కరించింది కదా! స్వర్గలోకపు తీర్పు ప్రార్థనలకు లొంగదా? వీళ్ల ఆశలన్నీ నిరాశలేనా? జ్ఞానదీపమా! వివరించు!"

అతడన్నాడు– "నేను చెప్పింది దేవుని మార్గాన వెళ్లలేని ప్రార్థనల గురించి. అయినా తొందరపడి నిర్ణయాలను తీసుకోకు! సత్యాన్ని కాంతివంతం చేసే 'బియాట్రైస్' నీ మనసులోని సందేహాన్ని తీర్చగలడు. అదుగో ఆ వ్యక్తి మనం ఎటుపోవాలో చెప్పగలడు".

అతడు రాజసంగా, ఠీవిగా, కూర్చుని ఉన్నాడు. నా మార్గదర్శకుడు 'మాంటువా'లో జన్మించాడని తెలియగానే అతడు వెంటనే తన పేరు 'సొర్డెల్లో' (Sordello) అని చెబుతూ మహాకవిని ఆదరంగా కౌగిలించుకున్నాడు. తన నగరం పేరు చెప్పగానే ఎంత ఆదరం చూపిస్తున్నాడతడు! అటువంటి అద్భుత దేశం 'ఇటలీ' ఈనాడు ప్రతి కోటగోడల దగ్గరా, ప్రతి అగడ్తల దగ్గరా ఒకరితో ఒకరు చేసే యుద్ధాలతో ఆక్రందిస్తోంది.

రోమన్ చక్రవర్తి జస్టినియన్ న్యాయమిప్పుడెక్కడ నిలిచి ఉన్నది?

చర్చిని, పవిత్ర దేవాలయాలలో ఉన్న పెద్దలారా! మీ ధర్మాలను సక్రమంగా నిర్వహిస్తున్నారా? సీజర్ కివ్వాల్సినవి సీజర్‌కు, దేవునికివ్వాల్సినవి దేవునికి ఇస్తున్నారా?

జర్మన్ ఆల్బర్ట్ తన సామ్రాజ్యపు అందాల తోట 'ఇటలీ'ని సరిగా సంరక్షించు కోనందుకేగా విధి ఆతనికి అనుకూలించనిది!

గ్యుల్ఫెలు, ఘిబెల్లిన్లుగా ఇటలీ ప్రజలే ఒకరినొకరు చంపుకుంటూ రక్తపు మడుగుల్తో ఇటలీని ముంచెత్తడం న్యాయమా!

ఇప్పుడు ఇటలీ కన్నీరు కారుస్తున్నది!– "సీజర్! నీవెందుకు ఇప్పుడు నా దగ్గరలేవు?" – అని దుఃఖిస్తున్నది. అనుమతిస్తే నేను 'జోవ్' దేవుడిని ఒక్కమాట అడుగుతాను– "ఎవరు మాకోసం శిలువనెక్కినది? నీవు న్యాయ దృక్కులను వేరేవేపు ఎందుకు మళ్లించినావు? లేక మేము అర్థం చేసుకోలేని కొత్త వ్యూహాన్ని రచిస్తున్నావా?

ఇతరులు న్యాయాన్ని హృదయంలో దాచుకుంటే ఇక్కడ వీళ్లు దానిని తమ పెదాలపై ఉంచుకున్నారు.

ఓ నా 'ఫ్లోరెన్స్'! నీవు ధనవంతురాలివే! కాని ఏథెన్స్, లేస్ డిమాన్ నగరాల్లోని ఋజు ప్రవర్తన, న్యాయశీలత నీలో లోపించింది. అక్టోబర్ నెలలో నేసిన వస్త్రాన్ని నవంబరులో విప్పేస్తావు. శాసనాలను న్యాయసూత్రాలను, నాణేలను, ఆచారాల్ని ఎన్నిసార్లు మార్చావో గుర్తుందా!

గుర్తుంటే నిన్ను నీవు ఆ జబ్బుపడిన స్త్రీలా, సుతిమెత్తని ఈకల పరుపుపై పరుండి, విశ్రాంతి లేక, నిద్రరాక, అటుయిటు పొర్లుతూ, నీ బాధను మరచిపోయే ప్రయత్నం చేస్తావు!

**Canto - 7**

**రాత్రి సమయం కావస్తుంది. సొర్డెల్లో వీరిని కొండలోనే తొలిచిన ఓ ఉద్యాన వనంలోకి తీసుకువెళ్తాడు. అక్కడ మహారాజులు, చక్రవర్తుల ఆత్మలు తిరుగాడుతున్నాయి.**

# చక్రవర్తులు, రాజుల ఆత్మలు తిరుగాడే చోటు

ఏడుసార్లు ఒకరినొకరు స్వాగతించుకున్నాక 'సొర్డెల్లొ' మీరెవరు? అని అడిగాడు. నా మార్గదర్శకుడన్నాడు– "ఈ ప్రక్షాళనా పర్వతం లేకమునుపే నా ఎముకలను ఆక్టేవియస్ చక్రవర్తి సమాధి గావించాడు. నాపేరు 'వర్జిల్'. నేను చేయని పాపానికి, దేవునిపై విశ్వాసం లేనందుకు నాకు స్వర్గంలోకి ప్రవేశించే అనుమతి లభించలేదు"

'సొర్డెల్లో' ఆనందాశ్చర్యాలతో అన్నాడు– "లాటియంకు కీర్తితెచ్చినవాడా! మన మాతృభాషకు ఎనలేని ఖ్యాతిని అందించినవాడివి. నా జన్మభూమికి గౌరవాన్ని సంపాదించినవాడివి. నా భాగ్యవశాన నిన్ను కలుసుకున్నాను. అయినా నా సందేహం ఏమిటంటే మీరు ఆ చీకటిలోకంలోంచి ఎందుకు వచ్చారు?"

వర్జిల్ సమాధానమిచ్చినాడు– "నరకలోకపు అన్నివలయాలను తిరిగి స్వర్గలోకం నాకు ఇచ్చిన అనుమతితో ఇటు వచ్చాను. దగ్గర్లో నరకయాతనలు లేని ప్రదేశమున్నది. దుఃఖభరితమై ఉన్న దానిలో నేను పవిత్రస్నానం కాకముందే మృతిచెందిన చిన్నపిల్లల్తో కలిసి ఉంటాను. ఆ పిల్లలకు విశ్వాసం, ఆశ, దయ (Faith, Hope, Charity)తో కూడిన వస్త్రాలింకా తొడగబడలేదు. కాని వివేకం (Prudence), న్యాయం (Justice), స్థైర్యం (Fortitude), ఆత్మనిగ్రహం (Temperance) వారికి తెలియును. మీకు వీలైతే పర్గేటరీ (Purgatory - ప్రక్షాళనా లోకానికి) వెళ్లే దగ్గరి దారి చూపించగలరా!"

'సొర్డెల్లో' అన్నాడు– "ఇక్కడ మాకు ప్రత్యేకించి ఒక స్థానమంటూ లేదు. నేను ఇలా పైకి క్రిందకు వెళ్లి వస్తూ ఉంటాను. మీకు నేను ఈ లోకంలో మార్గదర్శకుడిగా ఉండగలను. అది నాకు సంతోషదాయకమే! ఇప్పుడు చీకటి పడనున్నది. రాత్రివేళల ప్రయాణం విరమించి విశ్రాంతి తీసుకోండి!"

వర్జిల్ అడిగాడు– "రాత్రిపూట ప్రయాణానికి అభ్యంతరమేవిటి?"

సొర్డెల్లో– "సూర్యుడు అస్తమించాక ఈ గీత దాటుట నిషేధించడమైనది. చీకటి పడినాక ప్రయాణీకులు అయోమయస్థితిలో దారి తప్పకుండా ఈ జాగ్రత్త!"

వర్జిల్– “అయితే మమ్మల్ని ఈ రాత్రికి కాస్త ఆహ్లాదకరమైన ప్రదేశానికి తీసుకువెళ్ళగలవా!”

అతడు మమ్మల్ని దగ్గర్లో అందాల వనమున్న లోయలోకి తీసుకువెళ్ళినాడు. తళతళలాడ్తున్న బంగారం, వెండి, ఎర్రటిపొడి, తెల్లసీసం, ఇండియన్ లిగ్నైట్, ఆకుపచ్చని మరకతాల్లా విరగబూసిన పూలు, ఆకుపచ్చని పచ్చిక, అద్భుతమైన సువాసనలతో ఆ వనం అతి మనోహరంగా వున్నది.

అక్కడ అత్యున్నత స్థానంపై కూర్చుని ఉన్నది రుడాల్ఫ్ చక్రవర్తి. ఆతడు కాస్త జాగ్రత్త వహించి ఉంటే 'ఇటలీ'కి నేటి దురవస్థ తప్పేది. అతని పక్కనే ఉన్నది 'ఒట్టొకార్–2' బొహెమియా రాజు– రుడాల్ఫ్ చేతిలో మరణించినవాడు. ఒట్టోకార్ కుమారుడు వెన్‌సెస్‌లార్ – రుడాల్ఫ్‌తో సంధి కోరినాడు. ఆ చిన్ని ముక్కున్నవాడు ఫ్రాన్స్ రాజు ఫిలిప్–3, ఇతడు పెడ్రొ–3 అరగాన్ రాజు చేతిలో ఓడిపోయి – ఫ్రాన్సు చిహ్నం 'లిల్లీ' పూవుకు అవమానం తెచ్చినాడు. అతని స్నేహితుడు నవారె రాజు హెన్రీ–1; ఫ్రాన్సుకు చీడలాంటివాడు ఫిలిప్–4 అతడు పెడ్రొ–3, ఛార్లెస్‌ను ఓడించినవాడు. 'అన్‌జో'కు చెందిన ఛార్లెస్, మాన్‌ఫ్రెడిని (ఫ్రెంచి రాజును) ఓడించినాడు. అతడు చిన్న పెడ్రొ; అక్కడ సిసిలీరాజు జేమ్స్–2, సాధారణ జీవితం గడిపిన ఇంగ్లాండ్ రాజు హెన్రీ–3; అందరికంటే క్రింద కూర్చున్నవాడు 'విలియం' – అతని వల్లనే అలెగ్జాండ్రియన్లతో యుద్ధం, ఆ యుద్ధంలో ఓడిపోయిన 'విలియం' (Guighlielnao)ను పంజరంలో ఉంచి ఆతడు చనిపోయేంతవరకు పదిహేడు నెలల పాటు కౄరమృగాన్ని చూపినట్లు వీధుల్లో ప్రదర్శించారు. ఆ తరువాత ఆతని కుమారుడు గియొవాన్ని–1 మోన్ ఫెర్రాటొ, కనావెసె పట్టణ యోధులతో కలిసి అలెగ్జాండ్రియన్లతో యుద్ధం చేసి మోన్‌ఫెర్రాటేను కోల్పోయాడు.

## Canto - 8

**ఇద్దరు దేవదూతలు జ్వాలాఖడ్గాలు ధరించి ఆ లోయను కాపలా కాయడానికి వస్తారు. సొర్దెల్లొ, వర్జిల్, డాంటీలకు 'గల్లురా' న్యాయాధిపతి 'నినొ' కనిపిస్తాడు. ధృవందగ్గర మూడు ప్రకాశవంతమైన నక్షత్రాలు ప్రత్యక్షం కాగా అదే సమయంలో ఓ దుష్టసర్పం ఆ లోయలోకి ప్రవేశించి దేవదూతలు వస్తున్నారని తెలియగానే మాయమవుతుంది.**

# దేవదూతలను చూసి పారిపోయిన సర్పం

అది సముద్రంలోకి వెళ్లిన నావికులు తిరుగుముఖం పట్టే సమయం. వారి మనసంతా ఎప్పుడింటికి చేరుతామా బంధుమిత్రులతో కాలం గడుపుదామా అనే ఉంటుంది. దూరంగా పగటి సమయం అయిపోతుందన్న బాధతో సంతాపాన్ని ప్రకటిస్తున్నట్లు గంటలు మోగుతున్న ధ్వని. కొత్త బాటసారిలో నూతన ఉత్తేజం.

అక్కడ ఉన్న ఒక ఆత్మ మాకేసి సంజ్ఞలు చేస్తూ ఆకాశం వేపు చేతులు జోడించి– "I care for nothing else" - 'Te lucis ante' - అని మంద్రస్వరంతో ప్రార్థిస్తున్నాడు. అక్కడ ఉన్న మిగతా ఆత్మలు ఆ సామూహిక ప్రార్థనలో తమ గొంతును కలిపాయి.

అదే సమయంలో ఆకాశం నుంచి ఇద్దరు దేవదూతలు తమ జ్వాలాఖడ్గాలు (మొనలు విరిగినవి) అత్యంత ప్రకాశవంతంగా వెలుగుతుండగా, లేత ఆకుపచ్చని చిగురుటాకుల రంగులో వారి దుస్తులు మెరుస్తుండగా వారు లోయకు ఇరువైపులా ఉన్న కొండలపై దిగినారు.

'సొర్దెల్లొ' అన్నాడు– "వాళ్లు 'మేరీమాత' పంపగా ఈ లోయను కాపలా కాయడానికి వచ్చినారు. దుష్టసర్పం ఇటు వచ్చే సమయమైనది"

నాకు భయం వేసింది. నేను వర్జిల్‌కు దగ్గరగా జరిగాను. 'సొర్దెల్లొ'ను అనుసరిస్తూ మూడు మెట్లు దిగి మేము లోయలోకి ప్రవేశించాము. నాకెదురుగా నా మిత్రుడు న్యాయాధిపతి 'నినొ' – అతడు వెంటనే అడిగాడు– "ఈ సుదూర ప్రయాణం నీవెలా చేయగలిగినావు?"

నేనన్నాను– "విషాదలోకాన్ని దాటి ఈరోజు ఉదయమే ఇటు వచ్చాను. ఇంకా నేను నా తొలి జన్మలోనే వున్నాను. బహుశా ఈ ప్రయాణం తరువాత రెండోది లభ్యమవుతుంది"

నా మాటలు వినగానే 'నినొ', సార్డెల్లోలు ఆశ్చర్యపోయి ఒక అడుగు వెనక్కి వేసినారు. 'నినొ' పెద్దగా కేకపెట్టి – "కర్రాడో! (Currado)! దేవుని మహిమ చూడు!" అని నాతో– "నీవు భూలోకానికి తిరిగి వెళ్లినపుడు నా కుమార్తె గియొవాన్నా (Giovanna)ను నాకోసం ప్రార్థనలు చేయమను. ఆమె తల్లి (బియాట్రైస్ - Beatrice) ఇంకా తెల్లని దుస్తులను, ముసుగును (వైధవ్య సూచకమైనవి) ధరిస్తున్నదనుకోను. స్త్రీల ప్రేమలు క్షణికాలే! స్పర్శతోనో, కంటిచూపుతోనే ఎప్పటికప్పుడు వెలిగించకపోతే ఆ ప్రేమాగ్ని చప్పున చల్లారిపోతుంది. ఆమె ఇప్పుడు సర్పకేతనపు మిలనీస్ 'గలియాజ్జో' చెంత ఉన్నది కదా. ఆమెకు తెలియజేయి. నా 'గల్లురా' కోడిపుంజు పతాక ఇచ్చిన రక్షణ ఆ సర్పం ఇవ్వలేదు!" అని అతడు నిశ్శబ్దం వహించాడు.

నన్ను ఆకాశంలో వెలుగుతున్న మూడు నక్షత్రాలు ఆకర్షించాయి. వర్జిల్ వివరించాడు – ఆ మూడు తారలు విశ్వాసం, దయ, ఆశ (Faith, Charity, Hope) నీవు ఉదయం చూసిన – వివేకం (Prudence), న్యాయం (Justice), స్థైర్యం (Fortitude), ఆత్మనిగ్రహం (Temperance)ల స్థానంలో ఇప్పుడున్నాయి.

'సొర్డెల్లో' అటు చూపించాడు– "వర్జిల్! అటుచూడు! మన శత్రువు!"

అక్కడ కాపలా లేని ప్రాంతంలో బహుశా ఈవ్ (Eve)కు నిషిద్ధ ఫలాన్ని రుచి చూపించిన సర్పం, ఆకుపచ్చని పచ్చికపై, పూలమధ్య మెరుస్తూ, మెలికలు తిరుగుతూ, తల వినక్కు తిప్పి వీపును నాకుతూ, వడివడిగా పాకుతున్నది.

అదే క్షణంలో దేవలోకపు గరుడపక్షులు, డేగలు ఆ సర్పం వేపు దూసుకురాగా అది క్షణాల్లో అక్కడి నుంచి పారిపోయి తప్పించుకున్నది.

ఇంతలో 'కర్రాడొ మలస్పినా' మా వద్దకు వచ్చినాడు. అతడన్నాడు– "నేను ప్రఖ్యాతిగాంచిన 'కర్రాడో' మనవడిని. ఇక్కడి స్వచ్ఛమైన ప్రేమలోకం ఎంతో బాగున్నది"

నేనన్నాను– "మీ కుటుంబపు పేరు ప్రతిష్ఠలు యూరప్‌లో తెలియని వారెవ్వరు? నేను వాగ్దానం చేస్తున్నాను! నేను భూలోకం వెళ్లిన పిమ్మట శౌర్యం, ధనం ఉన్న మీ కుటుంబానికి, క్రూరత్వానికి మోసానికి దూరంగా ఉండే మీ వంశీకులకు కీర్తి ప్రఖ్యాతులు దక్కేలా చేస్తాను.

అతడన్నాడు– "మంచిది. ఏడు రోజులు గడిచేలోపులోనే మేషపు (Aries) నాలుగు కాళ్లు ఒప్పందపు నాలుగు మూలలా అదిమి ఈ మాటలు నీ మనస్సులో నిలుచునుగాక! దైవాజ్ఞచే నీ మనసు నుండి ఈ స్థిరభావాన్ని ఇంకే విషయమూ తొలగించకుండును గాక!"

## Canto - 9

**నిద్రపోతూ కలలుగంటున్న డాంటేను 'ల్యూసియా', పర్వతం మీదకు తీసుకువెళ్తుంది. మెలకువ వచ్చిన డాంటే తాను ప్రక్షాళనాలోకపు ద్వారం దగ్గర వర్జిల్‌తో ఉండటాన్ని గమనిస్తాడు. దేవదూత అనుమతితో లోనికి ప్రవేశిస్తారు.**

# పర్గేటరీ గేటును తెరిచే రెండు తాళపు చెవులు

అరోరా దేవత తన ప్రియుడు టిధొనస్ కౌగిలి వదిలి తూర్పు వాకిలిని ప్రకాశవంతం చేసింది. ఆమెకు అభిముఖంగా ఆకాశాన నక్షత్ర దీపాలింకా వెలుగుతూనే ఉన్నాయి. తన తోకకున్న విషపుకొండితో మానవుల్ని వణికించే వృశ్చికంలా నక్షత్రరాశి ప్రకాశిస్తున్నది. ప్రక్షాళనా లోకం వద్ద రాత్రి రెండడుగులు ముందుకు వేసి మూడో అడుగులో ఉండగా ఆదాం వంశీకుడనని కాబోలు నిద్ర నన్ను ముంచెత్తుకు వచ్చింది. వర్జిల్, సొర్డెల్లో, నినొ, కర్రాడోలు మేం అయిదుగురం కూర్చునివున్న చోటే నేను కునికిపాట్లు పడసాగాను.

'స్వాలో' పక్షి తన గతజన్మ స్మృతులను గుర్తు తెచ్చుకుంటూ విషాద గీతాలను ఆలపిస్తున్నది. శరీరాన్ని వదిలి ఆత్మ దివ్యలోకాల వేపు తిరుగాడుతున్నట్లు కలలో నాకు ఓ గరుడపక్షి (Eagle) బంగారు ఈకలతో ప్రకాశిస్తున్నది. రెక్కలు చాచి ఎగురుతూ కనిపించినది.

గనిమెడి (Ganymede)ను తల్లిదండ్రుల నుంచి పైలోకాలకు తీసుకు పోయిన గ్రద్ద ఇదేనేమోనని నేను అనుకుంటుండగానే, అది వలయాలుగా తిరుగుతూ, తిరుగుతూ అకస్మాత్తుగా నావేపు దూసుకువచ్చి నన్ను అగ్నిజ్వాలల్లోకి తీసుకుపోగా నా శరీరమంతా వేడిమంటలతో దహించబడ్తున్నట్లనిపించి నేను చప్పున నిద్ర మేల్కొన్నాను.

నిద్రపోతున్న 'ఎఖిల్లిస్' (Achilles)ను ఆతని తల్లి 'చిరాన్' దగ్గర్నుంచి ఎత్తుకునిపోయి 'స్కిరాస్ ద్వీపంలో దాచినట్లు, నేను మెలకువ రాగానే ఎక్కడున్నానో అర్థంకాక భయపడి మంచుముక్కలా చల్లబడ్డాను.

నా మార్గదర్శకుడన్నాడు– "భయం వద్దు. మనం పర్గేటరీ వద్దకు వచ్చినాము. ఆ ప్రాకారాన్ని చూసావా, దాని మధ్యన కొంత దారి – అటే మనం వెళ్లబోతున్నాము. నీవు పచ్చని పచ్చికపై పూలమధ్య విశ్రాంతి తీసుకుంటున్నపుడు మా వద్దకు ఓ 'దివ్యస్త్రీ' వచ్చి ఇలా అన్నది– "నాపేరు ల్యూసియా! నిద్రపోతున్నవాడిని నేను అతని దారిలో తీసుకువెళ్తాను" – సొర్డెల్లో, నినొ, కర్రాడోలు అక్కడే ఆగిపోయినారు. ఆమె నిన్ను తీసుకుని ఇటు రాగా, నేను ఆమెను అనుసరించాను"

నా భయసందేహాలు తీరి నేను మామూలు మనిషినైనాను. అక్కడి గోడలో ఓ పగులు కనిపించింది. దాని పక్కనే ఓ ద్వారం, మూడు వేర్వేరు రంగుల మెట్లున్నాయి. పై మెట్టు మీద కూర్చుని ఉన్న వ్యక్తి చేతిలో తళతళ మెరుస్తున్న ఖడ్గం వున్నది. అతడన్నాడు– "అక్కడే ఆగి మీరెవరో పరిచయం చేసుకోండి!"

మహాకవి అన్నాడు– "ఇప్పుడే ఒక దివ్యస్త్రీ మమ్మల్ని ఈ గేటువద్ద వదిలి వెళ్లింది"

అతడు– "అవునా! అయితే మంచితనపు మార్గంలోకి మీకు స్వాగతం!" అన్నాడు.

మొదటి మెట్టు – పాలరాతితో చేయబడి వున్నది. దానిలో నా ప్రతిబింబం స్పష్టంగా కనబడింది.

రెండవ మెట్టు – ముక్కలు కాబోతున్నట్లు, గరుకుగా, ముదురు ధూమ్రవర్ణంలో ఉన్నది.

మూడవది – ముదురు ఎరుపురంగులో, రక్తవర్ణంతో ఉన్న పెద్ద రాయి, విశాలంగా వున్నది.

మొదటి మెట్టుపై ఎడమాంటైన్ (Adamantine) శిలతో చేయబడిన గుమ్మంపై కూర్చున్న దేవదూతకు నా మార్గదర్శకుడి సూచనతో సాష్టాంగ ప్రణామం చేసి, నా రొమ్ములపై మూడుసార్లు చేతితో తట్టుకుని నమస్కరించాను.

అతడు నా నుదుటిపై ఏడు 'P' లను తన (Seven 'P's = Seven sins = Seven Peccata - ఏడు పాపాలు) కత్తిమొనతో లిఖించి నీవు లోపలికి వెళ్లినాక ఈ గాయాలను తుడిచివేయి సుమా!" అన్నాడు.

మట్టిరంగు ఉన్న (బూడిద) తన అంగీలోపల నుంచి ఆతడు రెండు తాళపు చెవులను తీసినాడు. ఒకటి బంగారపుది, రెండవది వెండిది. ముందు తెల్లటి దానితో, తరువాత పసుపు తాళం చెవితో తీస్తూ 'వీటిల్లో ఏ తాళం చెవి పనిచేయకపోయినా తలుపు తెరవబడదు ' – అని ఆ దేవదూత నా సందేహ నివృత్తి చేసాడు. ఒకటి విలువైనది, మరొకటి నైపుణ్యంతో చేయబడినది. వీటిని నాకు 'సెయింట్ పీటర్' ఇచ్చాడు" అని తలుపులు తెరుస్తూ అన్నాడు– "వినండి! ఎవరైతే వెనక్కి తిరిగి చూస్తారో వాళ్లు మరల గేటు వెలుపలకు నెట్టబడతారు!"

ఆ తలుపులు తెరుచుకుంటూ చేసిన శబ్దం – టార్పియన్ కొండపై రోమన్ల ధనాగారాన్ని సీజర్ బలవంతంగా తెరిపించినప్పుడు (మెలిటస్ వద్దన్నా వినకుండా) చేసిన ధ్వనులకన్నా భీకరంగా ఉన్నది.

మేము లోపలికి వెళ్తున్నపుడు – Te Deum Candamaus - అనే దైవప్రార్థన మంద్రంగా, చెవులకింపుగా వినబడగా మేము అటే వెళ్లినాము.

**Canto - 10**

**ప్రక్షాళనా పర్వతపు మొదటి వరండా (Terrace-1) పర్వతానికి రెండువైపులా ఉండి, తెల్లటి చలువరాయిలో చెక్కబడిన శిల్పాలు చూపరులను ఆకట్టుకున్నాయి. నమ్రత, వినయం (Humility) ఉట్టిపడుతున్న ఆ శిల్పాలను మెచ్చుకుంటున్న మహాకవులకు తమ గర్వానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటూ పెద్దపెద్ద రాళ్లను మోస్తున్న ఆత్మలు కనిపించాయి.**

## గర్వాంధులకు శిక్షలు (The Prideful - Terrace-1)

నా వెనుకనే ద్వారం మూయబడిన చప్పుడైంది. వెనక్కి తిరిగి చూసేందుకు వీలు లేదుకదా! మేము వెళ్తున్న దారి, ఉధృతంగా ముందుకుపోయి వెనక్కి మరల్తున్న అలల్లా రెండు కోసురాళ్ల మధ్య నుంచి పోతున్నది. ఆ సూది బెజ్జం నుండి బయటపడి కాసింత ఖాళీప్రదేశంలోకి వచ్చినాము. అది ఎడారిలా నిర్మానుష్యంగా ఉండి, ముగ్గురు మనుష్యుల వెడల్పుండి నాకు కుడి ఎడమ పక్కల చాలాదూరం ఉన్నట్లనిపించింది.

దారి పక్కన తెల్లటి చలువరాయితో చేయబడిన శిల్పాలు– శాంతి ఒప్పందాన్ని తీసుకువచ్చిన గాబ్రియెల్ దేవదూత, - Ave-hail అన్నట్లుండగా, కన్నీళ్లతో ప్రార్థిస్తున్న మానవులు, పక్కనే ప్రేమలోకపు ద్వారాన్ని తెరచిన స్త్రీమూర్తి – "Ecce ancilla Dei - Behold the hand maid of the Lord) ఆ సజీవ శిల్పాన్ని చూసి మైమరచిపోతుండగా, నా మార్గదర్శకుడన్నాడు– "ఒకచోటనే ఆగిపోకు!"

నేను పక్కనే ఉన్న శిల్పం వేపు చూసాను– మేరీమాత పక్కనే పవిత్ర 'ఆర్క్'ను మోసుకుని వస్తున్న ఎద్దులబండి, ఏడు బృందాలుగా అనుసరిస్తున్న జనం – నాలో ఒక సందేహం వాళ్లు గానం చేస్తున్నారు – లేదు – ఆ బండి ముందు నృత్యం చేస్తూ పాటలు పాడుతున్న గాయకుడు (డేవిడ్) రాజఠీవితో ఉన్నాడు.

రాజభవనపు కిటికీలోంచి చూస్తున్న మిఛల్ – ఆమె చూపులలో దుఃఖం, తిరస్కారం; – పక్కనే మరో శిల్పంలో – ట్రాజాన్ చక్రవర్తి దుఃఖిస్తున్న ఒక పేద విధవరాలిపై చూపిన దయ; చక్రవర్తి చుట్టూరా రాజలాంఛనాలతో అశ్వికులు, పైన ఎగుర్తున్న గరుడ పక్షులు – ఆమె అంటున్నది – "ప్రభూ! నా కుమారుడిని చంపి, నాకు హృదయశోకం కలిగించినవాడిని శిక్షించు". అతడంటున్నాడు– "నేను తిరిగి వచ్చేవరకు నిరీక్షించు!" – ఆమె– "ఒకవేళ నీవు రాకపోతే!"

అతడు– "నా స్థానాన్ని పొందిన వ్యక్తి ఈ వాగ్దానాన్ని నెరవేరుస్తాడు".

ఆమె– “నీ మంచితనాన్ని నీవు మరిస్తే ఇతరుల మంచితనానికి విలువేమిటి?”

అతడు– “నేను పోయేలోపల నీకిచ్చిన మాటను నిలబెట్టుకుంటాను” ఆ సజీవ శిల్పాలు ఈ సంభాషణను పలుకుతూ మహాశిల్పి పాలిక్లెటస్ (Polycletus) శిల్పాలకన్నా, ప్రకృతి సహజసిద్ధమైన శిల్పాలకన్నా మనోహరంగా ఉండి జీవకళను ఉట్టిపడుతున్నాయి.

నా మార్గదర్శకుడన్నాడు– “ఎవరో వస్తున్నారు. వారు మనమిక్కడ నుండి పైకివెళ్లే దారి గురించి చెబుతారు”

నేనన్నాను– “ప్రభూ! ఆ వచ్చేవాళ్లు మనుషుల్లా అనిపించడం లేదు. నా చూపు మందగించిందో ఏమో, ఏదీ స్పష్టంగా లేదు”

క్రైస్తవులారా! అలసటతో, దుఃఖంతో, మూర్ఖత్వంతో జ్ఞానం నశించి, దృష్టి నీరసించి మీ నమ్మకాల్ని వెనక అడుగులవేపుంచుతున్నారు. మీకు తెలియదా మనం సీతాకోక చిలుకల్లా మారాల్సిన గొంగళి పురుగులమని, రక్షణలేక ఎగుర్తూ ప్రభువు తీర్పుకోసం ప్రయాణించాలని? పురుగు రూపంలో ఎగరాలనే ప్రయత్నం సబబేనా! ఎందుకు మీకీ గర్వం?

మోకాళ్లు దాదాపు వాళ్ల రొమ్ముల వేపు వచ్చినంత వంగి కొందరు ఎక్కువ, కొందరు తక్కువ బరువైన గండశిలల్ని మోస్తూ వాళ్లు అతి భారంగా ముందుకు కదుల్తున్నారు. వాళ్లలో అత్యంత సహనపరుడైన వాడుకూడా కన్నీళ్లతో ఇలా అంటున్నట్లు నాకనిపించింది– “నేనింక ఈ భారాన్ని మోయలేను!”.

## Canto - 11

**వర్జిల్ పై ఆవరణకు వెళ్లేదారిని తెలుపమని ఆత్మలను ప్రార్థించినాడు. ఒంబెర్టొ అనేవాడు సమాధానమిచ్చినాడు. ఒడెరిసి అనేవాడు ఇహలోక కీర్తికాంక్ష అనే మాయ గురించి చెప్పి ప్రొవెంజన్ సాల్వానిని చూపిస్తాడు.**

# ఇహలోక కీర్తికాంక్ష అనే మాయ (Vanity)

"తండ్రీ! స్వర్గలోక నివాసా! నీ తొలి సృష్టిపై ప్రేమతో అక్కడ ఉంటున్న దానికే నీవు పరిమితమైనవాడివి కాదు కదా! నీ నామము, నీ సర్వవ్యాపకత్వము ప్రతి జీవజంతువుచే వేనోళ్ల పొగడబడును గాక! నీ రాజ్యము యొక్క శాంతి మమ్ములను సమీపించుచున్నది, అది మా వద్దకు చేరనియెడల సర్వశక్తులను ఒడ్డినా మా అంతట మేము దానిని చేరలేము కదా!

దేవదూతలు 'హోసన్నా'లను పాడి తమ ఇచ్ఛాశక్తులను నీ కర్పించినట్లు, మానవులునూ అలానే చేయుదురుగాక! మాకు ప్రతిరోజూ నీ కృపాన్నము 'మన్నా'ను ప్రసాదించుము, లేకున్న కష్టపడి ముందుకు పోవువాడు వెనకబడును.

మా శక్తిసామర్థ్యములను పరీక్షకుబెట్టక, మా ప్రాచీన విరోధి కుతంత్రాలకు లొంగకుండేట్లు ఆశీర్వదించుము తండ్రీ! ఈ ఆఖరి కోరిక మా గురించి కాక, మేము ఆ లోకమందు వదిలి వచ్చిన వారి గురించిగా భావించుము ప్రభూ!"

ఆ ఆత్మలు తమపై భారాన్ని మోస్తూ ఆ మొదటి ఆవరణ చుట్టూరా తిరుగుతూ భగవంతుని ప్రార్థిస్తున్నారు.

వాళ్లు మన గురించి అక్కడ అలా ప్రార్థిస్తున్నపుడు మనం కూడా వాళ్ల విముక్తికి దేవుని ప్రార్థించవలెను కదా! వారు ఈ లోకం నుంచి మోసుకువెళ్లిన మచ్చలను, మలినాన్ని కడిగి వారు స్వచ్ఛమైన, కాంతివంతమైన ఆత్మలుగా నక్షత్ర లోకానికి పోయేటందుకు మనం సహకరించాలి.

"న్యాయము, కరుణ మీ బరువులను తొలిగించును గాక! ఓ ఆత్మలారా! పై ఆవరణకు వెళ్లడానికి దగ్గర దారి తెలుపగలరా! నాతోటి ప్రయాణీకుడు ఇంకా సశరీరుడే! అదే అతని అధిరోహణకు ఆటంకమవుచున్నది'' అన్నాడు నా మార్గదర్శకుడు.

ఆ ఆత్మలలో ఒకడు మాకు సమాధానమిచ్చాడు– "మీరు మాతో వస్తే కుడివేపున ఉన్న సులభ మార్గమును చూపించగలను. నాపేరు ఓంబర్టొ (Omberto).

నా తండ్రి గ్విగ్నిఎల్మో. మా పూర్వీకుల కీర్తిప్రతిష్ఠలు నా తలకెక్కి నేనెవరినీ లెక్కచేసే వాడిని కాదు. గర్వం సర్వం చెరుచునన్నట్లు నా గర్వం, అహంకారం, సియనీస్ (Sienese)పై ఉన్న విరోధం చివరకు నా మరణానికి, మా వంశ పతనానికి దారి తీసినాయి. నేను బతికున్నపుడు తలదించలేదు కనుక ఇప్పుడు ఈ బరువును మోస్తూ తలదించుకుని ప్రభువు కరుణకై ఎదురుచూస్తున్నాను"

ఇంకొక ఆత్మ నన్ను గుర్తుపట్టి పిలువగా నేను ఆతడికి సమాధానమిచ్చాను– "ఒడెరిసీ! గుబ్బియో కీర్తిపతాకమా! పారిస్‌లో నీ చిత్రకళకున్న పేరు అపారమైనది కదా!"

అతడన్నాడు– "నా చిత్రాలకన్నా 'ఫ్రాంకొ' చిత్రాలు బాగుంటాయి. కాని ఆ రోజుల్లో నేను గర్వాంధుడనై, పేరు కోసం తపన పడేవాడిని. ఆ గర్వానికే ఈ శిక్ష నేడనుభవిస్తున్నాను.

మానవుని శక్తి వెలుగులు తాత్కాలికములు. అవి కొండపై పచ్చిక వంటివి. చిత్రకళలో మొన్న సిమాబ్యు, నేడు గియొట్టొ, రచయితల్లో నిన్న గిడొ – నేడోరేపో అతడిని అధిగమించేవాడు వస్తాడు. ఈ పేరు ప్రఖ్యాతులనేవి అప్పుడప్పుడు వీచే వాయు వీచికల్లాంటివి. దారిలో పేర్లు మార్చుకుంటాయి. భూలోకంలో వెయ్యేళ్లు వేరే గ్రహంలో కనురెప్పపాటుతో సమానం కావచ్చును. చిన్నపిల్లాడిగా మాట్లాడు తున్నప్పుడు చనిపోయినదానికన్నా పండితుడవై చనిపోతే గొప్ప కీర్తి మిగుల్తుందని అనుకుంటున్నావా!

అదుగో అతడు మా అందరికన్నా ముందు నెమ్మదిగా, భారంగా నడుస్తున్నాడు. తన స్నేహితుడిని, ఛార్లెస్ చెరసాల నుంచి విడిపించడానికి నాలుగు రోడ్ల కూడలిలో అందరినీ ధనం అర్థించినవాడు, సియనా నాయకుడు, ఫ్లోరెన్స్‌ను సర్వనాశనం చేయాలనుకున్నవాడు, ఆ రోజుల్లో ఘిబెల్లైన్లు అధికారంలో ఉన్నంత కాలం గొప్ప అధికారంలో ఉన్నవాడు, చివరకు 'గ్యల్ఫి'ల చేతిలో మరణించినాడు. అతడే ప్రొవెంజన్ సల్వాని"

నేనన్నాను– "అతడు పశ్చాత్తాపపడలేదే, మరి ఇక్కడికెలా వచ్చాడు?"

అతడన్నాడు– "తన స్నేహితుడి కోసం అతడు పడ్డ తపన అతడిని ఇక్కడకు చేర్చింది".

## Canto - 12

**మొదటి ఆవరణలో గర్వాంధులకు విధించబడిన శిక్షలను ఉదాహరణలుగా పదమూడు శిల్పాలు కనిపిస్తాయి – సాతాను, బ్రియారియస్, జెయంట్సు, నిమ్రాడ్, నియొబి, సాల్, అరాఖ్నె, రెహొబొమ్, ఎరిఫైలి, సెన్నాఛెరిబ్, సైరస్, హోలోఫెర్నెస్, ట్రాయ్ – వినయమూర్తి అయిన దేవదూత బాటసారులను రెండవ ఆవరణలోనికి తీసుకువెళ్తాడు. ముక్తిలో తొలిఘట్టం పూర్తికాగా డాంటీ నుదుటిపైని ఒక 'P' తొలిగిపోతుంది.**

# గర్విష్ఠులకు ఉదాహరణలు

కాడికి కట్టబడిన ఎద్దుల్లా నేను ఆ భారమును మోస్తున్న వ్యక్తితో సరిసమానంగా నడుస్తుంటే నా మార్గదర్శకుడన్నాడు– "అతడిని వదిలి ముందుకుపో! ఎవరి పడవను వాళ్లే తమ శక్తులతో, తెడ్లతో, తెరచాపలతో తోసుకుపోవాలి!" – నేను వంగివున్నవాడిని నిటారుగా నిలబడి ఆ వ్యక్తిని వదిలి నా మార్గదర్శకుడి వేపు రాగా ఆతడన్నాడు– "నీవు ఇప్పుడు నీ పాదాలకింద ఉన్న నేలను చూడు". నేలపై– సమాధుల పైకప్పుపైన, శవపేటికల మూతలపైన ఉండే శిల్పాల్లా, చిత్రాల్లా, మృతులకు స్మృతులుగా చెక్కబడిన మూర్తులున్నాయి.

స్వర్గం నుండి మెరుపులా తలకిందులుగా పడ్తున్న 'సాతాన్' (Satan) దివ్యబాణం దిగబడిన 'బ్రియారియస్' (Briareus) ఆతడి పతనాన్ని చూస్తూ నిలబడిన థింబ్రియాస్, అపోలో, మార్స్, పల్లాస్, జోవ్‌లు; షినార్‌లో బాబెల్ గోపురాన్ని నిర్మించిన 'నిమ్రాడ్' (Nimrod), గందరగోళపు భాషల్లో అక్కడి ప్రజలు; థెబెస్ రాజు ఏంఫియాన్ భార్య 'నియొబి' (Niobe) తనకు ఏడుగురు కొడుకులు, ఏడుగురు కుమార్తెలున్నారు. అందుకని లాటొనా దేవతకన్నా గొప్పదానిని అని గర్వించి పలుకగా, లాటొనా పిల్లలు డయానా, అపోలోలు 'నియోబి' సంతానాన్ని చంపివేసినపుడు ఆమె కళ్ల నుండి ధారాపాతంగా కురుస్తున్న కన్నీరు ప్రవాహంగా మారిన దృశ్యం.

ఇజ్రాయెల్ మొదటి రాజు 'సాల్' (Saul) దేవుని ధిక్కరించి, గర్వాంధుడై, చివరకు శత్రువుల చేతిలో పరాజయం పొంది, గిల్బొవా పర్వతంపై కత్తితో పొడుచుకుని మరణించగా డేవిడ్ విలపిస్తూ, ఆ పర్వతంపైన, మంచువాన కురియరాదని శాసించిన దృశ్యం;

అరాఖ్నె (Arachne) తనలా వస్త్రాలనెవ్వరూ నేయలేరని గర్వంతో, ఎథెనాను సవాలు చేయగా ఆమె అరాఖ్నె నేసిన వస్త్రాన్ని చింపి, కండెతో నానా భీభత్సం

సృష్టించగా 'అరాఖ్నె' ఉరివేసుకుని మరణించింది. ఎథెనా ఆమెను 'సాలెపురుగుగా', ఉరితాడును సాలెగూడుగా మార్చిందని ఐతిహ్యం.

సొలొమాన్ కుమారుడు రెహొబోమ్ (Rehoboam) ఇజ్రాయెలు లను హీనంగా చూసి తిరుగుబాటుకు గురై పారిపోయిన దృశ్యం –

ఏంఫియారస్ భార్య 'ఎరిఫైలి' (Eriphyle) ఒక కంఠహారం (Necklace) కోసం తన భర్త దాగున్న రహస్య స్థావరాన్ని శత్రువులకు వెల్లడిచేసి ఆతని మరణానికి కారణం కాగా, ఆతని పుత్రుడుఅల్కమీన్ ఆమెనుచంపిన కథ –

అస్సిరియా దేశపు నియంత 'సెన్నాఛెరిబ్' (Sennacherib) 'జూదా' పై యుద్ధం చేసి ఓడిపోయి పారిపోతున్నపుడు అతడి కుమారులే ఆతడిని చంపిన దృశ్యం–

టొమిరిస్ రాణి కుమారుడిని బంధించి, ఆమె విన్నపాన్ని లెక్కచేయకుండా ఆతడిని వధించిన పర్షియారాజు 'సైరస్' (Cyrus)పై ప్రతీకారంగా జరిగిన యుద్ధంలో ఆతడిని ఓడించి, ఆతడి తల నరికి, మానవ రక్తాన్ని ఆ శిరస్సు నోటిలో పోస్తూ ఆమె అన్నది– "రక్తం కోసం తపించావుగా! తాగు! ఎంత కావాలో!"

హోలోఫెర్నెస్ (Holofernes) అస్సిరియన్ల సైన్యాధిపతి. ఆతడు నెబుఛాద్ నెజ్జార్ ప్రభువును దేవుడిగా పూజించమని శాసించగా ఇజ్రాయెల్ ప్రజలు వ్యతిరేకించారు. బెధులియా ముట్టడి సమయంలో అందాల కన్య జుడిత్ (Judeth) అతని శిబిరంలోకి ప్రవేశించి ఆతడి తల నరికింది. నాయకుడు లేని ఆతని సైన్యం చెల్లాచెదురైంది.

ప్రసిద్ధిచెందిన ట్రాయ్ నగరం (Troy) శిథిలాలుగా, బూడిదగా మారినదృశ్యం–

ఏ చిత్రకారుని కుంచె నుంచి వెలువడ్డాయో ఈ అద్భుత దృశ్యాలు? ఏ శిల్పకారుని ఉలి ఈ శిల్పాలను మలిచిందో! మృతులు మృతులుగా, సజీవులు సజీవులుగా, సహజత్వం ఉట్టిపడుతున్న ఆ కళాఖండాలనెంతసేపు చూసినా తనివి తీరదు. అహంకారంతో కుములుతున్న 'ఈవ్' కుమారులారా! క్రిందికి చూసారా మీమీ దుష్కార్యాల మార్గం కనిపిస్తుంది.

మేము దాదాపు మొదటి వలయాన్ని పూర్తిచేసాము. నా మార్గదర్శకుడన్నాడు– "అడుగో! వినయమూర్తి అయిన దేవదూత ఇటే వస్తున్నాడు. ఆరుగురు సమయ కన్యలు వెళ్లిపోయినారు. అతనికి భక్తితో నమస్కరించు. ఈ ఉదయం ఇక తిరిగిరాదు"

ధవళ వస్త్రధారుడైన దేవదూత మమ్మల్ని సమీపించినాడు. అతడు ఉదయ నక్షత్రంలా వెలుగొందుతూ, తన రెక్కలను విప్పార్చి, చేతులు చాచి అన్నాడు– “స్వాగతం! మెట్లు పక్కనే ఉన్నాయి!” అతడు నా నుదుటిపై తన రెక్కతో స్పృశించినాడు.

మేము మెట్లు ఎక్కుతూ, కొండచరియలో తొలగబడిన దారిగుండా పైకి వెళ్తుండగా– "Beauti Pauperes spiritu - ఆత్మలో పేదలు ఆశీర్వదించబడెదరు” అన్న గీతం శ్రావ్యంగా వినవస్తున్నది. ‘రుబకాంటె’ వంతెన దాటి, శాన్ మినియాటొ చర్చి – ఫ్లొరెన్స్‌లో అత్యున్నతమైన దానివేపుకు వెళ్తున్నట్లుగా నాకనిపించింది.

నరకాగ్నిలోకానికి, ఈ ప్రక్షాళనా లోకానికి ఎంత తేడా! అక్కడ అడుగడుగునా విలాపాలు, విషాద గీతాలే! ఇక్కడ ప్రతి క్షణం వీనులకు విందై మనసును శాంతపరిచే మధుర భక్తిగీతాలే! నా శరీరం తేలికైనట్లనిపించి నేను మార్గదర్శకుడినడిగాను– “ప్రభూ! నాలో ఏదైనా భారము తొలిగిందా? నాకు అలసట అనిపించడంలేదు!”

అతడన్నాడు– “నీ నుదుటిపై ఉన్న మొదటి 'P' తొలిగింది. మంచి మనసుతో నడిచేప్పుడు, మిగతా పాపాలు తొలగగా, నీకు ఆరోహణలో మార్గాయాసమే ఉండదు”

నేను నా నుదుటిని తడుముకున్నాను. అక్కడ నాకు ఆరు 'P'లు మాత్రమే తగిలాయి. ఒక 'P' (Pride-గర్వం) తొలిగింది. నా మార్గదర్శకుడు చిరునవ్వు నవ్వినాడు.

## Canto - 13

**రెండవ ఆవరణలో అసూయ (Envy) తొలగించబడుతుంది. బాటసారులకు కుడిపక్కగా కొన్ని అగోచరమైన ఆత్మల స్వరాలు తోటి మానవులపై చూపాల్సిన దయ ప్రేమలను (Charity) వివరిస్తాయి. అక్కడ కొన్ని ఆత్మలు తమ అసూయా జీవితాలకు శిక్షగా గోనెసంచులు ధరించి, కనురెప్పలు ఇనుప దారాలతో కుట్టివేయబడి కనిపిస్తాయి. అక్కడ 'సాపియా' అనే స్త్రీ తన జీవితాన్ని వివరిస్తుంది.**

# అసూయాపరులకు శిక్ష

ఇది రెండవ వలయాకారపు ఆవరణ (Terrace-2). ఇక్కడ ఏ చిత్తరువులూ, శిల్పాలూ లేవు. అంతా గరుకురాతి నేల. నల్లగా ముదురు నీలంగా వున్నది.

నా మార్గదర్శకుడు సూర్యునివేపు చూసి ప్రార్థించాడు– "ఓ కాంతి ప్రకాశమా! ఈ కొత్తదారిలో మాకు తోడుగా ఉండు! మానవులకు ఇక్కడ నీ సహాయం అవసరం!" ప్రక్షాళనా పర్వతంపై సూర్యునికెదురుగా నిలబడి అపసవ్య దిశలో (కుడివేపుకు) తిరుగుతూ పోవడం సరైన విధానం. అలా మేము ఒక మైలుదూరం నడిచి వెళ్లామోలేదో మాకు అక్కడ ఆత్మలు మమ్మల్ని 'ప్రేమ' అనే Love table మేజాబల్ల వద్ద కూర్చోమని స్వాగతం పలుకుతున్నాయి.

ఒక గొంతు– Vinum non habunet - They have no wine - వారి దగ్గర మధువు లేదు – అంటున్నది. అది మేరీమాత కరుణార్ద్ర స్వరము. ఆ గొంతు అదే పలుకు మరోసారి పలికినది.

ఇంతలో మరో కేక వినబడింది– "నాపేరు ఒరెస్టెస్!" మూడవ గొంతు అంటున్నది– "నిన్ను గాయపరచినవారిని ప్రేమించుము"

నా మార్గదర్శకుడన్నాడు– "అసూయాపరులు ఈ వలయంలో శిక్షింపబడతారు. ఆ కొరడాలోని తాళ్లు ప్రేమతో ఛేదించబడతాయి. అసూయను శిక్షించడం, అసూయను అణచడం వేరువేరు రకాలు. మనం 'క్షమా కనుమ' (Pass of Pardon)ను చేరే సరికి నీకీ విషయం అర్థమవుతుంది. కాస్త జాగ్రత్తగా చూడు! అక్కడ నీకు ఓ గుంపు కనిపిస్తుంది"

నేను చూసిన ఆ దృశ్యాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. వాళ్లు అరుస్తున్నారు– "మేరీమాతా! మా గురించి ప్రార్థించు! మైఖేల్! పీటర్! సాధుసంతులారా!

మాకోసం ప్రార్థించండి!" అని దీనంగా వేడుకుంటున్నారు. వాళ్ల యాతనలను చూసిన ఏ హృదయమైనా దుఃఖసాగరమవుతుంది.

ఆ ఆత్మలు గోనెసంచులను అంగీలుగా ధరించి, ఒకరి భుజాలపై ఒకరి శిరస్సును మోపి, తాళ్లతో బంధించబడి ఉన్నారు. వాళ్లు కనురెప్పలు ఇనుపతీగెలతో కుట్టివేయబడి – మచ్చిక కాని డేగ ఎగిరిపోకుండా కనురెప్పలు కుట్టినట్లు – అంధులై అలమటిస్తున్నారు. వాళ్ల కళ్ల నుండి నీరు కాలువలై ప్రవహిస్తున్నది. నాతో ఒక ఆత్మ మాట్లాడింది– "నాపేరు సాపియా (Sapia). నేను సియానా నివాసిని. పేరులో తృప్తి వున్నా సంతృప్తిలేని దానిని నేను. నాకంటే ఎవరన్నా భాగ్యవంతులుంటే నాకు కన్నుకుట్టేది. నాతోటివాళ్లు శత్రువులతో పోరాడి నశించినప్పుడు నేను ఆనందపడ్డాను. నేనే ఇప్పుడు అందరికన్నా భాగ్యవంతురాలిని కావడంతో – కాసింత చక్కని వాతావరణానికే సంతోషపడిన నల్లపిట్టలా దేవుని తిరస్కరించి మరల అంతిమ కాలంలో దేవుని కరుణకై ఆరాటపడినాను. నా గురించి పైయర్ పెటినాయవొ (Pier Pettinaio) సాధువు ప్రార్థనలు జరిపినాడు. నీవు సశరీరంగా ఇక్కడకు వచ్చినట్లున్నావు. దేవుని ప్రేమకు నోచుకుని ధన్యుడవైనావు. నా గురించి ప్రార్థనలు చేసి, భూలోకంలో నా పేరును మరల నా బంధువులందు గౌరవప్రదంగా నిలుపగలవు"–

టాలమొని నౌకాశ్రయంపై, డయానా భూగర్భనది అన్వేషణలో పెట్టుబడిపెట్టి ధనాన్ని, మలేరియా జ్వరం వల్ల ప్రాణాల్ని పోగొట్టుకున్నవారిలా– దేవుని ప్రార్థించని వారి ఆత్మలు మరింత పతనాన్ని చెందుతాయి.

## Canto - 14

**'అర్నో' (Arno) నదీ పరివాహక ప్రాంత నగరాల దుష్కీర్తి, రోమాగ్నో పరిస్థితి. కెయిన్, ఎగ్లారాస్‌లు అసూయా ప్రవర్తనకు శిక్షింపబడడం.**

# అసూయాపరులైన కెయిన్, ఎగ్లారాస్‌లు

"ఎవరీ శరీరధారి? మృత్యుస్పర్శ సోకనివాడు. మన పర్వతం చుట్టూరా ప్రదక్షిణాలు చేస్తూ, తన కళ్లను తన ఇష్టాపూర్వకంగా మూసి తెరుస్తున్నవాడు, ఈతడెవరు?" అలా రెండు ఆత్మలు మా గురించి మాట్లాడకుంటున్నపుడు నేను వారి వంక చూసాను. నేనన్నాను– "పాల్టెరొనా వద్ద ప్రారంభమై వందమైళ్లు సాగే ఒక ప్రవాహం ఒడ్డున నేను జన్మించాను. నాపేరెందుకు చెప్పడం లేదంటే నేను ప్రముఖమైన వ్యక్తిని కాదుగనుక!"

అతడన్నాడు– "అది 'అర్నో' నది (Arno river).దాని పేరు తలవడానికి ఇతడెందుకు ఇష్టపడడం లేదు?" – బహుశా దానిపక్కనే ఉన్న నగరాల్లో సుగుణాలు సర్పాలుగా చూడబడతాయి. అక్కడి ప్రజలు 'సిర్సె' వనంలోని జంతువుల్లా ప్రవర్తిస్తున్నారు. ఆ ప్రవాహం పందులకొట్టం మధ్య నుండి పారుతున్న ఏరులా ఉండి పంటలకు పనికిరాని నదిలా తయారయ్యింది. అది పోయేకొద్దీ – కుక్కలు తోడేళ్లయినట్లు – అది మరింత కౄరభూమిగా మారుతున్నది. నీ మనవడు ఆ తోడేళ్లను వేటాడుతున్నాడు. బతికుండగానే వాటి శరీరాల్ని అమ్ముతున్నాడు. వేయి సంవత్సరాల నాటి వనం కాదిదిప్పుడు. ఆ అరెజ్జొ పట్టణం దగ్గర చిన్నకుక్క పెద్ద వరాహాన్ని నిలువరిస్తున్నది– 'a boar is often caught by a small cur' – నా పేరు 'గిడొడెల్ డుకా' (Guido del duca). ఎవరైనా సంతోషంగా ఉంటే అసూయతో నా రక్తం ఎంత కుతకుతలాడ్తుందంటే అది నా మొహంలో కొట్టవస్తున్నట్లు కనిపిస్తుంది. నేనప్పుడు నాటిన విత్తనాల పంటనే ఇప్పుడు అనుభిస్తున్నాను. ఇతడు 'రినిరి' (Rinieri da calboli). గ్యుల్ఫి కుటుంబాలలో ప్రముఖుడు. న్యాయాధిపతి. ఘిబెల్లైన్ల చేతిలో మరణించినాడు. ఇతడి మనవడే ఫల్సీరీ (Fulcieri) తోడేళ్లను వేటాడేవాడుగా ఇంతకు ముందు చెప్పబడినవాడు.

అతడే కాదు – మిగతావాళ్లెక్కడ? ubi sant - where are they? – 'రినిరి'కి సాయం చేసిన లిజియొ ఎక్కడ? నా స్నేహితుడు 'అరిగొ' (Arrego), పైయర్ ట్రావెర్సారొ, గిడొడ కార్పిగ్నా, ఫాబ్రా, బెర్నాడిన్, యుగొలినొ, గిడొడ ప్రాటా, ట్రావెర్సా రాకుటుంబము, అనస్టాగి కుటుంబం, ఫెడరిగగొ టిగ్నొసొ – వీళ్లందరూ ఇప్పుడేరీ?

బ్రెటినోరో! నీవెందుకు పారిపోలేదు? నీ కుటుంబం సర్వనాశనమయ్యింది కదా! బగ్నకావలో, కాస్ట్రో క్యూరో పట్టణాలు శిధిలమయ్యాయి. రాక్షసుడు (Demon) మఘినార్డొ పోగానే మరల పగాని కుటుంబం ప్రసిద్ధికెక్కుతుంది. సంతానం లేని యుగొలిని పేరు చెప్పేదేమీలేదు. ఇప్పుడు ఈ నేలనిండా విషపు మొక్కల కుదుళ్ళున్నాయి. టుస్కన్ నివాసీ! ఇక నేను మాట్లాడలేను. నాకు దుఃఖమొక్కటే మిగిలింది. శలవు!" అన్నాడతడు.

మేం ఇంకాస్త ముందుకు వెళ్లేసరికి మెరుపు మెరిసినట్లై ఒక గొంతు వినబడింది– "నన్ను బంధించేవారు నన్ను చంపుతారు– Who ever captures me will slaughter me" – ఎబెల్‌ను చంపిన కెయిన్ (Cain) స్వరం ఉరుముగా వినవచ్చింది.

ఆ ఉరుము ధ్వని తగ్గగానే మరో ఉరుము ఉరిమినట్లు ఇంకో స్వరం– "నాపేరు అగ్లారస్ (Aglauros). శిలగా మారిన దానిని!"

ఈమె సోదరి హర్సె (Herse). మెర్క్యురి దేవుడు 'హర్సె'ను ప్రేమించడాన్ని సహించలేక ఆమె వారి ప్రేమను భగ్నం చేయడానికి ప్రయత్నించి 'అసూయ'తో ఉడికి శిలారూపాన్ని పొందింది"

నా మార్గదర్శకుడు అన్నాడు– "అసూయ మన శాశ్వత విరోధి. సాతాను చేతిలోని గాలపుకొక్కెం వంటిది. దివ్యలోకంలో నీ చుట్టూరా ఉండే అద్భుత దృశ్యాలను చూడమని చెబుతుంటే నీవు నేలవైపే చూస్తుంటావు. అన్నిటినీ చూసేవాడు, అసూయతో ఉన్న నిన్ను నేలకూలుస్తాడు"

**Canto - 15**

**కాలవిభజన చర్చ తరువాత దేవదూత వారిని మూడవ ఆవరణలోకి తీసుకువెళ్తాడు. డాంటేకు పగటి నిద్రలో, సహనానికి ఉదాహరణలుగా మేరీమాత, పిసిస్ట్రాటస్, సెయింట్ స్టీఫెన్‌లు కనిపిస్తారు. వర్జిల్ వివరణ. అంతటా కమ్ముకున్న నల్లటి పొగ.**

# అత్యంత సహనశీలురకు ఉదాహరణలు

అటుయిటూ ఆడుకుంటున్న చిన్నపిల్లాడిలా సూర్యుడు అక్కడ మకర (Capricorn) రాశిలో, ఇక్కడ కర్కాటక (Cancer) రాశిలో కనిపిస్తున్నాడు.

దినంలోని 24 గంటలు ఇలా విభజింపబడినాయి. లౌకికమైనవి – చర్చి పద్ధతిలో పగలు 12 గంటలు, రాత్రి 12 గంటలు కాలాన్ని బట్టి వ్యవధి మారే Temporal hoursగా గుర్తింపబడగా, రెండవ పద్ధతి సమాన వ్యవధి (Equal hours) పద్ధతి.

చర్చిపద్ధతిలో – పగటికాలం టైయర్స్ (Tierce=6-9 AM) సెక్ట్స్ (Sext = 9-12 noon), నోని (None = Noon to 3 pm), వెస్పర్స్ (Vespers = 3-6 pm); ఇవికాక ప్రైమ్ (Prime = the hour of sunrise); ఉదయకాలపు ప్రార్థనా సమయం (matins with lauds); చరమప్రార్థనా సమయం (Compline) ఏడు భాగాలుగా విభజించబడింది.

ఇప్పుడు ఇటలీలో అర్ధరాత్రి, జెరుసలేంలో మధ్యాహ్నం, ప్రక్షాళనా పర్వతంపై వెస్పర్స్ ప్రారంభ సమయం (3 p.m.). సూర్యకాంతి మాపై తీవ్రంగా పడుతుంటే నేను నా కళ్లకు అరచేతులను అడ్డం పెట్టుకున్నాను. నీటిపైన, అద్దంపైన పడిన కాంతికిరణం అదే కోణంలో పరావర్తనం చెందినట్లు, ఎవరిదో పరావర్తనం చెందిన కాంతి నా కన్నులకు కనబడగా నేను నా మార్గదర్శకుడిని అడుగగా ఆతడు అన్నాడు– “దేవదూత మనల్ని తీసుకువెళ్లడానికి వస్తున్నాడు. అతని కాంతి నీ కన్నులకు సోకినది”

ఆ దేవదూత చూపించిన దారివెంబడి వెళ్తుండగా మాకు – Beati Misericordis - కష్టాలను అధిగమించినవారు ఆనందించండి! – అన్న గీతం మృదుమధురంగా వినిపించింది. "Blessed are the merciful for they shall obtain mercy" –

నేను నా మార్గదర్శకుడిని అడిగాను– “ఆనందాన్ని పంచుకోరాదని – ఆ రోమాగ్నా ఆత్మ అంటున్నది సత్యమేనా?”

"అతడన్నాడు– "అసూయపరులు తమ ఆనందాన్ని ఇతరులతో పంచుకోడానికి ఇష్టపడరు. వాళ్లకు ఇహలోకపు విషయాలపై మక్కువ ఎక్కువ. ప్రేమను ఐహిక విషయాలపై కాక దేవునిపైకి మళ్లించినప్పుడు అక్కడ 'నాది' అన్న భావన నశించి మనది, అందరిది అన్న భావనతో ప్రేమ సర్వవ్యాప్తమవుతుంది. మంచితనం, ప్రేమ ఎంత పంచుకున్నా తరగనివి. ఎంతమంది మంచితనాన్ని, ప్రేమను పంచుకుంటారో ఆ ప్రేమ అన్నింతలుగా వృద్ధి చెందుతుంది. నీకింకా సందేహముంటే బియాట్రైస్ (Beatrice) తీరుస్తుంది. నీ నుదుటిపై ఇప్పటికి రెండు గాయాలు మాయమైనాయి"

ఇంతలో పగటి నిద్ర నన్ను ఆవహించింది. ఆ నిద్రలో కలలో – దేవాలయంలో ఓ మాతృమూర్తి తన కుమారునితో – "ఎందుకు కుమారా ఇలా చేసి, నన్నూ నీ తండ్రినీ దుఃఖితులను చేసినావు?" అంటున్నది. (ఆమె మేరీమాత)

ఆమె అదృశ్యమై మరో స్త్రీ కనిపించింది. ఈమె ఏథెన్స్ ప్రభువు పీసిస్ట్రాటస్ భార్య – వారి కుమార్తెను ప్రేమించిన యువకుడు బహిరంగంగా ఆ యువతిని కౌగిలించుకుని ముద్దుపెట్టుకొనగా, ఆతడిని చంపమని రాణి కోరగా పీసిస్ట్రాటస్ అన్నాడు– "మనల్ని ప్రేమించే వాళ్లనే చంపాల్సివస్తే, మనల్ని ద్వేషించే వాళ్లను ఏం చేయాలి?"

ఇంకో దృశ్యంలో– చంపండి, చంపండి అని అరుస్తూ రాళ్లు విసుర్తున్న ప్రజలు – ఆ రాళ్ల దెబ్బలకు రక్తమోడుతూ, కూలిపోతూ ఆతడు సెయింట్ స్టీఫెన్ ఆకాశం వేపే తన కళ్లను నిలిపి – Lord, lay not this sin to their charge!" – వీళ్లను క్షమించు ప్రభూ! అంటున్నాడు.

నాకు మెలకువ వచ్చింది. నా ఆలోచనలను చదివినట్లే నా కలలను చదివిన మార్గదర్శకుడు ముందుకు సాగగా నేనతనిని అనుసరించాను. మాకు ఎదురుగా ఎక్కడచూసినా దట్టమైన నల్లటి పొగ!

## Canto - 16

**మూడవ ఆవరణ – (Terrace-3 The Wrathful) వాళ్ల కోపం వాళ్లకే శత్రువన్నట్లు, కోపిష్ఠివాళ్లు ఆ నల్లని పొగలో నానా అవస్థ పడతారు. మార్కొ స్వేచ్ఛాసంకల్పం (Free will), అవినీతి గురించి మట్లాడతాడు. ముగ్గురు ప్రాచీనులు, సుగుణశీలుర ఉదాహరణలనిస్తాడు.**

# కోపపు పొగతో మండిపడినవాళ్లకు నల్లటి పొగ – శిక్ష

నరకలోకపు చీకటి, మబ్బులు అలుముకున్న ఆకాశం గ్రహపుకాంతుల్ని అడ్డుకోగా వ్యాపించిన అంధకారం కూడా, ఈ పొగలా నా కళ్లను కప్పివేయలేదు. నేను కళ్లు తెరవలేని పరిస్థితిలో ఉండటం గమనించిన నా మార్గదర్శకుడన్నాడు– "నా పక్కనే నడువు. నా భుజాన్ని ఆసరాగా తీసుకో! పక్కలకు పోకు". అంధుడు తోటి ప్రయాణీకుడి సాయతో ప్రాణాన్ని కాపాడుకుంటున్నట్లు నేనూ ఆతడి ఆసరాతో ఆ నల్లటి పొగలో నడవసాగాను.

దేవుని కుమారుని ప్రార్థిస్తున్న స్తుతిగీతాలు వినిపించాయి. మా పాపాలను తొలగించి, మాకు శాంతిని, కరుణను ప్రసాదించు! 'Agnus Dei!' అని ఎవరో బృందగానం చేస్తున్నారు. నేనన్నాను– "గురువర్యా! ఆ పాటలు పాడుతున్నది ఆత్మలేనా!". అతడు సమాధానమిచ్చినాడు– "అవును! అలా పాడుతూ వాళ్లు తమ కోపపు ముడులను విప్పుతున్నారు"

"మీరెవరు? మా పొగలో నుండి దూసుకుపోతున్నారు? మీలో ఒకడు కాలాన్ని నెలలతో కొలిచే సజీవ మానవుడిలా మాట్లాడుతున్నాడు!" అన్నాడు ఒక ఆత్మ.

నా మార్గదర్శకుడి సలహాతో నేనతడిని పై ఆవరణకు వెళ్లే దారి గురించి అడిగాను. దేవుని అనుమతితో నేను నరకలోకపు వలయాల్ని చూసి ఇప్పుడు ప్రక్షాళనా పర్వతపు ఆవరణలను వీక్షిస్తున్నాను. నీ సలహాతో నేను పై ఆవరణకు పోగలనని అనుకుంటున్నాను" అని చెప్పాను.

అతడన్నాడు– "నాపేరు మార్కొ! లొంబార్డ్ నివాసిని. నాకు ప్రపంచపు పోకడలు తెలియును. ఇప్పుడు అక్కడ సుగుణాలన్నీ నశించినవి. అన్నీ వక్రబుద్ధులే! ఆ ప్రపంచం గుడ్డిది. The world is blind. ఈ మానవులు ప్రతిదానినీ స్వర్గంపైకి, దేవుని మీదకు నెట్టివేసి తమకు భగవానుడిచ్చిన స్వేచ్ఛా సంకల్పాన్ని (Free will) మరిచిపోతున్నారు. పైలోకం నుంచి కాంతి మంచీ, చెడులపై సమానంగా ప్రసరిస్తుంది.

దేనిని తీసుకోవాలన్నది నీ నిర్ణయంపై ఆధారపడి వున్నది. నీ నడతకు కారణం నీవే అయినప్పుడు, నీలోనే తప్పును వెదకు!

ఆత్మ శరీరంలోకి ఆ భగవానుని చేతుల నుండి ప్రవేశించినపుడు మాలిన్యం అంటని పసిపాపలా ఉంటుంది. చిరునవ్వులు రువ్వుతూ, దుఃఖిస్తూ సహజంగా ప్రవర్తిస్తుంది. మొదట చిన్నచిన్న రుచుల్ని ఆస్వాదించి, అవి ఆత్మను మలినపరచగా ఐహిక విషయాలపై ఆసక్తిని పెంచుకుని దారి తప్పుతుంది. ఎవరో ఒకరు ఆత్మను అదుపులో పెట్టకపోతే అది విశృంఖలంగా తిరుగుతుంది. అందుకే న్యాయం, అధిపతి అవసరం! ఈనాడు వాటిని ఎవరు అమలు పరుస్తున్నారు? గొర్రెలకాపరి వంపు కర్రకు, ఖడ్గం తోడైంది. మతాధిపతులు గొర్రెలకాపరుల్లా ప్రభుశాసనాలను నెమరు వేస్తున్నారు కాని వాళ్ల పాదాలకు చీలిక (Cleft hooves) లేదు. ఆధ్యాత్మిక విషయాలను, ఇహలోక విషయాలను వాళ్లే నిర్వర్తించ ప్రయత్నిస్తున్నారు. సీజర్‌కు చెందాల్సినవి సీజర్‌కు, దేవునికి చెందాల్సినవి దేవునికి అందనివ్వడం లేదు.

రోమ్ నగరానికి ఇద్దరు సూర్యులుండి రెండు మార్గాలను కాంతివంతం చేసినారు. ఒకటి ఇహలోక ప్రపంచమార్గం, రెండవది భగవానుని చేరే దారి. కాలం మారుతున్నది. విత్తనాలను బట్టే మొక్క గుర్తించబడుతుంది కదా! ఫ్రెడరిక్ రాజుకు మతాధిపతులకు మధ్య విరోధమున్నది. 'లొంబార్డో'లోని ముగ్గురు సుగుణశీలుర గురించి చెబుతాను. కర్రాడొ, ఘెరాడొ, లొంబార్డ్‌లు తమ సుగుణాలతో లొంబార్డ్‌కు ఖ్యాతి తెచ్చినారు.

ఇప్పుడు రోమ్ చర్చి రెండు అధికారాలను కైవసం చేసుకుని మురికి కూపంలో మునిగిపోతున్నది" అన్నాడు మార్కొ. 'ఘెరాడొ' ఎవరని నేనడుగగా, అతడు నా అజ్ఞానాన్ని మన్నించి అతడు గెయియా (Gaia) తండ్రి, లలితకళా పోషకుడు, మహావీరుడు అని తెలిపి దేవదూత వచ్చే సమయమైనదని చెబుతూ వెనక్కి వెళ్లిపోయినాడు.

**డాంటీ ఆ పొగ ప్రాభవం వల్లనో ఏమో కోపిష్ఠులకు కొన్ని ఉదాహరణలు చెబుతుండగా, దేవదూత వచ్చి నాల్గవ ఆవరణలోకి తీసుకువెళ్తుంది. మోక్షమార్గంలో ఇది ఏడవమెట్టు. వర్జిల్ ఏడు పాపాల గురించి వివరిస్తూ – గర్వం, అసూయ, కోపం – దారితప్పిన ప్రేమ వలన; బద్ధకం – ప్రేమరాహిత్యం వలన; అత్యాశ (లోభం), తిండిపోతు తనం, కామం – లౌకిక విషయాలపై అతి ప్రేమ వలన జనిస్తాయని చెబుతాడు.**

# ప్రేమకు సప్తపాపాలకు గల సంబంధం

ఆ దట్టమైన పొగ నుంచి – కొండ ఎలుకలు మట్టిలో నుంచి నిక్కినిక్కి చూస్తున్నట్లు – నేను అప్పుడప్పుడే పలచబడుతున్న పొగ అంచుల నుంచి బయటకు చూడడానికి ప్రయత్నం చేసాను. ఒక్కోసారి ఫాంటసీ అనబడే కల్పనాశక్తి (Fantasy) మనల్ని ఇహలోకం లోనుంచి, ఊహాలోకంలోకి తీసుకుపోయినప్పుడు, మన చుట్టూ వేయి బాకాలు శబ్దం చేస్తున్నా మనకా శబ్దాలు వినపడవు. ఏదో దైవశక్తి, ఇంద్రియాలు లుప్తమైన ఆ క్షణంలోనూ మనల్ని నడిపిస్తూనే ఉంటుంది.

నైటింగేల్‌గా మారిన ప్రొక్నె (Procne) – (ఫిలొమెలాను ఆమె బావ టిరియస్ బలాత్కారం చేసి, ఆమె మాట్లాడకుండా ఉండేందుకు నాలుక కత్తిరించగా, ఫిలొమెలా తన సోదరి ప్రొక్నెకు ఆ విషయం వస్త్రంపై నేసి తెలియబరుస్తుంది. వాళ్లిద్దరూ టిరియస్ కుమారుడిని చంపి, ఆతడి మాంసంతో వండిన కూరతో టిరియస్‌కు భోజనం పెడ్తారు. విందారగించిన టిరియస్‌కు నిజం తెలిసి వారిద్దరిని చంపబోగా ఫిలొమెలా 'స్వాలో' రూపంలో, ప్రొక్నె 'నైటింగేల్' రూపంలో పారిపోయారని, టిరియస్ 'హూపొ' (Hoopoe bird) పక్షిగా వాటిని వెంటాడుతూంటాడని ఐతిహ్యం) నా కళ్లముందు ప్రత్యక్షమైంది.

హమన్ (Haman)కు లొంగని మొర్దెకాయిని శిక్షించడానికి పర్షియారాజు అహసురియస్ (Ahasuerus) సలహాదారు 'హమన్' కోపంతో యూదులందరినీ చంపించే ప్రయత్నం చేయగా, మొర్దెకాయి (Mordecai) బంధువు ఎస్థర్ (Esther) రాజును వివాహమాడి యూదులను రక్షించిన సంఘటన 'హమన్'ను శిలువ వేసిన దృశ్యం – ఈ సంఘటన నీటి బుడగలా పేలగానే మరోటి –

రాణి అమాటా, రాజు లాటినస్‌ల కుమార్తె లవీనియా (Lavinia). లవీనియాను టర్నస్‌కు ఇచ్చి వివాహం చేద్దామనుకున్న అమాటారాణి టర్నస్

చనిపోయాడని భావించి, తన కుమార్తె ఈనియస్ (Aeneas)ను పరిణయమాడడం ఇష్టంలేక ఉరివేసుకుని మరణించగా లవీనియా దుఃఖానికి అంతేలేదు.

నా ఆలోచనలన్నీ ఆ దేవదూత మాటలతో - Here one can ascend - మాయమై నేను ఈ లోకంలోకి వచ్చాను. నా మార్గదర్శకుడి వెనుక నడుస్తూ మెట్లవద్దకు వచ్చి మొదటి మెట్టు ఎక్కగానే, దేవదూత రెక్క నా నుదుటికి తగిలింది – "Beati pacifici - those free of evil anger - కోపాన్ని వర్జించిన వారికి స్వాగతం!"

పైకి నడిచేసరికి ఆకాశాన తారలు ప్రత్యక్షమైనాయి. తీరానికి చేరిన నౌకలా మేము ఆఖరి మెట్టుపైన కూలబడినాము.

నేనడిగాను– "ఈ ఆవరణలో ఏ పాపం ప్రక్షాళన చేయబడ్తుంది?"

అతడన్నాడు– "ఇక్కడ ప్రేమరాహిత్యం వలన జనించే బద్ధకం (సోమరిపోతు తనం) నిర్మూలించబడుతుంది. నేను చెప్పేది జాగ్రత్తగా విను! ప్రేమలేని సృష్టి లేదు. సహజ సృష్టి దోషరహితమైనది. మానసిక సృష్టి తక్కువ, ఎక్కువల వ్యత్యాసాలతో చెడుగా మారుతుంది. దేవునికి విధేయుడిగా ఉంటూ, ఇహలోక సౌఖ్యాలను మితంగా అనుభవిస్తున్నంత కాలమూ, చెడు ఆ వ్యక్తిని చేరదు. ఎప్పుడైతే ఐహిక సుఖాలను మరిగి, చెడుతిరుగుళ్లకు మనసు బానిస అయ్యిందో, అప్పుడు అతడు సృష్టికర్తను వ్యతిరేకిస్తాడు. 'ప్రేమ' అన్ని సుగుణాలకూ బీజము అయినట్లే అన్ని పాపాలకూ బీజమవుతుంది. దుష్టప్రేమ (Ill love) మూడురకాలుగా ఉద్భవిస్తుంది. తాను గొప్పవాడిని కావాలనుకుని ఇతరులను అణగదొక్కడం, తాను పతనమై ఎదుటివాడి పతనాన్ని కాంక్షించడం, తాను గాయపడి ఎదుటివాడిని గాయపరచడానికి ప్రయత్నించడం.

ఎక్కడైతే ప్రేమ స్తబ్దించి, ప్రేమరాహిత్యపు స్థితిలోకి తీసుకువెళ్లిందో ఆ స్థితిలోని వ్యక్తులు ఈ ఆవరణలో శిక్షింపబడతారు. దారితప్పిన ప్రేమ వలన – **గర్వం, అసూయ, కోపంలు;** ప్రేమలేకపోవడం వలన – **బద్ధకం;** లౌకిక విషయాలపై అతి ప్రేమ వలన – **లోభం, తిండిపోతుతనం, కామం** – జనిస్తాయి. ఈ ఏడు పాపాలు, ఈ ఏడు ఆవరణలలో ప్రక్షాళన గావించబడ్తాయి.

పైన ఉన్న మూడు ఆవరణలలో ఇహలోక విషయాలపై మితిమీరిన ప్రేమ ఎటు దారితీస్తుందో గమనించు!

**Canto - 18**

**నాలుగవ ఆవరణ. సోమరిపోతులకు శిక్ష ఆగకుండా పరుగెత్తడమే! వర్జిల్ ప్రేమ, బాధ్యతల గురించి వివరిస్తాడు. సోమరితనానికి ఉదాహరణలు. నిద్రముంచుకు రాగా డాంటే స్వప్నలోకంలోకి జారుకుంటాడు.**

# సోమరితనానికి శిక్ష

"ప్రేమ అంటే ఏమిటి? మంచి ప్రేమ, దుష్టప్రేమ అన్నారు కదా. కాస్త వివరించండి గురుదేవా!" అని అడిగాను.

అతడన్నాడు– "ప్రేమకు త్వరితంగా స్పందించే ఆత్మ, ఇంద్రియాలు ఇష్టపడే వాటిపై మొగ్గుచూపుతుంది. ఊహాకల్పన దానికో రూపాన్ని కలిపించి ఆత్మ దానిని ఇష్టపడేట్లు, కోరుకునేట్లు చేస్తుంది. ఆ ఇష్టపడడమే ప్రేమ. మంటలు పైకెగసినట్లు అది లభ్యమయ్యేంత వరకు నిరీక్షణ, దాన్ని పొందడం ఆనందాన్ని కలిగిస్తుంది. అందుకనే అన్ని ప్రేమలూ పొగడతగ్గవి కావు. మైనం మంచిదే అయినా ముద్రికలన్నీ ఒకే విధంగా ఉండవు కదా!

ప్రతి పదార్థము తన ప్రత్యేకతను, శక్తిని కలిగి ఉంటుంది. ఆకుపచ్చని చిగురు మొక్కలోని జీవాన్ని తెలిపినట్లు, ఆ జీవశక్తి పనిచేసేంత వరకు దాని ఉనికి మనకు తెలియదు. తేనెటీగలకు తేనెను సంగ్రహించే శక్తి పుట్టుకతో వచ్చినట్లు, మానవులకు స్వేచ్ఛాసంకల్ప శక్తి (Free will) ఇవ్వబడింది. దానిని అతడు ఎట్లా వినియోగించినాడు అన్నదానిపైననే అంతిమతీర్పు చెప్పబడుతుంది. అరిస్టాటిల్ లాంటి వేదాంతులు ఈ మూలకారణాన్ని శోధించి నైతిక సూత్రాలను రూపొందించినారు. అనివార్యత (అవసరం) లోనుంచి ప్రేమ జనిస్తుందనుకుంటే దానిని అదుపులో ఉంచడం కూడా నీ చేతుల్లో ఉన్నట్లే కదా! ఇదే బియాట్రైస్ (Beatrice) అన్న స్వేచ్ఛాసంకల్పం!"

అర్థరాత్రి దాటింది. వెన్నెల వెలుగులో ఆకాశం మెరుస్తున్న తారలతో బోర్లించిన రాగిపాత్రలా ఉన్నది. అక్కడ రోమ్ నగరంలో ఉన్నవాళ్లకు కార్సికా, సార్డినియాల మధ్య సూర్యాస్తమయం కనిపిస్తోంది. పైటోలా (Pietola)లో జన్మించిన మాంటువావాసి నా గురువర్యుడు నా సందేహాలను తీర్చినాడు. నాకు నిద్ర ముంచుకు వస్తున్నట్లనిపించింది. మా వెనుక ఎవరో వస్తున్న సవ్వడి నిద్రను నా కళ్లనుంచి వెళ్లగొట్టింది.

ఇస్మెనస్, ఎసొపస్ నదుల మధ్య థెబన్లు జరుపుకునే బాకస్ (Bacchus) ఉత్సవాల్లోని విందులు వినోదాలప్పుడు వినిపించే సంబరాల ధ్వనుల్లా కేకలు, పాటలు–

ఆ గుంపు ఆగకుండా పరిగెడ్తూనే ఉన్నారు. ముందు వరుసలో ఉన్న వాళ్లు ఏడుస్తూ అంటున్నారు– "ప్రయాణంలో 'మేరీ' పర్వతాన్ని చేరేందుకు త్వరత్వరగా నడిచింది. ఎలిజబెత్‌కు సాయం చేసింది. ఇద్దరూ కలిసి ప్రకటనా స్థలానికి (Annunciation) చేరుకున్నారు.

పాంపెతో జరిగిన అంతర్యుద్ధంలో సీజర్ (Caeser) మార్సెల్స్ యుద్ధంలో చివరి ఘట్టాన్ని తన సేనానులకు వదిలి శత్రువును 'లెరిడా'లో మట్టికరిపించడానికి వేగంగా కదిలాడు.

పదండి! పదండి! ప్రేమరాహిత్యంలో మన బతుకులు మందకొడిగా గడిచాయి. మంచిపై కోరిక ఉన్నపుడు, కరుణ పచ్చటి పచ్చికను చూపుతుంది" అంటూనే వాళ్లు ఆగకుండా పరిగెడ్తూనే వున్నారు.

వాళ్లతో పాటు పరిగెడ్తూ పై ఆవరణకు వెళ్లేదారి తెలపమని నా మార్గదర్శకుడు అడిగాడు. వారిలో ఒకడు సమాధానమిచ్చినాడు– "వెరొనాలోని సెయింట్ జెనొ (Saint Zeno) పీఠాధిపతిని నేను. అప్పుడు ప్రఖ్యాతిగాంచిన బార్బరోసా ఆ ప్రాంతానికి రాజు. అతడు పోప్‌తో గొడవపడి మిలన్‌ను ధ్వంసం చేసినాడు. అల్బర్టో ప్రభువు తను మరణశయ్యపై ఉండి ఏ అర్హతా లేని 'గియొసెప్పె'ను పీఠాధిపతిని చేసి నన్ను తొలిగించినాడు" – అంటూనే అతడు వేగంగా ముందుకు పోయినాడు. మేము అక్కడనే ఆగగా మాకు ఎవరివో మాటలు వినవచ్చినవి.

"ఎర్రసముద్రం చీలి ఇజ్రాయెలులకు దారి ఇవ్వగా, మోసెస్‌ను అనుసరించని వాళ్లు ఎడారిలోనే నశించారు కదా!"

"తనతో రాలేమన్న వాళ్లను ఈనియస్ (Aeneas) సిసిలీలోనే వదిలి తాను ఇటలీలో సామ్రాజ్యస్థాపన చేయలేదా!"

ఆ మాటలు వింటున్నపుడు నాలో అనేక రకాలైన, విరుద్ధమైన ఆలోచనలు రాసాగినాయి. వాటి భారానికి అసంకల్పితంగానే నా కనులు మూతబడినట్లనిపించి నేను నిద్రాలోకంలోకి కలల్లో విహరించడానికి జారుకున్నాను.

## Canto - 19

**అయిదవ ఆవరణ. అత్యాశాపరులకు, దారితప్పినవాళ్లు శిక్షననుభవించే ప్రదేశం. డాంటీ తనకు కలలో కనిపించిన సైరన్ల గురించి వివరిస్తాడు. అభినివేశం (Zeal), పట్టుదలల దేవదూత వారికి అయిదవ ఆవరణలోకి ప్రవేశాన్ని కలిపిస్తుంది. అక్కడ అత్యాశాపరులను, లోభులను కాళ్లూచేతులూ విరగగొట్టి, నేలమీద బోర్లా పడవేసి ఉంచుతారు.**

# అత్యాశాపరులకు, లోభులకు శిక్ష

చలి ఇంకా తీవ్రంగానే ఉన్నది. ఆ రోజంతా కాసిన ఎండవేడిమి శాటరన్, మూన్‌ల శక్తి ముందు తలవంచింది. ఇసుకపై గీతలను, ఆకాశంలోని నక్షత్రరాశులకు అన్వయం చేసే జ్యోతిష్కులు (Geomancers) అదృష్టరాశి (Fortuna Major = Pisces = మీనరాశి) ఆకాశంలో కనిపించేసరికి ఆనందం చెందుతున్నారు.

నేను నా కలలో చూసాను– ఒక స్త్రీ నత్తినత్తిగా మాట్లాడుతూ, ఎగుడు దిగుడు కళ్లతో, వంకరకాళ్లతో, వంగిన చేతులతో, పాలిపోయిన శరీరంతో ఉన్న ఆమె, మరుక్షణంలో మామూలు రూపంలోకి వచ్చి ఏదో అలౌకికమైన పాటను గానం చేయసాగింది– “నేను సైరన్ (Siren)ను. సముద్ర మధ్యంలో పయనించే నావికులను నా గానంతో సమ్మోహపరచి వారిని దారిమళ్లిస్తాను. యులిసెస్ (Ulysses)ను మభ్యపెట్టే ప్రయత్నం చేసాను”

ఇంతలోనే ఆమె పక్కన మరోస్త్రీ సాధువులా ఉన్న ఆమె ప్రత్యక్షమైంది. ఆమె అన్నది– “వర్జిల్! వర్జిల్! ఎవరీమె?” అని అడిగింది. వర్జిల్ సైరన్ దుస్తులను లాగి చింపగా ఆమె పొట్ట బయటపడి దుర్గంధం వ్యాపించింది.

నాకు వెంటనే మెలకువ రాగా నన్ను నా మార్గదర్శకుడు మేల్కొలుపుతున్నాడు.

“ఇప్పటికి మూడుసార్లు నిన్ను నిద్రలేపడానికి ప్రయత్నం చేసాను. లే! మనం వెళ్లాల్సిన దారి అదుగో!” అన్నాడతడు.

అక్కడ ఓ దేవదూత హంసకన్నా తెల్లనైన రెక్కలు విప్పారి ఉన్నవాడు ఆ కొండరాతిలో ఉన్న మెట్లను చూపించినాడు– “అలసత్వం నుంచి విముక్తులైన వారికి స్వాగతం. Qui - lagent - those who mourn!"

నా కళ్లు ఇంకా నేలనంటుకుని ఉండగానే మేము మెట్లు ఎక్కుతుండగా నా స్థితిని గమనించిన మార్గదర్శకుడన్నాడు– “నీవు నీ కలలో చూసిన స్త్రీ ప్రాచీన

కాలపు మంత్రగత్తె. ఆమెను వదిలించుకుని బయటపడినావు. ఇహలోకపు బంధాలను తెంపుకుని పైనున్న ఆవరణలను దాటి పరలోకపు ప్రేమను నీలో నింపుకొందువుగాని"

వేటగాడి చేతిలోని ఆహారాన్ని చూసి క్రిందికి దిగిన డేగలా నా గురువును అనుసరించి అయిదవ ఆవరణలో ప్రవేశించాను. "Adahesit favimento anima mea - My soul cleaves to the dust" అని పాడుతూ, ఏడుస్తూ – "నా ఆత్మ దుమ్ములో పొర్లాడుతున్నది" –అని ఎవరో గానం చేస్తున్నారు.

నేను ఆవరణలో కుడివేపుకు నడుస్తూ, కాళ్లూ చేతులు కట్టబడి నేలపై బోర్లాపడి విలపిస్తున్న వారిలో ఒక ఆత్మను ప్రశ్నించాను. అతడన్నాడు– "నేను పీటర్ వారసుడిని. పోప్ ఎడ్రియాన్–5గా నేను ప్రభువుయొక్క గొర్రెలకాపరిగా నియమించబడగా ఆ భారము సరిగా మోయలేకపోయాను. అత్యాశతో ఇహలోక సంపదలను మూటగట్టాను. అందుకే ఇక్కడ మా కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేయబడి, ఇలా కదలకుండా మెదలకుండా బోర్లాపడి ఉన్నాము"

నేను మోకాళ్లపై వంగి అభివాదం చేయడాన్ని గమనించిన ఆతడన్నాడు– "నేను నీవలే ఒక మహాశక్తిమంతుడి సేవకుడిని. సువార్త చెప్పిన – 'Neque nubent' – నీకు తెలియును గదా! పునర్జన్మ మీద నమ్మకం లేని సద్యూసియులు (Sadducees) జీసస్‌ను – "ఒక మహిళ ఏడుసార్లు వివాహం చేసుకుంటే, వచ్చే జన్మలో ఆమె ఎవరి భార్య అవుతుంది?" అని ప్రశ్నించినారు. జీసస్ సమాధానమిచ్చినాడు– "పునరుత్థానంలో భార్యా, భర్తల ప్రసక్తి ఉండదు. అందరూ దేవదూతలే!

"నా పదవి అంతే! మరణంతో అంతమవుతుంది. అప్పుడు అందరమూ ఆ మహాశక్తిమంతుని సేవకులమే! నా తమ్ముడి కుమార్తె 'అలాగియా' (Alagia) దైవభక్తి, కరుణ కలిగిన స్త్రీ! ఆమెను నా కోసం ప్రార్థించమను!" అన్నాడతడు.

**అయిదవ ఆవరణ. అత్యాశను అంతమొందిచండం. పేదరికానికి దాతృత్వానికి ఉదాహరణలు - మేరీకన్య, ఫాబ్రిసియస్, సెయింట్ నికొలాస్; అత్యాశకు నిదర్శనాలుగా పిగ్మాలియన్, మిడాస్, అకన్, సాఫిరా, సాఫిరాభర్త అనానియస్, హెలియోడొరస్, పాలిమ్నెస్టర్, క్రాసస్‌లు; కంపించిన ప్రక్షాళనా పర్వతం; ఆత్మల కేకలు.**

## అత్యాశాపరులకు ఉదాహరణలు

నా జ్ఞాన దాహం ఇంకా తీరలేదు. నా మార్గదర్శకుడు కొండ పక్కనే దాదాపు ఆనుకున్నట్లు నడుస్తున్నాడు. పోప్ అడ్రియన్ మౌనం వహించాడు. ఇటలీని మింగేస్తున్న ప్రాచీన తోడేలును అదుపులోపెట్టే చక్రవర్తి ఎప్పుడు రానున్నాడో! మేము నెమ్మదిగా నడుస్తున్నాము. అక్కడ ఉన్న ఆత్మలు దుఃఖిస్తూ ఉన్నవి. ఒక ఆత్మ కడుపునెప్పులు పడుతున్న స్త్రీలా– “మేరీమాతా!” అని అరిచాడు. – క్రీస్తును మోస్తూ కూడా నీవున్న పేదరికం నాకు తెలిసినది తల్లీ! ఓ ఫాబ్రిసెయస్! లంచాన్ని, కానుకలను తిరస్కరించిన రోమన్ న్యాయాధిపతీ! ఓ దయగల నికొలాస్! పొరుగింటి ఆడపిల్లల పెళ్లిళ్లకోసం కిటికీలోంచి బంగారపు మూటలు రాత్రిపూట విసిరినవాడా! మీకు పేదరికం గురించి తెలియును. పేదలకు సాయం చేయుట తెలియును”

అతడిని నేనడిగాను– “ఎందుకిలా పొగుడుతున్నావని”.

అతడన్నాడు– “నాపేరు హ్యూఘ్ కాపెట్ (Hugh Capet). నా వంశము ఫ్రాన్సును పరిపాలించిన కరొలింగియన్ల వంశము. ప్రాచీన రాజవంశావళిలో ఆఖరివాడు సాధువైనాక నాకు అధికారం చిక్కింది. లూయిస్–5 మరణించాక నా కుమారుడిని రాజును చేసాను. ఛార్లెస్ (Charles of Anjou)కు బియాట్రైస్‌తో వివాహమైనాక మా వంశస్థుల అధికారం అప్రతిహతమైంది. ఛార్లెస్, ఫిలిప్‌లు అనేక విజయాలు సాధించారు. అత్యాశ ఎక్కువై మా వంశస్థులు చేయని అకృత్యం లేదు. ఫిలిప్‌ను చర్చినుంచి బహిష్కరించినందుకు పోప్ బొనిఫేస్ (Boniface-8)ను ఫిలిప్ బంధించి అతడితో చేదు, వినిగార్ (gall & venigar) తాగించి శిలువ వేసిమరోసారి క్రీస్తును శిలువ వేసిన మరో ‘పిలాటె’ (Pilate) అయినాడు. నాకు తెలుసు దేవుడు ఆ ఫిలిప్‌ను శిక్షిస్తాడని.

ఇప్పుడు నేను చెప్పబోయేది బంగారం మీద ఆశగలవాళ్ల గురించి. ఇతడు పిగ్మాలియాన్ (Pygmalion). తన సోదరి ‘డిడొ’ భర్తను చంపి, దొంగగా, ద్రోహిగా, హంతకుడిగా మారినవాడు;

అతడు మిడాస్ (Midas) – బాకస్‌ను ప్రార్థించి తను పట్టిందల్లా బంగారం కావాలన్న వరాన్ని పొందినవాడు. చివరకు తన కుమార్తె, తినే ఆహారం బంగారం కావడంతో వరాన్ని తిరిగి ఇచ్చేసినాడు;

'జెరికొ' (Jericho) యుద్ధంలో దొరికిన సంపదలు దేవునికి చెందాలన్న జాషువా ఆనతిని కాదని కొంత స్వంతం చేసుకోగా రాళ్లతో కొట్టబడి మరణించిన అకన్ (Achan);

అపొస్తులుల సంపదలలో కొంతభాగాన్ని హరించిన సఫిరా (Sapphira) మరియు ఆమె భర్త;

జెరుసలెం దేవాలయాన్ని దోచుకోవడానికి వచ్చి, దేవాలయం ముందు దివ్యాశ్వపు కాలిగిట్టల దెబ్బకు మరణించిన పాలి ఒడొరస్ (Poly Odorous).

ప్రియాం కుమారుడు పాలిడోరస్‌ను చంపి బంగారాన్ని కాజేసిన థ్రాసె రాజు పాలిమ్నెస్టర్ (Plymnestor);

సీజర్, పాంపెలతో మూడవ భాగాన్ని పంచుకున్న క్రాసస్ (Crassus), పార్థియన్లపై దండెత్తి ఓడిపోగా, పార్థియన్ల రాజు క్రాసస్ తల ఖండించి, అతని స్వర్ణ దాహానికి ప్రతిగా, నోటిలో మరుగుతున్న బంగారాన్ని పోసినాడని ఐతిహ్యం–

ఈ ఏడుగురూ ధన దాహానికి, అత్యాశకు ప్రతీకలు" అన్నాడతడు.

మేము అతడిని వదిలి ముందుకుపోతుండగా పర్వతం కంపించినట్లయ్యింది. నా వెన్నులో చలిబుట్టి వణుకు మొదలయ్యింది. అప్పటివరకూ కదిలే ద్వీపమైన డెలాస్ (Delos)ను 'జోవ్' స్థిరపరచగా 'లాటోనా' దేవత అక్కడే డయానా, అపోలోలకు (ఆకాశపు రెండు నేత్రాలకు) జన్మనిచ్చినప్పుడు – ఆగిన డెలాస్ కంపించినట్లు మేమున్న పర్వతం దద్దరిల్లింది.

మాకు అన్నివేపులా ఆత్మలు– "Gloria in excelsis Deo" - "Glory to the God in the highest" – "అత్యున్నతుడైన దేవునికి జయమగుగాక!" అంటూ గొర్రెలకాపరులు క్రీస్తు జననం రోజున గానం చేస్తున్నట్లు – ఆ ఆత్మలు గానం చేయసాగినాయి.

మేము కన్నీళ్లతో, భక్తిభావంతో ఆ పవిత్ర మార్గాన ముందుకు వెళ్లినాము. ఏమేమో అడగాలని మనసు కోరుతున్నది.

## Canto - 21

**అయిదవ ఆవరణ. అత్యాశాపరులు, దుబారా ఖర్చు పెట్టేవాళ్లు శిక్షల ననుభవించే ప్రదేశం. స్టాటియస్ రాక, వర్జిల్ వివరణం, స్టాటియస్ – ఈనియస్‌పై వెలిబుచ్చిన అభిప్రాయం, వర్జిల్‌పై ఆతనికున్న భక్తిప్రపత్తులు–**

# స్టాటియస్ – వర్జిల్ – డాంటీ

జ్ఞానదాహం తీరడానికి హేతువు ఒక్కటే సరిపోదు. దేవుని కరుణ, నిదర్శనాలు అవసరం. 'సమారియా'లో జాకబ్ నీటిబుగ్గ దగ్గర దాహం తీర్చుకోబోయిన మహిళతో 'జీసస్' అనలేదా – "ఈ నీటిని త్రాగినవారికి మరల దప్పిక వేయును. నేనిచ్చు నీరు త్రాగువానికి శాశ్వత జీవనం లభించును".

నాకు దాహంగా ఉన్నా నేను నా మార్గదర్శకుడి వెనక నడిచాను.

ల్యూక్ తెలిపినట్లు – సమాధి నుంచి లేచి దారిలో ఇద్దరికి కనబడిన జీసస్‌వలె – నాకు ఓ ఆత్మ కనిపించింది. మేము దారిలో బోర్లాపడి వున్న ఆత్మలను తొక్కకుండా జాగ్రత్తగా ముందుకు పోతున్నపుడు ఆతడు మా వెనకనే వచ్చి – "దేవుడు మీకు శాంతి నొసగు గాక!" అన్నాడు. మేము వెనుకకు తిరిగి చూసాము.

వర్జిల్ అన్నాడు– "నన్ను శాశ్వత ప్రవాసంలోకి పంపిన ఆ ప్రభువు నిన్ను తన ఆశీర్వదింపబడిన కూటమిలో చేర్చుకొనుగాక!"

ఆ ఆత్మ అన్నాడు– "దేవుడు మీకు అర్హత ఉన్నదని భావించడం వల్లనే కదా మీకు ఈ పర్వతంపై తిరుగగలుగుతున్నారు"

వర్జిల్ సమాధానమిచ్చినాడు– "రాత్రింబవళ్లు చరఖాను తిప్పే దేవతాస్త్రీ లాఖెసిస్ (Lachesis), మానవుని ఆయుర్దాయాన్ని కొలిచే క్లాతొ (Clotho); జీవన దారాన్ని కత్తిరించే ఎట్రొపాస్ (Atropos) – ఈ ముగ్గురు విధి దేవతలు (Three Fates). ఆత్మలు! నీ ఆత్మ, నాది ఒకే రకంగా చూస్తాము కదా! నేను ఇతనికి మార్గదర్శకుడిగా నరకలోకపు దంష్ట్రల నుండి బయటపడి ఇటు వచ్చాను. ఎంతవరకు నాకు తెలుసో అంతవరకు ఇతనిని ఈపై ఆవరణలకు తీసుకువెళ్తాను. అదిసరే, మరెందుకు ఈ పర్వతం ఇందాక ఇలా దద్దరిల్లింది?"

అతడన్నాడు– "ఈ పర్గెటరీ – ప్రక్షాళనా లోకం, స్వర్గంలా పవిత్రమైనది. ఎటువంటి కుదుపులకు లోనుకానిది. మబ్బులు, మెరుపులు, ఇంద్రధనుస్సు ఇవేమీ ఇక్కడ కానరావు. ఏదైనా ఆత్మ ప్రక్షాళన చెందినట్లు భావించగానే అటువంటి ప్రకంపన దానితోపాటు ప్రార్థన వినవస్తాయి.

నేనిక్కడ అయిదు వందల ఏళ్లపైబడి ఉన్నాను. ఇప్పుడు నేను పైలోకానికి వెళ్లడానికి అర్హుడిగా భావిస్తున్నాను" అన్నాడు.

నా మార్గదర్శకుడన్నాడు– "నిన్ను ఆపుతున్న ఆ 'వల' ఏమిటి? దాని నుంచి మీరెలా బయటపడుతున్నారు? ఈ ఆనందానికి కారణమేమిటి? నీవెందుకు అయిదు వందల ఏళ్లకు పైగా ఇక్కడే ఉన్నావు?"

అతడన్నాడు– "టైటస్ రాజు జెరూసలెంపై దండెత్తి ఆ పట్టణాన్ని నాశనం చేసి, 'జూడా' అమ్మిన రక్తం ప్రవహించిన నేలపై ప్రభువు ప్రతీకారం తీర్చుకున్న రోజుల్లో నేను జన్మించాను. నా తండ్రి టౌలౌస్ (Toulouse). నాపేరు స్టాటియస్ (Statius). నేను థెబాయిడ్ (Thebaid) కావ్యగానం చేసాను. దానిలో చివరిఘట్టం ఎఖిల్లిస్ కథను పూర్తిచేయకుండానే కాలం చేసాను. నా ఖ్యాతి ఆ కావ్యం ద్వారా ప్రసిద్ధమైనది. కాని నాలో ఆ కావ్యబీజం పడి కావ్యంగా మొలకెత్తడానికి, నాకే కాదు నాలాంటి వేలాది కవులకు కాంతిని, జ్వాలను ప్రసాదించిన పవిత్రాగ్నికి నేను చేతులెత్తి నమస్కరిస్తున్నాను.

నేనంటున్నది ఈనియాడ్ (Aeneid) కావ్యం గురించి. నేను కవిత్వం వ్రాస్తున్నపుడు ఆ కావ్యం నాకు తల్లిగా, దాయిగా, నన్ను కాపాడింది. అది లేకపోతే నా కావ్యం వీసమంతెత్తు విలువ చేయదు. వర్జిల్ బతికున్న నేలపై బతికుండడానికి మరో సంవత్సరమైనా ఈ ప్రవాసాన్ని భరిస్తాను" అన్నాడు.

నేనూ, వర్జిల్ ముఖముఖాలు చూసుకున్నాము. ఇద్దరి పెదవులపై చిరునవ్వులు వెలిసాయి. వర్జిల్ – మాట్లాడవద్దు – Be Still - అని సైగ చేసాడు. కాని స్టాటియస్ మా పెదాలపై మెరిసిన చిరునవ్వుకు కారణమడిగాడు. ఇద్దరి మధ్య ఇరుక్కుపోయిన నన్ను చూసి నా మార్గదర్శకుడు నిజం చెప్పమని చెప్పడంతో నేను 'స్టాటియస్'తో అన్నాను– "నా మార్గదర్శకుడైన ఇతడే వర్జిల్. అందుకే ఆ చిరునవ్వు"

స్టాటియస్ ఆరాధనతో నా గురువర్యుని పాదాలను ముద్దాడబోయినాడు. వర్జిల్ అతడిని వారించి– "సోదరా! మనిద్దరం ఆత్మలమే!" అన్నాడు.

స్టాటియస్ అన్నాడు– "నీమీద నాకున్న ప్రేమ, ఆరాధన అలాంటివి. నిన్ను చూడగానే అన్ని స్థితులను మర్చిపోయాను!"

**ఆరవ ఆవరణ – తిండిపోతులకు శిక్షలు – న్యాయాన్ని రక్షించే దేవదూత – స్టాటియస్ అనుభవిస్తున్న శిక్ష – వింతవృక్షం – ఆత్మనిగ్రహం, మితం – వీటికి నిదర్శనాలు.**

# దుబారా వ్యయం చేసేవారికి (Prodigality) శిక్ష

మమ్మల్ని ఆరవ ఆవరణలోకి పంపి, నా నుదుటిపైన మరో 'P' ను తుడిచిన దేవదూత – న్యాయంకోసం పరితపించువారు ఆశీర్వదించబడెదరు – "Sitiunt thrist" అని పలికినాడు.

నేను ఆ యిద్దరు ఆత్మలను అనుసరిస్తూ వెళుతుండగా వర్జిల్, స్టాటియస్‌తో అంటున్నాడు– "సుగుణాలతో ప్రదీప్తమయ్యే ప్రేమ తనకు సమాధానాన్ని రాబట్టు కుంటుంది. 'Love that releases no beloved from loving' – నీ సమకాలికుడు 'జువెనాల్' (Juvenal) నీకు నాపై ఉన్న ప్రేమను, నరకలోకపు 'లింబో' ప్రాంతంలో మేము కలిసినప్పుడు చెప్పినాడు. కాని, నీవు అత్యాశవలయంలో ఎందుకున్నావో నాకర్థంకాలేదు"

స్టాటియస్ సమాధానమిచ్చినాడు– "నేను నీ కావ్యాన్ని చదవకమునుపు పేరాశతో ఉండేవాడినేమో! ఏనాడైతే "Why cannot you, O holy hunger for gold, restrain the appetite of mortals?" – నేను ఆ వాక్యాలను శాసనంగా భావించి అత్యాశకు దూరంగా వున్నాను.

లేకుంటే ఈపాటికి నరకలోకపు నాల్గవలయంలో బరువుల్ని రొమ్ముతో కదిలిస్తూ యాతనలు పడుతూ ఉండేవాడిని కదా!

అంతేకాక మితిమీరిన ఖర్చు చేస్తుండడాన్ని కూడా అదుపులో పెట్టాను. ఆ పశ్చాత్తాపానికి గుర్తుగా నా జుట్టును దాదాపు గుండులా కత్తిరించుకున్నాను. మితిమీరి పొదుపుచేసి మితిమీరి ఖర్చుపెట్టడం దాదాపు సమానమైన పాపాలే! నేను చేసిన పాపం దుబారా ఖర్చు పెట్టడం (Prodigality)."

వర్జిల్ అన్నాడు– "ఇడిపస్, జొకాస్టాల కుమారులు – ఎటియోక్లెస్, పాలినైసిస్ ఒకరినొకరు చంపుకున్న కథను నీవు చరిత్రకు అధిదేవత క్లియొ (Clio) మ్యూజ్ ప్రేరణతో అద్భుతంగా వ్రాశావు కదా! నిన్ను నీవున్న చీకటిలోంచి వెలుగులోకి తెచ్చినదెవరు?"

స్టాటియస్ అన్నాడు– "నీవే! నీవు కాంతిదీపంతో వెళ్తున్న ప్రభువును అనుసరించావు. నేను నిన్ను అనుసరించాను. నీవు వర్ణించావు– 'యుగాలు మరల వస్తున్నాయి. న్యాయం, మానవుని మంచికాలం మరల రానున్నది. స్వర్గం నుంచి కొత్త సంతానం వస్తున్నది'. నేను నీవలన క్రిస్టియన్‌గా మారాను. అప్పటి రోమన్ ప్రభువులు డొమిటియన్, టైటస్‌లు కొత్త మతాన్ని నిషేధించడం, మతస్థులను నానా రకాల హింసలకు గురిచేయడాన్ని గమనించి, బాప్టిజాన్ని పొందినా, నేను నా క్రిస్టియన్ జీవితాన్ని రహస్యంగా గడిపాను. చానాళ్లపాటు 'పాగన్' (Pagan)లా బ్రతికాను. అందుకనే నాలుగు వందల ఏళ్లు నాల్గవ వలయంలో తిరిగాను. నీకు మన టెరెన్స్, సీసిలియస్, ప్లాటస్, వారియస్ ఎక్కడున్నారో తెలుసునా?"

వర్జిల్ సమాధానం చెప్పాడు– "వాళ్లూ, పెర్సియస్, యూరిపిడిస్, ఆంటిఫానే, సిమొనైడిస్, అగాథాన్, ఏంటిగొనె, డీఫైలె, ఇస్మెనె, ఆర్గియా, హిప్సిపైలి, మాంటొ, థెటిస్, డీడామియా, వీళ్లందరూ మొదటి వలయంలో ఉన్నారు. అది చీకటి కారాగారం"

మేము ముందుకు పోతుండగా దారిలో ఓ వింతవృక్షం అడ్డంగా ఉన్నది. అందంగా ఉన్న ఆ .ఫలాలు అందరావు. కొండపై నుండి పడుతున్న నీళ్లు ఈ చెట్టు ఆకులపైబడి అక్కడే మాయమవుతున్నవి. ఫర్ చెట్టుకు వ్యతిరేకంగా ఈ చెట్టుకొమ్మలు పైన పొడవుగా క్రింద పొట్టిగా ఉన్నవి. మేము ఆ చెట్టు వద్దకు రాగానే మాకో స్వరం వినిపించింది– "మీకు ఆహారం ఇవ్వబడదు. మేరీమాత తన ఆకలిని లెక్కచేయలేదు. ప్రాచీన రోమన్ స్త్రీలు మధువును ముట్టలేదు. డానియెల్ రాజభోజనాన్ని తిరస్కరించినాడు. ఆ స్వర్ణయుగపు రోజుల్లో సింధూరపు (Oak acorn) గింజ రుచిగా ఉండేది. వాళ్లు ఏటినీళ్లను అమృతంలా తాగేవారు. ఎడారిలో బాప్టిస్ట్ జాన్ మిడతల్ని, తేనెను తిని జీవించాడు"

## Canto - 23

**ఆరవ ఆవరణ. తిండిపోతులకు శిక్ష – ఆకలిదప్పులతో అలమటించడం – ఫ్లోరెన్స్ స్త్రీల నడవడిపై విమర్శ. వర్జిల్, స్టాటియస్‌ల గురించి డాంటీ అభిప్రాయం.**

# తిండిపోతులకు శిక్ష

పక్షులను వేటాడే కిరాతకుడు చెట్లకొమ్మలలోకి నిశితంగా చూస్తున్నట్లు నేను ఆకుపచ్చని కొమ్మలవేపు చూస్తుంటే నా తండ్రివంటి మార్గదర్శకుడన్నాడు– "వెళ్దాం పద కుమారా! ఇంకా మంచి విషయాలతో మన సమయపు విలువను పెంచుదాం!" మేం కొంచెం దూరం వెళ్లగానే మాకు సంతోషం, దుఃఖం మిళితమైన స్వరం వినిపించింది. "లాబియామియా డొమినె – Labiamea Domine" "నా పెదాలను విప్పుతండ్రీ! నీ స్తుతిగీతములను పాడెదను"

ఇంతలో ఓ గుంపు మా వెనుకనుంచి వచ్చి వేగంగా మా ముందు నుంచి వెళ్లిపోయింది. లోతుకుపోయిన కళ్లు, పీక్కుపోయిన ముఖం, పాలిపోయిన శరీరం, చర్మం ఎముకలకు అతుక్కున్నట్లు, ఎముకలు కనిపిస్తున్నాయి. ఎరిసిక్థాన్ (Erysichthon) కూడా ఇంత ఎండిపోయాడనుకోను. థెస్సాలియన్ యువరాజు ఎరిసిక్థాన్, సిరెస్ వనంలోని పవిత్ర వృక్షాన్ని నరకడంతో కోపగించిన దేవత ఆతడికి ఎంతకీ తీరని ఆకలి కలుగుగాక అని శపించింది. దానితో అతడి సంపదలన్నీ తిండికే హరించుకుపోగా, చివరకు తన కుమార్తెను అనేక రూపాల్లోకి మార్చి (అతనికా విద్య, శక్తి ఉన్నవి) మార్చి అమ్మినా సరిపోక, ఆకలి మరింత ఎక్కువ కాగా తన శరీరాన్ని తానే తినుకుంటూ మరణించాడు.

రోమన్లు జెరూసలెంను ముట్టడించినప్పుడు ఎలిజార్ కుమార్తె మేరీ ఆకలి భరించలేక తన రొమ్ము కుడుస్తున్న పసిపాపను చంపి, పెనంపై కాల్చి తాను సగం తిని మిగతావాళ్లకు ఇవ్వబోగా వాళ్లే భయంతో విహ్వాలులైనారు.

ఈ క్షుధార్తుల మొహాలు 'Om'లా కన్పించాల్సినవి కేవలం 'M' లా కనిపిస్తూ కళ్లు లోపలికి పోయాయి. ఇంతలో ఒక ఆత్మ నన్ను చూసి నిలబడి– "ఆ దేవుని కరుణ నాకు లభించింది" అన్నాడు. అతడి మాట, కళ్లల్లో వెలుగును చూసి ఆతడు నా మిత్రుడు ఫోరెసి (Forese Donati)గా గుర్తుపట్టాను. అతడన్నాడు– "ఎండిపోయిన నా శరీరాన్ని, బొబ్బలెక్కిన చర్మాన్ని చూసి నన్ను తిరస్కరించవద్దు. నీవిక్కడ ఎందుకున్నావో చెప్పు మిత్రమా!"

నేనన్నాను– “నేను ప్రయాణీకుడనై వారిరువురితో వచ్చాను. కాని నీకీ దుస్థితేమిటి?”

అతడన్నాడు– “నీవు చూసిన వింతవృక్షం మాలో ఆకలిని, దాహాన్ని కలిగిస్తుంది. మేము ఈ వలయమంతా తిరిగి ఆ వృక్షం వద్దకు వచ్చేసరికి మరల మాకు ఆకలిదప్పులు అధికమవుతాయి. బాధతో పరిగెడుతూ మరల నీడకోసం చెట్టు వద్దకు చేర్తాము. కాని మాకు నీరు, ఆహారమూ లభించదు. మేము ఆగడానికి వీల్లేదు. ఇలా పరిగెడ్తూనే ఉండాలి”.

జీసస్ శిలువ మీద ఉండి కేకవేయలేదా– "Eli, Eli lama sabachthani? - My God, My God, Why hast thou forsaken me? - దేవా! దేవా! నన్నెందుకిలా వదిలేశావు?” – అతడు తన మృత్యువును ఆనందంగానే ఆహ్వానించినాడు” అన్నాడతడు.

నేనన్నాను– “చాలా తక్కువ సమయంలో నీవు ఈ వలయానికి చేరుకో గలిగావు. ఇదెలా సాధ్యపడింది?”

అతడన్నాడు– “నా భార్య నెల్లా (Nella) ప్రార్థనల వలన, కన్నీళ్ల వలన నాకు త్వరగా క్రిందిలోకం నుంచి విముక్తి కలిగినది. ఆమె సుగుణాలే నన్ను రక్షించి దేవుని సన్నిధిన నిలిపినవి.

సార్డినియాలోని బార్బాగియా స్త్రీలు తమ సుగుణాలతో, మంచి ప్రవర్తనతో క్రైస్తవ ధర్మావలంబకులై ఉండలేదా! ఇప్పటి ఫ్లోరెన్స్ స్త్రీలను చూడు! ఎలా దుర్నీతి పాలైనారో! వాళ్లు అర్ధనగ్నంగా రొమ్ములు బయటకు కనబడేలా తిరుగుతున్నారు! వాళ్లకు విధించబోయే శిక్షలు తెలిస్తే ఆ నోళ్లు ఊళవేయడానికి కూడా పనికిరావు. పసిపాపలకు జోలపాడాల్సిన బుగ్గలపై వెంట్రుకలు మొలిసి, గడ్డాలు పెరుగుతాయి”

నేనన్నాను– “సూర్యుడి ఆసరాతో నేనింతదూరం వచ్చాను. ఇప్పుడు ఆతని సోదరి చంద్రిక (Diana) ఆకాశంపై ఉన్నది. అడుగో నా మార్గదర్శకుడు మహాకవి వర్జిల్ నన్ను నరకాగ్నిలోకంలో విశేషాలను చూపించి, ఈ ప్రక్షాళనా లోకంలోకి తీసుకువచ్చినాడు. ఇక్కడ నుంచి నన్ను ‘బియాట్రైస్’ (Beatrice) పైలోకం వేపు నడిపిస్తుందని తెలిపాడు. ఆ రెండవ వ్యక్తి స్టాటియస్ – అతని గురించే ఇప్పుడు ఈ ప్రక్షాళనా పర్వతం కంపించి ఆతడిని తన నుంచి విముక్తం చేసింది”

## Canto - 24

**ఆరవ ఆవరణ. ఫొరెసి తన సోదరి పిక్కార్డా గురించి వివరిస్తాడు. బొనాగ్వింటా కవి కవిత్వం గురించి మాట్లాడుతాడు. ఫొరెసి – ఫ్లోరెన్స్ గురించి, కొర్సొడొనాటి మరణాన్ని చెబుతాడు. రెండవ వింతవృక్షం. తిండిపోతులకు ఉదాహరణలు, సెంటార్లు, గిడ్యాన్‌చే తిరస్కరించబడిన హీబ్రూలు.**

# ఈవ్, సెంటార్లు, గిడియాన్ సైన్యం

మా సంభాషణ మా నడక వేగాన్ని తగ్గించలేదు. మా నడక వేగం మా సంభాషణనూ తగ్గించలేదు. అనుకూలమైన గాలిలో పడవ ముందుకు వేగంగా పోయినట్లు మేం వెళ్తుంటే, సశరీరంగా ఉన్న నన్ను చూసి ఆత్మలు అవాక్కైనట్లు కనబడ్తున్నాయి.

నేను అడిగాను– "ఫొరెసి! వీళ్లల్లో నాకు తెలిసినవారెవరైనా ఉన్నారా?నీ సోదరి పిక్కార్డా (Piccarda) ఏమైనది?"

ఫొరెసి అన్నాడు– "మంచితనానికి, అందానికి సాటిలేని ఆమె ఒలింపస్‌కు చేరి, కిరీటాన్ని అలంకరించుకునే ఉంటుంది. అదుగో అక్కడ ఉన్నది బొనాగియుంటా (Bonagiunta) అతని పక్కన మరింత బక్కగా ఉన్నది 'సైమన్ డిబ్రియాన్'. అతడెంత తిండిపోతంటే బొల్సెనా 'ఈల్' చేపలను తెప్పించి అవి బతికుండగానే వెర్నాసియా ద్రాక్షసారాయిలో వేయించుకు తినేవాడు. అందుకే ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నాడు. ఇతడు ఉబాల్డిన్, అదుగో బొనిఫేస్" ఇలా అతడు అందరిపేర్లూ చెప్పాడు. నాకు మెస్సర్ మార్ఛిసీ కనిపించాడు.

బొనాగ్వింటా నాతో అన్నాడు– "గెంటుక్కా! Gentucca! ఈమె వలన 'లుక్కా' నగరం అతిధులను గౌరవించే సాంప్రదాయాన్ని నిలబెట్టుకున్నది. మీలో ఎవరు– "Ladies who have intelligence of Love" అన్న కవిత్వం వ్రాసింది?"

నేనన్నాను– "అది నా 'Vita Nuova' కావ్యం లోనిది. నాలో ప్రేమ ఊపిరి తీసుకుంటున్నపుడు నేనా పంక్తులను నా గురువరేణ్యుని ఆసరాతో లిఖిస్తాను"

బొనాగ్వింటా అన్నాడు– "మాకా అదృష్టం లేదు. నాకుగాని, గియాకొమోకు గాని అంత అదృష్టం లేదేమో, మీ కవిత్వంలోని – 'Sweet new manner - dolce stil novo' - మాకబ్బలేదు. అందుకే మీ ఇద్దరి (డాంటీ, వర్జిల్) కవిత్వ ఝురులు ఒకేతీరుగా ప్రవహిస్తాయి".

నైలునదిపై ఎగిరే కొంగలు కాసేపు నెమ్మదిగా ఎగుర్తూ ఓ గుంపు ఏర్పడినాక వేగంగా పోయినట్లు ఆ ఆత్మలందరూ మమ్మల్ని వదిలిపోతుండగా 'ఫొరెసి' అన్నాడు– 'నీవున్న లోకం ఇప్పుడు పాపులతో నిండి ఉన్నదని దిగులు చెందకు. వాళ్లందరూ ఆ

మృగపు తోకకు చుట్టబడి నరకాగ్నిలోకంలోకి నెట్టబడతారు. ఇక నేను వెళ్లడానికి అనుమతి ఇవ్వు" అంటూ అతడు పెద్దపెద్ద అంగలు వేస్తూ గుంపులో కలవడానికి వేగంగా వెళ్లిపోయాడు.

నాకు కొంచెం దూరంలో ఫలపుష్పభరితమైన మరో వృక్షం కనిపించింది. ఆ చెట్టుకింద కొందరు ఆత్మలు చేతులు పైకెత్తి చిన్నపిల్లల్లా ఏదో అరుస్తున్నారు. అరచీ అరిచీ నోరు నెప్పెట్టినా వారు అడిగింది దొరకక నిరాశతో వెళ్లిపోతున్నారు. కన్నీళ్లను, ప్రార్థనలను నిరాకరిస్తున్న ఆ వృక్షం, ఈవ్ ఫలాల్ని ఆరగించిన వృక్షంపైన పెరిగి ఉన్నది. మా ముగ్గురికి ఆ చెట్టుకొమ్మలలో నుంచి ఏదో స్వరం వినబడింది. "మేఘాల్లో జన్మించి, రెండు ఛాతీలున్న, దురదృష్టవంతులను థెసియస్ (Theseus)తో యుద్ధానికి దిగిన ఆ సెంటార్లను (Centaurs)ను గుర్తు తెచ్చుకోండి. సెంటార్లు గుర్రపు శరీరంతో, మానవదేహం బొడ్డుపై నుండి గుర్రపుమెడకు కలపబడి రెండు ఛాతీలతో ఉంటుంది. 'హెరా'పై కన్నుబడ్డ ఇక్జియాన్, హెరారూపంలో ఉన్న మేఘంతో కలవగా మేఘం నుంచి సెంటార్లు జన్మించారు. వాళ్లు ఇక్జియాన్ కుమారుడు 'పిరిథౌస్' (లాపిట్ రాజు), ఆర్గాస్ రాజు ఎడ్రాస్టస్ కుమార్తె 'హిప్పొడామియా'తో వివాహపు విందుకు హాజరై, తాగిన మైకంలో పెళ్లికూతుర్ని అపహరించుకుపోబోగా, పిరిథౌస్ స్నేహితుడు థెసియస్ (Theseus) సెంటార్లను ఓడిస్తాడు. మితిమీరి తిని తాగడం వలన జరిగే అనర్థం ఇది.

వద్దంటే వినకుండా నిషేధించిన ఫలాన్ని ఆరగించిన 'ఈవ్' ఉదాహరణ మీకు ముందే తెలుసును కదా!

గిడియాన్ (Gideon) పదివేలమంది సైనికులతో మిడియానైట్లతో యుద్ధానికి పోయినప్పుడు నీటిని చూడగానే అందరూ నీళ్లపై బోర్లాపడి కుక్కల్లా నాలుకలతో నీళ్లను చప్పరించగా, కేవలం మూడు వందల మంది నీటిని తమ దోసిళ్లలో పోసేంతవరకు ఓపికగా ఉన్నారు. ఈ మూడు వందల మందితోనే గదా గిడియాన్ మిడియన్లను జయించింది" అన్నదా గొంతు.

మేము అక్కడనుంచి జాగ్రత్తగా ముందుకు నడుస్తుండగా– "ఎవరు మీరు? అలా ముగ్గురే పోతున్నారు?" అన్న కేక వినబడింది. అతని కళ్లు కొలిమిలో మండుతున్న లోహంలా ఎర్రగా ఉన్నాయి. "మీరు పైకి వెళ్లదలుచుకుంటే ఇక్కడే దారి ఉన్నది. శాంతిని కోరువారు ఆశీర్వదించబడుదురు"

మే నెలలో వీచే పవనాల అలలకు కదిలిన పుష్పాల నుంచి వెలువడిన సుగంధం మనసులను తేలికబరచినట్లు, నా నుదుటికి ఏదో మెత్తని రెక్క తగిలినట్లు, అమృతపు వాయువీచిక నన్ను స్పృశించినట్లు నాకనిపించింది. నా చెవులకు ఏదో ఆజ్ఞాస్వరం మంద్రంగా వినిపించింది– "కరుణ చేత ప్రకాశింపబడుతున్నవారు ధన్యులు! వారి హృదయాలలో ప్రేమ మాధుర్యము, కోరికలను అమితంగా రగుల్చ కుండును గాక! వారి ఆకలి మితంగా ఉండును గాక!"

## Canto - 25

**ఏడవ ఆవరణం. కామోద్రేకులకు శిక్ష. సన్నగా పలచగా వున్న ఆత్మలు. స్టాటియస్ – పుట్టుక, చావు, ఆత్మల గురించి వివరణ; కామోద్రేకులకు అగ్నిజ్వాలల మధ్య ప్రక్షాళన. సచ్ఛీలానికి ఉదాహరణలు.**

# కామోద్రేకులకు శిక్ష-1

సూర్యుడు వృషభరాశి (Taurus) వేపు మళ్లగా, రాత్రి వృశ్చికరాశి (Scorpion)లో ఉన్నది. ఒకరి వెనుక ఒకరం మేము ఆ సన్నని ఇరుకైన మెట్లవెంబడి ఏడవ ఆవరణలోకి అడుగుబెట్టినాము. పిల్లకొంగ గూడు నుండి వెళ్లదలుచుకుని రెక్కలు ఆడించబోయి ఆగినట్లు, నేనూ ప్రశ్నలు సంధించబోయి ఆగాను. నా తండ్రి, గురువు, మార్గదర్శకుడన్నాడు– "బాణపు ములికి వింటిబద్దకు దగ్గరగా ఉన్నది. మాటల శరాల్ని వదులు".

నేనడిగాను– "ఆహారమే అవసరం లేనప్పుడు ఆత్మ బక్కగా ఎలా అవుతున్నది?

ఆతడన్నాడు– "నీకు మెలీగర్ (Meleager) కథ తెలుసు కదా! కాలిడాన్ రాజు ఓనియస్, రాణి ఆల్థియాల కుమారుడు మెలీగర్. తన కుమారుడి జీవితం 'ఆ కొయ్యదుంగ (Log) కాలినంత సేపే' అని విధిదేవతల నిర్ణయాన్ని తెలుసుకున్న ఆల్థియా కాలుతున్న కొయ్యదుంగను ఆర్పి దానిని ఓ పెట్టెలో దాస్తుంది. మెలీగర్ పెద్దవాడై అనేక సాహసాలు చేసి, ఆ క్రమంలో తన తల్లి సోదరులిద్దరిని చంపగా దుఃఖంతో, కోపంతో ఆల్థియా ఆ సగం కాలిన కొయ్యదుంగను మంటల్లో పడేసేసరికి 'మెలీగర్' చనిపోతాడు. మానవ జీవితం బయటి శక్తులపై ఆధారపడి ఉంటుంది సుమా! అయినా, నీ సందేహాలను స్టాటియస్ తీరుస్తాడులే!"

స్టాటియస్ అన్నాడు– "ఆకలిగా, దాహంగా ఉన్నా మేజాబల్లపై ఉన్న పదార్థాలనన్నిటినీ ఆరగించలేము కదా! తిన్నదంతా వంటపట్టనూ పోకపోవచ్చు. వంటపట్టినది జీవస్రావమై వీర్యమై ఇంకో వ్యక్తి దానిని గ్రహించినపుడు రెండూ కలిసి ఒక ఆత్మ జనిస్తుంది. అది గర్భస్థశిశువుగా, సముద్రపు స్పాంజ్‌లా, పెరుగుతూ తన శక్తిని వృద్ధి చెందించుకుంటుంది. మొక్కలైతే వెంటనే పెరుగుతాయి. గర్భస్త శిశువు (పిండము) తన ప్రయాణాన్నింకా చేస్తూనే ఉంటుంది. శరీరంలోని అన్ని అవయవాలు ఏర్పడినాక, హృదయం, మెదడు వృద్ధి చెందినపుడు దానిలోకి పరమాత్మ, జీవాత్మను ఊదుతాడు. హృదయపు రూపనిర్మాణశక్తి (Formative Power) దేవుడిచ్చిన ఆత్మశక్తితో 'లాఖెసిస్' ఇచ్చిన 'జీవదారం' (Thread of Life) పొడుగంత బతికిన మానవుడు మరణిస్తాడు. శరీరం నుంచి విడిపోయిన ఆత్మ ఇప్పుడు మరింత చురుకుగా ఉండగా మానవ శరీరావయవాలు లేకపోయినా వాటి ఇంద్రియజ్ఞానం (Vegetative and Sensitive) ఇంకా కొంత ఉంటుంది.

టైబర్ నదీ ముఖద్వారం వద్దనో, ఎఖెరాన్ నదీతీరం వద్దనో తరువాత లోకంలో తన స్థితిని తెలుసుకున్న ఆత్మలో 'రూపనిర్మాణశక్తి' (Formative Power) మరల అధికమై పూర్వపు రూపురేఖలు వస్తాయి. శరీరం లేదు కనుకనే దానిని 'నీడ' లేదా షేడ్ (Shade)గా ఆత్మగా పిలుస్తాము. కొద్దికొద్దిగా ఆత్మకు ఇంద్రియజ్ఞానం వస్తుంది. స్పర్శ, రుచి, వాసన, వినికిడి, చూపు తిరిగి రాగా ఆత్మలు మాట్లాడుతాయి. ఏడుస్తాయి, శిక్షలననుభవిస్తూ నొప్పిని భరిస్తాయి. బాధపడ్తాయి.

ఎక్కడైతే ఆత్మ ఉన్నదో అక్కడి గాలి, సూర్యకాంతితో కలిసి తన పూర్వరూపాన్ని నీడగా, షేడ్‌గా చూపిస్తుంది. కాని ఆత్మలకు, సశరీరులకున్న నీడ ఉండదు. అవి వెలుగును అడ్డుకోవు"

మేము అలా మాట్లాడుకుంటూ కుడివేపు నడుస్తుండగా మా ఎదుటనే పర్వతం నుండి జ్వాజ్వల్యమానంగా మంటలు వస్తూండగా, ఆవరణ నుంచి వీస్తున్న గాలి ఆ మంటలను అదుపులో ఉంచుతున్నది.

మేము ఆ సందులోనుంచి ఒక్కొక్కరం ముందుకు వెళ్లినాము. మాకు ఎడమ పక్కన అగ్నిజ్వాల. కుడిపక్కన కొండచరియ. భయభయంగా ముందుకు కదిలాను. నా మార్గదర్శకుడన్నాడు– "ఈ ఆవరణలో నడుస్తూ దిక్కులు చూడకు. కొంచెం దృష్టిమళ్లినా నీవు బాధపడాల్సి వస్తుంది".

మాకు ఆ మంటలోనుంచి ఓ స్వరం వినవచ్చింది– "Summae Deus Clementiae - ప్రభూ! మా శారీరక ఉద్రేకాలను తగ్గించుకోవడంలో సాయం చేయి! – Gird thou our loins, each passion quell"

ఆత్మలు ఆ మంటగుండా నడవడం చూసాను. ఆ అగ్నిజ్వాలల్ని దాటుతూ వాళ్లు పాడుతున్నారు– Virum non cognosco - I know not a man - గాబ్రియెల్ దేవదూత మేరీకన్యకు చేసిన ప్రకటన (Annunciation) సమయంలో ఆమె అన్నది– "How shall this be, seeing I know not a man?"

అలా పాడుతూనే, మరల మరల స్తుతిస్తూనే ఆ ఆత్మలు ఎలుగెత్తి చెబుతున్నాయి– "దయానా తన చెలికత్తె హెలిసె (కాలిస్టో)ను తన పరివారం నుంచి తీసివేయలేదా, ఆమెను జోవ్ దేవుడు వీనస్ విషంతో (కామంతో) వశపరచుకున్నాడని తెలియగానే!"

వాళ్లు మరల పాటలు పాడుతూ సచ్ఛీలురైన భార్యలను భర్తలను పొగుడుతున్నారు.

ఆ ఆత్మలను అగ్నిజ్వాల ప్రక్షాళన చేస్తున్నది. ఈ ఆఖరి గాయానికి, పాపానికి అగ్నిజ్వాలలే ఆహారమూ, మందూ కూడా!

**Canto - 26**

**ఏడవ ఆవరణ. సశరీరుడైన డాంటీ ఆత్మలకిచ్చిన వివరణ – కామోద్రేకులు – వ్యతిరేకదిశలో వచ్చినవాళ్లు – 'గిడొ' కవితో సంభాషణ – డాంటీను పలకరించిన ఆర్నాట్ డానియెల్ కవి.**

# కామోద్రేకులకు శిక్ష-2

ఒక్కొక్క అడుగూ ముందుకువేస్తూ మేము నడుస్తుండగానే నీలి ఆకాశం తెలుపురంగును సంతరించుకుంటున్నది. నేను ముందుకు పోతున్నపుడు నా నీడ పడినవేపు మంటలు నాలుకలు చాపి మరీ ప్రజ్వరిల్లుతున్నట్లు నాకనిపించింది. దాన్ని చూసిన ఆత్మలు కూడా ఆశ్చర్యంతో– "ఈతడు సశరీరుడులా ఉన్నాడే" అన్నారు.

మంటల్లోంచే వాళ్లు నన్ను ఆశ్చర్యంగా చూస్తున్నారు. వాళ్లలో ఒకడన్నాడు– "ఇది మేమందరం అడుగుతున్న ప్రశ్న! ఈ సందేహదాహం మమ్మల్ని – ఇండియా, ఇథియోపియాలలో దాహంకోసం అలమటిస్తున్న ప్రయాణీకులకన్నా – ఎక్కువగా బాధిస్తున్నది. సూర్యకాంతికి నీవు గోడలా ఎలా అడ్డం రాగలుగుతున్నావు? ఇక్కడ తిరుగాడగలిగింది ఆత్మలే కదా!"

నేను మాట్లాడబోయేంతలో మాకెదురు దిక్కు నుంచి మరో ఆత్మల గుంపు వచ్చి – ఎదురెదురుపడిన చీమల్లా – ఒకరినొకరు కౌగలించుకుని కుశల ప్రశ్నలు వేసుకుంటున్నారు. ఎదురు వచ్చిన వాళ్లు వెళ్లబోతూ – "సోడోమ్, గొమొర్రా" అని అరిచారు. మిగతావాళ్లు – "గిత్తను పెయ్యదగ్గరకు పరుగెత్తనీ, పసిఫె (Pasiphae) పెయ్యలో చేరింది" అని కేకలు పెట్టినారు. ఎండకు తట్టుకోలేక రిఫయన్ కొండలవేపు ఎగిరే కొంగల్లా కొందరు, మంచుకు తాళలేక ఇసుక ఎడారులవేపు ఎగిరే కొంగల్లా మరికొందరు కేకలు పెడ్తూ పోవడం కన్నీళ్లతో వచ్చి అగ్నిజ్వాలల్లో శుద్ధికావించబడి మరలా కేకలుపెడ్తూ పోవడం ఇలా పలుమార్లు చేస్తూనే ఉన్నారు. నేను వాళ్లకు నా గురించి చెప్పి ఎందుకు ఆత్మలు ఇలా వేర్వేరు దిక్కులలో పరిగెత్తుతున్నాయో చెప్పమని అడిగాను. ఇందాక నన్ను ప్రశ్నించినవాడు సమాధానమిచ్చాడు– "ఈ ప్రాంతాలలో జరిగే విశేషాలను గమనించి జ్ఞానవంతుడవైన నీవు ఆశీర్వదింపబడుదువుగాక! మాకు వ్యతిరేకంగా వెళ్లేవాళ్లు ఒకప్పుడు 'సీజర్' ఊరేగింపుగా వెళ్తుంటే, గుంపులోంచి ఒకడు 'రాణీ' Queen! అని ఎగతాళిచేసి సీజర్ అసహజ లైంగిక ప్రవర్తనను గుర్తుచేసినట్లు – ఆ అసహజ లైంగిక కార్యాలలో పాల్గొన్నవాళ్లు – అందుకే వాళ్లు 'సోడోమ్' అని అరుస్తున్నారు. మంటలు వారి పాపాన్ని కాల్చివేస్తున్నవి.

మా కోర్కెలను 'పసిఫె' రాణి గిత్తతో రమించినట్లు మేము మా కామాన్ని తీర్చుకున్నాము. నాపేరు 'గిడొ గ్విసిజెల్లి'. నేను అంతిమ దినాల్లో పశ్చాత్తాప పడినందువలన నాకు క్షమ లభించినది" అన్నాడతడు.

నేనభిమానించే కవిని చూడగానే– లైసర్గస్ చేతిలో మరణశిక్షను పొందబోతున్న తల్లి హిప్సిపైలెను రక్షించిన ఆమె కుమారులు ఒయాస్, యున్యుస్‌లా – నేను 'గిడొ' కవిని సాదరంగా చూసినాను. అతడడిగాడు– "ఎందుకు నీ కళ్లల్లో నాపై ప్రేమ కనిపిస్తోంది?"

నేనన్నాను– "అది నీ కవితారఝరి మహత్యం! మాబోటివాండ్లకు మార్గదర్శకం! అతడు ఇంకో వ్యక్తిని చూపించాడు– "ప్రొవెన్సియల్ కవులలో 'గిరాట్' (Giraut) – రెక్టిట్యూడ్ కవిత్వానికి; ఆర్నాట్ డానియెల్ (Arnaut) ప్రేమ కవిత్వానికి, బెర్ట్రాన్ (Bertran) యుద్ధకవిత్వానికి ప్రసిద్ధులు. అయినా పేరు ప్రఖ్యాతులు 'గిట్టొని' కొట్టేసినాడు.

మా పాపాలు ఈ అగ్నిజ్వాలల్లో నశించాక మేము, నీవు క్రీస్తు అధిపతిగా ఉన్న కళాశాలలో మళ్లా కలుద్దాం!" అంటూ అతడు అగ్నిజ్వాలల్లోకి అదృశ్యమైనాడు.

నేను 'గిడొ' ఇందాక చూపించిన 'ఆర్నాట్' (Arnaut) కవిని పలకరించాను. అతడు తన మాతృభాష ప్రొవెన్‌కాల్‌లోనే మాట్లాడినాడు– "Ieu sui Arnault - నాపేరు ఆర్నాట్! నా తప్పులు, పాపాలు నాకు తెలుసు. వాటినుండి పరిశుద్ధుడనవు తున్నాను. విముక్తికాలం త్వరలో రానున్నది. సమయం వచ్చినప్పుడు నీవు నేను పడ్తున్న బాధను గుర్తుంచుకో! సెలవు!"

అంటూ అతడు మలినమైన ఆత్మలను పరిశుద్ధిపరచే ఆ అగ్నిజ్వాలలో దాక్కున్నాడు.

**Canto - 27**

**ఏడవ ఆవరణ నుంచి భూలోకస్వర్గపు గుమ్మం వేపు ప్రయాణం. సచ్ఛీలపు దేవదూత – అగ్నిజ్వాలల్లో అడుగుపెట్టడానికి భయపడిన డాంటీ! వర్జిల్ ఆజ్ఞతో అగ్నిజ్వాలాతోరణం నుంచి వచ్చిన డాంటీకు కలలో కనిపించిన లియా (Leah), రాఛెల్ (Rachel) లు.**

# భూలోక స్వర్గం వేపు ప్రయాణం

క్రీస్తు తనువు చాలించిన జెరూసలేం వద్ద ఇప్పుడు ఉదయం, స్పెయిన్‌లోని ఎబ్రొనదికి పైన తులారాశి (Libra) – జిబ్రాల్టర్ అగ్రం వద్ద అర్ధరాత్రి, గంగానది వద్ద మిట్టమధ్యాహ్నం, పర్గేటరీ (ప్రక్షాళనా పర్వతం) వద్ద సూర్యాస్తమయ సమయం. ఆ దేవదూత అగ్నిజ్వాలల కావల ఉండి– "Beati mundo carde - Blessed are the pure in heart, for they shall see God - స్వచ్ఛమైన హృదయమున్నవారు దేవుని దర్శించెదరు" అని గానం చేస్తూ అన్నాడు– "పవిత్రాత్మలారా! ఆ పావన అగ్నిద్వారా ఇటురండు. అపాత మధురమైన ఆ పాటను వినుటకు విచ్చేయుడు!"

ఆ మంటలను చూడగానే, చితిమంటల్లో కాలుతున్న దృశ్యం గుర్తుకు వచ్చి ఆ జ్వాలలు నాకు తగలకుండా చేతుల్ని అడ్డం పెట్టుకున్నాను. నా మార్గదర్శకుడన్నాడు– "కుమారా! ఇక్కడ బాధ ఉండవచ్చు కాని మరణం లేదు. నిన్ను నేను గెర్యాన్ వీపుమీద కాపాడినవాడిని, దేవుని దగ్గరలో గమ్యం చేరకుండా వదిలేస్తానా? నీవు ఈ అగ్ని వలయంలో వేయేళ్లు కాగినా నీ శిరస్సుపై ఒక్క వెంట్రుక కూడా కాలిపోదు. కావాలంటే నీ చేతుల్తో ఆ అగ్నిని అంటి చూడు!"

నేను ఒక్క అడుగుకూడా ముందుకు వేయకపోవడం గమనించిన ఆతడన్నాడు– "కుమారా! ఈ అగ్నిగోడ నీకూ, బియాట్రైస్‌కు మధ్య ఉన్న ఒకే ఒక ఆటంకం!". బియాట్రైస్ మాట వినగానే నేను– (చనిపోబోతున్న 'పిరామస్' (Pyramus) థిస్బె (Thisbe) పేరు విని కళ్లు తెరిచినట్లు – వాళ్లిద్దరూ ప్రేమికులు. పెద్దవాళ్లకు వీళ్ల ప్రేమ ఇష్టంలేదు. 'నైసస్' సమాధి దగ్గర కలుసుకోవాలనుకున్న రోజున 'థిస్బె' ముందు వచ్చి అక్కడున్న సివంగిని చూసి భయపడి పారిపోతూ తన మేలిముసుగును పోగొట్టుకున్నది. తరువాత వచ్చిన 'పిరామస్' సివంగి నోటిలో 'థిస్బె' వస్త్రాన్ని చూసి సింహం నోటబడి 'థిస్బె' చనిపోయిందని భావించి మల్బెర్రి చెట్టు కింద కత్తితో పొడుచుకున్నాడు. ఆతని గుండె నుండి కారిన రక్తంతో తెల్లటి మల్బెరి పళ్లు రక్తవర్ణంలోకి మారాయి. అప్పుడే వెనక్కి తిరిగివచ్చిన 'థిస్బె' ఆ దృశ్యాన్ని చూసి విలపిస్తూ ఉండగా 'పిరామస్' కళ్లు తెరిచినాడు. అదే కత్తితో తానూ పొడుచుకుని ఇద్దరూ చనిపోతూ ఉండగా 'థిస్బె' – ఎప్పటికీ ఈ మల్బెరి పళ్లు రక్తవర్ణంలో ఉండుగాక! అని పలికి మరణించింది") ముందుకు నడిచాను.

ముందుగా వర్జిల్, అతడి వెనుక స్టాటియస్, చివరగా నేను అగ్నిజ్వాలలో అడుగుపెట్టినాము. నేను ఆ మంటల తీవ్రతను భరించలేకపోతూండడాన్ని గమనించిన వర్జిల్ "అవిగో! బియాట్రైస్ నయనాలు. మనం ఆ లోకంలోకి అడుగుపెడ్తున్నాము" – అంటూ నాకు స్వాంతనకూర్చే ప్రయత్నం చేసినాడు.

అప్పుడు మాకు – Venite, benedict, Patris mei - నా తండ్రి మీకోసం ఏర్పరచిన లోకంలోకి స్వాగతం! – అన్న గీతం మృదుమధురంగా వినిపించింది. ఆ దేవదూత అత్యంత ప్రకాశవంతంగా మెరుస్తుండగా నేను కనులు మూసుకున్నాను. ఆ దేవదూత అన్నాడు– "సాయంసమయమవుతున్నది. పడమట చీకటి ఆవరించే లోపల పైకి వెళ్లండి". మేము కొన్ని మెట్లు ఎక్కుతుండగానే సూర్యుడు అస్తమించాడు. చీకటి నలుదిక్కులా కమ్ముకొనసాగింది. ఆ మెట్లనే శయ్యగా భావిస్తూ నేను కూలబడ్డాను. పగలంతా సూర్యుడి వెలుగులో మేతమేసిన గొర్రెలు చీకటిపడగానే విశ్రమించగా, గొర్రెల కాపరులు తమ కర్రలను ఆసరాగా చేసుకుని మందలను గమనిస్తున్నట్లు వారిద్దరూ నన్ను గమనించసాగారు. తూర్పున వీనస్ నక్షత్రం రాగా నాకు నిద్రపట్టింది. ఆ కలలో ఒక అందమైన యువతి పూలను సేకరిస్తూ పాటను పాడుతూ అంటున్నది– "నాపేరు 'లియా' (Leah). నేనీపూలతో మాలకడ్తాను. అలంకరించుకుని అద్దంలో చూసుకు మురిసిపోతాను. నా సోదరి రాఛెల్ (Rachel) అద్దాన్ని వదలదు. పూలను తెచ్చుకోదు. నేను కష్టపడే నా చేతుల్ని ఇష్టపడతాను. ఆమె అద్దంలో ఆలోచనలతో తృప్తిపడుతుంది. మనకు తెలుసు – ఇసాక్, రెబెకాల కుమారుడు జాకబ్. అతడికి లాబాన్ (Laban) కుమార్తె 'రాఛెల్' అంటే ఇష్టం. ఏడేళ్లు నా దగ్గర పనిచేయి కూతుర్నిస్తా! అన్నాడు లాబాన్! ఏడేళ్లు గడిచాక రాఛెల్ బదులు పెద్దకూతురు 'లియా'ను ఇచ్చాడు. మరో ఏడేళ్లు సేవచేయి – రాఛెల్‌ను ఇస్తాలే అన్నాడు లాబాన్. ఈ ఏడేళ్లలో 'లియా'కు ఏడుగురు పిల్లలు కలిగారు. తరువాత 'రాఛెల్'ను వివాహమాడిన జాకబ్‌కు రాఛెల్ ద్వారా ఇద్దరు పిల్లలు కలిగారు. 'లియా' క్రియాజీవితానికి, రాఛెల్ – ఊహా జీవితానికి, అద్దం దైవకాంతికి ప్రతీకలు"

నాకు మెలకువ వచ్చింది. ఇద్దరు అధ్యాపకులు అక్కడే వున్నారు. వర్జిల్ అన్నాడు– "కుమారా! నీవిప్పుడు ఒంటరిగా పోవాల్సిన తరుణం. నీవు తాత్కాలికాగ్ని ప్రక్షాళనాలోకాన్ని, శాశ్వతాగ్ని నరకలోకాన్ని చూసావు. నిన్ను జ్ఞానం, కళల మార్గాలలో ఇప్పటివరకు నేను నడిపించాను. నీ నుదుటిపైనున్న ఏడు మచ్చలు తొలిగిపోయినవి. ఇక ఇరుకుదారులు, నిలువు కొండలు ఉండవు. నీ సంతోషమే నీకు దారిని చూపుతుంది. నీ కనుబొమల ముందు నిలిచే సూర్యుడిని చూడు, ఆ పచ్చని పచ్చిక, అందమైన పూలు, లతలు, గుల్మాలు ఇవి నీకు దారిని చూపుతాయి. ఏ విలపిస్తున్న నయనాలు నన్ను నీతోడుగా వెళ్లమని అర్థించాయో, ఆ నయనాలే నీకు తోడుగా రాబోతున్నాయి. స్వేచ్ఛగా పయనించు! నీకు నిన్నే న్యాయాధికారిగా అభిషిక్తుడిని చేస్తున్నాను. ఇదుగో కిరీటం. న్యాయదండం!"

## Canto - 28

**భూలోక స్వర్గం. దివ్యవనం – లెథె ప్రవాహం వద్దకు వెళ్లిన డాంటే! మాటిల్డా దర్శనం, ఆమె దివ్యవనంలో గాలి, నీరు జనించిన విధానాన్ని వివరిస్తుంది. లెథె ప్రవాహానికి మరోపేరు యునొయి (Eunoe). ప్రక్షాళనా పర్వతంపై నాల్గవరోజు.**

# దివ్యవనంలో లెథె ప్రవాహం

నాలో నన్ను, నాచుట్టూరా ఉన్న వనాన్ని శోధించడానికి ఇప్పుడు నేను ఒంటరిగా భూలోకస్వర్గంలో ప్రయాణిస్తున్నాను. ఆ దివ్యవనం ఆకుపచ్చని వృక్షాలతో, దట్టంగా ఉన్నది. నెమ్మదిగా నడుస్తూ ఆ ఉదయపుకాంతిలో నేను మైదానాన్ని వీడి అరణ్యం వేపు నడక సాగించాను. చక్కని సుగంధ వాయుపరిమళాలు. గాలి అల్లనల్లన వీస్తూండగా చెట్లకొమ్మలు సంగీతానికి తలాడిస్తూ ఆకులు వయ్యారాలు పోతున్నా అవి తమ రెమ్మలపై వాలిన చిన్నపిట్టల్ని బెదరగొట్టడం లేదు. పక్షులు తమతమ గీతాలతో ఉదయాన్ని స్వాగతిస్తున్నాయి. ఇవొలస్ (Aeolus) తన గుహల్లో బంధించి వదిలిన 'సిరొక్కొ' (Sirocco) వాయువు ఉత్తర ఆఫ్రికాతీరం నుంచి వీస్తున్న వేడిగాలిగా అడ్రియాటక్ తీరపు పైన వనాల్ని, రవెన్నా పట్టణాన్ని, 'క్లాసె' సమాధికాబడిన తీరాన్ని స్పృశిస్తున్నట్లు – ఇక్కడా గాలి మంద్రంగా వీస్తున్నది.

నేను అలా అరణ్యంలోకి పోగాపోగా నా కళ్లెదుట ఒక నీటిప్రవాహం నా దారికి అడ్డంగా కనిపించింది. స్వచ్ఛమైన నీరు, దట్టమైన ఆకులతో నిండిన వృక్షాలు ఆ నీటిపై సూర్యచంద్రుల కాంతులను పడనివ్వడం లేదు. నేను పూలతో నిండిన అవతలిగట్టు వేపు చూసాను. ఆశ్చర్యం. అల్లంతదూరాన ఓ అందమైన యువతి పాటలను పాడుతూ, పుష్పాలను సేకరిస్తూ ఉన్నది.

నేనన్నాను– "వనకన్యలా ఉన్న దేవతా! నేను నిన్ను ప్రార్థిస్తున్నాను. ప్రేమ, కారుణ్యాలతో అలరారుతున్న నీవు కాస్త ఇటువేపు వస్తే మీ గానాన్ని విన ఉత్సాహపడుతున్నాను. నా కళ్లకు నీవు ప్రొసర్పినా (Proserpina) దేవతలా కనిపిస్తున్నావు"

ఆమె నెమ్మదిగా నావేపు తిరిగి తలను పైకెత్తి కరుణతో నిండిన కళ్లతో నావేపు చూసింది. తన కుమారుడు క్యుపిడ్ (Cupid) పొరపాటున వదిలిన బాణం తగిలినప్పుడు 'వీనస్' అనురాగం నిండిన కనులతో 'ఎడొనిస్' (Adonis)ను చూసినట్లు ఆమె నావేపు చూసి మనోహరంగా నవ్వింది.

అక్కడ మూడడుగుల వెడల్పు మాత్రమే ఉన్న ఆ ప్రవాహం – ఆనాడు హెల్లెస్‌పాంట్ (Hellespont - Dardanelles) వద్ద సముద్రాన్ని దాటి గ్రీకులపై

దండయాత్ర చేసి ఓడిపోయిన క్జెరెక్జెస్ రాజును; తన ప్రేమికురాలు హీరో (Hero)ను కలవడానికి అబిడాస్ నుంచి సెస్టాస్ వరకు ఉధృతంగా ప్రవహిస్తున్న నదిని హెల్లెస్ పాంట్ వద్ద దాటబోయి మునిగిపోయిన లియాండర్ (Leander)ను గుర్తుచేస్తున్నది.

ఆమె అన్నది– "నీవిక్కడకు కొత్తగా వచ్చినట్లున్నావు. ఇది మానవులకు తొలి గూడు. నేను ఆలాపిస్తున్న సామగానం – Delectasti - Lord has made me glad through Thy work, I will triumph in the work of Thy hands. - ఇదే నా చిరునవ్వుకు అర్థం. నేను నీ సందేహాన్ని తొలిగిస్తాను. అందరిలోని మంచితనమే ఆతడు– The Highest good is God. అదే మానవుడిలో ఉండాలని తలచినాడు. అందుకే తొలిమానవులకు ఆతడు ఈ ప్రదేశాన్ని, అనంతమైన శాంతి సౌఖ్యాలతో ఉన్న దానిని ఇచ్చినాడు. మానవుడు తన స్వేచ్ఛా సంకల్పంతో (Free will) తనకు నిషేధించబడిన కార్యాన్ని చేసి తన స్థానాన్ని పోగొట్టుకున్నాడు. మానవుని దోషం అతడిలోని నవ్వును, ఆనందాన్ని తొలగించి దానిస్థానే దుఃఖాన్ని, వ్యాకులతను నింపినది.

ఈ పర్వతం క్రింద మట్టి, నీటిరేణువులు వేడి ఆవిరిగా ఉప్పొంగి అప్పుడప్పుడూ ఈ పర్వతాన్ని అతలాకుతలం చేస్తుంటాయి. ఈ పర్వత శిఖరాగ్రం స్వర్గానికి దగ్గరగా ఉండి ఏ ఒడిదుడుకులూ ఉండవు.

వాతావరణమంతా ఒక వలయంలో పరిభ్రమించడం చేత, ఎప్పుడైనా మొదటి వలయం, శిఖరానికి తగిలినప్పుడు ఈ దట్టమైన వృక్షాలు ప్రతిధ్వనిస్తాయి. ఆ తాకిడికి ఈ వృక్షాల విత్తనాలు మరో వలయంలోకి పోతాయి. ఆ అర్ధగోళంలో వేర్వేరు రకాల చెట్లూ, జంతువులూ ఉండి ఒక్కోసారి వాటి విత్తనాలు ఈ లోకంలోకి రావచ్చును. అందుకే ఒకేసారి భూమిపై వింత మొక్కలు, జంతువులు కనిపిస్తూ ఉంటాయి.

ఈ నేలపై అన్నిరకాల వృక్షాలు వున్నా వాటి పండ్లు సేకరణకు దొరకవు. దేవుని కరుణతో స్వచ్ఛంగా, ఎల్లప్పుడూఉబికే నీటిబుగ్గ నుంచి వచ్చిన ప్రవాహం – ఇటువేపు లెథె (మరపు) నదిగా, అటువేపు 'యునో' (Eunoe)గా పిలువబడుతుంది. లెథె నీళ్లు తాగినవాళ్లు అన్నీ మరచిపోతారు. 'యునో' నీళ్లు తాగినవాళ్లకు వాళ్లు చేసిన మంచిపనులు గుర్తుకు వస్తాయి. ప్రాచీనులు, కవులు స్వర్ణయుగంగా భావించిన ఈ ప్రదేశాన్ని 'పర్నాసస్' కొండలపై, ఈ వనాన్ని కలగని ఉంటారు. ఇదే తొలి మానవుని నివాసం. ఇదే భూతలస్వర్గం" అన్నదామె.

## Canto - 29

**భూతల స్వర్గం. లెథె నదీతీరం. మాటిల్డా ఆ ఒడ్డున, డాంటీ ఈ ఒడ్డున నడుస్తూ నదీ ప్రవాహానికి వ్యతిరేక దిశలో వెళ్తారు. ఓ అద్భుత దృశ్యం. గొప్ప ఊరేగింపు. ఏడు కాండెలాబ్రాలు, ఏడు పెన్నాంట్లు, ఇరవై నలుగురు పెద్దలు, నాలుగు జంతువులు. గ్రిఫిన్ లాగుతున్న రథం. ఏడుగురు స్త్రీలు, మరో ఏడుగురు పెద్దలు. అకస్మాత్తుగా ఆగిన ఊరేగింపు.**

# అద్భుతమైన ఊరేగింపు

ఆమె మాట్లాడడం ముగించి, మనోహరంగా పాడసాగింది. 'Beati Quorum teecta sunt peccata' - Blessed is he whose Transgression is forgiven, whose sin is covered' - 'లెథె' నది నీళ్లు తాగితే పాపపు జ్ఞాపకాలు, మచ్చలు తొలగిపోతాయి. కనుక ఆ పాట సమంజసంగా ఉన్నది. ఆ నదికి ఆవైపు ఒడ్డున ఆమె, ఈ ఒడ్డున నేను లెథె ప్రవాహానికి వ్యతిరేకదిశలో నడుస్తూ ముందుకుపోయాము.

కొంచెం దూరం పోగానే ఆమె నావేపు తిరిగి అన్నది– "సోదరా! అటుచూడు! ఓ అద్భుతమైన కాంతి అకస్మాత్తుగా అరణ్యంలో మెరిసినట్లయ్యింది. ఆ ప్రకాశ వంతమైన వాతావరణంలో ఏదో తియ్యని పాట. నాకు 'ఈవ్'పై కోపం వచ్చింది. చేయవద్దన్న పనిచేసి ఆమె అందరికి చేటును తెచ్చింది. ఆమె విధేయంగా ఉండివుంటే ఈ భూతలస్వర్గపు అద్భుతాలను మరింతకాలం ఆనందించి వుండేవాణ్ణి కదా!

ఫలపుష్పశోభితమై వున్నఆ వనంలో, శాశ్వతానందపు తొలి ఫలాలు దొరికే ఆ వనంలో నేను ముందుకు నడుస్తున్నకొద్దీ ఆ పాట మరింత స్పష్టంగా వినబడుతున్నది. దూరంగా ప్రకాశవంతమైన వెలుగు. ఏడు బంగారు వృక్షాల్లా కనిపిస్తున్న కాండెలాబ్రా (Candelabra)లు, హోసన్నా (Hosanna) అని జయజయ ధ్వానాలు. మబ్బులు లేని ఆకాశంలో నడినెత్తిపై పూర్ణచంద్రుని కాంతి వెలుగులా ఉన్నవి. ఆశ్చర్యంతో నేను వెనుదిరిగి చూసాను. దూరంగా నావేపు చూస్తున్న వర్జిల్ తలూపినాడు. కొత్తగా పెళ్లైన వధువులకన్నా నెమ్మదిగా నడుస్తూ వస్తున్న వ్యక్తులు తెల్లని వస్త్రాలు ధరించివున్నారు. నా ఎడమపక్క వున్న నీటి ప్రవాహంలో ఆ దీపాల వెలుగులు ప్రతిబింబించినాయి. ఆ కాండెలాబ్రాలపై వెలుగుతున్న కొవ్వొత్తుల కాంతులు, చిత్రకారుడి కుంచె గీసిన గీతల్లా ప్రకాశిస్తుండగా వారిపైన ఇంద్రధనుస్సులోని ఏడురంగులూ, డెలియా (డయానా) వడ్డాణంలా, సప్త వర్ణ ప్రవాహంలా భాసించ సాగినాయి. ఏడు పెన్నాంట్లుకు మధ్య పదేసి అడుగుల దూరమున్నది. ఆ ఏడు పెన్నాంట్లు (త్రిభుజాకార ధ్వజాలు – Wisdom (వివేచన); Understanding

(అవగాహన); Consul (సలహా); Might (శక్తి); Knowledge (పరిజ్ఞానం); Piety (ధర్మనిష్ఠ – The fear of God - దేవునియందు భయం)

తలలపై లిల్లీపూల మాలలు ధరించిన ఇరవై నలుగురు పెద్దలు అటు యిద్దరు ఇటు యిద్దరు, ఆరు వరుసల్లో వస్తున్నారు. పాత నిబంధనలోని ఇరవైనాలుగు పుస్తకాల్లా వాళ్లు 'Blessed art thou among women, Benedicta' -అని గానం చేస్తున్నారు. ఆకాశంలో నక్షత్రాల తరువాత నక్షత్రాలు వస్తున్నట్లు ఆ పెద్దల వెనుకనే నాలుగు మృగాలు (అపొకాలిప్సోలోని నాలుగు మృగాలు–నాలుగు ఇవాంజిలిస్టులు) ఆకుపచ్చని కిరీటాలు, ఆరేసి రెక్కలతో, రెక్కలనిండా నెమలి ఈకల్లా కళ్లు (ఆర్గాస్ రాక్షస మృగానికున్నట్లు – మెర్క్యురి తన వేణుగానంతో (Reed pipe) ఆ వేలకళ్ల ఆర్గాస్‌ను సమ్మోహపరచగా అది నిద్రాస్థితిలోకి చేరుకున్నపుడు మెర్క్యురి దానిని వధించినాడు.)

ఎజెకిల్ తన దర్శనంలో ఉత్తరదిక్కుగా వస్తున్న ఆ మృగాలను మబ్బుల రెక్కలు, అగ్నిమెరుపులతో వర్ణించినాడు. అలాంటి నాలుగు మృగాల మధ్య రెండు చక్రాల రథం, దాన్ని లాగుతున్న గ్రిఫిన్ (Griffin) - మెడ, తల, రెక్కలు గరుడపక్షిలా, శరీరం సింహరూపంలో దివ్యత్వాన్ని, మానవత్వానికి సంకేతమై (జీసస్‌లా) ఆ రథం ఆఫ్రికానస్ (స్కిపియో), ఆగస్టస్ ప్రభువుల రథాలకన్నా దేదీప్యమానంగా ఒప్పుతున్నది.

సూర్యుని రథాన్ని నడపబోయి, అదుపుతప్పి, భూమిని అతలాకుతలం చేయబోయిన సూర్యుని కుమారుడు 'ఫీథాన్'ను 'జోవ్' దేవుడు తన మెరుపు వజ్రాయుధంతో చంపిన నాటి రథం కూడా ఆ రథంతో సరిపోల్చబడదు.

కుడి రథచక్రం దగ్గర ముగ్గురు స్త్రీలు – ఎర్రని జ్వాల - Charity -**కరుణ**; మరకతపు ఆకుపచ్చ – **ఆశ** (Hope); మంచులా తెల్లని **విశ్వాసం** (Faith); వలయంగా తిరుగుతూ నృత్యం చేస్తున్నారు. ఎడమ రథచక్రం వేపు నలుగురు స్త్రీలు (Prudence, Justice, Fortitude, Temperance) వారిలో Prudence (వివేకం)కు మూడు కళ్లున్నాయి.

వీరి వెనుక ఇద్దరు పెద్దలు – హిప్పొక్రేటిస్ శిష్యుడు– ల్యూక్; దేవుని వాక్యము అను ఖడ్గాన్ని ధరించిన సెయింట్ పాల్ నడుస్తున్నారు. వారి వెనుక నలుగురు (జేమ్స్, పీటర్, జాన్, జ్యూడ్) అందరికంటె వెనక వస్తున్నది. జాన్ – రివిలేషన్ అధ్యాయకర్త. అందరూ ధవళవస్త్రధారులై ప్రకాశిస్తున్నారు. అయితే వారి కనుబొమలపై లిల్లీ పూలగుచ్ఛాలకు బదులు ఎర్రగులాబీలు మరియు ఇతర పుష్పాలు అలంకరించబడి వున్నాయి. అవి దూరంగా చూసేవారికి అగ్నిజ్వాలల్లా కనిపిస్తున్నాయి.

ఆ రథం నా ఎదుటికి రాగానే ఓ భయంకరమైన ఉరుము వినిపించింది. ఆ ఊరేగింపు ఆగగా నేను ఆశ్చర్యంగా చూస్తూనే ఉన్నాను.

**Canto - 30**

**భూలోకస్వర్గం - ఏడు కాండెలాబ్రాలు ఏడు నక్షత్రాలకు చిహ్నం. అదృశ్యమైన వర్జిల్ - బియాట్రైస్ ప్రత్యక్షం. డాంటీను నిందించిన బియాట్రైస్.**

# డాంటీ - బియాట్రైస్

ఆకాశంలోని సప్త నక్షత్రాలు నావికులను రేవు వేపు రప్పించినట్లు, ఏడు కాండెలాబ్రాలు ఆగగానే ఇరవై నలుగురు పెద్దలు రథంవేపు తిరిగినారు. వారిలో ఒకరు– "Veni, sponsa, de libano" - come with me from Lebanon, my spouse - (Spouse is the symbol of Church, the bride of Christ) అని కీర్తించగా మిగతావారు గొంతు కలిపినారు. అంతిమతీర్పు రోజున సమాధుల్నుంచే లేచి, నూతన వస్త్రధారులై ప్రభువును స్తుతిస్తూవచ్చే ఆత్మలు 'అల్లెలూయా–Alleluia- గానం చేస్తున్నట్లు 'advocem tanti sentis' అందరూ శృతి కలిపినారు. వాళ్లు పూలను గాలిలోకి విరజిమ్ముతూ - Benedictus Qui venis - Blessed art thou who comest - అంటూ – Manibus, oh, data lilia plenis - with full hands give me lilies" – అని గానం చేస్తున్నారు.

తూర్పువాకిట అరుణ రాగరంజితమవుతుండగా మిగతా ఆకాశం నీలివర్ణంలో ప్రకాశిస్తున్నది. వాళ్లు విసుర్తున్న ఎర్రటి గులాబిరేకులు ఆకాశంలోకి ఎగిరి మబ్బుల్లా కనిపించి మరల నేలకు చేరుకుంటున్నాయి. ఇంతలో నాకో యువతి కనిపించింది. తెల్లటి మేలిముసుగుసు, ఎర్రటిజ్వాలా వర్ణపు అంగీ, ఆకుపచ్చని కోటు (Cape) ఆమెను చూడగానే నాలో ఏదో వణుకు, ఆశ్చర్యం, ఆపాదమస్తకం కంపించిన అనుభూతి – ఆ అనుభవం చానాళ్లక్రితందైనా ఇప్పటికీ నాకు కొత్తగానే ఉంటుంది. అదే ప్రేమలోని మాధుర్యం. తల్లికోసం వెదికే పిల్లాడిలా నేను 'వర్జిల్' కోసం వెనక్కి తిరిగిచూసాను. నేననబోయాను– "నాలో ప్రతి అణువూ, రక్తపుచుక్కా కంపిస్తున్నది. వెనకటి ఆ అగ్నిజ్వాలను నేను గుర్తించగలుగుతున్నాను" కాని అక్కడ నా మార్గదర్శకుడు 'వర్జిల్' లేడు. నా కళ్లలో నీళ్లు తిరిగాయి.

"డాంటీ! వర్జిల్ నిన్ను వదిలి వెళ్లాడని దుఃఖించకు. ఇంకా నీకు కన్నీళ్లు కావాలి! మరో కత్తిపోటు నీకు చేయబోయే గాయానికి సిద్ధంగా ఉండు"

ఆమె నన్ను నది ఆవలివేపు నుంచి చూస్తున్నది. మేలిముసుగులో ఉన్న ఆమె ఎవరో నాకు అర్థంకాలేదు. తీవ్ర స్వరంతో ఆమె నాతో మాట్లాడింది.

"చూడు! నేను బియాట్రైస్‌ను! నీవిక్కడికెలా రాగలిగినావు? మానవుడిక్కడ సంతోషంగా ఉంటాడని తెలియదా?"

నా కళ్లు నదిలోని నా ప్రతిబింబాన్ని దాటి పచ్చికపైకి మరలిపోయాయి. తల్లి తన బిడ్డను గదమాయిస్తున్నట్లు అనిపించింది. అప్పుడే దేవదూతలు "In Te, Domine, speravi - Pedes meos - నీలో నా విశ్వాసాన్ని ఉంచాను. దేవా! నా పాదాలు ఈ గదిలోకి అడుగుపెట్టినాయి" – అని గానం చేస్తున్నారు. వారు ఆమెను ఎందుకాతనిని నిలదీస్తున్నావని అడిగినట్లు అనిపించింది. ఆమె ఇలా అన్నది– "నా మాటలు ఆతనికి అర్థం కావాలి! అతడు యువకుడిగా ఉన్నపుడు కొన్నాళ్లు నాతో సత్యమార్గాన నడిచాడు. కొద్దికాలం గడచినాక నా మార్గం అతనికి కష్టమనిపించిదేమో నా రూపలావణ్యాలూ, మంచితనం పెరిగినా ఆతను నాకు దూరంగా తొలగిపోయాడు. అతడు మంచితనంలా భ్రమించే మార్గాలలో తిరగనారంభించాడు.

నా పిలుపును, హెచ్చరికలను అతడు లెక్కచేయలేదు. ఎంతదూరం అతడలా వెళ్లిపోయాడంటే అతనికి ముక్తిమార్గమే కానరానంత దూరం! కాని అతడు పోగొట్టుకున్న వారిని ఇలా చూడగలుగుతున్నాడు.

ఇతనికోసం నేను మృత్యుగుమ్మం దాటి, ఇతనికి మార్గదర్శకుడిగా ఉండమని ఆ మహాకవిని (Virgil) కన్నీళ్లతో ప్రార్థించాను. తాను చేసిన తప్పులకు కన్నీరుకార్చి పశ్చాత్తాపపడిన తరువాత ఇతడు 'లెథె'ను దాటి, ఆ నీళ్లను తాగడం ద్వారా ఇతడు దేవుని బృహత్తర పథకానికి (Grand design) ఆటంకం కలిగించనివాడవుతాడు"

## Canto - 31

**భూలోకస్వర్గం. డాంటీ కన్నీళ్లతో తన పశ్చాత్తాపాన్ని ప్రకటిస్తాడు. బియాట్రైస్ ఆతనిని నిలదీస్తుంది. 'మాటిల్డా' డాంటీను 'లెథె' నదిలో ముంచి స్నానం చేయిస్తుంది. బియాట్రైస్ చెలికత్తెలు, గ్రిఫిన్ రహస్యం. బియాట్రైస్ తన మేలిముసుగును తీస్తుంది.**

# డాంటీకు ప్రాయశ్చిత్త స్నానం

అవతలి తీరాన ఉన్న బాటసారీ! చెప్పు! నిజాన్ని వెల్లడించు! నీవు చేసిన పాపాల్ని ఒప్పుకో! యదార్థాన్ని వివరించు!" అన్నదామె తీవ్రంగా, నిశితంగా.

నాకు నోట మాటరాలేదు. ఆమె మరలా అన్నది– "ఇంకా నీవు లెథె నదీ జలాల్ని తాగనేలేదుకదా! మరపు వచ్చేదేమున్నది?" బాణాన్ని గట్టిగా లాగినప్పుడు విల్లు, వింటితాడు తెగగా, బాణం దుర్బలమై లక్ష్యం వేపు వెళ్లినట్లు నేను క్షీణస్వరంతో 'Yes' – అవును అన్నాను. నా కనుల నుండి నీరు ధారాపాతంగా వర్షంలా కురుస్తున్నది.

ఆమె అన్నది– "నామీద కోరిక నిన్ను నేనున్న మంచిమార్గంలోకి వచ్చేలా చేసిందేమోకాని, మనమధ్య ప్రేమ బలపడేందుకు ఏమన్నా చేసావా నీవు? ఏ సంకెళ్లను విరగగొట్టావు? ఏ కందకాల్ని దాటావు? అసలు నీవేం ప్రయత్నం చేసావు నన్ను చేరేందుకు? నీకే ఆకర్షణలు కనిపించి వాటిముందు నృత్యం చేస్తూ వాటికి వశమై నీ ప్రేమకు దూరంగా తొలిగావు?"

దుఃఖిస్తూ, గొంతు పెగుల్చుకుని నేనన్నాను– "నీ వదనం దూరం కాగానే పైపై ఆకర్షణలు, మిథ్యా ప్రేమలు నన్ను దారి మరల్చినాయి"

ఆమె అన్నది– "నీవు నిజం చెప్పినా, దాచినా వాస్తవం ఆ న్యాయాధిపతికి తెలుసును. పాపం చేసినవాళ్లే నిజాన్ని చెప్పడం వలన పాపఖడ్గపు శక్తి మందగిస్తుంది. నీ తప్పుకు నీవిప్పుడు సిగ్గుపడినా నిజం చెప్పక తప్పదు. అయినా నన్నంతగా ప్రేమించినవాడివయితే నేను మరణించగానే నన్నెందుకు నీవు అనుసరించలేదు. ఏ భౌతిక అవసరం నిన్నక్కడే నిలిపి ఉంచింది? పిల్లపక్షి ఎగిరేముందు రెండు మూడు దెబ్బలు తింటుంది. అనుభవమున్న పక్షి వలను, బాణాన్ని తప్పించుకునే మెలకువలు తెలుసుకుని ఉంటుంది కదా!"

తప్పుచేసిన పిల్లవాడు తలదించుకుని ఉన్నట్లు నేను ఆమె వాగ్బాణాలను స్వీకరిస్తూనే ఉన్నాను. దుఃఖంతో గొంతు పూడుకుపోయినా ఆమెతో మాట్లాడ సాహసం చేసాను. కాని మాట రాలేదు. ఆమె మరలా అన్నది– "నా మాటలు వింటేనే అంత దుఃఖం వస్తుంటే, మాట్లాడకపోతే సరే, కనీసం నీ గడ్డాన్ని పైకెత్తి ఇటుచూడు!"

నేను తలపైకెత్తి ఆమెవేపు చూసాను. బియాట్రైస్ గ్రిఫిన్ వేపు తిరిగింది. ఆ గ్రిఫిన్ లోని ద్వైదీ్వలక్షణాలస్థానే దివ్యత్వం ఒక్కటే ప్రకాశించసాగింది. ఆమె మేలి ముసుగులోనే మునుపటికన్నా అందంగా, ప్రకాశవంతంగా కనిపించసాగింది. నాలో పశ్చాత్తాపం అధికమై, నన్ను నేను నిందించుకుంటూ, నాలో ఉద్విగ్నత అధికం కాగా, నేను గాఢంగా ప్రేమించిన స్త్రీ నన్నిప్పుడు ఇలా ద్వేషించడాన్ని భరించలేక స్పృహతప్పి నేను ఉన్నచోటనే కూలబడిపోయాను.

నాకు మెలకువ వచ్చేసరికి 'మాటిల్డా' నన్ను పట్టుకుని ఉన్నది. నేను గొంతులోతు నీటిలో మునిగి వున్నాను. నన్ను 'గొండొలా' (Gondola) పడవను లాగినట్లు ఆమె నన్ను నీటి ఉపరితలంపై లాగుతూ ఆవలి తీరానికి తీసుకువెళ్లింది. నేనావలి తీరానికి చేరేసరికి – "purge me with hyssop, and I shall be clean, wash me, I shall be whiter than snow - సామగానం వినిపించింది. ఆమె నా శిరస్సు పట్టుకుని నదినీళ్లలోకి ముంచగానే ఆ నీళ్లను తాగాను.

అక్కడినుంచి ఆమె నన్ను నృత్యం చేస్తున్న నలుగురు అందమైన స్త్రీల (Prudence, Justice, Fortitude, Temperance) మధ్యకు తీసుకువెళ్లింది. వారు నా తలపై చేతులు ఉంచి అన్నారు– "మేము దేవకన్యలం. అక్కడ తారలం. ఇంతకుముందు బియాట్రైస్‌కు చెలికత్తెలం. మేము నిన్ను ఆమె కన్నులవద్దకు తీసుకువెళ్తాము. ఆ ముగ్గురు స్త్రీలు నిన్ను ఆమె కాంతి వలయంలోకి తీసుకువెళ్తారు" అని పలికి వారు నన్ను బియాట్రైస్ వద్దకు తీసుకు వెళ్లినారు. వేయి నిరీక్షణలు కాంతికిరణాలై నా కన్నుల నుండి ఆమెవేపు ప్రవహించాయి. కాని ఆమె కళ్లు ఆ గ్రిఫిన్‌పై స్థిరపడి ఉన్నాయి. అద్దంలో సూర్యునిలా ఆ గ్రిఫిన్ తన దైవమానవ లక్షణాలను మార్చిమార్చి చూపిస్తున్నది.

అటువేపు ఉన్న ఆ ముగ్గురు స్త్రీలు (Charity, Hope, Faith) "బియాట్రైస్"ను పిలిచారు– "బియాట్రైస్! నీ పవిత్ర నయనాలను నీ సేవకునిపైకి మరల్చు! ఇతడు చాలాదూరం నుంచి వచ్చియున్నాడు. నీలోని ద్వితీయ అందాన్ని ఇతనికి విశదపరచు. నీ కరుణను ఇతనిపై, మాపై కురిపించు"

ఓ శాశ్వత జీవకాంతిపుంజమా! నిన్నెలా వర్ణించను? పర్నాసస్ పర్వతపు ఛాయల్లో విహరించే సకల కళాధిదేవతల శక్తితో, అక్కడి నీటిబుగ్గలో నీరు తాగి ఉప్పొంగిన నైపుణ్యంతో – స్వర్గలోకపు అందాలను విరజిమ్ముతున్న నీ వదనాన్ని – మేలిముసుగు తొలగగా వేలకాంతులు విరజిమ్ముతున్న ఆ అద్భుత అందాన్ని వర్ణించే సాహసం చేస్తున్నాను.

## Canto - 32

**భూలోకస్వర్గం. ఊరేగింపు తూర్పువేపు వెళ్తున్నది. ఏడమ్ వృక్షం, గ్రిఫిన్, రథం, తిరిగి విరబూస్తున్న వృక్షం. మెలకువ నిద్రావస్థలలో ఉన్న డాంటీ. గ్రద్ద, నక్క, డ్రాగన్, రూపం మారిన రథం. మహాకాయుడు, వేశ్య.**

# ఆదాం వృక్షం - రూపుమారిన రథం

పదేళ్ల నిరీక్షణ ఇప్పటికి ఫలించింది. ఎంతచూసినా తనివితీరదు. ఈ దాహమూ చల్లారదు. ఈ ఆనందాస్వాదనలో మిగతా జగత్తు ఉనికే నేను మరచిపోయాను. నా పక్కనే ఉన్న ఆ ముగ్గురు యువతుల్లో ఒకరంటున్నారు– "నీచూపు మరీ స్థిరంగా ఉన్నది!"

సూర్యకాంతి సోకిన కన్నుల్లా నాకు కాసేపు చూపు కనిపించలేదు. పక్కకు చూసాను. ఆ ఊరేగింపు ఇప్పుడు కుడివేపుకు తిరిగి తూర్పుదిక్కుగా ప్రయాణం చేస్తున్నది. ప్రకాశిస్తున్న ఏడు నక్షత్రాలవేపు, సూర్యుని వేపుగా! ఆ యువతులు వారి వారి స్థానాలోకివెళ్లిపోయారు. గ్రిఫిన్ అనాయాసంగా నడుస్తోంది.

మాటిల్డా, నేను, స్టాటియస్, రథాన్ని అనుసరిస్తున్నాము. మూడు బాణాలు పోయిన దూరం పోయేసరికి రథాన్ని దిగి బియాట్రైస్ మావద్దకు వచ్చింది. అక్కడ ఓ వృక్షం ఉన్నది. ఆ వృక్షం ఎత్తు పెరిగినకొద్దీ కొమ్మలు విశాలంగా ఉన్నాయి కాని కొమ్మలకు ఒక్క ఆకుగానీ, పూవుగానీ లేదు. ఆ చెట్టును చూస్తే అరణ్యాలలో నివసించే ఇండియన్లు కూడా ఆశ్చర్యపోతారు. ఆ ఆదాంవృక్షం (Adam) చుట్టూ చేరిన వారు ప్రార్థనలు చేయసాగినారు– "ఓ గ్రిఫిన్! నిషేధించబడిన ఈ వృక్షపు ఫలాన్ని నీవు తినకుండా మంచితనమున్న మానవులను కాపాడినావు! నీకు జయమగుగాక!"

వారిలో ఒకడు రథపు కాడిని (Pole shaft) ఆ వృక్షపు కొమ్మకు కట్టినాడు. మీనరాశికి ఆవలనున్న మేషరాశి వెలుగుతో, ఆకుపచ్చని వెలుగు మొక్కలపై పడగా, ఆ వృక్షం మరల ఆకులు, పూలతో గులాబి, వయొలెట్ వర్ణాల మిశ్రమంలో క్రీస్తురక్తంలా, Apple blossom రంగులో కళకళలాడింది.

సిరింక్స్ కథవింటూ నిద్రపోయిన వంద కన్నుల ఆర్గస్ (Argus)లా, బొమ్మల్ని చిత్రిస్తున్న చిత్రకారుడిలా ముంచుకొచ్చిన నిద్రను కునుకుపాటు తీసి, మరల చెదరగొడ్తూ నిద్రలోకి జారుకోబోతున్నాను. ఇంతలో ఒక గొంతు నన్ను గదమాయించింది– "నిద్రలే! పీటర్, జాన్, జేమ్స్ వాళ్లు వచ్చి ఆపిల్ బ్లాసమ్స్‌ను చూసి తామెంత చిన్నవాళ్లమో గ్రహించుకున్నారు. మోసెస్, ఎలిజాలు కూడా తమ గురువర్యుని దుస్తులలో తేడాని గ్రహించినారు"

నేను కనులు తెరచేసరికి 'మాటిల్డా' నా వంక చూస్తూ నిలబడి వున్నది. నేనడిగాను 'బియాట్రైస్' ఎక్కడ అని. ఆమె సమాధానమిచ్చింది– "అదుగో, తిరిగి పునరుజ్జీవనం పొందిన ఆ వృక్షం కింద! ఆమె చుట్టూ పరివేష్ఠించి ఉన్నవారిని చూడు. మిగతావాళ్లు గ్రిఫిన్ వెనుక స్తుతిగీతాలు పాడుతూ పైలోకానికి వెళ్లినారు"

నేను బియాట్రైస్ వేపు చూసాను. ఆమె ఆ చెట్టు కింద నేలపై కూర్చుని వున్నది. ఏడుగురు యువతులు ఆమె చుట్టూరా వలయంలా ఉన్నారు. వారి చేతుల్లో దీపాలు వెలుగుతూ ఉన్నాయి. "ఇక్కడ నీవు నాతో ఉండగలవు. ప్రస్తుతానికి సందర్శకుడిలా! తరువాత శాశ్వతంగా! రోమ్ నగరంలో క్రీస్తు కూడా రోమనే కదా! Rome, in which Christ is Roman - అక్కడి ప్రపంచం కోసం నీవిక్కడి చూసినది చూసినట్లు వ్రాయగలవు."అ

ఇంతలో ఆకాశం నుంచి హఠాత్తుగా వచ్చిన ఓ గరుడపక్షి ఆ చెట్టుకొమ్మలలో నుంచి దూసుకువచ్చి, చెట్ల కొమ్మలను విరగగొడ్తూ, ఆకుల్నీ పూలనీ చెదరగొడుతూ, రథంపై పడి దానిని అటూ యిటూ తన కాలిగోళ్లతో తిప్పుతూ రథంలోకి దూరబోగా, దానిలో ఉన్న ఆకలిగొన్న నక్కను బియాట్రైస్ పారిపొమ్మన్నది. ఆ గరుడపక్షి రథాన్ని అతలాకుతలం చేసి తన ఈకలతో నింపగా – ఆకాశం నుంచి ఒక స్వరం – "నా పడవా! నీ ప్రయాణం మోసపూరితంగా ఉన్నది" – వినవచ్చింది.

అప్పుడు ఆ రెండు రథచక్రాల మధ్య నేలచీలి, ఓ డ్రాగన్ వచ్చి తన తోకను రథంలోనికి పోనిచ్చి రథం అడుగుభాగాన్ని భూమిలోకి లాక్కుపోయింది. నేల మూసుకుపోయింది. ఇంతలో ఆ రథం ఏడు తలలు, పది కొమ్ములున్న రాక్షసిగా మారింది. అక్కడ నాకు ఒక వేశ్య తన కన్నులను అటు యిటూ ఆడిస్తుండగా, పక్కనే ఓ మహాకాయుడు ఆమె అంగరక్షకుడిలా ఉన్నాడు. వాళ్లు ఒకరినొకరు కౌగలించుకుంటున్నారు. ఆమె నావేపు చూడగానే ఆతడు ఆగ్రహంతో ఉన్మాదిలా ఆమెను తలనుంచి కాళ్ల వరకూ చితకబాది, అనుమానం, కోపం ఎక్కువ కాగా రాక్షసిలా మారిన రథాన్ని, దానితో పాటు ఆ వేశ్యనూ లాక్కుని అడవుల్లోకి నిష్క్రమించినాడు. ఆ తరువాత నాకు ఆ వేశ్యకానీ, ఆ రాక్షసరథం కానీ కనబడలేదు.

**Canto - 33**

**భూలోకస్వర్గం. ఏడుగురు స్త్రీలు విలపిస్తుండగా బియాట్రైస్ వారిని ఓదార్చసాగింది. దేవుడు ఆ డ్రాగన్ మహాసర్పం, వేశ్య, మహాకాయుడిని శిక్షిస్తాడని జోస్యం చెబుతుంది. మాటిల్డా డాంటీను యునో నది వద్దకు తీసుకువెళ్లి ఆ నీరు తాగించి ఆతడిని స్వర్గ ప్రయాణం వేపు సిద్ధం చేస్తుంది.**

# బియాట్రైస్ చెప్పిన జోస్యం

ఆ స్త్రీలు విలపిస్తూ, ముగ్గురు, నలుగురుగా– 'Deus Venerunt gentes' - అవిశ్వాసులు నీ దేవాలయంలో ప్రవేశించినారు. వారు జెరూసలెంను నాశనం చేస్తున్నారు – అని దుఃఖిస్తుండగా బియాట్రైస్ వారిని ఓదార్చింది. బియాట్రైస్ ఆ యువతులతో అన్నది– “కొద్దిసేపు మీరు నన్ను చూడలేరు. ఆ తరువాత నన్ను చూడగలరు”

ఆమె ముందు ఏడుగురు యువతులు, ఆమె వెనుక నేను, స్టాటియస్, మాటిల్డాలు నడుస్తుండగా మేము ఆమెతో ముందుకు వెళ్లినాము. ఆమె నాతో అన్నది– “సోదరా! నీకేదన్నా సందేహాలుంటే అడుగు”

నేనన్నాను– “నీకు నా జ్ఞానదాహం తెలియును! నాకు జ్ఞానభిక్ష పెట్టగలవు”

ఆమె పలికింది– “నిన్ను భయం నుంచి, సిగ్గు నుంచి విముక్తి చేస్తున్నాను. ఇక నీవు కలలో మాట్లాడుతున్నట్లు మాట్లాడవు. ఆ డ్రాగన్ సర్పం రథాన్ని విరగగొట్టిన దానికి దేవుని ప్రతీకారము చాలా తీవ్రంగా ఉండగలదు.

గ్రద్ద వదలిన ఈకలతో ఈ రథం ఒకసారి రాక్షసిగా, ఒక్కోసారి ఎరగా మారుతూ వుంటుంది. చర్చి ఉత్థానపత్థానాలూ అంతే! నక్షత్ర స్థితుల్ని బట్టి అయిదు వందల పదిహేను సంవత్సరాలలో, దేవుని విశ్వాసులు ఆ వేశ్యను, ఆమె అంగరక్షకుడిని శిక్షిస్తారు. థెబెస్‌లోని స్ఫింక్స్ పొడుపుకథలా, థెమిస్ దేవతల జోస్యాల్లా నా మాటలూ నర్మగర్భంగా ఉంటాయి. కాని ఆ పొడుపు కథలు విప్పడం తెలిసిన ఇడిపస్, నైయేడ్స్ వాటిని విడమరుస్తారు. నీవు వ్రాసేప్పుడు వీటి గురించి ఇప్పటికి రెండుసార్లు ధ్వంసం చేయబడిన ఆదాం వృక్షం గురించి స్పష్టంగా వ్రాయి. జ్ఞానవృక్షాన్ని ఎవరైనా పాడుచేస్తే వారికి దేవునిచే విధించబడే శిక్ష దారుణంగా ఉంటుంది. నిషేధించిన ఫలాన్ని తిన్న తొలి మానవుడు అయిదువేల ఏళ్లకు పైగా శిక్షననుభవించవలసి వచ్చింది. నీకు అర్థమయ్యే ఉంటుంది ఎందుకా చెట్టు పైన విశాలంగా కిందకు వచ్చేసరికి సన్నగా ఉండిందో! ‘ఎల్సా’ ఉప్పునీళ్లలా నీ జ్ఞానం ఉప్పుగడ్డ కట్టరాదు. పిరామస్ (Pyramus)

రక్తం మల్బెరి పళ్లను శాశ్వతంగా రక్తవర్ణంలోకి మార్చినట్లు, ఆదాం వృక్షపు రూపం నీకు నిషేధించిన ఫలం గురించి, దైవన్యాయం గురించి చెప్పడం లేదా!

నీ జ్ఞానమిప్పుడు గట్టిగా పెంకుగట్టినట్లున్నది. దీని నుండి కాంతికిరణము లెటూ పోలేవు. అయినా నేను చెప్పిన ఈ విషయాల్ని బాగా గుర్తుంచుకో!"

నేనన్నాను– "నీవు చెప్పిన మాటలు మైనంపై ముద్రలా నా మనసులో నిలిచిపోయాయి. అయినా నీ మాటలు నా మందబుద్ధికన్నా పైస్థాయిలో ఉన్నాయి కదా! వాటిని సులభతరం చేయవచ్చును కదా!"

ఆమె అన్నది– "భూమికి స్వర్గానికి ఉన్న దూరంలానే, దైవ వాక్కుకు నీకూ అంత దూరం ఉన్నది. ఈ రోజు నీవు 'లెథె' నదీ నీటిని సేవించినావు. పొగ నిప్పును గురించి చెబుతున్నట్లు నీ మనసు ఇప్పుడు మరెక్కడో ఉన్నట్లున్నది. ఇకనుంచి నేను చెప్పబోయే విషయాలు నీకు తేలికగా అర్థమవుతాయి"

సూర్యుడు నడినెత్తిమీద ఉన్నాడు. మిట్టమధ్యాహ్న సమయం. ఏడుగురు యువతులు నల్లని కొమ్మలు, పచ్చని ఆకుల దిగువన నీడలో నిలబడినారు. వారికి ఎదురుగా యూఫరెటిస్, టైగ్రిస్ (Euphrates, Tigris) నదులు రెండూ జన్మించే నీటిబుగ్గ ఉన్నది – అవి అక్కడ నుంచి స్నేహితులు విడిపోయినట్లు విడివిడిగా పోతాయి.

బియాట్రైస్ అన్నది– "ఈతడిని 'యునో' నది వద్దకు తీసుకునివెళ్లి అతనిలో నిద్రాణమైపోతున్న శక్తిని పునరుద్ధరించు"

మాటిల్డా నన్నూ, స్టాటియస్‌ను తీసుకుని 'యునో' నదీతీరానికి తీసుకు వెళ్లింది. ఆ తియ్యటి నీళ్లు మరలా నాలో కొత్త జీవాన్ని నింపాయి.

అక్కడ నుండి నేను మరల బియాట్రైస్ వద్దకు వచ్చాను. చెట్లు చిగిర్చినట్లు నాలో కొత్త ఆలోచనలు, శక్తి చిగురించాయి. ఇప్పుడు నేను తారామండలానికి ఎగబాకడానికైనా సిద్ధమే!



Paradiso-Cross

DANTE

# The Divine Comedy

డాంటీ

# డివైన్ కామెడి

## Part - III

## PARADISO

## (స్వర్గలోకం)

స్వేచ్ఛానువాదం

డాక్టర్ లంకా శివరామప్రసాద్

# విషయసూచిక

## Part - III - PARADISO (స్వర్గలోకం)


| | |
|---|---|
| **Canto-1** | విశ్వప్రకారం – ఎంపిరియాన్ – స్వర్గలోకం |
| **Canto-2** | స్వర్గలోకపు తొలిమజిలీ – చంద్రగ్రహం |
| **Canto-3** | హింసవలన పరిశుద్ధజీవనం నుంచి దారి తప్పినవాళ్లు |
| **Canto-4** | హింసకు లొంగిపోవడం చెడును సమర్థించడమే! |
| **Canto-5** | రెండవ స్వర్గం – మెర్క్యురీలోకి ప్రవేశం |
| **Canto-6** | పేరుప్రతిష్ఠలకై కోరికతో ఋజుమార్గాన నడిచినవారు. |
| **Canto-7** | మానవుని నైతికత, ముక్తిమార్గం, పునరుత్థానం |
| **Canto-8** | తృతీయ స్వర్గం – వీనస్ గ్రహం |
| **Canto-9** | మూడవ స్వర్గం – వీనస్ గ్రహం – ప్రేమజీవుల లోకం |
| **Canto-10** | పంద్రెండుగురు విజ్ఞానులు, వేదాంతులున్న నాల్గవ స్వర్గం |
| **Canto-11** | సెయింట్ ఫ్రాన్సిస్ జీవిత చరిత్ర |
| **Canto-12** | సెయింట్ డొమినిక్ జీవితచరిత్ర |
| **Canto-13** | సొలొమాన్ ప్రభువు న్యాయనిర్ణయ శక్తి |
| **Canto-14** | అయిదవ స్వర్గం – మార్స్ గ్రహంలో – శిలువ |
| **Canto-15** | అయిదవ స్వర్గం – మార్స్ గ్రహం |
| **Canto-16** | కాసియాగ్విడా వివరణ |
| **Canto-17** | డాంటీ భవిష్యత్తు |
| **Canto-18** | ఆరవ స్వర్గం – జూపిటర్ గ్రహం వేపు ప్రయాణం |
| **Canto-19** | ఆరవ స్వర్గం – జూపిటర్ గ్రహం – గరుడపక్షి |
| **Canto-20** | గరుడపక్షిలో ఉన్న దివ్యాత్మలు |
| **Canto-21** | ఏడవ స్వర్గం – శాటరన్ గ్రహం – బంగారు నిచ్చెన |
| **Canto-22** | సెయింట్ బెనెడిక్ట్‌తో సంభాషణ |
| **Canto-23** | ఎనిమిదవ స్వర్గం – స్థిరనక్షత్రాల ప్రదేశం |
| **Canto-24** | ఎనిమిదవ స్వర్గంలో డాంటీ పాల్గొన్న ప్రవేశపరీక్ష |
| **Canto-25** | ‘ఆశ’ అనే అంశంపై డాంటీకు పరీక్ష |
| **Canto-26** | ‘దేవునిపై ప్రేమ’ అంశంపై డాంటీకు పరీక్ష |
| **Canto-27** | తొమ్మిదవ స్వర్గం వేపు ప్రయాణం |
| **Canto-28** | దేవదూతల వలయాల క్రమణిక |
| **Canto-29** | సృష్టి, దేవదూతల గురించి బియాట్రైస్ వివరణ |
| **Canto-30** | పదవ స్వర్గం ఎంపిరియాన్‌లోకి ప్రవేశం |
| **Canto-31** | దశమ స్వర్గంలో విరిసిన తెల్లగులాబీ |
| **Canto-32** | స్వర్గ సామ్రాజ్యపు విభాగాలు |
| **Canto-33** | ట్రినిటీని దర్శించిన డాంటీ |

**Canto - 1**

**అపోలో (సూర్యుడు) దేవుని ప్రార్థిస్తూ మూడోభాగం ప్రారంభమవుతుంది. బియాట్రైస్‌ను అనుసరిస్తూ దివ్యలోకం వేపు డాంటీ ప్రయాణం; ఆశ్చర్యపడ్తున్న డాంటీకు బియాట్రైస్ వివరించిన ఎంపిరియాన్ మరియు విశ్వప్రకారం. (Order of the universe).**

# విశ్వప్రకారం - ఎంపిరియాన్ - స్వర్గలోకం

విశ్వంలోని చరాచర రాశుల్లో లీనమై ప్రవహిస్తూ ప్రకాశించే ఆ దేవదేవుని కీర్తి ఒక్కోచోట ఎక్కువగా ఒక్కోచోట తక్కువగా కనిపిస్తుంది. నేను ఆ కాంతి అధికంగా పరిఢవిల్లే వెలుగులోకమైన స్వర్గంలో ఉన్నాను. అక్కడి అద్భుత విషయాలను వర్ణించడానికి ఈ పరిమిత మానవ జ్ఞానం, పదజాలం సరిపోవు. అయినా నా శక్తికొలదీ ఈ పవిత్ర రాజ్యపు వైభవాన్ని నా ఈ కావ్యంలో గానం చేస్తాను.

ఈ మానవాతీత కార్యాన్ని నిర్వహించడానికి, అపోలోదేవా! నీ శక్తి, ఆశీస్సులు నాకు ఇబ్బడి ముబ్బడిగా ప్రసాదించు. నాకు ఈ కావ్యరచనకు పర్నాసస్ శిఖరాన తిరుగాడే సకల కళాధిదేవతలైన మ్యూజెస్ ఆశీస్సులతోపాటు, రెండవ శిఖరమైన సిర్రా (Syrrha)ను అభిమానించే సంగీత సాహిత్యాధిదేవతా - అపోలో నీ అండదండలు నాకుండాలి. నీకత్యంత ప్రియమైన 'డాఫ్నె' (Daphne) వనకన్య 'లారెల్' (Laurel) వృక్షంగా మారిపోగా ఆ వృక్షమే నీకెంతో అభిమానపాత్రమై, రాజులకు, కవిరాజులకు కిరీటమై వారికి లారియేట్ (Laureate) అన్న బిరుదు న్నిస్తున్నది కదా!

అహంకారంతో గాయకుడు మార్సియాస్ (Marsias) నిన్ను సంగీతపు పోటీకి సవాలు చేసినప్పుడు ఆతడిని ఓడించి, అతని గర్వాన్ని పటాపంచలు చేసి, నిలువునా దహించినావు కదా! ఓ దివ్యశక్తిస్వరూపమా! నీవు నాకొసగే శక్తితో ఆ వెలుగులోకపు వైభవాన్ని కావ్యంగా మలచి నీకత్యంత ప్రియమైన లారెల్ తరూఛాయన నిలబడతాను. ఎన్నాళ్లో ఆ గౌరవం కొరకు నిరీక్షిస్తున్న నాకు ఈ కావ్యం ఆ అవకాశాన్నిచ్చుగాక!

చిన్న అగ్నిరవ్వలు వెలువడిన తరువాత పెద్దమంటలు దానిని అనుసరించి నట్లు, నా తరువాత ఎందరో మహాకవులు, కవిగాయకులు అపోలో దేవా! నిన్ను ప్రార్థించి సాయం అర్థించవచ్చు. నీవు కరుణించవచ్చును. ఓ ప్రభూ! నీ కరుణా కటాక్షవీక్షణాలతో నా యీ ప్రయత్నాన్ని సఫలం చేసి నను చరితార్థుడిని చేయి ప్రభూ!"

విశ్వదీపకాంతి మానవులకు వేర్వేరు దారుల్లో చేరుతుంది. ఆ సూర్యకాంతి ప్రసరించేప్పుడు నాలుగు వలయాలను, మూడు శిలువలను (Crosses), రాశులను దాటి ప్రపంచ మైనపు ఉపరితలంపై తనదైన ముద్రను వేస్తుంది. ఆ కాంతి భూలోకంపై

చీకటి వెలుగులను రేయింబవళ్లుగా చిత్రిస్తుంది. (ఆ నాలుగు వలయాలు - The equator, The ecliptic, The equinoctial coture, the horizon - మూడు శిలువలు లేదా క్రాసెస్ మూడుస్తరాలు.)

బియాట్రైస్ ఎడంవేపు తిరిగి సూర్యుడి వేపు గరుడ పక్షికన్నా స్థిరంగా, తీక్షణంగా చూసినది. నేనూ ఆమెను అనుసరిస్తూ సూర్యునివేపు చూడబోయి ఆ కిరణాల కాంతిలో, అగ్నిలో పునీతమైన లోహంలా పరిశుద్ధుడనైనాను. పగటికి మరో పగలు తోడైనట్లు ఆకాశంలో నాకు రెండో సూర్యుడున్నట్లు కనిపించింది. ఆకాశం వేపు నుంచి నా చూపులను మరల్చి నేను బియాట్రైస్ వేపు చూసాను. సముద్ర తీరాన మూలికను సేవించి సముద్ర దేవతగా రూపాంతరం చెందిన గ్లాకస్ (Glaucus)లా నాలో ఏదో అద్భుతమైన మార్పు వచ్చినట్లనిపించింది.

నాలో అనేక ఆలోచనలు. ఈ సృష్టిలో నేనెవర్ని? నాలో నేను ఒక భాగమా? ఓ సృష్టికర్తా! నీ కాంతి నన్ను జీవింపచేస్తున్నది. పోషిస్తున్నది. నన్ను నడిపిస్తున్నది. నీ విశ్వ నిర్మాణ చతురతను కొనియాడ నాతరమా? ఈ విశ్వంభరాచక్రము శాశ్వతంగా పరిభ్రమిస్తూ సమస్తలోకాలనూ నీ కనుసన్నలలో ఉంచుతున్నట్లే, నా జ్ఞానదాహం ఆ సృష్టిశోధనలో నిమగ్నమవుతున్నది. ఈ కొత్త వెలుగు, ధ్వని, గ్రహసంగీతం వాటి మూలకారణాలపై నా దృష్టిని నిలుపుతున్నవి.

నేనిలా ఆలోచిస్తుండగానే ఆమె నన్ను, నన్ను నేను చదివినట్లు చదివి ఇలా అన్నది– "నీవు వృథా ఊహలలో కాలం గడుపుతున్నావు. నీవిప్పుడు భూలోకంలో లేవు. మెరుపు వేగం కన్నా ఎక్కువగా నీవు ఊర్ధ్వలోకాలవేపు పయనిస్తున్నావు!"

నేను నా సందేహం తీరక ఆమెను అడిగాను– "నా శరీరం బరువైనది కదా! ఎలా ఇంత వేగంగా పైకి వెళ్లగలుగుతున్నది?"

ఆమె పసిపాపను లాలిస్తున్న తల్లిలా సమాధానమిచ్చింది– "దేవుని సృష్టిలో ప్రతి వస్తువూ దాని ప్రత్యేకతను కలిగి ఉంటుంది. దేవుని పథకపు (Lord's Grand design) నమూనా ప్రకారం ప్రతి గ్రహం, తార, జీవనిర్జీవ పదార్థాలు వాటి వాటి స్థానాలలో ఉండి వాటికి నిర్దేశించబడిన కార్యాలను నిర్వహిస్తూ ఉంటాయి.

విశాల సముద్రం వంటి సృష్టిలో ప్రతి ఒక్క పదార్థానికీ ప్రచోదన (Impulse) శక్తి ఉంటుంది. ఈ ప్రచోదన చంద్రునికి అగ్నిశక్తిని తీసుకువెళ్లగా ఆ శక్తితోనే జీవరాశులు, భూమిపై కలిసిమెలిసి ఉంటాయి. ఈ శక్తి సంధించి విడవబడిన బాణాల్లా అందరినీ చేరుతుంది. మనం ఆ బాణపు శక్తితో స్వర్గం వేపు వెళ్తూ ఉంటాము. అయితే మానవుడికి మిథ్యాసుఖాలపై భ్రాంతి కలిగితే ఆతడు మరల వెనుకకు భూలోకంలోకి పంపబడతాడు. కొండపై నుంచి నేలకు జాలువారిన ప్రవాహంలా అతడు ఇహలోక సుఖాలు కోరుకున్నట్లయితే 'ఇల' వేపు వస్తాడు. కాని నీవు భూమిపైన నిలబడి వున్నట్లే ఉండడం నీకు ఆశ్చర్యాన్ని కలిగించింది" అని పలికి ఆమె మరల తన దృష్టిని స్వర్గంవేపు మరలించినది.

**Canto - 2**

**స్వర్గలోకపు మొదటి మజిలీ! చంద్రగ్రహం! డాంటీ ఆలోచనలు. చంద్రునిపై మచ్చలను పదార్థాల సాంద్రతలో తేడాగా భావించిన డాంటీ అభిప్రాయాలపై బియాట్రైస్ వ్యాఖ్యానం.**

# స్వర్గలోకపు తొలి మజిలీ - చంద్రగ్రహం

చిన్ని పడవలలో కూర్చుని నా కావ్యగానాన్ని వింటున్న పాఠకులారా! నా నౌక వెనుక ప్రయాణించే సాహసం వద్దు. ఈ నౌక సముద్రజలాల మధ్యలో వేగంగా పోతుంటే మీరు వెనకబడి దారి తప్పవచ్చును. నేను ప్రయాణిస్తున్న అలలపై ఇంతకు ముందెవ్వరూ వెళ్లలేదు. మినర్వా నాకు ఊపిరినిస్తూ అపోలో నాకు దారి చూపు తుండగా, నవకళాధిదేవతలైన 'మ్యూజెస్' నాకు నక్షత్ర దర్శనం చేయిస్తున్నారు.

ఎవరైతే సకాలంలో దేవదూతలు ఆరగించే విజ్ఞానంపై (Angel's bread) తమ దృష్టిని నిలిపారో, వారు ఈ కల్లోల అలల్ని దాటి ప్రశాంత సాగరంలోకి అడుగుబెడతారు.

బంగారపు ఉన్ని కోసం సముద్రాల్ని దాటి కాల్చిస్ (Colchis) చేరుకున్న ఆర్గొనాట్లు తమవాడు జేసన్ (Jason), అక్కడి రాజాజ్ఞతో లోహపు వాడికొమ్ములతో, పొగమంటలు నిశ్వసిస్తున్న ఎద్దుల్ని కాడికి కట్టి నాగలి దున్నగా అందరూ ఆశ్చర్యపడిన దానికన్నా, పాఠకుడా! నీవు ఆశ్చర్యపోతావు.

దేవుని రాజ్యానికి చేరుకునేందుకున్న ఈ దాహం శాశ్వతమైనది. సహజసిద్ధమైనది. అదే మమ్మల్ని శరవేగంతో ముందుకు తీసుకుపోతున్నది. బియాట్రైస్ నాతో అన్నది– "నీ మనస్సును దేవునిపై లగ్నంచేయి! అతడు మనల్ని మొదటి నక్షత్రం వద్దకు చేర్చినాడు"

సూర్యకిరణాలు సోకిన వజ్రంలా మెరిసిపోతూ కాంతివంతమై, చిక్కగా, మచ్చలు లేని, కడిగిన ముత్యంలా ఉన్న ప్రదేశం మమ్మల్ని ఆహ్వానించింది. అది కాంతి కిరణాన్ని తనలోకి తీసుకుని కూడా నిశ్చలంగా ఉన్న నీటిలా ఉండి మానవ దైవ పరస్పర సంబంధాలను తెలుపుతున్నది.

నేను అడిగాను– "ఇది చంద్రలోకమే అయితే, భూమి నుంచి మాకు చంద్రునిపై కనిపించే మచ్చలకు కారణం – తన సోదరుడు ఎబెల్ (Abel(ను చంపిన కెయిన్ (Cain) శాశ్వతంగా ఇక్కడ నిర్బంధింపబడి అనంతకాలం వరకు తన భుజాలపై ముళ్లమోపును మోయాల్సిన శిక్ష అనుభవిస్తున్నాడని అని ప్రజలు

చెప్పుకునేది నిజమేనా? – నేననుకుంటున్నాను ఇక్కడి పదార్థాల్లోని సాంద్రతాభేధం ఆ మచ్చలకు కారణమనేది నా అభిప్రాయం" అని నేను నా అభిప్రాయం చెప్పాను.

బియాట్రైస్ అన్నది– "ఈ గ్రహాలన్నీ వివిధ పరిమాణాల్లో ఉన్న నక్షత్రాలు సాంద్రతా భేదమే మచ్చలకు కారణమైతే గ్రహణం రోజున సూర్యుడి కాంతి సరాసరి చంద్రుడి గుండా రావాలి లేదా కనబడకుండా వెనక్కి మళ్లాలి. కంసాలి ఒకే సుత్తితో మందుతున్న లోహంపై వేర్వేరుగా బలాన్ని ఉపయోగించినట్లు, గ్రహాల వేగాలు, పరిభ్రమణాలు ఆ దివ్యశక్తిచే నిర్దేశించబడి వుంటాయి.

దేవుడు నివాసముండే ఎంపిరియాన్ (Empyrean) నుంచి మహాశక్తి తొమ్మిదవ స్వర్గమైన Primum Mobile లేదా స్ఫటికస్వర్గం (Crystalline heaven)లోకి సమానంగా, హెచ్చుతగ్గులు లేకుండా ప్రవహిస్తుంది.

ఎనిమిదవ స్వర్గంలోని స్థిర నక్షత్రాలలోకి శక్తి హెచ్చుతగ్గులుగా నక్షత్రాలను బట్టి వేర్వేరు విధాలుగా వాటిని కాంతివంతం చేస్తుంది.

ఏడవ స్వర్గం శాటరన్ (Saturn); ఆరవది జూపిటర్ (Jupiter), అయిదవది మార్స్ (Mars), నాల్గవది సూర్యుడు (Sun), మూడవది వీనస్ (Venus), రెండవది మెర్క్యురి (Mercury), మొదటిది చంద్రగ్రహం (Moon).

మట్టి నుంచి జనించిన మానవదేహంలోని వివిధావయవాలలో ఆత్మ వ్యాపించి ఉన్నట్లు, విశ్వాంతరాళంలోని వివిధ గ్రహాల్లో దైవశక్తి – పరమాత్మ వ్యాపించి ప్రభావితం చేస్తుంటుంది. అంతేకాని చంద్రునిపై ఉన్న పదార్థంలో ఒకచోట తేలికగా, ఒకచోట మందంగా ఉండటం వలన కాదు. ఆ నక్షత్రాలలో, గ్రహాలలోని ఉన్న పదార్థాలు దివ్యకాంతిచే ఎంత ప్రకాశవంతమవుతున్నవో ఆ ధర్మాన్నిబట్టే మనకు వెలుగునీడలు కనిపిస్తాయి. బాగా ప్రకాశవంతమవుతున్న పదార్థాలు వెలుగును, తక్కువ ప్రకాశవంతమవుతున్న పదార్థాలు నీడగా మనం భూమండలం నుంచి చంద్రుని వీక్షించినప్పుడు చంద్రబింబంలో మచ్చలు కనిపిస్తాయి"

## Canto - 3

**ప్రథమ స్వర్గమైన చంద్రగ్రహం. ఆశీర్వదించబడినవారిని చూసిన డాంటే! పిక్కార్డా డొనాటి - చంద్రగ్రహంపై ఉండే ఆత్మల స్థానాన్ని గురించి వివరిస్తుంది. పరిశుద్ధమైన, స్వచ్ఛమైన జీవితాన్ని గడిపినవారు వారిపై ప్రయోగించబడిన హింస వలన సత్యమార్గాన్ని తప్పినవారు చంద్రగ్రహంపై ఆత్మలుగా నివసిస్తారని ఉదాహరణగా కొస్టాంజా రాణి ఆత్మను చూపిస్తుంది.**

# హింస వలన పరిశుద్ధ జీవనం నుంచి దారితప్పిన వాళ్ళు

ప్రేమతో నా హృదయాన్ని నింపిన సూర్యుడు ఇప్పుడు నాలో ప్రేమ, ప్రశాంతతతో కూడివున్న సత్యవదనాన్ని తెలియబరుస్తున్నాడు. నన్ను నేను ప్రకటించు కోవడానికి నేను తలపైకెత్తగా అద్దంలో, నిర్మలమైన నీటిలో కనిపించే ప్రతిబింబంలా, తెల్లని ఫాలభాగంపై నిలిచిన ముత్యంలా ఉన్న అనేక ఆత్మలు నాకు కనిపించాయి. వెనుదిరిగి చూడగా ఎవరూ లేరు. నేను నా మార్గదర్శకురాలి వేపు చూడగా నా సందిగ్ధావస్థను చూసి ఆమె చిరునవ్వు నవ్వింది– “నేను నవ్వినందుకు ఆశ్చర్యపడకు! నీవు చిన్నపిల్లాడిలా కారణాల్ని శోధిస్తున్నావు. సత్యపథంపై నీవింకా సరిగా అడుగులు వేయడంలేదు” అన్నదామె. “నీవు చూస్తున్నది వాస్తవ రూపాలే అయినా నీ మనసు వాటిని మిథ్యారూపాలుగా, ప్రతిబింబాలుగా జమకడ్తున్నది. ఆ ఆత్మలు ఇక్కడ ఉండడానికి కారణం వారి ప్రతిజ్ఞలు నెరవేరకపోవడమే! వారితో మాట్లాడి నీ సందేహ నివృత్తి చేసుకో!”

నాకు దగ్గరలో ఉండి నాతో మాట్లాడాలని ఆతృత చూపిస్తున్న ఆత్మతో ఇలా అన్నాను– “మంచితనానికి ప్రతిరూపంగా వున్న ఆత్మా! ఏ నెరవేరని ప్రతిజ్ఞ నిన్నీలోకంలో ఉంచింది? ఇంకా పైలోకాలకు వెళ్లాలనే కోరిక నీకున్నదా?”

ఆమె అన్నది– “నేను పవిత్ర ఆరాధనామందిరంలో ప్రభుసేవిక (Nun)గా స్వచ్ఛమై, నీతివంతమైన జీవితాన్ని గడుపుతూ ఉన్నదానిని. నా ప్రేమను, జీవితాన్ని, దేవుని వధువుగా, ఆ మహోన్నతుడికే అంకితం చేసిన దానిని.

చెడుకు, హింసకు ప్రాధాన్యతనిచ్చే మగవాళ్లు ఆ పవిత్ర సన్నిధి నుండి నన్ను మానవ అంతఃపురంలోకి చేర్చినారు.

సోదరా! నాపేరు పిక్కార్డా (Piccarda). నా సోదరి ఫొరెసె, నా సోదరుడు కోర్సొ డొనాటి. ఇతడు నలుపు (Black), గ్యెల్ఫి (Guelphi)ల నాయకుడు. నన్ను

బలవంతంగా మందిరం నుంచి లాక్కువెళ్లి తన అనుచరుడైన 'రొసెల్లినొ డెల్లా టొసా'కు ఇచ్చి వివాహం చేసినాడు. నాలోని లోపమే నన్ను ఈ తక్కువ వేగ పరిభ్రమణం గల చంద్ర గ్రహంపై ఉంచినా నేను గానీ ఇక్కడ ఉన్న ఆత్మలు గానీ పైలోకాలకు వెళ్లాలని ఆలోచించము. భగవానుని ఆలోచన మా ఆలోచన ఒక్కటే కదా! ఈ దివ్యజీవన సారాంశమే భగవానుడు నిర్దేశించిన సరిహద్దుల లోపల శాంతిసంతోషాలతో అరమరికలు లేకుండా జీవించడం. నదునలన్నీ సముద్రంలో కలిసినట్లు, జీవనిర్జీవ పదార్థాలన్ని అంతిమంగా కలిసిపోయే ఆతని సంకల్పానికి అనుగుణంగా మసలుకోవడం కదా!

నా కుడివేపున ఉన్న ఆత్మ కొన్స్టాంజా (Costanza-Constan) ప్రభు సన్నిధిలో కన్యగా ఉన్న ఆమె ఆరవ హెన్రీను వివాహమాడవలసి వచ్చింది. అతడు స్వాబియన్ల రెండవ గాడ్పుగా ప్రసిద్ధికెక్కినవాడు. వారి కుమారుడు రెండవ ఫ్రెడరిక్. అతడితో స్వాబియన్ల పరిపాలన అంతమైనది. ప్రభుసేవికగా ఆమె తలపై ఉన్న మేలిముసుగు తొలిగినా ఆమె హృదయంపై ఉన్న పవిత్రవస్త్రం నిలిచి ఉన్న కారణాన ఆమె కూడా ఈ చంద్రగ్రహస్వర్గంలో ప్రభు ఆరాధనలో మాతో కాలం గడుపుతున్నది"

అలా పలికి 'పిక్కార్డా' – Ave Mario! మేరియా నీకు జయమగుగాక!" అంటూ నీటిలో పడిన బరువైన వస్తువులా తానూ, ఇతర ఆత్మలతో కలిసి అదృశ్యమైనది.

ఆమె కనుమరుగు కాగానే నేను నా దృష్టిని బియాట్రైస్‌పైకి మరల్చాను. అద్భుతమైన కాంతితో ప్రకాశిస్తున్న ఆమె రూపాన్ని నా కళ్లు తట్టుకోలేకపోవడంతో నేను ఆమెను అడుగుదామనుకున్న ప్రశ్నలను తాత్కాలికంగా వాయిదా వేశాను.

## Canto - 4

**డాంటే అడుగుదామనుకున్న రెండు ప్రశ్నలు. తొలి ప్రశ్నకు జవాబుగా బియాట్రైస్ వివరణ. ఆత్మలు చేరుకోవాల్సిన అంతిమ ప్రదేశం ఎంపిరియాన్. రెండవ ప్రశ్నకు సమాధానంగా హింసవల్ల తమ కోరికలు నెరవేరని వారిలో తేడాలకు వివరణ.**

# హింసకు లొంగిపోవడం చెడును సమర్థించడమే!

ఎవరైనా ఆకలిగొన్నవాడి ఎదుట రెండు వాడికిష్టమైన పదార్థాలను ఉంచినట్లు, రెండు తోడేళ్ల మధ్య ఓ గొర్రెపిల్ల ఉన్నట్లు, రెండు దుప్పుల మధ్య కుక్కపిల్ల ఉన్నట్లు, రెండు సందేహాలు నన్ను పీడించగా మాటలకన్నా నా ముఖకవళికలు ప్రశ్నార్థకంగా మారినాయి.

నెబుఛాద్‌నెజ్జర్ (Nebuchadnezzar) కోపాన్ని ఉపశమింపజేసిన 'డానియేల్' (Daniel) ఆ రాజు కలకు అర్థాన్ని వివరించినట్లు – బియాట్రైస్ ఇలా పలికింది– "నీ మొదటి ప్రశ్న– నాలో మంచితనం మారకుండా ఉన్నపుడు, ఇతరులు నాపై రుద్దిన హింస వలన నా సుగుణం తక్కువగా ఎందుకు ఎంచబడుతున్నది?, రెండవది– నీవు 'ప్లాటో' నుంచి నేర్చుకున్న ఆత్మలు వాటి జన్మస్థలాలైన గ్రహాలకు తరలిపోవడం గురించి కదా!"

దేవునికి అత్యంత సమీపంలో ఉండే సెరాఫ్ (Seraph) కానీ, మోసెస్, శామ్యూల్, జాన్, మేరీమాత వీరెవరైనా కానీ వారు వేర్వేరు గ్రహాలపై ఉన్నా, అందరూ పొందే ఆనందం సమానమే! అన్ని ఆత్మలూ ఉండేది ఎంపిరియాన్ (Empyrean)లోనే! అయితే మానవ ఇంద్రియాలకు దగ్గర దూరాల తారతమ్యత తెలుస్తుంది. కాబట్టి ఈ ఆత్మలు మహాశక్తిమంతునికి దూరంగా ఉన్న ప్రథమ స్వర్గంలో ఉన్న అనుభూతి కలుగుతుంది.

మానవులకు అర్థం కావడం కోసమే పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లో దేవునికి రూపాన్ని, కాళ్లూ చేతులున్న స్వరూపాన్ని ఇవ్వడం, గాబ్రియేల్, మైఖేల్, రాఫెల్ దేవదూతలకు పవిత్ర చర్చి ఆలయాల్లో మానవరూపాన్ని ఇవ్వడంలోనిఉద్దేశమదే!

ప్లాటో అభిప్రాయమైన– ప్రతి ఆత్మ తనకు నిర్దేశించిన గ్రహంలోకి పోతుందనే దాన్ని మనం ఒక సూచనగానే తీసుకోవాలి, లేకుంటే ఆత్మల నిందా గౌరవాలు ఆ గ్రహాలకు అన్వయించే ప్రమాదముంటుంది.

హింసకు లొంగిపోవడం హింసాయుత శక్తులకు సాయం (abettment) చేసినట్లే కదా! వారు ప్రభు సన్నిధికి తిరిగి రావడానికి ఆటంకమేమున్నది. వారు

తాము లొంగిన పరిస్థితులను అంగీకరించి తమ మార్గాన్ని తప్పినారు కదా! సెయింట్ లారెన్సును (Laurence) వాలెరియన్ ప్రభువు (Valerian) సజీవంగా మంటల్లో వేల్చమన్నప్పుడు, "నన్ను మంటలలో అన్నివేపులకూ తిప్పండి సరిగా కాల్తాను" – అని ఎగతాళి చేసి తన మనోబలాన్ని నిరూపించలేదా!

'పోర్సెనా' – 'రోమ్'ను ముట్టడించబోగా ఆతడిని చంపబోయి పట్టుబడిన మ్యూసియస్ (Mucius)ను సజీవదహనం చేయమని 'పోర్సెనా' ఆజ్ఞాపించగా – తన చేతిని అక్కడే వున్న మంటలో వుంచి మాలో ఒకరి తరువాత ఒకరు నిన్ను చంపడానికి ప్రయత్నం చేస్తూనే వుంటామని అనడంతో నిశ్చేష్టుడైన 'పోర్సెనా' (Porcena) మ్యూసియస్‌ను విడుదల చేసి, రోమ్ ముట్టడిని విరమించుకోలేదా!

ఈ ఉదాహరణలు హింసకు లొంగిపోవడం, హింసను సమర్థించడం లాంటిదేనన్న విషయాన్ని నీకు స్పష్టం చేసి ఉంటాయి.

ఇంకో సందేహం నీకున్నది– కోస్టాంజా తలపై ముసుగు తొలిగినా హృదయంపై ముసుగు తొలగలేదన్న విషయం– మానవులు ఒక్కోసారి తమకు ఇష్టంలేని పనుల్ని చేయవలసి రావడం – దీనికి దృష్టాంతంగా ఆల్కమియాన్ (Alcamaeon) వృత్తాంతం విను. ఆల్కమియాన్ తండ్రి ఏంఫియారస్. థెబెస్ (Thebes) వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొంటే మరణం తప్పదని రహస్య ప్రదేశంలో దాక్కున్న ఆతడిని, ఆతడి భార్య 'ఎరిఫైలీ' (Eriphyle) వజ్రాల (నెక్లెస్) హారానికి ఆశపడి ఆతడి ఆచూకీ చెప్పగా, యుద్ధంలో మరణించేముందు తన కుమారుడు ఆల్కమియాన్‌ను పిలిచి ఏంఫియారస్ తన భార్యను వధించమనగా తనకిష్టం లేకపోయినా ఆల్కమియాన్ ఆ పని చేస్తాడు.

Absolute will is completely unyielding to evil, but contingent or relative will is yielding to evil out of fear and not coming back to their holy shelter. తాత్కాలికంగా అయినా చెడుకు లొంగిపోరాదు. పిక్కార్డా నీతో చెప్పినది Absolute will గురించి. నేను వివరించింది relative will గురించి. స్వర్గలోకంలో ఆత్మలు నిజాలే చెబుతాయన్నది మరిచిపోవద్దు" అన్నది బియాట్రైస్.

నేనన్నాను– "The truth beyond whose boundary no truth lies - ఏ సత్యపు సరిహద్దు కావల వేరే సత్యం ఉండదో అక్కడ మాత్రమే మనసులో సందేహాలు నశిస్తాయి. సత్యమూలం నుంచే సందేహాలు ఆవిర్భవించి వృద్ధిచెందుతాయి. మరి ఈ నెరవేరని ప్రతిజ్ఞలను నెరవేర్చడానికి ఏవైనా మంచిపనులను చేయడానికి వీలున్నదా ఆ రకంగా ఇక్కడున్న ఆత్మలలోని లోపాన్ని సరిదిద్దవచ్చును కదా!"

## Canto - 5

**ప్రథమస్వర్గం చంద్రగ్రహంపైన బియాట్రైస్ నెరవేరని ప్రతిజ్ఞలను ఎలా పూర్తిచేసుకోవాలో అన్న విషయాన్ని వివరిస్తుంది. రెండవ స్వర్గమైన మెర్క్యురి (Mercury) లోకి ప్రయాణం. అక్కడ జస్టినియన్‌తో పరిచయం**

# రెండవ స్వర్గం మెర్క్యురిలోకి ప్రవేశం

జ్వాజ్వల్యమానంగా ప్రకాశిస్తున్న బియాట్రైస్‌ను చూసి నేను కనులు మూసికొనగా ఆమె అన్నది– "సోదరా! నీ దృష్టిశక్తిని మించి నా ప్రకాశత్వం స్వచ్ఛమైన ప్రేమాగ్నిజ్వాల వలన ఉద్భవించినదే. మంచిని గ్రహిస్తూ మరింత ప్రకాశవంత మవుతుంది. ఇప్పుడు నీ మస్తిష్కంలో శాశ్వతకాంతి ప్రకాశిస్తున్నది. అల్ప విషయాలపై క్రమేపీ నీ దృష్టి సన్నగిల్లుతుంది.

నీ సందేహం గొప్పదే! నెరవేరని వాగ్దానాలను మంచిపనులను చేయడం ద్వారా ఆత్మ పరమాత్మకు మరింత దగ్గర కావడానికి వీలవుతుందా అనేది కదా!

భగవానుడు మానవుడికిచ్చిన ఓ గొప్ప బహుమతి, వరం – Free will – అవసరానికి గాని, అదృష్టానికి గాని కట్టుబడకుండా తన చేతలను తాను నిర్ణయించుకునే శక్తి – దాని వలన మానవుని అంగీకారమే దేవుని అంగీకారమవుతుంది. అంతేకాక ఒక వాగ్దానమో, ఒప్పందమో చేసినప్పుడు మానవుడు తన స్వేచ్ఛా నిర్ణయశక్తి అనే సంపదను కోల్పోయిన వాడవుతాడు. అలా కోల్పోయిన దానికి పరిహారమెలా చెల్లింపగలడు?

నేను చెబుతున్నది నీకర్థమవుతున్నదనుకుంటాను. నీవు విన్న విషయాలను మనసులో పదిలపరచుకో! లేకుంటే ఏమీ నేర్చుకోలేవు.

ఎవరైనా ఒక త్యాగాన్నో, వాగ్దానాన్నో తలపెట్టినప్పుడు దానిలో రెండు విషయాలు ఇమిడి ఉంటాయి. మొదటిది– ఆ ఒప్పందపు సారాంశం. రెండవది– ఆ ఒప్పందాన్ని ఏ రూపంలో ఇస్తున్నావనేది. హీబ్రూలకు కొన్ని ఆచారాలు నిర్దేశింపబడినా ప్రత్యేక పరిస్థితులలో కొన్న మినహాయింపులు, మార్పులు అనుమతించ బడినవి. కాని చర్చిలలో అప్పుడప్పుడు పూర్తి మినహాయింపులు ఇస్తున్నట్లు కనిపిస్తున్నవి దైవసమ్మతం కానివి.

మతాధికారుల జ్ఞానం (White Key), అధికారం (Yellow Key) ఇటువంటి మినహాయింపులు ఇచ్చేప్పుడు ధర్మసమ్మతంగా వ్యవహరించాలి. అందుకనే మానవులు కూడా తమ స్వేచ్ఛా నిర్ణయశక్తితో ఒక ఒప్పందానికి వచ్చేముందే జాగ్రత్తగా ఉండాలి.

ఇజ్రాయెల్ న్యాయాధికారి జెఫ్థా (Jephthan) – అమ్మోనైట్లతో యుద్ధంలో విజయం సాధిస్తే, తన ఎదుటకు వచ్చిన మొదటి వ్యక్తిని యెహోవా (Yahweh)కు బలిస్తానని మొక్కుకున్నాడు. విజయం సాధించాక ఆతని ఎదుటకు వచ్చిన మొదటి వ్యక్తి ఆతని ప్రియకుమార్తె. అతడు ఆమెను బలిచ్చాడు. అలా కాకుండా దేవుని వేడుకున్నట్లయితే ఆ ఘోరం జరిగుండేది కాదు.

ఆగమెమ్నాన్ ఒకనాడు ఆర్టెమిస్ దేవతకు ఆ సంవత్సరం తన రాజ్యంలో పుట్టిన అందాలరాశిని ఆమెకు సమర్పిస్తానని మొక్కుకున్నాడు. తీరా ఆ అందాలరాశి తన కుమార్తె ఇఫిజీనియా (Iphigenia) అయ్యేసరికి వాగ్దానభంగం చేసినాడు. ట్రాయ్ యుద్ధసమయంలో అనుకూలమైన గాలులు వీచకపోయేసరికి గ్రీకు పెద్దలందరూ ఆగమెమ్నాన్‌ను నిందించగా తప్పనిసరి పరిస్థితుల్లో ఆగమెమ్నాన్ ఆమెను బలియిమ్మని ఆజ్ఞాపించినాడు. ఆమె తనకంత అందమున్నందుకు కన్నీరు పెట్టుకున్నది.

క్రైస్తవులు మరింత జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే, వీళ్లను సరైన దారిలో నడిపించేందుకు పరిశుద్ధ గ్రంథాలున్నవి, మతాధికారులున్నారు. తల్లిని వదిలి వేరే రుచులకు దారితప్పిన గొర్రెపిల్లలా జీవించరాదు"

బియాట్రైస్ వివరణ అనంతరం మేము ఎక్కుపెట్టిన విల్లునుంచి విడివడిన బాణాల్లా ద్వితీయ స్వర్గమైన మెర్క్యురి (Mercury) లోకి ప్రవేశించినాము. అక్కడ వేలాదిమంది ఆత్మలు, చేపల సరస్సులోని చేపలు బయట వ్యక్తుల్ని గమనించి వారి వేపు గుమికూడినట్లు, ఆ ఆత్మలు ఆనందంతో ప్రకాశవంతంగా వెలుగుతూ మావేపు రాసాగినారు.

ఆ ఆత్మలు నాతో మాట్లాడడానికి ఉత్సుకత చూపగా, బియాట్రైస్ ప్రోత్సాహంతో నేను అడిగాను– "ఆత్మలారా! మీ కన్నుల నుండీ వెలువడుతున్న కాంతులే మీకు గూడుకాగా అందులో ప్రకాశవంతంగా ఒదిగి ఉన్నారు. భూలోకంలోని మర్త్యులకు, మీకు మధ్య ఉన్న మరో గ్రహపు కాంతులు మిమ్మల్ని వారికి కానరాకుండా చేస్తున్నవి. మీరెవరు, ఎందుకిక్కడ ఉన్నారో వివరించి నన్ను జ్ఞానవంతుడిని చేయమని అర్థిస్తున్నాను"

మాట్లాడమని నన్ను ప్రోత్సహించిన ఓ ఆత్మ అమితమైన ఆనంద ప్రకాశంతో నాతో మాట్లాడ సిద్ధమైనది.

**Canto - 6**

**ద్వితీయ స్వర్గం మెర్క్యురీ గ్రహంలో జస్టినియన్ ఆత్మ విధి గురించి రోమన్ ఈగిల్ గురించి వివరిస్తాడు. ఇక్కడ నివసించే ఆత్మలు ధర్మనిష్ఠ, న్యాయప్రవర్తన, ఋజువర్తన కలిగినవే అయినా పేరుప్రతిష్ఠలపై కోరికతో అలా ప్రవర్తించడం వలన వారికి ద్వితీయ స్వర్గ నివాసం లభించిందని తెలుస్తుంది. విల్లెన్యూమేలోని రోమియో వృత్తాంతం వివరించబడ్డుంది.**

# పేరు ప్రతిష్ఠల కోరికతో ఋజుమార్గంలో నడిచినవారు

కాన్‌స్టాంటైన్ (Constantine) చక్రవర్తి రోమన్ సామ్రాజ్య రాజధానిగా 'కాన్‌స్టాంటినోపుల్'ను (Constantnople) 'రోమ్' నుండి మార్చి రోమన్ ఈగిల్‌ను స్వర్గానికి వ్యతిరేకంగా తిప్పి రెండు వందలు ఏళ్లు గడిచాయి. ఈనియస్ ట్రాయ్ నుంచి ఇటలీకు తూర్పు నుంచి పడమరకు తీసుకువచ్చి నెలకొల్పిన రాజ్యం, పడమట నుంచి తూర్పుకు మారింది. ప్రజల నీతి ప్రవర్తనపై నిర్ణయాధికారం చర్చికి, తద్వారా 'పోప్'కు లభించింది.

నేను సీజర్ ప్రభువును. నాపేరు జస్టినియన్ (Justinian). నేను కోడెక్స్ జస్టినియనస్ (Codex Justinianus)లో అప్పటి వరకు ఉన్న న్యాయసూత్రాలను క్రోడీకరించి, పవిత్రాత్మ ప్రోద్బలంతో అనవసరమైన వాటిని తీసివేసి న్యాయ సంస్కరణలను చేబట్టినాను. నేను క్రీస్తుని దేవునిగానే చూసాను. ఆ దేవునిలో మానవ, దైవశక్తులను వీక్షించాను. అంతేగాని మానవ క్రీస్తు, దైవక్రీస్తు అనే ద్వైతం నాకు లేదు. పోప్ అగాపెటస్ (Agapetus) నాలో ఈ భావన రూపొందడానికి కారణం.

నా సైన్యాధికారి, విశ్వసనీయుడు అయిన బెలిసారియస్ (Belisarius) నా సామ్రాజ్యాన్ని విస్తృతపరచాడు. నా సామ్రాజ్యపు గరుడపక్షి కళ్లు అనంత దూరాన్ని అవలోకిస్తూ ఉండేవి. ఆనాడు ఈనియస్ తరఫున యుద్ధంలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన పల్లాస్ (Pallas) కాలం నుండి మూడు వందల ఏళ్లకుపైగా 'అల్బా'లో ఉన్న సామ్రాజ్యం – అస్కానియస్ నుండి రొమ్యులస్ వరకూ రొమ్యులస్ తన సైనికుల కోసం సబైన్ స్త్రీలను బలాత్కారంగా వశపరచుకుంటే ఏడవ రోమన్ చక్రవర్తి టార్క్విన్ (Tarquin) శీలవతి లుక్రెసి (Lucrece) ని బలాత్కారం చేయగా ఆమె ఆత్మహత్య చేసుకోవడంతో ప్రజలు తిరగబడి రోమన్ రాజరికపాలనకు చరమగీతం పాడినారు!

అలా రోమన్ రిపబ్లిక్ మొదలైంది. ఉంగరాల జుట్టున్న క్వింక్టియస్ (Quinctius), బ్రెన్నస్‌ను ఓడించిన టార్కెటస్ (Torquatus), ఫాతీ, డెసీలు, హన్నిబాల్‌ను నిలువరించిన ఫాబియస్, హన్నిబాల్ (Hannibal)ను ఓడించిన స్కిపియో (Scipio), మారియస్‌ను ఓడించిన పాంపే (Pompey) వీళ్లందరూ గరుడ పతాకకు కీర్తి తెచ్చినవాళ్లే.

క్రీస్తు భూమికి వచ్చే సమయం ఆసన్నమైనది. మానవుడు దేవునితో సమాధాన పడాల్సిన తరుణం వచ్చింది.

సీజర్ రోమన్ రాజలాంఛనాలను చేబట్టి దిగ్విజయ యాత్రకు బయల్దేరినాడు. గాల్ (Gaul) ప్రాంతపు అయిదు నదులు Var, Isere, Saone, Scine, Cuni, రవెన్నా (Ravenna)ను వదిలి, రోమన్ సెనెట్ ఆజ్ఞలనతిక్రమించి రుబికాన్ (Rubicon) నదిని దాటినాడు. స్పెయిన్‌లో పాంపే పై ఆధిపత్యం సంపాదించి, డురాజ్జొలో ఓడించినాడు. ఈజిప్టుకు పారిపోయిన పాంపేను అనుసరిస్తూ ట్రాయ్ శిధిలాలను, హెక్టార్ సమాధిని చూసి, ఈనియస్ తొలిసారి కాలిడిన Antandros నుంచి ఈజిప్టుకు వెళ్లినాడు.

అప్పటికే టాలమీ (Ptolemy XII), క్లియోపాత్రాల మధ్య ఉన్న వివాదం పరాకాష్ఠకు చేరుకోగా టాలమీ – సీజర్ సాయం కోరే ఉద్దేశంతో పాంపేను హత్యచేసి ఆతని శిరస్సును సీజర్‌కు బహుకరించాడు. సీజర్ క్లియోపాత్రాకు ఈజిప్టు సింహాసనాన్నిచ్చినాడు. టాలమీ సముద్రంలో మునిగి చనిపోయాడని వార్త వచ్చింది. న్యుమిడియన్ల రాజు జుబా (Juba)ను ఓడించి మరల స్పెయిన్‌కు తిరిగివచ్చి 'పాంపే' అనుయాయుల్ని ఓడించి శత్రుశేషం లేకుండా చేసుకున్నాడు జూలియస్ సీజర్.

ఏంటోనీ, ఆగస్టస్‌లు జూలియస్ సీజర్ హత్యకు మూలకారకులైన బ్రూటస్, కాసియస్ (Brutus, Cassius)లను ఓడించగా వాళ్లు ఆత్మహత్య చేసుకుంటారు. తరువాత క్లియోపాత్రా, ఆంటోనీలు, ఒక పక్షంగా, ఆగస్టస్ మరోపక్షంగా జరిగిన యుద్ధంలో ఓడిన ఆంటోని ఆత్మహత్య చేసుకోగా, రోమ్‌కు బందీగా వెళ్లడం ఇష్టంలేని క్లియోపాత్రా Asp సర్పంతో కాటువేయించుకుని చనిపోతుంది. ఆగస్టస్ రోమన్, ఈజిప్టు రాజ్యాలకు సర్వంసహా చక్రవర్తి కాగా, రోమన్ సామ్రాజ్యంలో శాంతి వెల్లివిరయగా యుద్ధదేవత జేనస్ (Janus) దేవాలయపు తలుపులు మూయబడతాయి.

టిబెరియస్ (మూడవ సీజర్) కాలంలో క్రీస్తు శిలువ వేయబడినాడు. మానవుడు దేవునితో సమాధానపడడం ప్రారంభమయ్యింది. మానవుడు తన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవడం మొదలైంది.

టైటస్ జెరుసలేంను ధ్వంసం చేయడాన్ని అనేకులు, దేవుడు యూదులపై తన ఆగ్రహాన్ని తెలిపిన ఘటనగా భావిస్తారు. తరువాత ఛార్లమానె Charlemagne) కాలం నాటికి ప్రాచీన రోమన్ సామ్రాజ్యం, పవిత్ర రోమన్ సామ్రాజ్యంగా రూపు దాల్చింది.

ఇప్పుడు గ్యుల్ఫులు (Guelphs) – వీళ్లు రోమన్ ఈగిల్‌ను వ్యతిరేకిస్తున్నారు. ఘిబెల్లైన్లు (Ghibellines) రోమన్ గరుడ పక్షిని, ఫ్రెంచి లిల్లీపూలను తమ చిహ్నంగా వాడుతున్నారు. ఇప్పటి గ్యుల్ఫు ఛార్లెస్‌ను ఏరోజో గరుడపక్షి తన గోళ్లతో వేటాడుతుంది"

ఈ మెర్క్యురి గ్రహంలో న్యాయబుద్ధి, ఋజుప్రవర్తనతో జీవించిన వారి ఆత్మలు నడయాడుతాయి. కాని వారిలోని ప్రబలమైన కీర్తికాంక్ష వారిని దైవశక్తికి ఇంత దూరంలో ఉంచుతున్నది.

అదుగో అతడు రోమియో (Romeo of Villeneure). చాలా పేదవాడు. దైవభక్తుడు. తీర్థయాత్రకు వెళ్లివచ్చి తన సుగుణాలతో ప్రొవెన్స్ ప్రభువు రేమాండ్ బెరింగర్ (Raymond Berenger-IV)ను మెప్పించి మంత్రిగా, ప్రతీహారిగా (Chamberlain) విధుల్ని నిర్వర్తించినాడు. తన బుద్ధి కౌశలంతో రేమాండ్ కుమార్తెలు నలుగురిని నాలుగు దేశాలకు మహారాణులుగా చేసినాడు. అతడంటే గిట్టని వాళ్లు నిందలు వేసి, రేమాండ్ ప్రభువు ఖర్చులు లెక్కచెప్పమనేట్లు చేసినారు. రోమియో వెంటనే తన పదవిని త్యాగం చేసి తాను ఏ కట్టుబట్టతో వచ్చాడో అలానే ఎవరకు తెలియని ప్రదేశానికి వెళ్లిపోయినాడు. పశ్చాత్తాపపడిన ప్రభువు వెళ్లవద్దని బతిమలాడినా ఫలితం లేకపోయింది" అన్నాడు జస్టినియన్.

అతడు కదా ఋజుమార్గవర్తనుడు! రోమియో! నీకెవరు సాటి!

**ద్వితీయ స్వర్గం – మెర్క్యురి గ్రహంలో జస్టినియన్ నిష్క్రమణ. బియాట్రైస్ దేవుని ఆగ్రహం గురించి, క్రీస్తు మరణాన్ని, మానవ నైతిక పతనాన్ని, ముక్తి, పునరుత్థానాన్ని గురించి వివరిస్తుంది.**

# మానవుని నైతికత, ముక్తిమార్గం, పునరుత్థానం

"Hosanna! Oh, save ! holy God of hosts ! Superabundantly illuminating with your brightness the happy fires of these kingdoms" "ఆర్తత్రాయ పరాయణుడా! మమ్మల్ని రక్షించు!" అంటూ ప్రార్థిస్తూ ఆ జ్వలిస్తున్న ఆత్మ యుద్ధం, న్యాయం అనే రెండు వెలుగులు మరింతగా ప్రకాశిస్తుండగా తనతో ఉన్న ఇతర ఆత్మలతో కలిసి, వేగంగా పోతున్న నిప్పురవ్వల్లా అదృశ్యమైనారు.

నా మనసు ఆమెనడిగి సందేహాలను తీర్చుకోవాలని తహతహలాడ్తున్నా ఆమెపై నాకున్న భక్తిభావం, ఆమె పేరులోని Be, ice లను విన్నా నాలో పొంగే ఆరాధన నన్ను నిద్రిస్తున్న వాడిగా మార్చాయి.

అగ్నిమంటల్లో ఉన్న మానవుడిని సేదదీర్చే శీతల స్పర్శలా ఉండే ఆమె చిరునవ్వులు నన్ను సంతోషాంబుధిలో ముంచెత్తినాయి. ఆమె అన్నది– "నీలో ఉన్న సందేహం నాకు తెలుసు. సరైన ప్రతీకారం (Just Vengeance) సరైన శిక్ష (Just punishment)ను ఎలా పొందుతుందని నీ ప్రశ్న! అవునా? తొలిమానవుడు తనకిచ్చిన స్వేచ్ఛా నిర్ణయశక్తిని (Free will) దుర్వినియోగపరచి తననూ తన తరువాత తరాలను పాపుల్ని చేసినాడు. దైవవాక్కు వీరిని పరిశుద్ధం చేసేంతవరకూ అనేక శతాబ్దాలపాటు వీళ్లు ఆ అగాధంలో మగ్గవలసి వచ్చింది. దేవుని శాశ్వత ప్రేమకు దూరమైన ఈ ప్రపంచం చానాళ్లు ప్రేమరాహిత్యంలో అలమటించింది.

సృష్టికర్తకు ముడివేయబడిన ప్రకృతి, సృష్టి ప్రారంభంలో స్వచ్ఛంగా, సహజంగా, మంచిగా ఉండినది. మానవుని పొరపాటు వలన స్వర్గం నుంచి తొలగించబడి తప్పుదారి పట్టినది. మానవుడైన క్రీస్తు శిలువ వేయబడి మానవుల తప్పిదానికి మూల్యం చెల్లించి, ఎవరూ చేయని పని చేయడంతో దివ్యుడైనాడు.

దేవుడు, యూదులు (Jews) ఆతని మరణానికి వేర్వేరు భావనలతో సంతోషించినారు. భూమి వణికింది. ఆకాశం బద్దలైంది. నీవు అడగవచ్చు. దేవుడు మానవుల విముక్తికి  ఈ మార్గాన్ని (The incarnation and passion of the Christ) ఎందుకు ఎన్నుకున్నాడు?

దేవుని మంచితనం (The goodness of God) శాశ్వత ప్రేమకు సంబంధించిన ఉద్వేగాలకు అతీతమైనది. ఆతని మంచితనం నుంచే సమస్త సృష్టి, రూపురేఖలు ఏర్పడినాయి. దేవునిచే సరాసరి సృష్టింపబడినవి శాశ్వతమైనవి. అలా కాకుండా మధ్య పదార్థాల (Intermediaries) ద్వారా ఏర్పడినవాటికి శాశ్వతత్వమూ, స్వేచ్ఛ (Immortality, liberty) ఉండవు.

నిషేధించిన ఫలాన్ని తిని మానవుడు శాశ్వతత్వాన్ని, స్వేచ్ఛను కోల్పోయినాడు. వీటిని తిరిగి పొందాలంటే – దేవుడు మానవుని క్షమించుట (through nothing other than His <u>mercy</u>) ద్వారా, మానవుడు తన తప్పుకు తగిన మూల్యాన్ని చెల్లించుట (Payment for his folly) ద్వారా మాత్రమే సాధ్యం. మానవుడు తనకున్న పరిధుల్లో సరైన మూల్యం చెల్లించడం అసంభవం. ఎందుకంటే అతడు నిషిద్ధ ఫలాన్ని తిని, సర్పం మాటలను నమ్మి దేవునితో సమానం కావాలని భావించినాడు. కాబట్టి ఆ అవిధేయతకు ఎంత పశ్చాత్తాపమూ సరిపోదు.

దేవుని మార్గాలు – కరుణ, న్యాయం. ఈ రెండూ మానవునికి అందకుండా పోయినాయి. అందుకే క్రీస్తు మానవుల తరపున శిలువనెక్కి మరల పునరుజ్జీవనము నొంది మానవులకు దేవుని కరుణా మార్గమును చూపించినాడు.

స్వర్గంలో, ఇతర గ్రహాల్లో ఉన్న దేవదూతలు దేవునిచే సృష్టింపబడినవారు గనుక వారు అమరులైనారు. అయితే ప్రాథమిక మూలకాలు, వాటి శక్తులను దేవుడు సృష్టించిన గ్రహాల నుంచి పొందుతాయి కనుక వాటికి శాశ్వతత్వం లేదు.

నాలుగు మూలకాలైన భూమి, నీరు, గాలి, అగ్ని – ఇవి దేవునిచే సృష్టింపబడినా వీటికి శాశ్వతత్వం లేదు. అంతేకాక అవి అపభ్రంశ రూపాన్ని పొందవచ్చు (Corruption). ప్రతి వస్తువూ తన మూలాల్లోకి పోవాలనుకున్నట్లే, మానవుడు తన సృష్టికర్త వద్దకు చేరుకోవాలనే లక్ష్యంతో ఉండడం వల్ల ఆత్మ, పరమాత్మ వేపు పయనిస్తుంది. ఇతర జీవరాశులకు (మొక్కలు, జంతువులు) భిన్నంగా, దేవుడు మానవ శిశువుల్లోకి ఊదిన ఊపిరి వలన, మానవుని ఆత్మ, దేహం కూడా శాశ్వతత్వాన్ని సంతరించుకున్నాయి. అందుకనే మృత్యువు తరువాత మానవులకు పునరుజ్జీవనం (Resurrection) ఉంటుంది" అన్నది బియాట్రైస్.

**తృతీయ స్వర్గం వీనస్ గ్రహం. ఛార్లెస్ మార్టెల్ తండ్రులు, కొడుకులు, వంశ పారంపర్య లక్షణాలను, సహజ ప్రవర్తనలను వివరిస్తాడు.**

# తృతీయ స్వర్గం - వీనస్ గ్రహం

క్రీస్తు ఇంకా భువికి రాని కాలంలో ప్రేమ (Sensual love) సైప్రస్ దీవికి దగ్గర సముద్రంలో జనించిన 'వీనస్' మహిమగా భావించేవారు. ప్రాచీనులు ఆమెను సంతృప్తిపరచడానికి ఉత్సవాలు బలులు నిర్వహించేవారు. దయానా తల్లిగా, క్యుపిడ్ (Cupid) కుమారుడిగా మానవుల మనస్సుల్లో ప్రేమను, కామాన్ని ప్రవేశపెడ్తారని విశ్వసించేవారు.

ఈనియస్ 'డిడో'లున్న (Aeneas, Dido) సమావేశానికి అస్కానియస్ (Ascanius) రూపంలో వచ్చిన క్యుపిడ్, డిడొ మనస్సులో, శరీరంలో ప్రేమభావనలు మొలకెత్తింపజేసి ఆమె విషాదాంతానికి కారకుడయ్యాడు.

వీనస్ గ్రహం ఉదయతారగా, సాయంకాలపు నక్షత్రంగా కనిపిస్తూ ఆకాశాన్ని తన కాంతితో ప్రకాశవంతం చేస్తుంది. నా మార్గదర్శకురాలు బియాట్రైస్ అందం మరింత ఎక్కువ కావడాన్ని గమనించిన నేను ఖచ్చితంగా ఈ గ్రహం 'వీనస్' (Venus) అని నిర్ధారించుకున్నాను.

మంటలోని నిప్పురవ్వల్లా, పాటలోని స్వరాంతర్గత స్వరంలా, ఒకరు స్వరస్థాయిని స్థిరంగా ఉంచుతుంటే, మరో స్వరం వస్తూపోతున్నట్లు, నేను అక్కడి ప్రకాశవంతమైన కాంతిలో ఆత్మల రాకపోకలను గమనించాను.

వేగాల స్థాయిలో తేడా ఉన్నా ఆ ఆత్మలు చల్లని గాలుల్లా వేగంగా పయనిస్తూ, నృత్యం చేస్తూ, దేవుని ప్రతీహారుల సన్నిధి నుంచి (Primum mobile) ఇక్కడకు వస్తూ Hosanna! ప్రభూ! రక్షించు! అని స్తోత్రాలు చేస్తున్నవి.

వారిలో ఒక ఆత్మ నన్ను సమీపించి అన్నది– "జ్ఞానదాహంతో అలమటిస్తున్న బాటసారీ! సంపూర్ణమైన మా ప్రేమ, మా వృత్తాంతము నీకు సంతోషాన్నిచ్చేట్లయితే కాసేపు ఇక్కడ నిలబడడానికి మాకు అభ్యంతరం లేదు"

నేను నా మార్గదర్శకురాలి అనుమతితో మీరెవరని ఆ ఆత్మను ప్రశ్నించాను. – "సంతోషానికి, సంతోషం జతకలిసినప్పుడు వెలుగు మరింత ప్రకాశవంతమైనట్లు బహుశా ఎక్కువ కాలం అక్కడ జీవించివుంటే నాకూ మాలిన్యాలంటేవేమో! నా సంతోషం నన్నావరించుకుని పట్టుపురుగును చుట్టుకున్న ప్రశస్తమైన పట్టుకాయలా మెరుస్తున్నది.

నేను ఆ లోకంలో ఉన్నపుడు నీవు నన్ను ప్రేమించావు. మనిద్దరం స్నేహితులుగా ఉన్నాము. నేను ఛార్లెస్ మార్టెల్‌ని (Charles Martel). రేమాండ్ బెరింగర్ నలుగురు కుమార్తెలలో ఒకరైన బియాట్రైస్‌ను వివాహమాడిన ఛార్లెస్ (Charles of Anjou) మనమడిని.

నేను ఇంకొంత కాలం బతికివుంటే ప్రొవెన్స్‌కు అధిపతినయ్యిండేవాడిని. నా తల్లి పేరు మేరీ. ఆమె నుంచి హంగరీ నాకు వారసత్వ సంపదగా వచ్చేది. ట్రినాక్రియా (సిసిలీ) కూడా మాకు చెందేదేకాని మా తాతగారు ఛార్లెస్-1 తన దుష్పరిపాలనతో ప్రజల్ని వేధించగా, సిసిలియన్ వెస్పర్స్ తిరుగుబాటు చేసి ఛార్లెస్‌ను అతని అనుయాయుల్ని తరిమికొట్టారు.

తరువాత మా తండ్రి ఛార్లెస్-2 విడుదల కోసం నా సోదరుడు రాబర్ట్ (Robert) అరగాన్ ప్రభువుల చేతుల్లో ఏడేళ్ల పాటు బందీగా ఉండి విడుదలైన తరువాత నేపుల్స్‌కు రాజైనాడు. రాబర్ట్ అత్యాశాపరుడు. ధనకాంక్ష ఎక్కువ. సైనికులతో ప్రజలను దోచుకున్నాడు. ఛార్లెస్-1 దయగలవాడిగా ప్రసిద్ధికెక్కినా రాబర్ట్ తద్వ్యతిరేకంగా పరిగణించబడినాడు. తత్ఫలితమే పాలెర్మోలో మరణమృదంగం వినిపించింది" అన్నాడతడు.

నేనన్నాను- "మంచివాళ్ల కడుపున ఇటువంటి వక్రబుద్ధులున్న సంతానమెలా కలుగుతుంది?"

అతడన్నాడు- "దేవుడు తన విల్లునుంచి బాణాలను ఎక్కుపెట్టి వదలగా అవి విధిననుసరించి వేర్వేరు వేగాలతో వేర్వేరు ప్రదేశాలకు చేరుకుంటాయి. ప్రకృతి ఆ విత్తనాలకు సరిపడినంత రక్షణనిస్తుంది. అలా జనించిన మానవుడు సంఘజీవిగా బ్రతుకుతూ తన అవసరాలను తీర్చుకుంటాడు. సంఘానికి అవసరమైన విధుల్ని నిర్వర్తించే క్రమంలో ఒకరు **సోలాన్**లా న్యాయసూత్రాలను ప్రతిపాదిస్తే ఇంకొకడు **క్జెరెక్జెస్**లా యోధుడవుతాడు. మరొహడు **మెల్కిజెడెక్**లా మతాధిపతిగా, **డీడాలస్**లా పరిశోధకుడుగా తయారవుతాడు. (Solon, Xerxes, Melchizedek, Daedalus). ఇసాక్, రెబెకాల కవలపిల్లలు ఈసావు, జాకబ్‌లలో తేడా గమనించే వుంటావు. రొమ్యులస్ తండ్రిని 'మార్స్'గా ప్రజలు గుర్తించారు.

విధినిర్ణయం (Divine Providence) అడ్డుపడకుంటే పిల్లల ప్రవర్తన తండ్రుల ప్రవర్తనలానే ఉంటుంది. మంచి విత్తనం కూడా చెడు నేలపై పడి విఫలమైనట్లు ఒక్కోసారి కత్తి పట్టాల్సినవాడు మతాధికారిగా కావచ్చు. నా సోదరుడు లూయిస్ రాజలక్షణాలున్న వాడు మతాధికారి అయినాడు. మరో సోదరుడు రాబర్ట్ అత్యాశాపరుడైనాడు. ఆకాశంలో విహరించే దివ్యగ్రహాలు (Celestral bodies) మానవుల ప్రవృత్తిపై తమ ప్రభావాన్ని దేవుని నిర్ణయానుసారం చూపుతూ మానవుల ప్రవర్తనను నిర్దేశిస్తాయి." -

**Canto - 9**

**తృతీయ స్వర్గం వీనస్ గ్రహం. ఛార్లెస్ మార్టెల్ భవిష్యద్దర్శనం. ఇప్పటి మతాధిపతుల్ని నిరసిస్తూ, చర్చి పునరుజ్జీవనం గురించి వ్యాఖ్యలు.**

# మూడవ స్వర్గం - వీనస్ గ్రహం - ప్రేమ జీవులలోకం

"ప్రియమైన క్లెమెన్స్! ఛార్లెస్ మార్టెల్ నాతో తన సంతానం ఎలా పతనం చెందుతుందో వివరించినాడు. తప్పులు చేసినవారికి తగిన శిక్ష పడుతుంది. అనుభవించక తప్పదు" ఇలా నేను అనుకుంటూ ఉండగానే మరో దివ్యాత్మ నావేపు తిరిగింది. ఆ దివ్యాత్మతో మాట్లాడడానికి నాకు బియాట్రైస్ అనుమతి నివ్వగానే నేనన్నాను– "దివ్యాత్మా! నా ఆలోచనలనునీవు ప్రతిఫలించు". ఆ దివ్యాత్మ ఇలా పలికింది– "ఈశాన్య ఇటలీలో రియాల్టొ (వెనిస్), ఆల్ప్సుల మధ్య ఉన్న రొమానొ (Romano hill) గుట్ట ప్రాంతాన్ని ఎజ్జెలినొ–3 పరిపాలిస్తున్నాడు. అతడు తల్లిగర్భంలో ఉండగానే ఆ మాతృమూర్తికి స్వప్నంలో తనకు జనించిన సంతానం అగ్నిజ్వాలలా March of Treviso ను కాల్చివేస్తున్నట్లు కలగన్నది.

నేను ఆతని సోదరి– 'క్యునిజ్జా' (Cunizza)ను. రాజకీయ కారణాల వల్ల నన్ను వెరొనా ప్రభువు 'రిజార్డొ'కు కట్టబెట్టినారు. నాపై 'వీనస్' గ్రహ ప్రభావం ఎక్కువగా ఉండడం వలన నేను అందాలరాశిగా పేరు పొందాను. భావకవి 'సొర్డెల్లొ' నన్ను అపహరించుకుపోగా ఆతనితో నేను కొన్నేళ్లు జీవించాను. ఆ తరువాత 'ఎన్రికో'తో అనేక దేశాలు తిరిగి, ఎన్రికొ మరణించగా, బ్రగాంజా ప్రభువు అల్మేరియోను వివాహమాడాను. ఆతడు కన్నుమూసిన తరువాత వెరొనీస్ రాజవంశీకుడిని పెళ్లి చేసుకున్నాను. నాపై 'వీనస్' కరుణ నన్ను, నా అందాన్ని ఎన్నటికీ వాడిపోనివ్వలేదు. తరువాత నేను నా శేషజీవితాన్ని క్రీస్తుకంకితం చేసి భగవదారాధనలో కాలం గడిపాను. బహుశా నాకు ఈ స్వర్గంలో అందుకే చోటు చిక్కింది.

నా పక్కనే ఉన్న ఈ దివ్యాత్మ 'ఫాల్కొ' (Folco). ప్రేమకవిగా ఇతని ఖ్యాతి మరో అయిదు వందల ఏళ్లు చిరస్థాయిగా ఉండగలదు.

నేను చెబుతున్నాను విను! గర్వంతో విర్రవీగిన పడువన్ గ్యుల్ఫులు పతనం చెందుతారు. రిజార్డొ వెన్నుపోటుకు గురై మరణిస్తాడు. తిరుగుబాటు చేసిన అలెస్సాంద్రొ, అతని అనుయాయులు బహిరంగ శిరచ్ఛేదనకు గురౌతారు. దేవుని అనుమతితో నేనింతవరకు నీకు చెప్పగలుగుతున్నాను" క్యునిజ్జా ఆ మాటలు పలికి నిశ్శబ్దంగా వెళ్లిపోయింది.

నా కళ్లముందు సూర్యకాంతి తగిలి మెరుస్తున్న కెంపులా 'ఫాల్కొ' భావకవి మాట్లాడసాగినాడు. పవిత్రాగ్నులైన సెరాఫిమ్ (Seraphim=ardent, burning - Angels of Charity or love)లు, ఛెరుబిమ్‌లు (Cherubim=Angels of Wisdom) – ఆరురెక్కలతో – రెండు వదనాన్ని, రెండు కాళ్లను కప్పుగా రెండిటితో ఎగుర్తూ దేవదేవుని సింహాసనం వద్ద ఉండే దేవదూతల గానంలా ఆతని మాటలు వినవచ్చాయి.

– "నాపేరు ఫాల్కొ (Folco of Marscilles). నా హృదయం ఎప్పుడూ ప్రేమాగ్నితో జ్వలించేది. బెలస్ (Belus) కుమార్తె డిడొ, ట్రోజన్ ఈనియస్ (Dido, Aeneas)ల ప్రణయ వృత్తాంతం (డిడొ–సైకియస్‌కు, ఈనియస్–క్రెయూసాల స్మృతులకు అన్యాయం చేస్తూ మునిగిన ప్రేమాగ్నిజ్వాల),

థ్రాసియన్ యువరాణి ఫిల్లిస్ (Phyllis) తనను డెమొఫూన్ (Demophoon) వంచించాడని భ్రమించి ఉరివేసుకుని ఆల్మండ్ వృక్షంగా మారిన విషాదగాథ,

ఆల్‌సైడెస్ (హెర్క్యులిస్) ఐవొలెను అపహరించుకునిపోగా, తన భర్త తనకు దూరమైపోతున్నాడని తలచిన డియనీరా (Deianeira) అతనిని తన వశం చేసుకో దలచి పంపిన నెస్సస్ అంగీ, హెర్క్యులిస్ రక్తమాంసాలను పీల్చివేయగా హెర్క్యులిస్ మరణించిన దురదృష్ట గాథలలోని వ్యక్తులు తమ పాపాలకు పరిహారం చెల్లించి, లెథె నదిలో మునిగి దేవుని ప్రార్థిస్తూ ముక్తినొందుతారు.

నాపక్కన వెలుగుతున్న దివ్యాత్మ రహబ్ (Rahab). క్రీస్తు విజయం నాడు ముందుగా వెళ్లేఆత్మ ఈమే! జాషువా పంపిన దూతలకు ఆశ్రయమిచ్చి ఇజ్రాయిలుల విజయానికి సహకారాన్నందించింది. ఆమె పాత జీవితం (వేశ్యావృత్తి) ఆమె ముక్తికి అడ్డురాదు. ఆ పాపం నుంచి ఆమె ప్రక్షాళన పొంది ఇప్పుడు అపురూప కాంతితో వెలిగిపోతున్నది.

నీ నగరం ఈనాడు సృష్టికర్త మార్గానికి వ్యతిరేకంగా ఉన్నది. మీ నగరపు గొర్రెలకాపరి దారి తప్పినాడు. సాతాను నాటిన విషబీజం ఈ ఫ్లొరెన్సుగా వృద్ధి చెందుతున్నది. భగవానుని ఆదేశాలు, శాసనాలస్థానే మతాధిపతి నిర్ణయాలు, ఆజ్ఞలు (Decretals) ఆచరణలో ఉంటున్నాయి.

ప్రధాన దేవదూత గాబ్రియెల్ (Gabriel) కూడా మేరీకన్యకు నమస్క రించినాడు. ఇప్పటి మతాధిపతులలో ఆ అణకువ లోపించింది.

ఆ మంచికాలం రానున్నది. ఎక్కడైతే సెయింట్ పీటర్ శిలువ వేయబడి, సమాధి చేయబడినాడో, ఏ నగరంలోనైతే క్రిస్టియన్ వీరులు మతం కోసం ప్రాణాలర్పించారో (Martyrs), ఆ నగరం నుంచి ఈ పతనం చెందిన, దుష్ట, వ్యభిచారుల మతాధికారుల గుంపు తొలగిపోకతప్పదు"

**దివ్యజ్ఞానం, సృష్టిలోని సమతుల్యత (Harmony) గురించి వివరణ. చతుర్థస్వర్గం – సూర్యగ్రహం. భగవానునికి కృతజ్ఞతాంజలి. సెయింట్ థామస్‌తో కూడిన పన్నెండు ఆత్మలు బియాట్రైస్, డాంటీల చుట్టూ కిరీటంలా, వలయంలా ఏర్పడడం.**

# పండ్రెండుగురు విజ్ఞానులు, వేదాంతులున్న నాల్గవ స్వర్గం

దైవ స్వరూపం త్రిమూర్తితత్వంతో ఉంటుంది. సృష్టినిర్మాణ రచన చేసే క్రమంలో ఆ Trinity (<u>God - the father</u> = The Power - first and inexpressible, gazing upon his <u>Son - His word</u> or wisdom; with the Love that is the <u>Holy Spirit</u> - made all creation - the spiritual and material) - తండ్రి (దైవశక్తి), కుమారుడు (దైవవాక్కు); దివ్యాత్మ (దైవప్రేమ) ఈ మూడింటి పూర్ణస్వరూపమే దైవం) మూడు భాగాలుగా సృష్టినిర్మాణం చేస్తుంది. సృష్టికి పూర్వమే శరీరానికి ఆత్మకు పొందిక (harmony) కలిగి ఉంటుంది. గ్రహాలు వేర్వేరు చలనాలు కలిగి ఆకాశంలో పరిభ్రమిస్తుంటాయి. సూర్యుడు భూమధ్యరేఖను దాటేప్పుడు తులాసంక్రమణం (Autumn equinox-Libra); సూర్యుడి మార్గమైన కాంతివృత్తం, రాశిచక్రం (Zodiac) ఇవన్నీ సరైన స్థితిలో ఉంటూ భూమిపై రేయింబవళ్లనీ, ఋతువులనూ సృష్టిస్తున్నాయి. ఇదే దివ్యజ్ఞానమూ, సృష్టి సమతుల్యతకు సంబంధించిన విజ్ఞానమూ!

ప్రకృతి యొక్క ప్రధాన మంత్రి అయిన సూర్యుడు భూమిపై చరాచర జీవరాశులను తన శక్తితో ప్రభావితం చేస్తూ, రాత్రింబవళ్లను, కాలాన్ని నిర్ణయం చేస్తున్నాడు. ఆ మహాశక్తివంతమైన గ్రహంలో, నాల్గవస్వర్గంలో ఇప్పుడు నేనున్నాను. అక్కడ నా కళ్లకు అనేక కాంతిదీపాలు కనిపించాయి.

బియాట్రైస్ అన్నది– "కృతజ్ఞతాంజలులు తెలుపుకో! ఆ భగవంతునికి! ఆతని కరుణ వలన నీవు ఈ సూర్యగ్రహంలో అడుగిడగలిగినావు!" – నేను కరుణామయుడైన దేవునికి వినమ్రుడనై నా కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

మా ఇద్దరి చుట్టూ ఒక వలయంలా, మా తలలపై కిరీటంలా, మధురమైన గొంతులతో మాట్లాడుతూ దివ్యాత్మలు కాంతిదీపాల్లా కనిపించాయి. చంద్రుని (Diana = Latona, Jove's daughter) చుట్టూ ఒక్కోసారి ఏర్పడే వలయంలా ఆ ఆత్మలు మా చుట్టూ ఏర్పడినాయి. వారి అద్భుత ప్రకాశాన్ని మాటలతో వర్ణించడం సాధ్యం

కాదు. ఆ దివ్యాత్మలు నీరు పల్లమెరిగినట్లు, వారికి సహజమైన కరుణతో నాకు దివ్య విషయాలను వివరించసాగినారు.

"ఏ దేవుని కరుణ వలన ప్రేమ ఉప్పొంగి ప్రవహిస్తుందో అది నీలో ముమ్మారు వర్ధిల్లి నీవెక్కిన సోపానాలను మరల దిగకుందువుగాక! నీకు మీ చుట్టూ వెలసిన హారంలోని పూల గురించి తెలుసుకోవాలనున్నది కదా!

నాపేరు థామస్ ఎక్వినాస్ (Thomas Aquinas). ఏంజెలిక్ డాక్టర్‌గా పేరుపొందిన వాడిని. డొమినిక్ ఆర్డర్‌లో నడిచిన గొర్రెపిల్లను.

నా కుడిపక్క ఉన్నది నా సోదరతుల్యుడు, గురువు – ఆల్బర్ట్ (Albert of Cologne). థియాలజీలో, శాస్త్రాలలో ఉద్ధండ పండితుడు.

అతడు ఫ్రాన్సిస్కస్ గ్రాటియేనస్ (Franscicus). కానన్ న్యాయసూత్రాలకు ఆధారమైన సిద్ధాంతాలను ప్రవేశపెట్టినవాడు.

ఇతడు పీటర్ లొంబార్డ్ (Peter Lombard). గొప్ప సిద్ధాంతకర్త, జ్ఞాని. తన రచనలను పేద విధవరాలు జీసస్‌కిచ్చిన నాణేలతో పోల్చినవాడు.

అయిదవ కాంతిదీపం – సొలొమాన్ (Solomon) - Song of Songs, ప్రొవెర్బ్స్, ఎక్లెసియాస్టెస్, Book of Wisdom వ్రాసిన జ్ఞాని, మేధావి, రాజు.

అతడు డయొనెసియస్ (Dionycius). ఏరోపాగైట్ – సెయింట్ పాల్ వద్ద క్రైస్తవ మత దీక్ష పుచ్చుకున్నవాడు; ఇతడు మతాధిపతి ఒరొషియస్ (Orosius). చరిత్రను ఆకళింపు చేసుకున్నవాడు. క్రిస్టియానిటీ వలన ప్రపంచం నాశనమైందన్న వాదాన్ని తిప్పికొట్టినవాడు.

ఎనిమిదవ కాంతిదీపం – పవిత్రాత్మ బొథియస్ (Boethius) వేదాంతి, సుగుణశీలుడు. సెయింట్ సెవెరినస్‌గా ప్రసిద్ధికెక్కినవాడు.

సెయింట్ ఇసిడోరి (Saint Isidore); ఆంగ్లో శాక్సన్ ముని బెడె (Bede); రిఛర్డ్ (Richard of Saint Victor). అదుగో ఆఖరివాడు సిగర్ (Siger). తన సిద్ధాంతాలతో ఇతరులకు అసూయను కలిగించినవాడు.

మొత్తం గడియారంలోని అంకెల్లా పన్నెండుమంది విజ్ఞానులు. దివ్యజ్ఞానానికి భాష్యం చెప్పినవారు. చర్చి శిఖరంపైన గడియారం మ్రోగే గంటల్లా వీరు తమ ప్రేమను ప్రకటించిన విజ్ఞానధనులు"

ఆ వలయాకార కాంతిదీపాల చక్రం మరింత జ్వాజ్వల్యమానంగా ప్రకాశిస్తూ, చక్కని సంగీతాన్ని వినిపిస్తూ అనంతమైన విజ్ఞానాన్ని ఆనందాన్ని నాకు పంచి యిచ్చింది.

**Canto - 11**

**చతుర్థస్వర్గం – సూర్యగ్రహం – సెయింట్ థామస్ వివరించిన డొమినికన్ల వర్గం. సెయింట్ ఫ్రాన్సిస్ జీవిత చరిత్ర – దారిద్ర్యాన్ని వివాహమాడి ఫ్రాన్సిస్కన్ ఆర్డర్‌ను రూపొందించిన మహానుభావుని వృత్తాంతం.**

# సెయింట్ ఫ్రాన్సిస్ జీవిత చరిత్ర

మర్త్యులు ఎగబడే ప్రాపంచిక సుఖాల్లారా! ఎంత అల్పమైన కారణాలను అన్వయించుకుని కాసింత ఎగిరే శక్తిని ఈ మానవులకిచ్చి వీళ్లకు గర్వాన్ని తెచ్చిబెడ్తున్నారు! ఒకడు న్యాయశాస్త్రాన్ని, మరొహడు వైద్యాన్ని, ఇంకొకడు మతాధికారిగా, మరొకడు యుక్తితోనో, శక్తితోనో, కుట్రకుయుక్తులతో రాజుగా రాజ్యమేలుతూ, ఒకడు దోపిడీ దొంగ, ఇంకొకడు మోసగాడు, ఒకడు రాజకీయవేత్త, మరొహడు శ్రామికుడు, ఇంకొకడు భోగలాలసుడు, మరొహడు కాముకుడు, ఇంకొకడు బద్ధకస్తుడు ఇట్లా వేర్వేరు వ్యాపకాలు, వాటిల్లో పేరు ప్రతిష్ఠలకు తన్నుకోడాలూ, గుద్దుకోడాలూ!

నేనా విషవలయం నుంచి బయటపడ్డాను. బియాట్రైస్ నా పక్కనే ఉండగా నేను క్రింది మూడు గ్రహాల ప్రభావానికి దూరంగా వచ్చేసాను. కాంతిదీపాల్లాంటి దివ్యాత్మలన్నీ మరల హారంలా ఉన్న ఆ వలయంలోకి వచ్చినాయి.

దివ్యాత్మ థామస్ ఎక్వినాస్ నాతో అన్నాడు– "నేను నీ ఆలోచనలను గ్రహించాను. ఈ ప్రపంచాన్ని పరిపాలించే విధి యొక్క అంతూపొంతును తెలుసుకోవడం ఎవరివల్లా కాదు! ఆతని రక్తంతో వివాహం చేసుకున్న వధువు (Bride of Christ=Church) ఆతడిని కలుసుకోవడానికి రెండు మార్గాలున్నవి. ఒక యువరాజు నడిచిన దారి సెరాఫిమ్ (Seraphim)ల ప్రేమమార్గం (Love). రెండవ యువరాజు నడిచిన దారి ఛెరుబిమ్ (Cherubim)ల జ్ఞానమార్గం (Wisdom). వీరిద్దరి లక్ష్యం ఒక్కటే! అంతిమ గమ్యం ఒక్కటే!

నేను సెయింట్ ఫ్రాన్సిస్ గురించి చెబుతాను. ఫ్రాన్సిస్ జన్మస్థలం అస్సిసి (Assisi). ఇది సుబాసియో పర్వతానికి దిగువ టోపినో, ఛియాసియో నదుల మధ్య ఉన్నది. ధనిక కుటుంబంలో పుట్టినా ఆతడు పేదరికాన్ని పెళ్లాడినాడు. ఆస్తులన్నిటినీ పేదవాళ్లకు ఇస్తున్న తన కుమారుడి ప్రవర్తనను గర్హించిన ఆతని తండ్రి పీట్రో బెర్నార్డో, కుమారుడి మనసు మార్చమని నైతిక న్యాయస్థానం ముందు (Episcopial Court) నిలబెట్టగా ఫ్రాన్సిస్ – తన ఒంటిపైనున్న దుస్తులను కూడా తీసిచ్చివేసి, గోనెసంచిని

చుట్టుకున్నాడు. “నేను నా ధనాన్ని, ఆశను ఆ తండ్రిపై ఉంచినాను” అన్నాడు ఫ్రాన్సిస్.

దరిద్రదేవత ప్రథమ భర్త (జీసస్) వెళ్లిపోయిన పదకొండు వందల సంవత్సరాల తరువాత ఫ్రాన్సిస్ వచ్చేంతవరకు ఆమెకు సరైన భర్త దొరకలేదు.

‘సీజర్’నే ధిక్కరించిన పేదవాడు – చేపలుపట్టే ఎమిక్లాస్ (Amyclas), శిలువపై ఉండి వస్త్రాన్ని, ప్రాణాన్ని కోల్పోయిన జీసస్ వల్ల దరిద్ర దేవతకు అభిమానులు ఏర్పడ్డారు.

ఫ్రాన్సిస్‌కు మొదటి శిష్యుడు ధనికుడైన వ్యాపారి బెర్నార్డ్ (Bernard of Quintavalle) తనకున్న ఆస్థిపాస్తులను తెగనమ్మి ధనాన్ని పేదలకు పంచినాడు. ఫ్రాన్సిస్, తన శిష్యులతో క్రీస్తువెంట అపొస్తలులు నడిచినట్లు పాదరక్షలు లేకుండానే నడిచేవాడు. ఎగిడియస్, సిల్వెస్టర్‌లు కూడా ఫ్రాన్సిస్ బాటలో చేరినారు. మొలకు గోనెసంచి ఆచ్ఛాదన. పేదరికాన్ని తోడుగా ఉంచుకున్న ఫ్రాన్సిస్‌కు ఇన్నొసెంట్–3 (Pope Innocent-III) తన మాటగా మత ప్రచారానికి అంగీకారాన్నిచ్చాడు. ఇది మొదటి రాజముద్ర. హోనొరియస్–3 (Honorius-III) అంగీకారం రెండవది.

పండ్రెండుగురు శిష్యులతో ఈజిప్టుకు అయిదవ క్రూసేడ్‌లో పాల్గొని, ఈజిప్టురాజును (al-malik-al-kamil) క్రైస్తవుడిగా మార్చడానికి ప్రయత్నం చేసినాడు.

ఆఖరి ముద్ర (Final Seal) క్రీస్తు స్వయంగా వేసినాడు. ఫ్రాన్సిస్ శరీరంపై అయిదు రక్తం స్రవిస్తున్న గాయాలు – రెండు అరచేతుల్లో, రెండు పాదాల్లో, ఒకటి పక్కలో బల్లెపు గాయం – ఆ Stigmata (సంజ్ఞలు) రెండు సంవత్సరాల పాటు, ఫ్రాన్సిస్ మరణించేంతవరకూ కనిపిస్తూనే ఉన్నాయి.

తనకు మరణం సంభవిస్తుందనుకున్న రోజున ఫ్రాన్సిస్ తన శిష్యుల సాయంతో ‘పొర్జియుంకోలా’ చర్చి వద్దకు చేరుకుని, దుస్తులేమీ లేకుండా నేలపై పడుకుని కన్నుమూసినాడు. అంతటి మహానుభావుడు పీటర్ నావను సరైన మార్గంలో నడిపినాడు.

డొమినికన్ల నాయకుడు అటువంటివాడే! కాని ఆతని శిష్యులు నేడు దారితప్పిన గొర్రెపిల్లలయినారు. ఇప్పుడు గొర్రెలకాపరి పక్కనే ఉంటున్న వాళ్లను కప్పేందుకు చిన్న అంగీ సరిపోతుంది. అందుకే Where one may fatten well, if one doesnot stray off - గొర్రెలకాపరి పక్కనే ఉంటే గొర్రెపిల్ల బలంగానే ఉంటుంది!” – అన్నాడు థామస్ ఎక్వినాస్.

**నాల్గవ స్వర్గం – సూర్యగ్రహం. పన్నెండు దివ్యాత్మల రెండవ వలయం. సెయింట్ డొమినికన్ జీవిత చరిత్ర. ఫ్రాన్సిస్కన్ల పతనాన్ని నిందించడం పన్నెండు దివ్యాత్మల పరిచయం.**

# సెయింట్ డొమినిక్ చరిత్ర

ఆ కాంతిదీపాల వలయం చక్రంలా ఒక్కసారి పరిభ్రమించేలోపుగానే మరో వలయం, ఈ వలయానికావల ప్రత్యక్షమైంది. ఆ రెండు వలయాల్లోని ఆత్మలు ఆలాపిస్తున్న మధుర స్వరాలు మ్యూజెస్ గీతాల్లా, సైరన్స్ (Muses, Sirens) పాటల్లా అతి మనోహరంగా మనసుల్ని ఆకట్టుకుంటున్నాయి.

జునో (Juno) దేవత చెలికత్తె ఐరిస్ (Iris). ఇంద్రధనుస్సులా ఏర్పడగా దాని ప్రతిరూపం మరో ఇంద్ర ధనుస్సులా; ఆకాశంలో వెలుగుతున్న – నర్సిస్సస్ (Narcissus)ను ప్రేమించి ఆతనికై అరుస్తూ, అరుస్తూ గొంతు మాత్రమే మిగిలిన ఎఖొ (Echo) కన్యలా–

– రెండు ఇంద్రధనుస్సులు దేవుడు 'నోవా' (Noah)తో చేసుకున్న ఒప్పందాన్ని(మరల వరద భూమిని ముంచెత్తదు) గుర్తు చేస్తున్నట్లుగా,

– ఎన్నటికీ వాడని గులాబీల దండల్లా ఆ రెండు వలయాలు మా చుట్టూరా ఉన్నాయి. నృత్యగానాల హోరు, సంతోషం ఉత్సాహాల వెల్లువ, భగవానుని స్తుతిగీతాల మధురిమ ఆ వలయాల నుండి వస్తూ మమ్మల్ని చుట్టుముట్టి పరవశుల్ని చేస్తున్నాయి.

కొత్తవలయం నుంచి నన్నెవరో పలకరించినట్లనిపించి నేనటుతిరగగా, నేను ధృవనక్షత్రం వేపు తిరిగిన సూదిలా కనిపించాను. ఆ గొంతు ఇలా అన్నది– "అంతులేని ప్రేమ నన్ను మరో మహావ్యక్తి గురించి మాట్లాడేందుకు ప్రేరణనిస్తున్నది. నేననుసరించే మహానుభావుడి వ్యక్తిత్వాన్ని వారు శ్లాఘించారు. ఈ ఇద్దరూ రెండుదారుల్లో క్రీస్తును చేరేందుకు క్రైస్తవులకు వీలు చూపించారు.

క్రీస్తుసైన్యం మరల యుద్ధానికి చాలా నెమ్మదిగా, తన బలంకన్నా భగవానుని కరుణ వలన, సిద్ధమవుతున్నది. ఈ ఇద్దరు ఆ బృహత్కార్యానికి నడుము బిగించి, ముందుకు కదిలినారు.

స్పెయిన్ దేశంపై జెఫిర్ (Zephyr - పడమటి గాలి) ఉధృతంగా వీస్తున్న కాలంలో కలరోగా (Calaroga) కోటలో డొమినిక్ (Dominic) జన్మించాడు. ఆతడు

గర్భస్థశిశువుగా ఉండగానే ఆతని తల్లికి స్వప్నంలో తనకు తెలుపు నలుపు రంగులున్న కుక్కపిల్ల జన్మించినట్లు, ఆ కుక్కపిల్ల నోటిలో వెలుగుతున్న కాగడా ఉన్నట్లు కలగన్నది.

బాప్టిజం ద్వారా డొమినిక్ విశ్వాసాన్ని (Faith)ను వివాహమాడినాడు. ఆతని పెంపుడు తల్లి (God mother) కలలో అతడి నుదుటిపై ప్రకాశిస్తున్న నక్షత్రాన్ని చూసి అతడు, ఆతని అనుయాయులు భవిష్యత్తులో ప్రపంచాన్ని కాంతివంతం చేయగలరన్న సూచనను గ్రహించింది.

క్రీస్తుతోటలో (చర్చి) పనిచేసే తోటమాలిగా ఆతడు డొమినిక్ (Dominic = of the Lord) గా పిలువబడినాడు. క్రీస్తుపై అచంచల విశ్వాసమున్న సేవకుడిగా ఆతడు Sermon of Mount పైన చెప్పబడిన – "How happy are the poor in spirit, theirs is the kingdom of Heaven" - వాక్యాన్ని అక్షరాల పాటించినాడు.

డొమినిక్ తండ్రి పేరు ఫెలిసి (Felice=happy); తల్లిపేరు గియొవాన్నా (Giovanna=Johanna=the grace of God).

ఇప్పటి వరకు విశ్వాసులు టాడ్డియో, ఓస్టియాన్‌ల మార్గాలలో పయనిస్తుండగా, డొమినిక్ తనకు దివ్యజ్ఞానంతో ఉన్న ప్రేమతో (Love of the true Manna) పాడైపోతున్న ద్రాక్షతోటను మరల బాగుచేసినాడు. చర్చి తనకిచ్చిన సంపదలను, అధికారాల్ని పేదలకు ధారాదత్తం చేసినాడు. తాను ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా తన బోధనలతో అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం సాగించినాడు.

ఆ ఇద్దరు మహావ్యక్తులూ పావన చర్చిరథానికి రెండు చక్రాలై శత్రువులను ఓడించినారు. ఇప్పుడు ఆ రెండు మార్గాలలోనూ నీతిబాహ్యులు చొరబడినారు. అయినా మనం పంటనూర్చే కాలాన్ని చూస్తాము. తాలూ తప్పా ఎగిరిపోయి సరైన ధాన్యమే బస్తాల కెత్తబడుతుంది. మా ఫ్రాన్సిస్కన్లలో ఎక్వాస్పార్టా పోప్ బొనిఫేస్–8 ఆదేశంతో ఫ్లోరెన్స్ రాజకీయాల్లో చొరబడినాడు.

నాపేరు 'బొనావెంచురి' (Bonaventure). నేను నా కుడిచేతి మార్గాన్ని ఆధ్యాత్మికత (Spiritual)కు ప్రాధాన్యత నిచ్చాను. (In her left hand are riches and glory) – వీరు – ఇల్యుమినాటో, ఆగస్టీన్, హ్యూగ్, పీటర్, నాథాన్, ఏన్‌సెల్మ్, క్రిసొస్టామ్, డొనాటస్, రబానస్, జొయాచిమ్ - (Illuminato, Augustine, Hugh, Peter the book devourer, Nathan, Anselm, Chrysostom, Donatus, Rabanus, Abbot Joachim). వీరంతా ఈ వలయంలో ఉన్న జ్ఞానులు. నేను ఆ మహావ్యక్తి వివరాలను తెలిపినందుకు ఆనందిస్తున్నాను"

**నాలుగవ స్వర్గం సూర్యగ్రహం – విజ్ఞానలోకం. గగన మేఖల ఖగోళశాస్త్ర అద్భుతాల వివరణ, దివ్యాత్మల నృత్యగానాలు. సొలొమాన్ ప్రభువు యొక్క న్యాయ చతురత. తొందరపాటు న్యాయనిర్ణయాలను గర్హించిన సెయింట్ థామస్.**

# సొలొమాన్ ప్రభువు న్యాయ నిర్ణయశక్తి

గగన మండలంలో రెండు వలయాల్లో వ్యతిరేక దిశల్లో పరిభ్రమిస్తున్న ఇరవై నాలుగు కాంతి దీపాలు ఒక అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరిస్తుండగా, పదిహేను తారలు టాలమీ, అల్ఫ్రాగ్రానస్ వర్ణించినట్లు, ఏడు తారలు Ursa Major గా ఉత్తరాకాశాన్ని ఎల్లప్పుడూ వెలుగులతో నింపుతున్నవై, మరోరెండు Ursa Minor గా ప్రకాశిస్తుండగా, ధృవనక్షత్రం చివర ఉన్న కొమ్ముబూర (horn)లా సంపదలకు చిహ్నమై Ursa Minor ఒప్పుచున్నది.

మినాస్, పసిఫెల కుమార్తె అరియాడ్నె (Ariadne) మరణించినప్పుడు ఆమె తలపై ఉన్న పూల కిరీటం బాకస్ దేవునిచే గగనమండలాన నక్షత్ర వలయంగా మారింది.

ధృవనక్షత్రం (North Star) అక్షంగా స్వర్గపు మొదటి వలయం Primum mobile పరిభ్రమిస్తుంటుంది.

మానవుల గ్రహణాశక్తికి స్వర్గలోకపు సత్యానికి ఉన్న తేడా ఛియానా మడుగులోని నీటి వేగానికి, అనంత వేగంతో పరిభ్రమించే Primum mobileకు ఉన్నంతగా ఉంటుంది. అక్కడ పాడే స్తుతిగీతాలు – బాకస్ ఉత్సవాల్లోని బృందగానాల్లా, అపోలో గీతాల్లా ఉండవు. త్రిమూర్తి (Trinity) తత్వాన్ని ప్రబోధించేవిగా, జీసస్ క్రీస్తుయొక్క మానవ, దైవగుణాలను కీర్తించే మనోహర భక్తిగీతాలుగా ఉంటాయి. నేను ఆ అద్భుత దృశ్యాన్ని వీక్షిస్తూ ఉండగానే నాకు ఇంతవరకు జ్ఞానకాంతినిచ్చిన ఆ అద్భుత దీపం 'సెయింట్ థామస్' ఇలా అన్నాడు– "కుప్పనూర్చిన ధాన్యం ధాన్యాగారానికి వెళ్లిపోయింది. ఇప్పుడు మరో కుప్ప వద్దకు వెళ్దాం. ఆ యిద్దరినీ సృష్టించిన మహాకాంతి స్థానమే అన్ని జీవులకూ కాంతినిస్తుంది గనుక అందరి జ్ఞానమూ సమమే అని అనుకోవచ్చు! అది సరికాదు. ఒకరి పక్కటెముకను తీసి సహచరిగా సృష్టిస్తే, ఆమె ఆకలి లోకానికి శత్రువైనది కదా! ఇంకొకరి పక్కలో పొడిచిన బల్లెపు గాయం నుంచి స్రవించిన రక్తమే అన్ని కాలాల్లోని పాపాలను శుద్ధిపరచి దివ్యలోక న్యాయాన్ని నిలబెట్టినది కదా! వీరిద్దరూ దేవునిచే ప్రత్యక్షముగా

సృష్టించబడినవారు. ఆదాం (Adam)ను దేవుడు స్వయముగా సృష్టించినాడు. క్రీస్తును కన్యాగర్భంలో ప్రవేశపెట్టినాడు.

సృష్టి రెండు రకములుగా విభాజ్యము. శాశ్వతమైనది (incorruptible - that which never dies - created by God directly - Angels, heavens, primal matter, human soul). రెండవది- అశాశ్వతమైనది (Corruptible - that which dies - is a reflection of divine idea - Logos- Word). త్రిమూర్తి తత్వమైన తండ్రి, కుమారుడు, దివ్యాత్మలు, దేవదూతలు – (Seraphim, Cherubim, thrones, Dominions, Virtues, Powers, Principalities, Archangels, Angels), ఆ తరువాత కాంతి క్రమేపీ అన్ని చరాచర, జీవ నిర్జీవ ప్రకృతులకు చేరుతుంది.

ప్రకృతి అనేది అశాశ్వతమైన మూలకాలతో దేవుడు సృష్టించినది. కాంతి మూలస్థానం నుంచి వెలువడిన కాంతి వేర్వేరుగా సోకడం వలన ఒకే రకమైన వృక్షాలు కూడా వేర్వేరుగా ఫలాల్నిస్తున్నాయి. మానవులలో వివిధ రకాల ఉద్వేగాలుంటున్నాయి. ప్రకృతిలోని లోపాల వలన అన్నీ ఒకేరకంగా ఉండక విద్య తెలిసిన కళాకారుడికి వణుకుతున్న చేయి ఉన్నపుడు కళలో లోపం కన్పించినట్లు సృష్టిలో లోపాలు కానవస్తాయి.

గిబియాన్ వద్ద యెహోవా (Yahweh) సోలోమాన్‌కు కలలో కనబడి నీకేమి కావాలో కోరుకొమ్మనగా ఆతడు- "Give your servant a heart to understand how to discern between good and evil" – మంచీ చెడుల మధ్య ఉన్న భేదాన్ని తెలుసుకునే శక్తినివ్వమని ప్రార్థించినాడు. భగవానుడు అన్నాడు- "I give you a heart wise and shriwell as none before you has had and none will have after you" - అందుకనే అతడు జ్ఞానంలో ఆదాం, క్రీస్తుల తరువాతవాడిగా పేర్కొనబడినాడు.

పర్మనెడిస్, మెలిస్సస్, బ్రైసన్ లాంటి వేదాంతులు అర్థంపర్థం లేని వ్యాఖ్యానాలు చేయగా, సబెల్లియస్ త్రిమూర్తి తత్వాన్ని, ఎరియస్ (Arius) క్రీస్తు దైవత్వ లక్షణాన్ని తిరస్కరించినారు. వీళ్లందరూ తొందరపడి నిర్ణయాలు చేసినవారే! అందుకే ఎవరో బెర్తా (Dame bertha), మార్టిన్ (Master Martin) మాకు దైవజ్ఞానం ఉందనగానే వాటిని విశ్వసించడం తగదు. సముద్ర ప్రయాణమంతా చక్కగా చేసి రేవులో కొండకు ఢీకొని నాశనమైన నౌకలా జ్ఞాని తొందరపాటు నిర్ణయాలు చేయరాదు.

**నాలుగవ స్వర్గం – సూర్యగ్రహం – బియాట్రైస్ దివ్యాత్మల నడుగుతుంది డాంటీకున్న సందేహాన్ని తీర్చమని – పునరుత్థానం తరువాత పార్థివ శరీరాలు ఈ దివ్యాత్మల కాంతిని భరించగలవా అని! – సొలొమాన్ సమాధానమిస్తాడు. కొత్త ఆత్మల ప్రత్యక్షం. అయిదవ స్వర్గంలోకి ప్రయాణం. మార్స్ గ్రహం. శిలువపై క్రీస్తు దర్శనం. అమందానందభరితుడైన డాంటీ.**

# అయిదవ స్వర్గం – మార్స్ గ్రహంలో – శిలువ

గుండ్రటి పాత్రలో నీరు అంచు నుంచి మధ్యకు, మధ్య నుంచి అంచుకు కదిలినట్లు, నేను థామస్, బియాట్రైస్ సంభాషణలలో నన్ను నేను అలా ఊహించుకున్నాను.

బియాట్రైస్ దివ్యాత్మతో అన్నది– "ఈ దివ్యకాంతి శాశ్వతమా! పునరుత్థానం తరువాత ఇంత కాంతి పార్థివ శరీరంలో ఉండడం సాధ్యమా! డాంటీకున్న ఈ సందేహాన్ని కూడా వివరించు!"

నృత్యగానాలతో అలిసిపోకుండా ఉన్న ఆ దివ్యాత్మలు మరింత సంతోషంతో దైవస్తుతి చేస్తూ, త్రిమూర్తి తత్వాన్ని కొనియాడుతూ ఉన్నారు. ఇంకో దివ్యాత్మ నాతో ఇలా అన్నది– "స్వర్గంలో ఉత్సవాలున్నంత కాలమూ మాలో ఈ కాంతి ఇలా ప్రజ్వరిల్లుతూనే ఉంటుంది. భగవానుని కరుణ వర్షపుజల్లులా పడుతూ ప్రతి ఆత్మనూ కాంతివంతం చేస్తుంది. ఆత్మయొక్క దృష్టిగాఢత ననుసరించి ప్రేమ, ఆ ప్రేమ గాఢతననుసరించి ప్రకాశమూ ఉంటాయి (Vision, Love, Brightness). పునరుత్థానం తరువాత ఆత్మ, దేహం రెండూ దేవుని వలెనే ప్రకాశిస్తాయి. మండుతున్న అగ్నిజ్వాలలో నిప్పుకణిక కనిపించినట్లు దేహంలో ఆత్మ కనిపిస్తుంది.

దేహాలు పరిశుద్ధం చేయబడి శరీరభాగాలు పరిశుద్ధమై అవి ఆధ్యాత్మిక మార్గానికి అనువుగా ఉంటాయి" అన్నాడు సోలోమాన్ దివ్యాత్మరూపంలో. మిగతా ఆత్మలు 'Amen' అని పలికినారు.

మా చుట్టూ ఉన్న రెండు వలయాలు కాక నాకు మరిన్ని దివ్యాత్మలు కనిపించినాయి. నిజమా కాదా అని నేను తర్కించుకునే లోపలే బియాట్రైస్ నా వంక చిరునవ్వు నవ్వుతూ చూసింది. నా శరీరకాంతి ప్రజ్వరిల్లినట్లై నేను పైకి ప్రయాణిస్తున్నట్లు భావించాను. ఎర్రటి మార్స్ గ్రహం, అగ్నిలా కనిపించగా నన్ను నేను ఆ దేవునికి సమర్పించుకున్నాను. నాకు తెలుసు దేవుడు దానిని స్వీకరించినాడని.

"O Helios! You who adorn them thus!" “ఓ దేవా! నీ కిరణాలే అవి!” అని ఆ అద్భుత దృశ్యాన్ని ఆనందంతో అవలోకించసాగాను.

వృత్తంలో, నాలుగు రెక్కలు సమంగా ఉన్న క్రాస్ (Cross) ఇమిడి ఉన్నట్లున్న శిలువ (Greek Cross), దానిపై జ్వాలలా వెలుగుతున్న క్రీస్తు – వర్ణించడానికి ఏ సామీప్య పోలికా దొరకడం లేదే! ధృవాల మధ్య వెలుగుతున్న నక్షత్రాల్లా కాంతి దీపాలు శిలువకు నాలుగు చెరగులా కదుల్తున్నాయి.

సూర్యుని చూడడానికి ప్రయత్నించినపుడు ఆ కిరణాలు మన కళ్లవేపుకు, అటు యిటూ, చుక్కల్లా, గీతల్లా, రకరకాల రూపాలతో, ఇంద్రధనుస్సు రంగులతో ప్రకాశిస్తూ కదుల్తున్నట్లు...

వీణ, వయొలిన్ వాద్యాల నుండి ప్రవహిస్తున్న స్వరాలు అతిమధురంగా స్వర సమ్మేళనంగా వినిపిస్తున్నట్లు....

ఆ శిలువ నుండి వస్తున్న కాంతులు ఓ దృశ్యరూపకంగా నన్ను ఆనందాంబుధిలో ముంచి నిశ్చేష్టుడిని చేసాయి.

ఆ శిలువ నుండి వస్తున్న కాంతులలో, రాగాలు మిళితం కాగా – Rise, Conquer లాంటి శబ్దాలు వినబడుతున్నాయి.

నేను మంత్రముగ్ధుడనై అలా చూస్తూనే ఉన్నాను. ఆ మాటలు క్రీస్తు పునరుత్థానాన్ని, మృత్యువుపై విజయాన్ని సూచిస్తున్నవిగా అర్థం చేసుకుని తాదాత్మ్యతను చెందాను.

బియాట్రైస్ నేత్రాలు మరింత ప్రకాశవంతం కాగా నా కర్థమయ్యింది. మేము అయిదవ స్వర్గం 'మార్స్' గ్రహానికి చేరుకున్నామని.

ఎగిసిపడ్తున్న సీల్ జంతువుల్లా ఆమె నేత్రాలు అందంగా, మనోహరంగా కదుల్తుండగా మేము మార్స్ గ్రహంపైకి వచ్చినాము.

**Canto - 15**

**అయిదవ స్వర్గం - మార్స్ గ్రహం - మంగళ గ్రహం - కాసియాగ్విడా డాంటీ పూర్వీకుడు ఆనాటి ఫ్లోరెన్సు గురించి వివరిస్తాడు. తాను రెండవ క్రూసేడ్‌లో ఎలా మరణించిందీ తెలియజేస్తాడు.**

# అయిదవ స్వర్గం - మార్స్ గ్రహం

ఆశీర్వదింపబడిన ఆత్మలు ఆ జ్వలిస్తున్న శిలువకు సరిసమానంగా ప్రకాశిస్తున్నాయి. ఆ కాంతి దీపాలు ఒక వీణలా ఉండగా ఆ కాంతి కిరణాల తీగెల నుండి రాగాలు ఆ దేవుని మృదు హస్తాలచే మీటబడుతున్నాయి. ఆ ఆత్మలు మౌనం వహించి నన్ను మాట్లాడమని కోరుతున్నట్లున్నాయి. ఇంతలో ఆ శిలువ కుడివేపు నుండి ఒక దివ్యాత్మ ఆకాశంలో జారిపడ్తున్న నక్షత్రంలా, నా వేపుకు దూసుకువచ్చింది.

ఎలిషియం పొలాల్లో (Elysium) ఈనియస్ (Aeneas)ను ప్రేమతో కన్నీరు మున్నీరవుతూ కౌగలించుకున్న అతని తండ్రి ఏంఖైసిస్ (Anchises) ఆత్మలా, నా వేపుకు వచ్చిన దివ్యాత్మ ఇలా పలికింది– "నా రక్తవంశీకుడా! స్వర్గద్వారం రెండుసార్లు తెరచుకున్న పుణ్యానికి నోచుకున్నవాడా! దేవుని కరుణ నీపై ఉన్నది". ఆ మాటలు వినగానే నేను ఆశ్చర్యంతో బియాట్రైస్ వేపు చూసాను. ఆమె కనులు మరింత కాంతివంతంగా మిరుమిట్లు గొలుపుతున్నాయి. ఆ దివ్యాత్మ నా మనసులోని ఆలోచనలను గ్రహించినవాడై మరల ఇలా అన్నాడు. భగవానుని ప్రార్థిస్తూ ఆతడన్నాడు– "మూడుగా, ఒకటిగా ప్రకాశించే కాంతిస్వరూపుడా! నీకు జయమగు గాక! నీవు నాకు నా రక్తసంబంధీకుడిని చూపించినావు!"

నాతో అన్నాడు– "కుమారా! నేను నిన్నిక్కడకు తీసుకువచ్చిన ఆమెకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. నేనెవరో తెలుసుకోవాలని తహతహలాడుతున్నావు కదూ! నీ కోరికను వెలిబుచ్చినట్లయితే నేను నా గురించి వివరించగలను"

బియాట్రైస్ అనుమతితో నేనడిగాను– "నీ వాత్సల్యానికి నేను పులకించి పోయాను. దివ్యాత్మా! నీవెవరివో తెలుపగలవా!"

అతడన్నాడు– "నేను నీ వంశ మూలపురుషుడను. నీ కుటుంబ నామము అలిఘిరీ (Aligheri), నీ ప్రపితామహుడు నా కుమారుడు. నాపేరు కాసియా గ్విడా (Cacciaguida). నా కుమారుడు అలిఘిరి–1; నా మనవడు, నీకు తాత - బెల్లిన్సియోని (Bellincione).

ఫ్లోరెన్సు నా రోజుల్లో ఇంకా మొదటి ప్రాకారం లోపలే ఉండినది. నగరం పెరిగినకొద్దీ రెండవ వలయం, తర్వాత మూడవ వలయం ఏర్పడినవి. నా యిల్లు పాత నగరపు నడిబొడ్డున ఉండేది. ఆరోజుల్లో శ్రామికుని పని ఉదయం తొమ్మిది గంటలకు (tierce) మొదలై సాయంకాలం మూడు గంటలకు (Nones)కు ముగిసేది.

శాంతి సౌఖ్యాలతో ప్రజలు నివసించేవారు. నీతి న్యాయానికి పెద్దపీట ఉండేది. కిరీటాలు, కంఠహారాలు, ఎంబ్రాయిడరీ చేసిన గౌనులు, వడ్డాణాలు లేవు. ఆడపిల్ల పుట్టిందంటే తండ్రికి భయమూ, కట్నకానుకల భారమూ ఉండేవి కావు. పిల్లలు లేని కుటుంబాలూ లేవు.

సర్దానాపాలస్ (Sardanapalus) అస్సిరియన్ రాజులాంటి కాముకులూ, భోగలాలసులూ ఉండేవారు కాదు. రోమ్ నగరం కన్నా వేగంగా వృద్ధి చెందిన ఫ్లోరెన్స్ నగరం బహుశా పతనం కూడా వేగంగానే అవుతుందేమో! నా సోదరుడు మొరొంటో (Moronto), ఎలిసియొ (Eliseo)లు. నా భార్య 'పొ' (Po) నదీ ప్రాంతానికి చెందినది. నేను కాన్రాడ్ (Conrad) ప్రభువు వద్ద పనిచేస్తూ ఆతని అభిమానాన్ని పొంది నైట్‌హుడ్ (Knight hood) బిరుదు సంపాదించుకున్నాను.

బెల్లిన్సియొని, నెర్లి, వెక్కియో లాంటి గౌరవప్రదమైన, భాగ్యవంతమైన కుటుంబాలు సాధారణ జీవితాన్ని గడుపుతూ ఉండేవి. ధనం, కీర్తికోసం అలమటిస్తూ భార్యాబిడ్డల్ని ఒంటరిగా వదిలేసి ఇతర దేశాలకు పోయేవారు కాదు. భార్యాభర్తల సమాధులు ఒక్కచోటే ఉంటాయనే నమ్మకం ఉన్న కాలం అది.

ఇప్పుడున్న కాలం చూడు – లాపొ సాల్టెరిల్లో దుష్టరాజకీయాలను – ఆనాడు రాజత్యాగం చేసి పొలం దున్నుకోడానికి పోయిన చక్రవర్తి క్వింక్టియస్ సిన్‌సినాటస్‌తో పోల్చిచూడు! ఈనాటి సింఘెల్లా డెల్లాటోసా విశృంఖల కాముక జీవనానికి, ఆనాటి గ్రాచి (Gracchi) మాతృమూర్తి కార్నిలియా (Cornelia)కు తేడా చూడు! ఆనాటి ఫ్లోరెన్సుకు ఇప్పటి ఈ ధ్వంసం కాబోతున్న నగరానికి అదే తేడా!

నేను కాన్రాడ్ (Conrad-III) ప్రభువుతో కలిసి రెండవ పవిత్రయుద్ధంలో పాల్గొని వీరమరణం చెందినాను. దేవుని కరుణ నాపై ప్రసరించగా నేను ఈ లోకానికి వచ్చాను" అన్నాడు దివ్యాత్మ కాసియాగ్విడా.

## Canto - 16

**అయిదవ స్వర్గం – మార్స్ గ్రహం – తన పూర్వీకునితో డాంటే సంభాషణ. కాసియాగ్విడా ఆనాటి ఫ్లోరెన్సు విషయాలను వివరిస్తాడు.**

# కాసియాగ్విడా వివరణ

నా పూర్వీకుల పేరుప్రఖ్యాతులు తెలవగానే నాకు కొంచెం గర్వంగా అనిపించింది. స్వర్గలోకంలోనే అటువంటి భావన కలిగితే మరి మానవులు తమ ఉన్నత వంశగౌరవానికి గర్వం చెందరూ! అయినా ఈ అంగీ ఎన్నాళ్లుంటుంది? కాలచక్రం తిరుగుతూ ప్రతిరోజూ ఈ అంగీని కొంచెం కొంచెం కత్తిరిస్తుంటే ఇంకేమి మిగుల్తుంది కొన్నాళ్లకు? అందుకే దివ్యాత్మా! నీమీద నాకు గౌరవం మరింత అధికమైంది. రోమ్ నగరంలో ఒకప్పుడు తాము గౌరవించేవారిని ప్రజలు (Voi - ఓయ్)– మీరు – అని మిగతావాళ్లని టు (Tu అని) సంబోధించేవారు. మీరు నాకు పూర్వీకులు. మీ మాటలు విన్నాక నాలో సంతోషం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. తండ్రీ! మీ పూర్వీకులెవ్వరు? మీ బాల్యమెట్లా గడిచింది? అప్పటి రోజుల్లో సెయింట్ జాన్ పాదాలకింద వృద్ధిచెందిన ఈ నగరపు విశేషాలేమిటి?"

నా ప్రశ్నలు విన్నాక ఆ దివ్యాత్మ కాంతి మరింత ప్రకాశవంతమైనది. కాసియాగ్విడా (Assiaguida) ఇలా పలికాడు– "Down from that day when 'Ave' was pronouned - గాబ్రియేల్ దేవదూత అవతారమూర్తి పుట్టుక గురించి మేరీకన్యతో ప్రకటన చేసినరోజు – The Feast of annunciation - నుంచి మార్స్ గ్రహం 580 సార్లు భూమిచుట్టూ పరిభ్రమణం చేసి సింహరాశిలో ఉన్న సంవత్సరంలో (1091 A.D.) నేను పుట్టాను. రోమన్ ప్రాచీనరక్తం మా పూర్వీకులది. ఇప్పటి జనాభాలో అయిదోవంతు ప్రజలుండేవారు. నగరానికి ఒకచివర బాప్టిస్ట్ సాన్ గియొవాని విగ్రహం, మరో చివర మార్స్‌దేవుని విగ్రహం ఉండేవి. కాంపి, సెర్టాల్డో, ఫిగ్లైన్ పరిసర ప్రాంతల్నించి ప్రజలు ఇక్కడకు వలస వచ్చేవారు. గలుజ్జొ, ట్రెస్పియాన్ పట్టణాలు, ఇప్పుడు నీ నగరం దుష్టరాజకీయాలకు కారణమైన అనుగ్లియోని, సిగ్నా వలస కుటుంబాలు ఉండిన గ్రామాలు అక్కడే అలానే ఉండి ఉంటే ఇప్పటి దుస్థితి దాపురించేది కాదు. పోప్‌ను సమర్థిస్తున్న గ్యల్ఫి (Guelphs)లు, రాచరికాన్ని సమర్థించే ఘిబెల్లైన్లు ఇలా ఒకరి గొంతు ఒకరు కోసుకునేవారు కాదు.

సెమిఫొంటె నుంచి వచ్చిన వడ్డీ వ్యాపారస్థుడు, మొంటె ముర్లొ, సెర్చి, అకొనె, వాళ్లు వాళ్ల ఊళ్లల్లోనే ఉండి ఉండాల్సింది. అందరూ చేరి నగరం

భాగ్యవంతంగా కనిపించినా, తిండి మీద తిండి తిన్నప్పుడు రోగం వచ్చినట్లు నగరం రోగ గ్రస్థమైంది. గుడ్డి గొర్రెపిల్లకన్నా గుడ్డి ఎద్దు నేలమీద త్వరగా పడినట్లు, అయిదు కత్తులకన్నా ఒక్క కత్తి బాగా గాయం చేసినట్లు నగరం గాయాలమయమైనది.

చుట్టుపక్కల ఉన్న ల్యుని, అర్చిసాగ్లియా, సినిగాగ్లియా, కియుసి లాంటి పట్టణాలు నాశనమయ్యాయి. అదృష్టం ఫ్లొరెన్సులో దోబూచులాడసాగింది. చంద్రుని వృద్ధి క్షయాల్లా ఫ్లోరెన్సు గతీ అంతే అయ్యింది. ప్రసిద్ధ వంశాలు పతనమై పేరెన్నికగన్న 'రవిగ్నాని' ఉన్నచోట నేడు కుత్సితులైన సెర్చిస్ (Cerchis) నివసిస్తున్నారు.

యుఘి, కాటల్లెని, ఫిలిప్పె, గ్రెసి, ఆర్మాన్ని, అల్బెరిచి, అర్కా, సాన్నెల్లా, అర్దింఘి, పోల్దానీరీ, బొస్టిచ్చి లాంటి వంశావళి అదృశ్యమై ప్రజల్ని మోసం చేసిన 'ఉప్పు'ను కూడా మోసపు తూనికలతో అమ్మిన ఛియొరామొంటెసి వంశం లాంటి వాళ్లు పాలకులవుతున్నారు.

పారిపోయే వాణ్ణి వేటాడ్తూ, ఎదురు తిరిగిన వాడికి దాసోహం చేసేవాళ్లు నేడు ఏలికలవుతున్నారు. పేరు పొందిన వీరుడు – టుస్కాని హ్యూగ్ (Hugh) ఆశీస్సులు పొందిన గియానొ డెల్లా బెల్లా తిరుగుబాటు చేసి ప్రజల పక్షాన చేరినాడు.

గ్వాలెట్టెరొట్టి, ఇంపోర్ట్యునిలు శాంతియుతంగా ఉన్న కాలంలో ఈ బ్యుండెల్మోంటి (Buondelmonti) గొడవతో ఫ్లోరెన్సులో అశాంతి పెచ్చు పెరిగింది. అమిడి (Amidei) కుటుంబంలో యువతితో జరిగిన నిశ్చితార్థాన్ని కాదని, 'డొనాటి' కుటుంబపు యువతిని చేసుకోబోయిన బ్యుండెల్మోంటీని 'అమిడీ' వర్గం 'మార్స్' విగ్రహం వద్ద హత్య చేయడంతో మొదలైన కుటుంబ కలహాలు క్రమేపీ ఫ్లొరెన్సును రెండుగా చీల్చివేసి వీధుల్ని రక్తపు మడుగుల్తో నింపివేసాయి.

ఎర్రటి పొలంలో తెల్లటి లిల్లీపూవు గుర్తుండే ఫ్లోరెన్స్ చిహ్నం తారుమారై ఫ్లోరెన్స్ ప్రజల రక్తంతో తెల్లటి లిల్లీపూవు ఎర్రగా మారుతున్నది.

**Canto - 17**

**అయిదవ స్వర్గం - మార్స్ గ్రహం. తన భవిష్యత్తు ఏమౌతుందో తెలుసుకోవాలనుకున్న డాంటీ. 'కాసియాగ్విడా' చెప్పిన విషయాలు.**

# డాంటీ భవిష్యత్తు

"ఫీబస్ అపోలో కుమారుడివేనా నీవు?" అని ఎగతాళి చేయబడగా తల్లి క్లైమెనె (Clymene) వద్దకు వెళ్లి అనునయింపబడిన ఫీథాన్ (Phaethon) లా నేను బియాట్రైస్ వేపు చూసాను. ఆమె అన్నది– "నీ మనసులో ఉన్న ప్రశ్నాగ్నులను బయటకు తీసుకునిరా! సరైన సమాధానం దొరుకుతుంది".

నేను మా పూర్వీకుడైన ఆ దివ్యాత్మనడిగాను– "నా వంశ వృక్షపు తల్లివేరు వైనవాడా! ఉన్నత స్థితితో మీరున్నారు. మా మానవ మస్తిష్కాలు ఒక త్రిభుజంలో రెండు గురుకోణాలుండవనే సంగతి గమనించినట్లు, మీరు అన్ని కాలాల్లోకి చూడగలరు. నేను నా మార్గదర్శకుడైన 'వర్జిల్'తో ప్రక్షాళనా లోకం (Purgatory), నరకాగ్నిలోకం (Inferno)లో తిరుగాడినప్పుడు నా భవిష్యత్తు గురించి తీవ్ర పదజాలం వాడబడింది. దయచేసి నా భవిష్యత్తు ఎలా ఉంది, మీరేమి చూస్తున్నారో చెప్పగలరా!"

మన పాపాల్ని ప్రక్షాళన చేయడానికి వచ్చిన దేవుని గొర్రెపిల్లను బలిచేసే కాలానికి ముందు మానవుల్ని మాయమాటలతో మోసపుచ్చేవాళ్ల కనికట్టు మాటలలా కాక నా పూర్వీకుడు సమాధానమిచ్చినాడు– "వారసుడా! దివ్యాత్మలకు దేవుడు ఒసగిన దృష్టితో నేను ఈ మాటలు పలుకుతున్నాను.

తన సవతి తల్లి అవాంఛనీయమైన కోర్కెను తిరస్కరించి అపనిందలపాలై దేశం నుంచి వెళ్లగొట్టబడిన 'హిప్పొలైటస్' (Hippolytus)లా నీవు ఫ్లోరెన్సు వదిలి వెళ్లవలసి వస్తుంది. దీనికి క్రీస్తును ప్రతిరోజూ అమ్మి, కొనే, ప్రదేశపు అధికారి (బొనిఫేస్–8) కారకుడు. నీవు ఎక్కే గుమ్మం, దిగే గుమ్మంలా నానా దేశాలు తిరుగుతూ, ఇతరుల దయాదాక్షిణ్యాలతో ఇచ్చిన రొట్టెపై ఆధారపడతావు. దానికి తోడు నీవాళ్లనుకున్నవాళ్లు అర్థం పర్థం లేని వ్యూహాలతో సర్వనాశనం కొనితెస్తారు. నిన్ను వాళ్లు వ్యతిరేకించి ఉన్మత్తతతో వ్యవహరిస్తారు గాని చివరకు వాళ్ల నుదుటి నుంచి రక్తం కారుతుంది. నీ గౌరవానికి మాత్రం ఎటువంటి మచ్చా రాదు.

నీ మొదటి మజిలీ లోంబార్డ్ (Bartolommeo della Scala) వారి చిహ్నం నిచ్చెనపై గరుడపక్షి. ఆ తరువాత నీవు తొమ్మిదేళ్ల వయస్సున్న కాన్‌గ్రాండె

(Congrande – మార్స్ దేవుని ఆశీస్సులు ఉన్నవాడు) ఆశ్రయాన్ని పొందుతావు. ఇతడు బార్టొలొమియా సోదరుడే!

ఇటలీకి దిక్కుగా భావించిన హెన్రీ–V ను ముందుగా సమర్థించిన పోప్ 'క్లెమెంట్–V' తరువాత వ్యతిరేకించి ఆతనికి, ఇటాలియన్ 'గ్యుల్ఫి'లకు మధ్య వైరాన్ని రగులుస్తాడు. కాన్‌గ్రాండె శాంతిప్రియుడు అవుతాడు. ఆతడిలో నమ్మకముంచుకో! నీ శత్రువులు పన్నే కుట్రలను త్రోసిరాజని నీవు మనగలవు. ఇవి నీకు లభించే కానుకలు, ఉచ్చులు కూడా! జాగ్రత్త!"

అతడు మౌనం వహించగా నేనన్నాను– "తండ్రీ! నా భవిష్యత్తు నాకు స్పష్టంగా తెలిసింది. ముందుజాగ్రత్త నాకు ఇప్పుడు ఆయుధంగా రూపుదాల్చింది. అనేక కలతలు, కష్టాలు ఉన్న ఆ లోకంలో పర్వతం దగ్గర నేను నిలబడినప్పుడు ఆ దేవత నయనాలు నన్ను అథోలోకం నుంచి, ప్రక్షాళనా పర్వతం పైకి, ఆ తరువాత స్వర్గంలోని వేర్వేరు లోకాలకు తీసుకుని వచ్చినాయి. నేను నేర్చుకున్న ఈ జ్ఞానాన్ని వారికి చెప్తే వారు స్వీకరిస్తారా?"

నా పూర్వీకుడన్నాడు– "నల్లబడ్డ అద్దంలో ప్రతిబింబం కనబడదు. అయినా నీవేమి చూసావో, తెలుసుకున్నావో దానినే నిక్కచ్చిగా వ్రాయి. వారికి దురద పుట్టిన దగ్గర గోక్కుంటారు. కొండశిఖరానికి తగిలిన గాలి పైకెగసినందుకు సంతోషపడ వచ్చును గాని, శిఖరానికేమీ తలవంపులు కాదుకదా! నీ మాటలు మొదట కర్కశంగా వున్నా, అరిగినకొద్దీ అమృతతుల్యమవుతాయి.

నీకింతవరకూ కనిపించినవన్నీ ఆ లోకంలో ప్రసిద్ధికెక్కిన వారి ఆత్మలే! సందేహాలున్న వారికి, నీవిచ్చిన ఉదాహరణలు ఉపయుక్తమై, వారి మనస్సుకు శాంతినిస్తాయి. ఊరూపేరులేని వారి గురించి చెబితే దానిని ఎవరూ స్వీకరించరు కదా!"

## Canto - 18

**అయిదవ స్వర్గం – మార్స్ గ్రహం. కాసియాగ్విడా – శిలువలో ప్రకాశిస్తున్న ఇతర ఆత్మల గురించి ప్రస్తావిస్తాడు. ఆరవ స్వర్గమైన జూపిటర్ గ్రహంలోకి వెళ్లిన ప్రయాణీకులు. దివ్యాత్మలచే అక్షరాల, పదాల నిర్మాణం. గరుడపక్షి ప్రత్యక్షం. డాంటీ ప్రార్థన.**

# ఆరవ స్వర్గం - జూపిటర్ గ్రహం వేపు ప్రయాణం

నేను నా పూర్వీకుడి మాటలలోని మాధుర్యతను చవిచూస్తూండగానే బియాట్రైస్ మాటలతో తేరుకుని ఆమె వేపు చూసాను. ఆమె కన్నులలోని అనంతమైన ప్రేమ నా ఆత్మను అన్ని బంధాల నుంచి విముక్తి చేసింది. దైవప్రేమ ఆమెలో శాశ్వతమై ఇమిడియుండగా, ఆమె నుంచి పరావర్తనం చెందినకొద్దీ కాంతి నన్ను ఆనందంలో నింపివేసింది. ఆమె అన్నది– "అతనివేపు తిరిగి ఆలకించు. స్వర్గలోకపు కాంతి నాలోనే కాదు ఉన్నది"

అప్పుడతడన్నాడు– "ఈ అయిదవ స్వర్గంలో, పైనుంచి క్రిందకు పెరిగే ఈ అద్భుతవృక్షం అనంతంగా ఫలాల్నిస్తూంటుంది. ఒక్క ఆకూ రాలిపోదు. ఈ శిలువలోని దివాత్యలందరూ క్రింది లోకంలో పద్యాలచే కీర్తించబడినవారే! నేను వారిని వర్ణిస్తున్నపుడు వారు మేఘంలోని మెరుపుల్లా చటుక్కున ప్రత్యక్షమౌతారు.

అతడు జాషువా (Joshua) పేరు పలుకగానే శిలువలో అద్భుతమైన మెరుపు మెరిసింది. ఆ తరువాత మకాబియస్ (Macabeus), ఛార్లమానె (Charlamagne), రోలాండ్ (Roland), విలియం (William), రెనొయార్డ్ (Renouard), గాడ్ఫ్రె (Godfrey), రాబర్ట్ గిస్కార్డ్ (Robert Guiscard), ఇంకా అనేకమంది ప్రసిద్ధుల దివ్యాత్మలు తళుక్కున మెరిసి మరల శిలువ కాంతిలో కలిసి పోయాయి. నా పూర్వీకుడు కూడా గ్రహ సంగీతంలో స్వరంలా, శిలువ వెలుగులో వెలుగులా ఆ దివ్యాత్మలతో మిళితమైనాడు.

నా కుడిపక్కన ఉన్న బియాట్రైస్ మరింత స్వచ్ఛంగా ప్రకాశిస్తుండగా, నాలోని వర్ఛస్సు మరింత అధికమైనట్లుగా అనిపించింది. మార్స్ గ్రహపు ఎరుపు వర్ణం మాయం కాగా, ఆరో స్వర్గపు అంచులవేపు మేము ప్రయాణిస్తున్నామన్న అనుమానం నాకు కలిగింది. జూపిటర్ గ్రహపు వెలుగులో, ఆకాశంలో గుంపులుగా ఎగిరే పక్షులు మనకు రకరకాల రూపాల్లో కనిపించినట్లు నాకు అక్కడి దివ్యాత్మలు రకరకాల అక్షరాల (D, I, L...) రూపంలో కనిపించినారు. వారు గానం చేస్తున్న పాటల లయననుసరించి

ముందొక అక్షర రూపం తరువాత కాసేపు మౌనం, ఇలా..... – ఆనాడు 'పెగాసస్' (Pegassus) రెక్కలగుర్రం తన కాలిగిట్టలతో హెలికాన్ (Helicon) పర్వతంపై హిప్పోక్రిని (Hippocrene) నీటిబుగ్గ (Spring)ను పైకెగసేట్లు చేయగా ఆ ప్రదేశంలో నడయాడే తొమ్మిదిమంది 'మ్యూజెస్' (Muses) – సకల కళాధిదేవతలారా! మీ కాంతిని నాపై ప్రసాదించి ఆ కనబడుతున్న సంకేత అక్షరాల అర్థాన్ని వివరించండి!

ఆ దివ్యాత్మలు రూపొందిస్తున్న అక్షరాలను నేను గుర్తుంచుకుంటున్నాను– DiLiGiTE IUSTiTiAM - ఆ తరువాత Qui IuDiCATiS TERRAM - ఈ ఆఖరి 'M' అక్షరం పైభాగాన చేరి గానం చేస్తున్నాయి. ఆ 'M' అక్షరం నుంచి వేలాది అగ్గిరవ్వలు వెదజల్లబడగా ఆ జ్వాలలన్నీ క్రమేపీ గరుడపక్షి రూపమై అద్భుతంగా ప్రకాశిస్తున్నాయి. ఆ చిత్రాన్ని చిత్రిస్తున్న చిత్రకారుడెవరు? ఆతనిని నడిపించేదెవరు? ఇద్దరూ ఒక్కరే! ఒక గూటి నుంచి మరో గూటికి ప్రవహించే 'మహాశక్తి' అది.

"Love Justice, You who Judge the earth" భువిపై న్యాయాన్ని ప్రతిష్ఠించి పాలించే దేవా! న్యాయం – జస్టిస్ – Justice -ను ప్రభావితం చేసే జూపిటర్ (Jupiter) గ్రహం – తన కాంతితో సమానంగా ఒకప్పుడు న్యాయాన్ని నెలకొల్పిన 'రోమ్' (Rome)లో ఈనాడు కొందరు మతాధికారులు అన్యాయానికి పాల్పడుతున్నారు. ఎందరో సాధుసంతుల బలిదానంతో నిర్మితమైన ఆలయాల్లో క్రీస్తును, దీవెనలను క్రయవిక్రయాలు చేస్తున్న దుష్టాత్ములపై ప్రభువు ఆగ్రహం విరుచుకు పడునుగాక! దారితప్పిన వాళ్లందరకూ సద్బుద్ధి కలుగును గాక! ప్రభువు అందరికి సమంగా ఇచ్చిన 'రొట్టె' ఏ కొద్దిమంది చేతికో చిక్కకుండునుగాక! ఇప్పటి మతాధిపతి గుర్తుంచుకోవాలి! పీటర్, పాల్‌లు సంరక్షించిన ద్రాక్షసారాయిని నీవు పాడు చేస్తున్నావు. సలొమె (Salome) అన్న ధూర్తురాలు ఒక్క నృత్యంతో – పావనుడైన 'జాన్'కు శిరచ్ఛేదం చేయించి ఆ తలను పళ్లెంలో పెట్టగా చూసింది. నీకూ ఆ సాధువు పేరే ఉన్నా ఆ మహానుభావుడి చిహ్నమే ఉన్న ఫ్లోరిన్ల (Florines) పై నీకు ఆశ పెరిగి దైవధిక్కారం చేస్తున్నావు. నీవనవచ్చు నాకు వాళ్లెవరూ తెలీదు – I donot know the Fisherman or Paul".

**Canto - 19**

**ఆరవ స్వర్గం – జూపిటర్ గ్రహం – గరుడపక్షి సంభాషణ – దైవన్యాయం గురించి డాంటీ అడిగిన ప్రశ్నలు. దైవన్యాయం, ముక్తిపై గరుడపక్షి వివరణ. దుష్టులైన క్రిస్టియన్ పరిపాలకులను ఈసడించిన గరుడపక్షి రూపం.**

# ఆరవ స్వర్గం – జూపిటర్ గ్రహం – గరుడపక్షి

ఆ దివ్యాత్మలన్నీ జ్వాలల్లా ప్రకాశిస్తూ క్రమేపీ రెక్కలు విప్పుకున్న గరుడపక్షి రూపాన్ని దాల్చినాయి. ఒక్కో ఆత్మ ఒక్కో కెంపులా, ఒక మండుతున్న సూర్యుడిలా నా కంటికి కనిపించింది. నేను ఆశ్చర్యంతో చూస్తుండగానే ఆ పక్షి ముక్కు కదిలినట్లై ఈ మాటలు వినిపించాయి– "నేను న్యాయబద్ధంగా, కరుణతో వ్యవహరించడం వల్ల, ఇక్కడ స్థానం దొరికింది. ఆ లోకంలో మచ్చలేని జీవితాన్ని గడిపాను. నన్నందరూ ఇష్టపడినా, ఇప్పుడు నన్ను, నా మార్గాన్ని అనుసరించేవారు తక్కువైనారు"

నేనన్నాను– "శాశ్వతానందపు వనంలోని పుష్పాల్లారా! మీరు వెదజల్లే సువాసనల పరిమళాలు నా జ్ఞానదాహాన్ని తీర్చునుగాక! దైవన్యాయాన్ని గురించి నేను తెలుసుకోగోర్తాను"

ఆ అద్భుత పక్షి ఇలా పలికింది– "లోకాల సరిహద్దులను నిర్ణయించినవాడు కొన్న విషయాలను గోప్యంగా, కొన్నింటిని బహిరంగంగా తెలియబరచినాడు. తన వాక్కు ద్వారా తన శక్తిని వాటిలో ప్రవేశపెట్టినాడు. ఉదాహరణకు గర్వాంధుడైన ల్యూసిఫర్ (Lucifer) తన శక్తిని ఎక్కువగా అంచనావేసి, తిరుగుబాటు చేసి పతనం చెందలేదా! నీవుకూడా దేవుడు నీకిచ్చిన శక్తిమేరకు ఆతనిలోకి నీ చూపు చొచ్చుకు పోయినంత దూరమే, దైవ న్యాయం గురించి నీ బుద్ధి తెలుసుకోగలుగుతుంది. తీరం వద్ద కనబడిన సముద్రపు అడుగు, దూరం పోయినకొద్దీ కనబడదు కదా!

సింధునది తీరంలో పుట్టినవాడికి క్రీస్తు గురించి ఎలా తెలుస్తుంది, అతడిపై దైవన్యాయం ఎలా ఉంటుంది అని నీవడగవచ్చు. అతడు పవిత్రస్నానం (Baptism) చేయకుండానే మరణిస్తాడు.

దేవునిపై విశ్వాసం లేనివాడు, అతడి పాపాలకు ఏ రకమైన శిక్ష విధించబడ్తుంది? మనుషులు వేరుకావచ్చు, ప్రదేశాలు వేరుకావచ్చు కాని అత్యున్నత మంచితనంలో, దైవస్వరూపంలో మార్పుండదు కదా! మానవులు తమ మంచితనం ఆలంబనగా ఆ దైవస్వరూపం వేపు నడుస్తూ ఉంటారు"

పిల్లలకు మేతపెట్టి ఆకాశంలోకెగిరి తన గూడుచుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్న తల్లికొంగవేపు పిల్లపక్షి చూస్తున్నట్లు నేను ఆ గరుడపక్షివేపు చూసాను. ఆ గరుడపక్షి రూపమే కదా రోమన్ల మహా సామ్రాజ్యానికి, న్యాయానికి ప్రతీక అయ్యింది.

ఆ పక్షి మరల పలికింది– "క్రీస్తుపై విశ్వాసం లేనివారు ఆతని రాజ్యంలోకి రానివ్వబడరు. అయితే నాలుకపై క్రీస్తు, క్రీస్తు అని పలవరిస్తూ హృదయంలో విశ్వాసం లేనివారు, సింధు ప్రజలు, ఇథియోపియన్లు, పర్షియన్లు తమకన్నా ప్రభువుకు దగ్గరగా ఉండటం చూసి ఆశ్చర్యపోతారు. Book of Life - జీవపుస్తకం తెరవబడి జీవుడు చేసిన పాపాలన్నీ గణించబడి మంచివారొకపక్క (Company of the Saved), పాపులొకపక్కకు (Company of the damned) విడదీయబడతారు. క్రిస్టియన్లుగా ఉండి దుష్కార్యాలు చేసిన ఆల్బర్ట్ (Albert of Austria), దొంగ నాణాలు ముద్రించిన ఫిలిప్ (Philip of Frances) స్కాట్లాండ్‌పై యుద్ధం చేసిన ఇంగ్లీషు రాజులు, దురాశాపరులైన స్పానియార్డ్– ఫెర్డినాండొ, బొహెమియన్ వెన్సిస్‌లాస్, ఛార్లెస్ (Charles-II of Anjou - His merit is I (1); demerits are M (1000) = జెరుసలేం (Jerusalem-Ierusalem) పవిత్ర పదంలో మొదటి చివరి అక్షరాలు; ఒకప్పుడు ఈనియస్ తండ్రి ఏంఖైసిస్ మరణించిన 'సిసిలీ' (Sicily = the isle of Fire)ని ఇప్పుడు పరిపాలిస్తున్న పిరికివాడు ఫ్రెడరిక్; అతడి మేనమామ జేమ్స్, పోర్చుగల్ రాజు డయొనైసియస్, నార్వే రాజు హాకాన్, సెర్బియారాజు స్టీఫెన్ యురోష్; కారొబెర్టొకు ముందున్న హంగరీ రాజులు – వీళ్లందరూ క్రీస్తు ప్రభువుకు దూరంగా పోతున్నవారే!

ఫ్రెంచి హెన్రీరాజు (Henry-II) సైప్రస్ ద్వీపపు నికోసియా, ఫామగొస్టాలను ఆక్రమించుకున్నట్లే, స్పెయిన్‌లోని నవర్రే (Navarre)ను కూడా వశపరచుకుని అణగదొక్కనున్నాడు. దైవ న్యాయాన్ని విశ్వసించిన చక్రవర్తి (Emperor) ఒక్కడున్నా ఇటువంటి చిల్లర రాజుల చేతుల్లో ప్రజలకు బాధలు తప్పేవేమో!"

**Canto - 20**

**ఆరవ స్వర్గం – జూపిటర్ గ్రహం – దివ్యాత్మల గానం. గరుడపక్షి తనలో ఉన్న దివ్యాత్మల గురించి ప్రసంగం. ట్రాజాన్ ప్రభువును, ట్రోజన్ రిఫియస్‌ను చూసి ఆశ్చర్యపడిన డాంటే. పూర్వనిర్ణయవాదం.**

# గరుడపక్షిలో ఉన్న దివ్యాత్మలు

సూర్యాస్తమయం కాగా ఆకాశంపైన తెరపై మిగిలిన గ్రహాలు, నక్షత్రాలు ప్రత్యక్షమయినట్లు గరుడపక్షిలోని మిగిలిన కాంతిదీపాలు ప్రకాశవంతం కాసాగినాయి. కొండపై నుండి జాలువారుతున్న నీటిప్రవాహం రాళ్లను ఒరుసుకుంటూ శబ్దం చేస్తున్నట్లు, ఆ దివ్యాత్మల గొంతుల నుండి వెలువడిన మాటలు క్రమేపీ ఏకస్వరంగా నాకు వినిపించాయి– "ఈ గరుడపక్షి రూపాన్ని దాల్చిన దివ్యాత్మలలో నా కంటి వద్ద ఉన్న ఆరుగురు ముఖ్యమైన వారు. మధ్యలో కనుపాపలా ఉన్నది 'డేవిడ్' (David) – పవిత్ర ఆర్క్ (Ark)ను ఒక పట్టణం నుండి మరొక పట్టణానికి తీసుకువెళ్లినవాడు. పవిత్రాత్మను సామగానంతో స్తుతించినవాడు. మిగతా అయిదు ఆత్మలలో నా ముక్కుకు దగ్గరగా ఉన్నది– విధవరాలికి న్యాయం చేయడానికి తన ప్రయాణాన్ని వాయిదా వేసుకున్న 'ట్రాజాన్' (Trajan) ప్రభువు; దేవుని కన్నీళ్లతో వేడుకుని మరణాన్ని పదిహేనేళ్లు తరువాత వచ్చేలా అనుగ్రహించబడిన 'హెజెకియా' (Hezekiah - King of Judah); నన్నూ, శాసనాలను మతాధికారికి అప్పగించిన కాన్‌స్టాంటైన్ (Constantine) ప్రభువు – రాజధానిని రోమ్ నుంచి కాన్‌స్టాంటనోపుల్‌కు మార్చినవాడు. తన మంచి పని నుంచి పుట్టిన చెడు ఈ ప్రపంచానికే హానికరం అయినది కదా!; దక్షిణ ఇటలీ సిసిలీల ప్రభువు 'విలియం' (William) పరిపాలించిన దేశాలు ఈనాడు ఛార్లెస్ (Charles of Anjou - the Cripple of Jerusalem) ఫ్రెడరిక్ (Frederick-II of Aragon) లాంటి దుష్టులచే పరిపాలింపబడుతున్నాయి.

స్వర్గలోకం – డేవిడ్, ట్రాజాన్, హెజెకియా, కాన్‌స్టాంటైన్, విలియం లాంటి ప్రభువులను మన్నిస్తుంది; ప్రేమిస్తుంది. కాని ఎవరైనా ఊహించగలరా ఈ కాంతిదీపాల వలయంలో అయిదవవాడు ట్రోజన్ 'రిఫ్యూస్' (Ripheus) – ఈనియస్‌తో పొగడబడిన ట్యురకియన్ అని? – ఇండియన్లయినా, ఇథియోపియన్లయినా, ట్రోజన్లయినా – వారి మంచిపనులు, న్యాయబుద్ధి ఇవే భగవానుని అంతిమ తీర్పులో కొలబద్దలు. మానవ మస్తిష్కానికి అందనివి. ఆ విధంగా ఈ దివ్యాత్మలందరూ దేవుని కరుణను పొందినవారు"

ఆకాశంలో ఎగుర్తూ పాటపాడే లార్క్ (Lark) పక్షి పైకి దూసుకుపోతూ తన పాటను మధురంగా పాడుతూ తన హృదయానికి స్వాంతన కలిగాక మౌనం వహించినట్లు ఆ దివ్యాత్మ మౌనం వహించగా, నా హృదయంలో చిన్న సందేహం – ఇది సాధ్యమా? Can such things be? దానిని పసికట్టిన ఆ దివ్యాత్మ సమాధాన మిచ్చింది– "నమ్మిన వాటిని కళ్లతో చూడకపోయినా మాటల్లో వర్ణిస్తాము. పేరు ద్వారా తెలిసేది అసంపూర్తి జ్ఞానం (Sensual knowledge). సారాంశం తెలిసినపుడు, అనుభవించినపుడు అది సంపూర్ణ జ్ఞానం (Intellectual Knowledge) అవుతుంది.

దైవ సామ్రాజ్యం (Regnum Celorum = the Kingdom of Heaven) ఈనాడు హింసతో ఉప్పొంగుతున్నది. మానవుడిని మానవుడు హింసతో ఓడిస్తున్నాడు. కాని దేవుని హృదయాన్ని చూరగొనాలంటే దయ, ఔదార్యం ఉండాలి.

ట్రాజాన్ చనిపోయేముందు ఆతని శరీరంపై శిలువ గాయాలు కనిపించాయి. గ్రెగరీ ప్రార్థనల వల్ల ఆతడు మరల జన్మించి క్రిస్టియన్‌గా మారి పరలోకమునకేగినాడు.

రిఫ్యూస్ (Ripheus) దేవుని కరుణచే పరిశుద్ధుడై, పాగనిజం (Paganism) నుంచి విముక్తుడై ఈ లోకానికి చేరినాడు.

బియాట్రైస్ భూలోక స్వర్గంలో వచ్చిన రథం కుడిపక్కన ఉన్న సుగుణాలు – విశ్వాసం (Faith); ఆశ (Hope); కరుణ (Charity – సోదర ప్రేమ) – ఇవి ముక్తికి వాహకాలు. అవే పవిత్ర స్నానాన్ని ఆత్మలచే చేయించి ముక్తిమార్గాన్ని చూపుతాయి. విధి నిర్ణయం ముందు మానవుల ఊహలు ఎంత అల్పమైనవో నీకు అవగాహన కాలేదా! దేవుడు ఎవరిని ఎన్నిక చేసి ఆశీర్వదించాడో తెలుసుకోవడం అతిదుర్లభం. సరైన దారిలో నడుస్తూ భగవానుని కృపకు పాత్రుడు కావడానికి ప్రయత్నించడమే మానవుడి విధి" అని ఆ దివ్యరూపం పలికింది – "In His will there is our peace".

లబ్ధప్రతిష్ఠుడైన గురువు వద్దకు జ్ఞాన భిక్షకు వచ్చిన శిష్యుడిలా నేను ఆ దివ్యాత్మ మాటలను ఆకళింపు చేసుకుంటున్నాను.

**Canto - 21**

**ఏడవ స్వర్గం – శాటరన్ గ్రహం – బంగారు నిచ్చెనపై ఉన్న దివ్యాత్మలు. డాంటీ ప్రశ్నకు దివ్యాత్మల సమాధానం – విధి పూర్వ నిర్ణయంపై చర్చ. సెయింట్ పీటర్ డామియాన్ దివ్యాత్మతో సంభాషణ.**

# ఏడవ స్వర్గం – శాటరన్ గ్రహం – బంగారు నిచ్చెన

నేను నా కన్నులను బియాట్రైస్ వేపు తిప్పాను. ఆమె చిరునవ్వు నవ్వకుండానే ఇలా అన్నది– "ఇప్పుడు నేను చిరునవ్వు నవ్వితే ఆ వెలుగుకు – జ్యూస్ దివ్యవర్ఛస్సును చూసి భస్మమైన సెమెలె (Semele)లా అయిపోగలవు. మానవుడవైన నీకు ఈ కాంతి పిడుగుపాటులా అనిపిస్తుంది. ఇప్పుడు మనం ఏడవ స్వర్గంలో ఉన్నాము. ఈ శాటరన్ గ్రహంలో నీకు కనిపించే దివ్యాత్మపై నీ మనసు కేంద్రీకరించి జ్ఞాన దాహాన్ని తీర్చుకో!"

ఈ శాటరన్ గ్రహం ప్రాచీన కవుల రచనలలో ఎప్పుడూ వసంతకాలంతో పాటు స్వచ్ఛమైన మానవ హృదయమున్న స్వర్ణయుగాన్ని తెలుపుతుంది. భూమి చుట్టూ తిరిగే అద్దంలాంటి ఈ గ్రహంలో నా కంటికి ఓ బంగారు నిచ్చెన కనిపించింది. ఆ నిచ్చెనపై అనేక జ్వాలావలయిత ఆత్మలు పైకీ కిందకు దిగుతూ, ఎక్కుతూ, కొన్నిచోట్ల ఆగుతూ ప్రకాశిస్తున్నాయి. ఒక దివ్యాత్మ మాకు దగ్గరగా వచ్చింది. బియాట్రైస్ అనుమతితో నేనడిగాను– "దివ్య కాంతిపుంజమా! ఎందుకీ లోకం ఇంత నిశ్శబ్దంగా ఉన్నది?"

ఆ దివ్యాత్మ సమాధానమిచ్చినాడు– "జగత్ప్రభువు అనుమతితో నేను నిన్ను ఈ లోకంలోకి ఆహ్వానిస్తున్నాను. సోదర ప్రేమ (Charity), కరుణ మమ్మల్నిక్కడ నడిపిస్తాయి. ఈ నిశ్శబ్దం, ధ్వని ఇవన్నీ మానవ ఇంద్రియాలకు తోచేడివి. మాకు అంతా కాంతివలయాలే! అనంత ప్రేమలోని భావాలే!"

నేనడిగాను– "ఎల్లెడలా ప్రేమతో నిండిన ఈ గ్రహంలో మీరే నన్నెందుకు కలవడానికి వచ్చినారు? ఇది పూర్వ నిర్ణయమా? (Predestination)"

ఆ దివ్యాత్మ బదులు పలికినాడు– "ఆ దివ్యకాంతి సరస్సు నుండి ఓ కిరణం నాపై పడి నన్ను మరింత ప్రకాశవంతం చేస్తుంది. నా బాహ్యకాంతి, అంతర్దృష్టితో సమంగా ఉంటాయి. నీవడిగిన ప్రశ్న దేవునికి అతి సమీపంలో ఉండే సెరాఫిమ్ (Seraphim)కు కూడా తెలియకపోవచ్చును. నీవు ఆ లోకంలో తెలియజెప్పు –

ఇంతెత్తుకు వచ్చినా గ్రహించలేని విధి నిర్ణయ రహస్యాన్ని అక్కడి వాళ్లు తెలుసుకోవడం దుర్లభమని. దేవునికి విధేయుడిగా ఉండడమే నిజమైన స్వేచ్ఛకు మార్గమని అర్థం చేసుకోవాలి. True freedom consists in submission to God's will"

నేనతడిని ఏ దేశం మీదని అడిగాను. ఆతడు జవాబిచ్చినాడు– "మీ నగరానికి దగ్గరలోనే ఉన్న ఎపెనైన్ పర్వతాల వద్ద ఉన్న కాట్రియా శిఖరం వద్ద ఉన్న కాయల్ డొలెసి బెనెడెక్టైన్ మొనాస్ట్రీలో నేనుండేవాడిని. లాయర్‌గా, అధ్యాపకుడిగా వున్న నేను ఆ ఆశ్రమంలో శాంతాక్రొసె (Santa Croce)లో పవిత్ర జీవనం గడిపాను. Ora et labora (pray and work) మా సిద్ధాంతం. బ్రెడ్డు, నీరు, రెండ్రోజులకోసారి ఆలివ్ నూనెతో కూడిన కూరగాయలు మా ఆహారం. నేను 'పీటర్ డామియేన్' (Peter Damien)గా పేరుపొందాను. నన్ను కార్డినలేట్‌గా గౌరవించినా అక్కడి ఆడంబరాలు నచ్చక నేను నా ఆశ్రమానికి వెళ్లి ధ్యానంలో కాలం గడిపాను.

ఈ గ్రహం నిశ్శబ్దంగా ఉండడానికి మేము ధ్యానంలో కాలం గడపడమే కారణం.

ఒకప్పుడు సెయింట్ పీటర్, సెయింట్ పాల్ లాంటివాళ్లు చర్చిలను సక్రమ మార్గంలో నడిపారు. వాళ్లు 'జీసస్' చెప్పినట్లు – Carry no purse, no haven sack, no sandals.... - నడిచారు. శిలవంటి వాడైన సైమన్ (Cephas), దివ్యాత్మకు వాహకుడి వంటి పాల్ – వీళ్లందరూ ఆదర్శవంతమైన జీవితాలను, ధ్యానంలో, ప్రభు సేవలో గడిపారు.

ఈనాటి ఆధునిక మతాధికారులు ఎంత ఊరిపోయారంటే వారిని కూర్చోపెట్టడానికి నలువేపులా మనుష్యులు కావాల్సివస్తోంది. దేవుడా! వీరినెలా భరిస్తున్నావు!"

అనేక దివ్యాత్మలు ఆ నిచ్చెనపై దిగుతూ, వలయంగా చక్రంలా తిరుగుతూ మరింత ప్రకాశిస్తున్నవి. వారందరూ 'పీటర్ డామియేన్' చుట్టూ మూగి, ఆగి ఒక్కసారిగా పెద్దపెట్టున కేకపెట్టినారు. నాకు ఆ మాటలు అర్థం కాలేదు. ఆ కేక గొప్ప ఉరుములా నన్ను చుట్టుముట్టింది.

**Canto - 22**

**ఏడవ స్వర్గం - శాటరన్ గ్రహం - ఆత్మలు ఎందుకు కేకపెట్టాయో వివరించిన బియాట్రైస్ - సెయింట్ బెనెడిక్ట్‌తో సంభాషణ - ఎనిమిదవ స్వర్గం - స్థిరతారల వేపు ప్రయాణం - జెమిని - మిథునరాశిని ప్రార్థించిన డాంటే!**

# సెయింట్ బెనెడిక్ట్‌తో సంభాషణ

పసిపిల్లాడిలా నేను నా మార్గదర్శకురాలివేపు చూసాను. పిల్లాడిని సముదాయించే తల్లిలా ఆమె అన్నది– "నీవు స్వర్గంలోనే కదా ఉన్నది. ఇక్కడ జరిగే ప్రతి క్రియా సత్యమార్గం వేపేనన్నది మరచిపోకు! ఆ దివ్యాత్మలు ఉవ్వెత్తున పెట్టిన కేకలోని ప్రార్థనను అర్థం చేసుకో! ఆ ప్రార్థనా ఫలితాన్ని నీవు నీ లోకంలో నీవు చనిపోక ముందే చూస్తావు. స్వర్గలోకం నుంచి వెలువడే కత్తి దెబ్బ నిర్ణయించిన సమయానికి చేరవలసిన వాళ్లను చేరుతుంది. నీవిప్పుడు ఆ దివ్యాత్మలను చూడు".

నేనటు చూసాను. వంద చిన్న సూర్యుళ్లు అక్కడ ప్రకాశవంతంగా వెలుగుతూ కనిపించారు. ఆ కాంతిదీపాల్లోంచీ నాకో మాట వినవచ్చింది– "రోమ్, నేపుల్స్ నగరాలకు మధ్య ఉన్న కాస్సినో పట్టణంలో ప్రాచీన అపోలో దేవాలయం ఉండేది. ఉన్నత కుటుంబంలో జన్మించిన నేను రోమ్‌లో విద్యాభ్యాసానికి వెళ్లి అక్కడి అవినీతిని అసహ్యించుకుని సుబియాకొ వద్ద ఉన్న గుహలో మునిలా జీవించాను. క్రమేపీ అనేకమంది శిష్యులు ఏర్పడగా దగ్గరలో ఉన్న అనాగరికులు, ప్రకృతి ఆరాధకుల (Pagans) స్థలాల్నాక్రమించుకుని బెనెడిక్టైన్ ఆర్డర్‌ను స్థాపించాను. మొంటె కాస్సినొలో మొనాస్ట్రీని స్థాపించి దేవుని ప్రేమను, వాక్యాలను ప్రచారం చేసాను. నా పక్కన ఉన్న వీళ్లందరూ ధ్యానమార్గాన భగవంతుని కరుణను పొందినవారు. ఇతడు మకారియస్, ఇతడు 'రోముఅల్డాస్' (Macarius, Romualdus)".

నేనన్నాను– "తండ్రీ! నేను నీ వదనాన్ని వీక్షించవచ్చునా?".

అతడన్నాడు– "సోదరా! నీ కోరిక ఆఖరి వలయంలో నెరవేరగలదు. ఆ అంతిమ ప్రదేశంలో అన్ని కోర్కెలనుంచి విముక్తి లభిస్తుంది. అది ఒక ప్రదేశమూ కాదు. దానికి ధృవాలు లేవు. అందుకే అది నీ దృష్టికి దూరంగా ఉన్నది. అక్కడి వరకూ జాకబ్ నిచ్చెన వేసి ఉన్నది. దానిపై దేవదూతల రాకపోకలున్నవి. ఇప్పుడు భూలోకం నుంచి ఎవరూ ఆ మెట్లనెక్కడం లేదు. నేను వ్రాసిన నియమాలు ఆ కాగితంపైన అలానే ఉండిపోయాయి.

తంత్రివంటి (Abbey) మతాధికారుల నిలయాలు దొంగల దోపిడీ కేంద్రాలైనాయి. పేదలకు చెందాల్సిన చర్చి ధనం స్వంత ఖర్చులకు వినియోగించ బడుతున్నది. దేవుని ధనం చుట్టపక్కాలకు, వెలయాళ్లకు ఖర్చు చేయబడుతున్నది.

సెయింట్ పీటర్, సెయింట్ ఫ్రాన్సిస్‌ల మార్గాలను అనుసరించేవారు కరువైనారు. జెరికోకు పోతున్న జాషువాకు దారి ఇచ్చిన జోర్డాన్ నదిని, మోసెస్‌కు దారి ఇచ్చిన ఎర్రసముద్రాన్ని, ఆ ఋజువుల్ని జనం మరచిపోయారు" అని పలికి ఆతడు తన దివ్యాత్మలతో కలిసి సుడిగాలిలా అదృశ్యమైనాడు.

నేను బియాట్రైస్ సూచనతో ఆ దివ్యాత్మల ననుసరిస్తూ ఆ నిచ్చెన మెట్లనెక్కాను. నేనిప్పుడు వృషభరాశి తరువాత వచ్చే మిధునరాశి – జెమిని చేరుకున్నాను.

ఓ అద్భుత నక్షత్రరాశీ! జెమినీ! నాకున్న అదృష్టం, తెలివితేటలూ నీ చలవే కదా! నేను పుట్టినపుడు నీ రాశిలో సూర్యుడున్నాడు. నీనుంచే నేనిప్పుడు అత్యున్నత స్థానానికి చేరుకున్నాను. నన్ను ఆశీర్వదించు!" అని నేను ప్రార్థించాను.

నాతో బియాట్రైస్ అన్నది– "నీవు అంతిమ ఆశీర్వచనములకు అతి దగ్గరలో వున్నావు. పైకి వెళ్లేముందు ఒక్కసారి క్రింద నేను నీకోసం చేసిన ఏర్పాట్లను చూడు. ఆ తరువాత ఆనందంతో నీవు నిచ్చెనను అధిరోహించవచ్చును".

నేను క్రిందకు చూసాను. ఏడు గోళాలలో చిన్నగా కనిపిస్తున్న భువిని చూసాను. మచ్చలు లేని చంద్రగ్రహాన్ని (Latona's daughter - Diana), హైపరియాన్ కుమారుడు హిలియాస్ (Helios - Sun) డయొనె కుమార్తె వీనస్‌ను (Venus); మైయా కుమారుడు మెర్క్యురీని (Mercury); 'జూపిటర్'ను ఆతని తండ్రి శాటరన్‌ను, జూపిటర్ కుమారుడు 'మార్స్' (Mars)ను – ఈ ఏడు స్వర్గాలను నేను వచ్చిన క్రమంలో వీక్షించాను. (Moon, Mercury, Venus, Sun, Mars, Jupiter, Saturn) వాటి పరిమాణాల్ని, వేగాల్ని, దూరాల్ని గమనించాను. వాటితో పోలిస్తే కుప్పనూర్పిడికి వాడే బల్లలాంటి (Threshing floor), a narrow plot of land లాంటి భూమిని చూసాను. ఆ మాత్రం దానికి ఇంత హింస, మారణహోమాలా! కొండల్లో కోనల్లో మైదానాల్లో ఎక్కడ చూసినా పరాకాష్ఠకు చేరిన హింస! నేను 'జెమిని' నక్షత్రరాశి నుంచి ఇంత చిన్నదిగా కనిపించిన భూమిపై నుంచి దృష్టి మరల్చి బియాట్రైస్ వేపు చూసాను.

**Canto - 23**

**ఎనిమిదవ స్వర్గం – స్థిర నక్షత్రాల ప్రదేశం – క్రీస్తు విజయం – క్రీస్తు ప్రకాశంలో ఆశీర్వదించబడినవారు – మేరీమాత విజయం కిరీట ధారణ – ఎంపిరియాన్‌లోకి వెళ్లిన క్రీస్తు, మేరీమాత, మేరీమాతకు స్తుతిగీతం – సెయింట్ పీటర్.**

# ఎనిమిదవ స్వర్గం – స్థిర నక్షత్రాల ప్రదేశం

రాత్రంతా తన పిల్లల పక్కనే విశ్రమించి తెల్లవారగానే ఎప్పుడు సూర్యోదయ మవుతుందో, పిల్లలకు ఆహారం అందిద్దామా అని వేచిచూస్తున్న తల్లిపక్షిలా ఉన్న బియాట్రైస్ నాతో అన్నది– "అదుగో అటుచూడు! క్రీస్తు విజయోత్సవంలో పాల్గొంటున్న దివ్యాత్మలు. అన్ని గోళాల నుంచి పోగైన దివ్యఫలాలు!". ఆమె వదనం అత్యంత ప్రకాశవంతంగా, ఆనందంతో నిండిన కన్నులతో మెరుస్తున్నది.

మబ్బులు లేని ఆకాశంలోని చందమామలా (Diana = Moon), తనవెంట నక్షత్రాలు చెలికత్తెలై వెంటరాగా వినువీధిలో నడుస్తున్నట్లు, నేను వేలాది కాంతిదీపాలు వెంటరాగా నడుస్తున్న సూర్యుణ్ణి చూసాను.

బియాట్రైస్ నాతో అన్నది– "క్రీస్తు కిరణాలచే ప్రకాశవంతమౌతున్న ఆ అద్భుత వనాన్ని చూడు. ఆ వనంలోని గులాబిపూవులో ప్రవర్ధమానమవుతున్న దైవవాక్కును వీక్షించు. ఆ గులాబి పక్కనే ఉన్న లిల్లీపూల పరిమళాన్ని ఆఘ్రాణించు!"

ఆనందం అతిశయించగా నేను బియాట్రైస్ వేపు చూసాను. ఆమె వర్చస్సును వర్ణించడానికి మాటలు చాలవు. పాలిహైమ్నియా, ఆమె సోదరీమణులు 'మ్యూజెస్' సర్వశక్తియుక్తులనూ నాకిచ్చినా ఆమెను నేను వర్ణించలేనేమో! ఆమె చిరునవ్వు అద్భుతంగా ఉండగా ఈసారి ఆమెను నేను చూడగలిగాను. ఈ ఆనంద సాగరాన్ని దాటడానికి నాకిప్పుడు పడవ అక్కరలేదు. కర్ణధారి (helmsman) సాయం అవసరం లేదు. ఆమె అన్నది– "నా వదనాన్ని వీక్షించడం మాని ఆ దివ్యవనం వేపు నీ దృష్టిని సారించు. ఆ గులాబీపుష్పాన్ని ఆరాధించు – (Rose of Sharon). ఆ లిల్లీపూలను (Apostles) వీక్షించు".

నేను నా దృష్టిని మరల్చి ఆ లిల్లీపూల మైదానంలో విరిసిన గులాబీని, దానిలోని దైవవాక్కును దర్శించాను. కాంతిసరస్సు నుంచి వెలిగించబడిన అనేక దీపాలు నా కనుల ముందు కదలాడుతున్నాయి. నేను ప్రాతఃసంధ్యా వేళల్లో అనుదినమూ స్మరించే ఆ అలౌకిక పుష్పం నన్ను విస్మయుణ్ణి చేసింది.

నేను చూస్తుండగానే అక్కడి ప్రకాశవంతమైన దీపం నన్ను కరుణించి ఎంపిరియాన్ వేపు వెళ్లగా నేను మిగతా దీపాలవేపు దృష్టి సారించాను.

స్వర్గ భూలోకాలను తన సుగుణాలచే (Virtues) వశపరచుకున్న ఉదయతార, జీవనతార, ఆ మనోహరమైన గులాబీ పుష్పాన్ని చూస్తున్నప్పుడే, ఓ వెలుగుతున్న కాగడాలా వచ్చిన కాంతిదీపాలు, ఆమెకు పూలమాలగా మారి పరిభ్రమిస్తున్నాయి. గ్రహసంగీతం అన్ని దిక్కులలో అతిమధురంగా వ్యాపిస్తూన్నది– "మేరీమాతా! నీవు నీ కుమారుడిని అనుసరిస్తూ రాగా ఎంపిరియాన్ లోకం నీ రాకతో మరింత దివ్యమగుగాక!"

ప్రైమమ్ మొబైల్ (Primum Mobile = the royal cloak of all the wheeling spheres - క్రింది ఎనిమిది గ్రహాలను అంగీలా కప్పి ఉంచే తొమ్మిదవ స్వర్గంను దాటి మేరీమాత, ఎంపిరియాన్ వేపు వెళ్లగా నేను తొమ్మిదవ స్వర్గం వరకె ఆమెను వీక్షించగలిగాను. అక్కడ ఉన్న కాంతి దీపాలు ఆమెను చూస్తూ – "Regina Coeli" - Hail Queen of Heaven, rejoice, alleluia - అని కీర్తించినారు.

ఈ మానవ జీవితం కన్నీటి సముద్రం వంటిది. నీవు నీతిమంతుడివి కావలెనన్న నీ సంపదలను పేదలకు పంచు. నీకు పరలోక రాజ్యంలో సంపదలు లభిస్తాయి. నన్ననుసరించు'' అన్న జీసస్ మాటలను విశ్వసించినవారు విజయోత్సాహంతో ముందుకు నడుస్తారు. అడుగో ఆహ్వానిస్తూ the keepr of the keys of glory - సెయింట్ పీటర్.

**ఎనిమిదవ స్వర్గం - స్థిర నక్షత్రాల ప్రదేశం - సెయింట్ పీటర్‌చే డాంటీకు పరీక్ష - విశ్వాసం అనే విషయంపై చర్చ - పరీక్షలో ఉత్తీర్ణుడైన డాంటీ!**

# ఎనిమిదవ స్వర్గంలో డాంటీ పాల్గొన్న ప్రవేశపరీక్ష

"ఆశీర్వదించబడిన గొర్రెపిల్ల విందుకు ఆహ్వానించబడినవాడా! జాన్ అన్నట్లు - "Look, there is the lamb of God that takes away the sin of the world - ఆ విందులో ముక్తినొందినవారు అనంతకాలం దేవుని దర్శనభాగ్యాన్ని పొందుతారు - వారి చెంతకు ఆకలిదప్పులు రానేరవు. ఆ విందుకు ఆహ్వానించబడిన వారి బల్లల క్రింద పడిన ఆహారాన్ని ఏరుకుని జ్ఞానదాహాన్ని, ఆకలిని తీర్చుకోవాలను కుంటున్న ఈతడిని కరుణించండి" - అని బియాట్రైస్ ఆ దివ్యాత్మను కోరినది. ఆ దివ్యాత్మలు గడియారం లోపలి చక్రాల్లా పెద్ద చక్రం నెమ్మదిగా తిరుగుతుంటే, వాటిలో అతిచిన్న చక్రం దాదాపు ఎగురుతున్నంత వేగంగా తిరుగుతున్నట్లు ఆ దివ్యాత్మలు నృత్యం చేస్తూండగా వాటిలోని ఒక దివ్యాత్మ బియాట్రైస్ చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణాలు చేసి అద్భుతంగా గానం చేస్తున్న విషయాన్ని వ్రాయడానికి నాకు మాటలు చాలడం లేదు- "ఓ సోదరీ! నీ ఆప్యాయతతో, ప్రేమతో నన్ను కాంతివలయం నుంచి మీవేపు రప్పించగలినావు" అన్నదా దివ్యాత్మ.

బియాట్రైస్ అన్నది- "దేవుని కీర్తి కాంతిలోకానికి బీగాలను కలిగి ఉన్నవాడా! The keeper of the keys of glory! - ఈ మానవుడికి 'విశ్వాసం - Faith' అన్న అంశంపై పరీక్షను నిర్వహించి నిగ్గుతేల్చు. తద్వారా ఈతనికి ఆ ఆనందలోకంలోకి ప్రవేశార్హత లభిస్తుంది.

అతడన్నాడు- "క్రైస్తవుడా! విశ్వాసం (Faith) అంటే ఏమిటో వివరించు!"

నేను బియాట్రైస్ ఆశీస్సులు గైకొని ఆతనికి పరీక్ష వ్రాస్తున్న విద్యార్థిలా సమాధానమిచ్చాను- "తండ్రీ! 'రోమ్'ను సరైన మార్గంలో నడిపించిన నీ సోదరుడు సెయింట్ పాల్ మాటల్లో- "Faith is the substance of the things we hope for and is the eivdence of things not seen - మనం కోరుకునే విషయాల సారాంశమూ, మరియు మనం చూడని వాటికి ఉదాహరణ - విశ్వాసం" అని నేనన్నాను.

అతడడిగాడు– “అలా అయితే కోరుకున్న విషయాలను ముందుంచి, ఉదాహరణలను తరువాత, ఎందుకు నీ సమాధానంలో పొందుపరచినావు?”

నేను సమాధానమిచ్చాను– “నా మనసులో ముద్రవేసుకున్న విషయాలను నేను భౌతిక నేత్రాలతో చూడలేను. వాటిని విశ్వాసపు అంతర్దృషితో మాత్రమే గమనించగలను. దేనిపైన ఉన్నతమైన ఆశ (Hope) నిలబెట్టబడి ఉంటుందో ఆ విశ్వాసమే విషయపు సారాంశం (Substance). దానిని సమర్థించేవి, భౌతిక నేత్రాలతో చూడగలిగినవి ఉదాహరణలు”.

అతడన్నాడు– “ఈ నాణెం ప్రశస్తమైన లోహంతో చేయబడినది. ఖచ్చితంగా గుండ్రంగా ఉన్నది. అయినా నీవద్ద నాణెములను భద్రపరచుటకు సంచి (Purse) ఉన్నదా?”

నేనన్నాను– “ఉన్నది. అది ప్రకాశవంతమైనది. ఏమీ దాచుకోనిది”

అతడడిగాడు– “నీ దగ్గరకు వచ్చే అతి ముఖ్యమైన మణి (Gem) ఏది?అన్ని సుగుణాలకు ఆధారమైన ఆ మణి ఏమిటి?”

నేను సమాధానమిచ్చాను– “పవిత్రాత్మ పాత, కొత్త నిబంధనలలో వచించిన ఆ మణి విశ్వాసం (Faith)” “మహిమలు లేకుండానే కేవలం విశ్వాసము వలన ఈ ప్రపంచమంతా క్రైస్తవ మయమవడమే ఓ పెద్ద మహిమ కదా (Miracle). మీరు ఒక మొక్కను నాటినారు (చర్చి). అది నేడు పూలకు బదులు ముళ్లను పూస్తున్నది”.

Praise Thee, O, God - అన్న గీతం ప్రతిధ్వనించింది.

అతడడిగాడు– “నీవు ఏమి నమ్ముతున్నావు? నీకున్న ‘విశ్వాసం’ ఎవరు నీకిచ్చారు?”

నేనన్నాను– “నేను శాశ్వతుడైన, మహాశక్తివంతుడైన ఆ దేవుడిని నమ్ముతున్నాను. తన ప్రేమతో తానున్న చోటు నుండి కదలకయే ఈ సమస్త విశ్వాన్ని కదిలించేవాడిని విశ్వసిస్తున్నాను. ఏ ఋజువులు లేకపోయినా మోసెస్ లాంటి ప్రవక్తల ద్వారా, సామగానాల ద్వారా, సువార్తల ద్వారా నేను పవిత్రాత్మను దర్శిస్తున్నాను. ఆ త్రిమూర్తితత్వం ఒక్కరేనని నమ్ముతున్నాను. ఆ విశ్వాసమే నాలో అగ్గిరవ్వరూపం నుంచి అనంత కాంతిదీపంలా, ప్రశస్తమైన నక్షత్రంలా నాలో వెలుగుతున్నది”.

నా మాటలు వినగానే నన్ను ప్రశ్నించి, నా సమాధానాలు విన్న ఆ దివ్యాత్మ, నన్ను ఆశీర్వదిస్తూ, నృత్యగానాలతో నా చుట్టూరా మూడుసార్లు ప్రదక్షిణాలు చేసి మరింత ప్రకాశవంతంగా వెలిగింది.

**ఎనిమిదవ స్వర్గం - స్థిర నక్షత్రాల ప్రదేశం - ఫ్లోరెన్సు తిరిగి వచ్చి కవిగా గుర్తింపు పొందాలన్న డాంటీ ఆశ. సెయింట్ జేమ్స్ 'ఆశ' అంశంపై పెట్టిన పరీక్ష. సెయింట్ జాన్ రాక. దృష్టి కోల్పోయిన డాంటీ.**

# 'ఆశ' అనే అంశంపై డాంటీకు పరీక్ష

ఈ పవిత్ర కావ్యం స్వర్గభూలోకాలు పంచుకున్న విస్తృతితో, దీర్ఘ సంవత్సరాలను గడచి, నన్ను నా జన్మస్థానం నుండి దూరం చేసిన క్రూరత్వాన్ని, గొర్రెపిల్లపై తోడేళ్లు చేసిన దురాక్రమణ పర్వాన్ని త్రోసిరాజని, నన్ను బంగారు ఉన్ని ధరించి వన్నెకెక్కిన కవిగా, సెయింట్ జాన్ రక్షించే గొర్రెలమంద ఉండే ప్రదేశమైన ఫ్లోరెన్సు (Florence)లో, గుర్తించగా లారెల్ కిరీటాన్ని ధరించాలని నా ఆశ.

సెయింట్ పీటర్ భగవానునిపై నాకున్న విశ్వాసాన్ని పరీక్షచేసి నా కనుబొమపై ఆమోదముద్ర వేసినాడు. ఇంతలో క్రీసుకు అత్యంత ప్రియమైన వ్యక్తి మా ముందుకురాగా బియాట్రైస్ అంటున్నది- "చూడు! చూడు! గలిసియాలో ప్రసిద్ధికెక్కిన సెయింట్ జేమ్స్ (Saint James) వస్తున్నాడు".

తన సహచరుడి దగ్గర వాలిన పావురంలా, సెయింట్ జేమ్స్ వచ్చి సెయింట్ పీటర్ వద్దకు రాగా ఇద్దరూ ఒకరినొకరు పలుకరించుకున్నారు. పరస్పర అభివాదా లనంతరం బియాట్రైస్ వారితో పలికింది- "ఆశ'కు ప్రతిరూపమా! జీసస్ మీ ముగ్గురు సుగుణమూర్తులనే ఎన్నిక చేసుకుని మీ సలహాలతో నిర్ణయాలు తీసుకునేవాడు!" అనగా ఆతడు నాతో పలికినాడు- "ఇది భగవన్నిర్ణయం! నీవు మరణించాక ప్రభువు సన్నిధికి చేరేముందే నీకు ఆ అర్హత ఉన్నదో లేదో మేము తెలుసుకుంటున్నాము. 'ఆశ' అంటే ఏమిటి? అది నీ మనస్సులోకి ఎలా ప్రవేశించిందీ, ఎక్కడనుంచి వచ్చింది?"

బియాట్రైస్ నన్ను సమర్థిస్తూ అన్నది- "There is no child of the Church Militant who has more hope than he has" ఇతడిలోని ఆశ, నిరీక్షణ ఈజిప్టు నుంచి జెరూసలేం యాత్ర అంత స్థిరమైనవి. మిగతా రెండు ప్రశ్నలకు ఇతడే సమాధాన మివ్వగలడు"

నేనన్నాను- "Hope is the certain expectation of future glory. రాబోయే కీర్తి గురించి ఉన్న ఖచ్చితమైన ఆశ. దేవుని కరుణ, వ్యక్తి అర్హతల ప్రతిరూపం.

ఈ కాంతి నాలోకి అనేక తారల నుంచి వచ్చి చేరింది. డేవిడ్ స్తుతిగీతాల సామగానాల నుంచి నేను 'ఆశ'ను గ్రహించాను, అర్థం చేసుకున్నాను.

"నీ పేరు తెలిసినవారు నీపై ఆశను ఉంచుకొందురు. నాలా దేవునిపై విశ్వాసమున్న వారికి దేవుని నామము తెలియును. ప్రభువు కురిపించిన కరుణ, మీ నుంచి మాకు, మా నుంచి ఇలా తరతరాలకు వర్షంలా కురుస్తూనే ఉంటుంది"

నేను అలా మాట్లాడుతూ ఉండగానే ఆ దివ్యాత్మలో ప్రకాశవంతమైన వెలుగు మెరుపు తీగెలా మెరిసింది. అతడన్నాడు– "నేను 'ఆశ' (Hope) అన్న సుగుణంతోనే నా జీవితాన్ని గడిపాను. ఆశతో జీవించే నీవంటివాడికి 'ఆశ' నీకేమి ఇవ్వనున్నదో తెలియజేస్తాను"

నేనన్నాను– "పవిత్రమైన పాత, కొత్త నిబంధనలు దేవుని చేరదలచుకున్న ఆత్మలకు ఒక గమ్యం (Mark) నిర్దేశించినాయి. దానిని 'ఆశ' (Hope) అందుకునేలా చేస్తుంది. ఎన్నిక చేయబడినవారు రెండంచుల తెల్లటి అంగీ ధరించి ఆశీర్వదించ బడిన ఆనంద జీవనాన్ని గడుపుతారు – అని ఈసయ్య (Isaiah) తెలియజేసినాడు.

నేనలా పలుకగానే 'Sperent te' అన్న మధురగీతం Let them hope in you -వారు నీలో ఆశను పెంచుకోనీ – మధురంగా వినవచ్చింది.

ఆ దివ్యాత్మలలో ఒకరు మరింత ప్రకాశవంతం కాగా కర్కాటక రాశి (Crab)లో సూర్యుడు అస్తమించినా, ఆ దివ్యాత్మ వంటి నక్షత్రపుకాంతులతో చీకటి తొలగుతున్నట్లు, వారు నృత్యం చేస్తుండగా మరో దివ్యాత్మ – 'జాన్' (John the apostle) వారిని కలిసినాడు.

బియాట్రైస్ అన్నది– "తన రొమ్ము రక్తంతో పిల్లలకు జీవమిచ్చే 'పెలికాన్' (Pelican) లాంటి మన రక్షకుడైన క్రీస్తు 'జాన్'కు మేరీమాతను అప్పగించినాడు. (Woman, this is your son; John, this is your mother).

నేను ఆ దివ్యాత్మ వేపు చూస్తుండగా అతడన్నాడు– "భగవానుడు మానవులను సృష్టించి వారితో, స్వర్గం నుండి వెడలగొట్టబడిన తిరుగుబాటు దేవదూతల స్థానాన్ని నింపదలుచుకున్నాడు. నా శరీరం కూడా మిగతా మానవుల శరీరాల్లానే భూలోకంలో ఉన్నది.

కేవలం రెండు కాంతిదీపాలు క్రీస్తు, మేరీకన్య వారు మాత్రమే. ఎంపిరియాన్‌లో రెండంచుల అంగీ (దేహం, ఆత్మ) కలిగి ఉంటారు".

ఆ మాటలు విని నేను పక్కకు చూసాను. నాకేమీ కనిపించడం లేదు.

## Canto - 26

**అష్టమ స్వర్గం - స్థిరనక్షత్రాల ప్రదేశం. సోదర ప్రేమ లేదా కరుణ (Charity) గురించి సెయింట్ జాన్‌చే డాంటీకు పరీక్ష - పోయిన చూపు తిరిగి వచ్చుట. డాంటీ అడిగిన నాలుగు ప్రశ్నలకు ఆదాం (Adam) సమాధానమిచ్చుట.**

# ‘దేవునిపై ప్రేమ’ అంశంపై డాంటీకు పరీక్ష

దృష్టిని కోల్పోయి కంగారుగా ఉన్న నన్ను, నా చూపును పోగొట్టిన ప్రకాశ వంతమైన దివ్యాత్మ అనునయిస్తూ పలికింది- “నీకు చూపు తిరిగి వచ్చేంత వరకూ సంభాషణలతో నీ అంతర్దృష్టిని మెరుగుపరచుకో! అనానియాస్ (Ananias) సాల్ (Saul) దృష్టిని రప్పించినట్లు ‘బియాట్రైస్’ దేవుని కరుణతో నీకు చూపును రప్పించగలదు.

నేనన్నాను- “నా కనుల వాకిళ్ల ద్వారా హృదయంలోకి ప్రేమను ప్రవేశపెట్టిన ఆమెకు నా కృతజ్ఞతలు. ఈ సృష్టికి ఆదియు, అంతము అయిన దేవుని ప్రేమ నన్ను సదా రక్షించును గాక!”

ఆ దివ్యాత్మ అన్నాడు- “ఎవరు నీలో దేవునిపై ప్రేమను ప్రవేశపెట్టినారు? నీ బాణాన్ని ఆ లక్ష్యం వేపు ఎక్కుపెట్టేలా చేసిందెవరు?”

నేను సమాధానమిచ్చాను- “వేదాంత చర్చలు, దివ్య వాక్యములు నాలో దేవునిపై ప్రేమను స్థిరపరచినవి. మంచితనం నుంచి ప్రేమ, ప్రేమ నుంచి మంచితనం అధికమై సత్యం నిరూపణ కాగా, ప్రథమ ప్రేమ ‘సృష్టికర్తపై జీవులకుండే ప్రేమ’ - అని అర్థమైంది. దేవుడు మోసెస్ (Moses)తో అన్నాడు కదా- "I shall show you all goodness" -నీవు ఈ విషయాన్ని మానవులకు ఎరుకపరచు అని” అన్నాను నేను.

అతడన్నాడు- నీవు చెప్పినవి కాక ఇంకేవన్నా కారణాలున్నాయా నిన్ను దేవుని వేపులాగుతున్న ప్రేమకు?”

నేనన్నాను- “ఏ విషయాలైతే నా హృదయాన్ని దేవునివేపు మరలిస్తాయో, ఈ ప్రపంచపు ఉనికి, నా ఉనికి, ఎవరి మరణం వలన నిలిచి ఉన్నాయో, విశ్వాసులలో నాలో ‘ఆశ’ (Hope) ను నింపాయో అవే నన్ను సరైన ప్రేమ మార్గాన నడిపిస్తున్నాయి.

నేను మాట్లాడడం ఆపగానే స్వర్గమంతా Holy, holy, holy - అన్న ధ్వనులు ప్రతిధ్వనించాయి.

క్రమేపీ నా కనులలో వెలుగు నిండి దృష్టి మునుపటికన్నా బాగా స్పష్టంగా కనిపించసాగింది. బియాట్రైస్ నాతో అన్నది– "ఆ అనాదిశక్తి సృష్టించిన తొలి ఆత్మ దేవునిపై ప్రేమతో నిండిన కనులతో ఎలా వీక్షిస్తున్నదో గమనించు"

హోరుగాలికి తలవంచి, తేరుకుని తలపైకెత్తిన వృక్షంలా నేను ఆ దివ్యాత్మ (ఆదాం=Adam) వేపు చూసి ఇలా అన్నాను– "దేవుని స్వహస్తాలచే రూపొందించ బడిన దివ్యఫలమా! నాతో మాట్లాడి నా మనసులోని సందేహాలను తీర్చు!"

అతడన్నాడు– "నీ సందేహాలు నేను గ్రహించాను. నా దీర్ఘ ప్రవాసానికి కారణం నేను నిషిద్ధ ఫలాన్ని తినడం కాదు, దేవుడు విధించిన ఆధ్యాత్మిక సరిహద్దును దాటడం, గర్వంతో మెలగడం.

నేను 930 సంవత్సరాలు జీవించాను. 'లింబో' ప్రదేశంలో 4302 సంవత్సరాలున్నాను. క్రీస్తు నరకలోకాన్ని నాశనం చేసి (34 A.D.) ఇప్పటికి 1266 సంవత్సరాలు. మొత్తం 6498 సంవత్సరాలు.

నిమ్రాడ్ (King Nimrod) బాబెల్ గోపురాన్ని నిర్మించక ముందే నేను మాట్లాడిన భాష అంతరించింది. నేను మాట్లాడిన మొదటి మాట 'I' (అది దేవుని నామమే); తరువాత దేవుని ఎల్ (El)గా 'Eli' గా హీబ్రూలు సంబోధించినారు. ఈ పరిణామం అరణ్యంలోని వృక్షాలు ఆకులను రాల్చి కొత్త ఆకులను చిగురింప చేసుకున్నంత సహజమే!

ప్రక్షాళనా పర్వతంపైన (Purgatory) భూతల స్వర్గంలో పాపానికి ముందు, పాపానికి తరువాత మొత్తం నేనూ, ఈవ్ ఉన్న కాలమంతా ఉదయం నుంచి మధ్యాహ్నమంత కాలమే. కేవలం ఏడు గంటలు!

## Canto - 27

**ఎనిమిదవ స్వర్గం – స్థిర నక్షత్రాల ప్రదేశం. ఆశీర్వదించబడిన వారి స్తోత్రాలు. అవినీతిలో కూరుకుపోయిన చర్చిలను, మతాధికారులను దుయ్యబట్టిన సెయింట్ పీటర్. డాంటీను ఆశీర్వదించగా భూమివేపు దృష్టిసారించిన డాంటీ. తొమ్మిదవ స్వర్గం–ప్రైమమ్ మొబైల్‌లోకి ప్రయాణం.**

# తొమ్మిదవ స్వర్గం వేపు ప్రయాణం

"తండ్రి, కుమారుడు, పవిత్రాత్మలకు జయమగు గాక!" స్వర్గలోకమంతా జయజయధ్వానాలతో ప్రతిధ్వనించగా, నాకు ఈ చరాచర విశ్వమంతా ఆనందాతిరేకంతో చిరునవ్వు నవ్వుతున్నట్లు అనిపించింది.

ఎంత ఆనందం! మాటలతో వర్ణించలేనంత సంతోషం! ప్రేమ, శాంతిలతో నిండిన పరిపూర్ణ జీవనం! నిరీక్షణ అవసరం లేని సౌభాగ్య భాగ్యం.

నా కనుల ముందు నాలుగు కాంతి దివ్వెలు కనిపించాయి. ఒకదానిని మించిన కాంతితో ఒకటి వెలుగుతూ జూపిటర్, మార్స్ గ్రహాలు పక్షులుగా మారి వాటి ఈకలను మార్చుకున్నట్లు మొదటి కాంతిదీపం తెలుపు నుంచి ఎరుపురంగులోకి మారింది. ఆ నాలుగు కాంతిదివ్వెలు – పీటర్, జేమ్స్, జాన్, ఆదాంలు. మొదటి కాంతి దివ్వె సెయింట్ పీటర్ ఇలా అన్నాడు– "ఇప్పుడు నా స్థానాన్ని ఆక్రమించు కున్నవారు, దేవునికుమారుని కన్నెదుటే, నా సమాధి ఉన్న ప్రాంతాన్ని రక్తపంకిలం కావించి, దుర్వాసనతో నింపి – స్వర్గం నుంచి పతనం చెందిన ల్యూసిఫర్ (Lucifer)కు తృప్తినిస్తున్నారు"

నేను చూస్తుండగానే స్వర్గం అరుణరాగరంజితమయ్యింది. ఎందుకో బియాట్రైస్ వదనం గ్రహణం నాటి సూర్యునిలా కనిపించగా నేను దానిని దైవకుమారుని వధువు (చర్చి)ను అలుముకున్న చీకటికి ప్రతీకగా భావించాను.

అతడన్నాడు– "నేను, లినస్, క్లెటస్, సిక్టస్, పయస్, కాలిక్టస్, అర్బన్ – మేమందరం చర్చి ఉన్నతికోసం మా రక్తాన్ని ధారపోసాము. ఈనాటి చర్చి అధిపతులు ప్రజలను విడదీసి (గ్యుల్ఫ్, ఘిబెల్లైన్లు) రక్తాన్ని ఏరుల్లా పారిస్తున్నారు. క్రీస్తు ఇచ్చిన తాళపుచెవులు, చర్చి ముద్రికలు నేడు దుర్వినియోగమవుతున్నాయి. ఇవి నాకు కోపాన్ని తెప్పిస్తున్నాయి. "మేలుకో! ప్రభూ! గొర్రెలకాపరుల రూపంలో ఉన్న ఈ తోడేళ్ల నుంచి గొర్రెపిల్లలను కాపాడు! నీ అగ్నిజ్వాలలతో ఈ దుష్టులను

శిక్షించు! గాస్కన్లు (క్లెమెంట్-5), కాహర్సైన్లు (జాన్-22) చర్చి ధనాన్ని తమ స్వప్రయోజనాలకు వినియోగిస్తూ పేదలను నిర్లక్ష్యం చేస్తున్నారు.

రోమ్‌కు కీర్తి తెచ్చిన స్కిపియో (Scipio)లా మరలా చర్చికి మంచిరోజులు వస్తాయి. కుమారా! నీవు ఇక్కడ చూసినవి, నేర్చుకున్నవి అన్నిటినీ నిష్కర్షగా వెల్లడించు" ఈ మాటలు పలికి ఆ ఆత్మలు మకరరాశిలో ఎగసిపడే మంచుతునకల్లా ఎంపిరియన్ వేపు అదృశ్యమైనారు. అప్పుడు బియాట్రైస్ అన్నది– "నీ చూపులను భువివేపు మళ్లించు. నీవెంత దూరం వచ్చావో అవగతమవుతుంది"

ఈ గడచిన ఆరుగంటల కాలంలో – జెరుసలెం నుంచి కాడిజ్ (Cadiz) వరకు – యులిసెస్ ప్రయాణమార్గాన్ని, జూపిటర్ తెల్లటి గిత్తగా మారి యూరోపాను ఎత్తుకుపోయిన దారి నాకు భూమిపై కనిపించాయి. నేనింకా ఈ కుప్పనూర్పిడి బల్లలాంటి (Threshing floor) భూమిని చూసేవాడినే కాని సూర్యుడు మిథునరాశి (Gemini) నుంచి మేషరాశిలో (Aries)కి మారినాడు.

బియాట్రైస్ నన్ను కాస్టర్, పొలక్స్ (Castor, Pollux)లు ('లెడా' సంతానం ఉన్న మిథునరాశి నుంచి ప్రైమమ్ మొబైల్ (Primum Mobile) – ఈ విశ్వాన్ని చలనంలో ఉంచే ప్రదేశమైన తొమ్మిదవ స్వర్గానికి తీసుకుని వెళ్లింది. దేవుని మనస్సు ఇక్కడ ప్రేమ, శక్తితో నిండి ఉంటుంది. ఇది స్ఫటికస్వర్గం. అత్యంత వేగంగా పరిభ్రమిస్తూ విశ్వాన్ని నియంత్రిస్తుంది. ఇక్కడే కాలం పుడుతుంది. ఇతర గ్రహాల వేగాలు కొలవబడ్తాయి.

వీటిని, ఈ దివ్యవిషయాలపై మనసు లగ్నం చేయకుండా మానవులు అల్పమైన, తుచ్ఛవాంఛలతో చరిస్తున్నారు. అమాయకత్వం, నమ్మకం ఇప్పుడు పసిపాలకుపరిమితమైనది. గడ్డం రాకముందే మనుషులు అడ్డదారులు తొక్కుతున్నారు. మానవుల దురాశకు (Greediness) అంతులేకుండా పోయింది. అన్నినోళ్లతో బొక్కుతూ, కక్కుతూ, మాటలు నేర్వగానే కన్నతల్లినే సమాధి చేయచూస్తున్నారు. ఉదయకాంతులపై చీకట్లు అలుముకుంటున్నాయి. వృక్షాలు ఎండి పళ్లు కుళ్లి పోతున్నాయి.

నేను చెబుతున్నాను విను. ఇక భూమిపై రాజరికం ఉండదు. On earth no king holds sway - మానవులు దారితప్పుతారు. వేయేళ్లు గడిచేసరికి కాలగణనలో మార్పు వస్తుంది. ఓడల ముందు భాగాలు వెనకకు మారగా నౌకలు సరైన మార్గంలో పయనిస్తాయి. జనవరిలో వసంతకాలం వస్తుంది. మంచిపూలు, ప్రశస్తమైన ఫలాలు మరల లభిస్తాయి.

## Canto - 28

**తొమ్మిదవ స్వర్గం - ప్రాథమిక చలన ప్రదేశం - ప్రైమమ్ మొబైల్ తొమ్మిది ప్రకాశవంతమైన దేవదూతల వలయాలు. ఒకే కేంద్రం నుంచి పరిభ్రమిస్తున్న వాటి గురించి బియాట్రైస్ వివరణ. స్వర్గంలో ఉండే అధికార సోపానాలు (Heirarchy). దేవదూతల క్రమపు సవరణ.**

# దేవదూతల వలయాల క్రమణిక

నన్ను నడిపిస్తున్న నా మార్గదర్శకురాలి మాటలను వింటూ, ఈనాటి మానవుల వ్యర్థజీవన ప్రయాసలను, వెలుగుతున్న కొవ్వొత్తి ప్రతిబింబాలుగా అద్దంలో కనిపిస్తున్నట్లు భావించాను.

నాకు కొంతదూరంలో ఒక కేంద్రబిందువు నుంచి తీక్షణమైన కాంతి వెలువడుతూ కళ్లకు మిరుమిట్లు గొలుపుతుండగా, ఆ బిందువు చుట్టూరా ప్రజ్వలిస్తున్న అగ్నివలయాలు, ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరు, ఏడోది ఎంతపెద్ద వలయమంటే 'జునో' (Juno) దేవత చెలికత్తె ఐరిస్ (Iris=ఇంద్రధనుస్సు) కన్నా పెద్దది; దానికన్నా ఎనిమిదవది, తొమ్మిదవది మరింత పెద్ద వలయాలు. వెడల్పైనవి. అన్నిటికన్నా లోపల వున్న వలయం స్వచ్ఛంగా ఉండి ఎక్కువ వేగంగా పరిభ్రమిస్తున్నది.

నా సందిగ్ధతను చూసి బియాట్రైస్ అన్నది– "ఆ కేంద్రబిందువు శక్తిస్థానం. ఈ విశ్వనిర్మాణం, చలనం ఆ బిందువు శక్తిపైననే ఆధారపడి ఉంటుంది. ఆ బిందువుకు దగ్గర ఉన్న వలయాలు ప్రజ్వలిస్తున్న ప్రేమ వలన అత్యంత వేగంగా తిరుగుతూ ఉంటాయి"

నేనన్నాను– "బరువుతో కూడిన భూమిలాంటి గ్రహాలకు ఈ తారతమ్యాలు వర్తించవచ్చును గాని, స్వర్గంలో ఉన్న వలయాలలో ఈ తేడా ఎందుకు ఉన్నదో దయచేసి వివరించు!" అని నేను వేడుకున్నాను.

ఆమె అన్నది– "గ్రహాలలో నిబిడీకృతమైన శక్తిని అనుసరించి వాటి పరిమాణాలున్నాయి. స్వర్గంలో ఉన్న వలయాలు వాటిలోని దివ్యజ్ఞాన పరిమితిని బట్టి కేంద్రబిందువుకు దగ్గరగా, దూరంగా ఉంటాయి. ఆధ్యాత్మిక, భౌతిక ప్రపంచాలకున్న ముడిని తీయడానికి నీవు చేసే ప్రయత్నం మెచ్చతగినదే! ఈ వలయాల్లో నిప్పురవ్వలుగా ప్రకాశిస్తున్న వారందరూ దేవదూతలే! వీరు అసంఖ్యాకులు, చదరంగపు గడులలో, మొదటి గడిపై ఒక ధాన్యపు గింజనుంచి, అక్కడి నుంచి ప్రతి గడిలో ఉంచవలసిన గింజలను రెట్టింపు చేస్తూపోతే, ఆ ధాన్యాన్నివ్వడానికి పర్షియాలోనిదే కాక

ప్రపంచంలోని ధాన్యమే సరిపోనట్లు ($2^{64}$ - 1 = 18½ బిలియన్ బిలియన్లు) అంతకన్నా ఎక్కువ మంది దేవదూతలున్నారు". ఆమె అలా పలకగానే ఆ వలయాల నుంచి హోసన్నా (Hosanna) అన్న పాట వినిపించింది. బియాట్రైస్ మాటలతో ఈశాన్యపు గాలికి ఆకాశాన ఉన్న మబ్బులు చెదిరి నిర్మలమైనట్లు నా మనసు నెమ్మదించి ప్రశాంతతను పొందింది.

బియాట్రైస్ చెప్పసాగింది– "కేంద్ర బిందువుకు దగ్గరగా ఉన్న మొదటి వలయం సెరాఫిమ్ (Seraphim); రెండవది ఛెరుబిమ్ (Cherubim); మూడవది సింహాసనాలు ((Thrones). ఈ మూడు వలయాలూ ప్రేమతో నిండిన దృష్టిపై ఆధారపడి వుంటాయి.

రెండవ వర్గంలో ఉన్న మూడు వలయాలు 'ప్రేమ'పై కాక శ్రేష్ఠత లేదా అర్హత (Merit)తో కూడిన దృష్టిపై ఆధారపడినవి. నాల్గవ వలయం – డొమినియన్లు (Dominions); అయిదవది– సుగుణాలు (Virtues); ఆరవది శక్తులు (Powers);

మూడవ వర్గంలో ఏడవ వలయమైన ప్రిన్సిపాలిటీలు (Principalities); ఎనిమిదవ వలయమైన ఆర్కాంజిల్స్ (Archangels - ప్రధాన దేవదూతలు; తొమ్మిదవ వలయంలో ఏంజిల్స్ (Angels=దేవదూతలు) – పరిభ్రమిస్తూ ఉంటారు. వారి చూపులన్నీ ఆ దేవునిపైననే ఉంటాయి.

డయొనైసిస్ (Dionysius) ఈ వలయాల్ని పేర్కొన్నాడు. ధ్యానంలో ఆతడు ప్రతిపాదించిన ఈ క్రమాన్ని గ్రెగరీ కొన్ని మార్పులు చేసినాడు. కాని అతడు స్వర్గానికి వచ్చి క్రమాన్ని గ్రహించి తన పొరపాటును గ్రహించాడు" అన్నది బియాట్రైస్.

| **స్వర్గం** | **సెయింట్ గ్రెగరీ** | **డయొనైసిస్ – డాంటే స్వర్గం** |
|---|---|---|
| ప్రైమమ్ మొబైల్ | సెరాఫిమ్ | సెరాఫిమ్ |
| స్థిర నక్షత్రాలు | ఛెరుబిమ్ | ఛెరుబిమ్ |
| శాటరన్ | పవర్స్ | థ్రోన్స్ |
| జూపిటర్ | ప్రిన్సిపాలిటీస్ | డొమినియన్లు |
| మార్స్ | వర్చ్యూస్ | వర్చ్యూస్ |
| సన్ | డొమినయన్లు | పవర్స్ |
| వీనస్ | థ్రోన్స్ | ప్రిన్సిపాలిటీస్ |
| మెర్క్యురి | ఆర్కాంజిల్స్ | ఆర్కాంజిల్స్ |
| మూన్ | ఏంజిల్స్ | ఏంజిల్స్ |

## Canto - 29

**నవమ స్వర్గం – ప్రైమమ్ మొబైల్. సృష్టి, దేవదూతలు, దేవదూతల తిరుగుబాటుపై బియాట్రైస్ చర్చ. మెట్టవేదాంతం, ఉబుసుపోక బోధనలపై ఆగ్రహం. దేవదూతల సంఖ్య.**

# సృష్టి, దేవదూతల గురించి బియాట్రైస్ వివరణ

లాటొనా (Latona). బిడ్డలైన సూర్యచంద్రులు (Apollo and Diana) మేష, తులా (Aries, Libra) రాశుల్లో స్థానాలు మార్చుకున్నపుడు ఆకాశపు అంచు వద్ద రెండు అర్ధగోళాలు అటూ ఇటూ కనిపించినట్లు, క్రమేపీ ఒకటి పూర్తిగా అదృశ్యం కాగా మరొహటి పూర్తిగా కానవస్తుంది. అంతసేపు మౌనంగా వున్న బియాట్రైస్ నాతో పలికింది– "నేను నీకిప్పుడున్న సందేహాలను ఒక్కొక్కటీ తీరుస్తాను. సృష్టి, దేవదూతల తిరుగుబాటు, విధేయులైన దేవదూతల సంఖ్య, కాలానికి ఆద్యంతాలు (Whens = Alpha and Omega of all time) స్థలం (Space = Ubi - Where) – వీటిని వివరిస్తాను.

దేవుని యొక్క అనంతమై పొంగిపొరలే ప్రేమ ఈ సృష్టి. అనంతుడైన ఆతనికి సృష్టితో పనిలేదు. కాని ఆతని సంకల్పం (Will - ఇచ్ఛాసంకల్పం) నుంచి అహం (I am = Subsisto=నేను) జనిస్తుంది. ఆ వికసిస్తున్న పుష్పం నుంచి దేవదూతలు, స్వర్గలోకాలు, ఆదిమ పదార్థం తయారవుతాయి. సృష్టి అనేది దేవుని విరామం తరువాత వచ్చే క్రియ కాదు. అది కాలానికి, మార్పుకు ఆవల జరిగే క్రియ. సృష్టి జరిగిన తరువాత కాలం ప్రారంభమవుతుంది. అప్పుడు దివ్యాత్మ ఆ జలాలపై కదలాడుతుండగా (Hovering), పదార్థము, స్థితి (Matter, form) కలిసో, వేర్వేరుగానో, మూడు తాళ్ల వింటి నుంచి మూడు బాణాల్లా – పదార్థము, స్థితి, వాటి మిశ్రమం – వెలువడుతాయి. ఆ మూలాధార ద్రవ్యాలతో (Substances) బాటు క్రమం, నమూనా (Order, Pattern)లు సృష్టించబడగా ప్రపంచపు శిఖరంపై క్రియ (Act), అడుగున సంభావ్యత (Potentiality) మధ్యలో క్రియా సంభావ్యతల మిశ్రమం (Act, Potentiality) ఉంటాయి.

సెయింట్ జెరోమ్ చెప్పినట్లు దేవదూతలు ఈ భౌతిక ప్రపంచంకన్నా ముందు సృష్టించబడినారన్న వాదన సరైనది కాదు. పవిత్రగ్రంథం ఆదికాండంలో – In the begining God created the heavens and the earth. స్వర్గాలను కదిలించిన వారు స్వర్గంతోపాటే సృష్టించబడినవారే! ఇరవై అంకెలు లెక్కపెట్టేంత కాలంలోనే ఆ

దేవదూతలలో కొద్దిమంది గర్వాంధులైన ల్యూసిఫర్ (Lucifer) నాయకత్వాన తిరుగుబాటు చేసి పతనం చెందినారు.

మిగిలినవారు దేవుని కార్యమును ఆనందముతో చేయుచూ సృష్టి కార్యక్రమంలో పాల్గొన్నారు. వినయ విధేయతలతో మెలిగిన మంచి దేవదూతలపై దేవుని కరుణ ప్రసరించగా వారు మరింత ప్రకాశవంతంగా వెలుగుతున్నారు.

అవగాహన (Understanding), జ్ఞాపకశక్తి (Memory), ఇచ్ఛాసంకల్పం (Will) దేవదూతలకుంటాయని భూలోకంలో కొంతమంది చెబుతుంటారు కాని అది నిజం కాదు. నిరంతరం దేవుని కాంతిని, దివ్యజ్ఞానాన్ని పొందుతున్న దేవదూతలకు విషయాలను గుర్తు తెచ్చుకునే అవసరమేమున్నది?

బాహ్యాడంబరాలు, ప్రేమను బహిరంగపరచడం (Show of Love), ప్రేమకన్నా ప్రేమను చూపించే ప్రదర్శనపై మక్కువ, వాటికై వేర్వేరు మార్గాలలో నడుస్తూ దారి తప్పుతున్నారు. దివ్యశాసనాలను ధిక్కరించడమో, వక్రభాష్యం చెప్పడమో చేస్తున్నారు. వీళ్ల గోలలో 'సువార్త' మౌనంగా వుంటోంది. క్రీస్తు శిలువ వేయబడినప్పుడు, సూర్యుడిని అస్తమయం కానివ్వకుండా చంద్రగ్రహం వెనక్కి నడిచిందని, యూదులు, స్పానియార్డులు, ఇండియన్లు కూడా ఆ సమయంలో గ్రహణాన్ని చూసారని కథలు చెబుతారు. ఈ కథలు ఫ్లోరెన్సులోని ప్రజల సర్వసాధారణ నామాలైన లాపస్, బిన్‌దాస్ (Lapos, Bindos)ల కన్నా ఎక్కువే! ఈ గాలికథలు నమ్మి అమాయకులు అపాయంలో పడతారు. క్రీస్తు తన అనుచరుల్ని కట్టుకథలు ప్రచారం చేయమని చెప్పలేదే! సత్యాన్ని ప్రబోధించి, విశ్వాసాన్ని పాదుకొలపండని, సువార్తలను డాలూ, బల్లెంగా వినియోగించమని ఆదేశించినాడు.

ఇప్పటి ప్రచారకులు వ్యంగ్యోక్తులు, ఎత్తిపొడుపులతో ప్రజలలో నవ్వులు రేకెత్తించడమే తమ మత ప్రచారంగా భావిస్తూ, క్షమాభిక్షలూ, క్షమాపత్రాలూ (Indulgences) దేవుని అనుమతి లేని పనులు చేస్తూ తమ అంగీలలో సాతానుకు ఆశ్రయమిస్తున్నారు. ఏంటోనైన్ సన్యాసులు తమ పందులను ప్రజల పొలాల్లో మేపినట్లు, వాళ్లు చర్చిని తమ స్వంత పనులకు వాడుతున్నారు.

దేవదూతల సంఖ్య విషయానికొస్తే ఇంతవరకూ ఏ సంఖ్యా నిర్ధారించ బడలేదు. డానియేల్ దేవదూతలు 'వేలవేలాదిమంది' అన్నమాట వాడాడు గానీ నిశ్చయ సంఖ్య పేర్కొనలేదు. దేవుని తొలికాంతి సోకి దేవదూతలు ప్రకాశవంతంగా వెలుగుతూ, శాశ్వత మంచితనాన్ని ప్రతిబింబించే అద్దాల్లా అనేకులై ఉన్నా, ఆ దివ్యకాంతి జనకుడు ఒక్కడే!

**Canto - 30**

**దివ్యాత్మల నిష్క్రమణ. బియాట్రైస్ అద్భుత సౌందర్యం. పదవ స్వర్గం ఎంపిరియాన్‌లోకి ప్రవేశం. దివ్యగులాబి. ఏడవ హెన్రీకిచ్చిన గౌరవం. బియాట్రైస్ చివరి సందేశం.**

# పదవ స్వర్గం ఎంపిరియాన్‌లోకి ప్రవేశం

ఇప్పుడిప్పుడే తెలవారబోతున్నది. సూర్యుని చెలికత్తె సంధ్య (Dawn) వస్తుండగా తారాదీపాలు ఒక్కొక్కటి అదృశ్యమవుతున్నాయి. ఇంకా ఆరువేల మైళ్ల దూరం ప్రయాణిస్తే సూర్యుడు నడినెత్తికి చేరుకోగలడు. అదుగో ఆ ఉదయతార 'వీనస్' క్రమేపీ మాయమవుతున్నది. ఆ విధంగానే కేంద్రబిందువుచుట్టూ పరిభ్రమిస్తున్న దేవదూతల వలయాలు నా దృష్టి నుంచి అదృశ్యం కాగా నేను బియాట్రైస్ వేపు చూసాను. ఆమె అందాన్ని, ప్రకాశాన్ని వర్ణించడానికి నా విద్వత్తు చాలదు. ఎవరో మహాకవికి మాత్రమే అది సాధ్యపడుతుంది. నా తొమ్మిదేళ్ల వయసులో ఆమెను చూసినప్పటి నుంచి ఇప్పటి వరకు నేను ఆమె అందాన్ని మాటలతో, పదాలతో వర్ణిస్తూనే ఉన్నాను. ఇప్పుడామె మాటలకందని అందాలరాశి. ఆమె ఇలా అన్నది– "మనం పదార్థపు అతిపెద్ద గోళం (Primum Mobile) నుంచి స్వచ్ఛమైన కాంతితో అలరారే పదవ స్వర్గానికి (Empyrean) చేరుకున్నాము. ఈ కాంతి జ్ఞానంతో, ప్రేమతో, మంచితనంతో, సంతోషంతో, అన్ని మధురిమలను మించిన ఆనందంతో నిండిన కాంతి. ఇక్కడ దేవదూతలు, సాధుసంతులు అంతిమ తీర్పు రోజున ఉండే విధంగానే కనిపిస్తారు"

మెరుపు విద్యుత్ప్రవాహం నుంచి వచ్చిన మిరుమిట్లు గొలిపే కాంతిలా ఆ కాంతి నా కళ్లను కమ్మడంతో కాసేపు నాకేమీ కానరాలేదు. "స్వర్గాన్ని ప్రశాంతంగా ఉంచే ప్రేమ (Love) నిన్ను స్వాగతిస్తున్నది"

ఆ మాటలు వినగానే నాకర్థమయ్యింది. ఏదో అతీతమైన శక్తి నన్ను పైలోకానికి తీసుకువెళ్తున్నదని. ఆ స్వచ్ఛమైన కాంతి, బంగారు ఎరుపు రంగుల నదిలా భాసిల్లుతూ, ఆ నదికిరు ఒడ్డులా పచ్చని పచ్చికపై అందమైన పూలు వికసించగా అత్యంత రమణీయంగా కనిపించింది. ఆ నది నీటి నుంచి విరజిమ్మబడిన కాంతిరవ్వలు పక్కనున్న పుష్పాలపైబడి బంగారంపై అమర్చిన కెంపుల్లా ప్రకాశిస్తున్నవి. ఆ పూల సుగంధాన్ని ఆఘ్రాణించి మత్తెక్కగా మరలా ఆ కాంతిరవ్వలు నదీ ప్రవాహంలోకి దూకుతున్నవి.

బియాట్రైస్ నాతో అన్నది– “ఈ నది, మణులు, పుష్పాలూ, పచ్చిక అవి నిన్నాకర్షించడం ఇంకా నీలో మానవ దృష్టి మిగిలే ఉన్నదని తెలుపుతున్నది”

పాలకోసం వెదుకుతున్న అప్పుడే నిద్రలేచిన పసిపిల్లవాడిలా నేను ఆ నదీతీరం వద్దకు వెళ్లి ఆ సుందర దృశ్యాన్ని వీక్షించసాగాను. వాటిని నేను చూడగానే సరళరేఖలా ప్రవహిస్తున్న నది వలయంలా మారగా, ఆ పుష్పాలు, మణులు, ఆ వలయాకారపు దండలో పుష్పాలై పరిభ్రమిస్తూన్న స్వర్గంలోని దేవదూతలు, సాధుసంతులను చూసాను. “ఓ ప్రభూ! నేనిక్కడ చూసిన విషయాలను చూసినట్లు లిఖించగలిగిన పదజాలాన్ని నాకు ప్రసాదించు!”

పైన, ఓ అత్యంత ప్రకాశవంతమైన కాంతిదీపం సృష్టికర్తను తలపిస్తూండగా, అక్కడ నుండి వెలువడిన కాంతి వలయాకారపు అలల్లా విస్తృతి చెందుతున్నది. ఆ కాంతి వలయపు పరిధి ఊహకందనిది. ఆ దివ్యకాంతి పుంజం నుంచి వెలువడిన ఒక్క కాంతికిరణం ప్రైమమ్ మొబైల్‌కు తగిలి పరావర్తనం చెందగా ఇదంతా కనిపిస్తున్నది. నదిలోని నీళ్లలో కొండ, పచ్చిక, పూలు ప్రతిబింబిస్తున్నట్లు వేయి అంతస్థులలో, ఆశీర్వదింపబడినవారు ఉండడం నేను గమనించాను. దగ్గరైనా, దూరమైనా అనే బేధం లేని స్వర్గంలో, ప్రకృతి సూత్రాలేవీ పనిచేయని ఈ దివ్య ప్రదేశంలో ఈ శాశ్వత గులాబీ పుష్పంలో, ఈ ‘ఎంపిరియాన్’ (Empyrean)లో దేవుని కీర్తి పరిమళాలు అనంతంగా వ్యాపిస్తున్నాయి.

బియాట్రైస్ అన్నది– “చూడు! ఈ ధవళ వస్త్రధారులైన దివ్యాత్మలను! ఈ విశాలమైన ప్రాంగణాన్ని వీక్షించు! కిక్కిరిసిన ఈ ఆవరణను అవలోకించు! అడుగో అతడు కిరీటధారుడిగా ఉన్నవాడు ఏడవ హెన్రీ (Henry-VII) ఇటలీకి సరైన మార్గం చూపించబోయినవాడు. కాని సరైన సమయం కాకపోవడంతో పూర్తి విజయాన్ని సాధించలేదు. ఆతడిని మోసం చేసిన దురాశాపరుడు పోప్ క్లెమెంట్ (Clement-V) ఇంకెంతోకాలం తన పదవిలో ఉండబోడు. దేవుడు ఆతడిని సైమన్ మాగస్‌కు తోడుగా నరకాగ్నిలోకపు రాతి రంధ్రంలో నికొలాస్ (Nicholas-III) భుజాలపై ఉన్న బొనిఫేస్ (Boniface-VIII)పై నిలబడేట్లు చేసి ఈ ముగ్గురినీ మరింత అధఃపాతాళానికి నెట్టివేస్తాడు”

**Canto - 31**

**దశమ స్వర్గం – ఎంపిరియాన్. పవిత్ర గులాబి పుష్పం – బియాట్రైస్ బదులు సెయింట్ బెర్నార్డ్ కనిపించడంతో ఆశ్చర్యపడిన డాంటీ. సెయింట్ బెర్నార్డ్ ఉద్బోధనతో పవిత్ర గులాబీని, మేరీమాతను ధ్యానం చేసిన డాంటీ. పండుగ ఉత్సాహంలో ఉన్న దేవదూతలను చూసి ఆనందించిన మేరీమాత.**

# దశమ స్వర్గం – విరిసిన తెల్ల గులాబి

శిలువ వేయబడిన క్రీస్తు ద్వారా ఆశీర్వదించబడిన పవిత్రాత్మలు అందరూ తెల్లని దివ్యగులాబీ – ఎంపిరియాన్–లో గుమికూడినారు. పూలపై వాలి, మకరందాన్ని సేకరించుకుని ఎగిరిపోయే తేనెటీగల్లా ఆ తెల్ల గులాబీ రేకులపై వాలుతూ, ఎగుర్తూ ఆ దివ్యాత్మలు అనంతమైన ప్రేమ మాధుర్యాన్ని పొందుతున్నారు. వారి వదనాలు అగ్నిజ్వాలల్లా వారి రెక్కలు స్వర్ణకాంతులతో మెరుస్తుండగా తక్కిన శరీరమంతా మంచులా తెల్లని తెలుపుతో ప్రకాశిస్తున్నది. వారి అర్హతలు, దివ్యజ్ఞానాన్ననుసరించి వారు ఆ గులాబీ పుష్పంలోని రేకుల వలయాలపై పైనున్న అద్భుత కాంతి దీపానికి, తెల్లగులాబీకి మధ్య పరిభ్రమిస్తున్నారు. పాత కొత్త కాలాలకు చెందిన ఈ దివ్యాత్మలందరూ తమ దృష్టిని ఆ అద్భుత కాంతిపుంజం వేపే నిలిపి ఉంచినారు.

"ఓ త్రిశక్తియుతమైన కాంతిపుంజమా! నిన్ను చూస్తూ ఈ దివ్యాత్మలు అనంతమైన ఆనందాన్ని అనుభవిస్తున్నారు!

హెలిసీ (Helice = Callisto)ని వశపరచుకున్న జూపిటర్‌పై కోపంతో, జునో దేవత ఆమెను ఎలుగుబంటిగా మార్చగా, పెరిగి పెద్దవాడైన ఆమె కుమారుడు ఆర్కాస్ (Arcas) ఓ రోజున ఎలుగురూపంలో ఉన్న ఆమెను చంపబోగా, 'జూపిటర్' ఆమెను 'Great Bear'గా, ఆమె కుమారుడు ఆర్కాస్‌ను 'Little Bear'గా నక్షత్ర మండలంలో ప్రతిష్ఠించాడని ప్రతీతి. ఆ హెలిసీ నీడలో ఉండే అనాగరికులు రోమ్ నగరపు విశేషాలను చూసి ఆశ్చర్యంతో నోట మాట రాకుండా నిలబడి ఉన్నట్లు, ఆ తుచ్ఛ మానవలోకం నుండీ, కాలగణన ఉన్న ప్రాంతం నుండీ, మూఢులు ఉన్మత్తులూ ఉన్న ఫ్లోరెన్సు ప్రాంతం నుండీ వచ్చిన నేను ఈ స్థలకాలాలు లేని ఆనందమయ ప్రాంతంలో ఆ మహాకాంతి పుంజం ఎదురుగా నిలబడి వున్నాను. ఈ ఆనంద సమయంలో ఏమీ వినని, మాట్లాడలేని అనిర్వచనీయమైన స్థితి నాది. ఈ గులాబీ వలయాల్లో నడయాడుతూ నేను ఆ దివ్యాత్మలందరినీ తీర్థయాత్రికుడిలా చూసి నేను బియాట్రైస్‌తో మాట్లాడబోయి పక్కకు తిరిగాను. కాని నా పక్కన 'బియాట్రైస్'

కనిపించలేదు. ఆమె స్థానంలో మరో దివ్యాత్మ నన్ను దయతో చూస్తూ తండ్రిలా కనిపించాడు. "ఆమె ఎక్కడ?" అని నేను ప్రశ్నించాను.

అతడన్నాడు– "ఆమె కోరికమీదనే నేనిక్కడకు వచ్చాను. అటుచూడు ఆ మూడవ వలయంలో కిరీటధారిణిగా ఆమె తన సింహాసనం (Throne)పై ఆసీనురాలై యున్నది"

నేనటు చూసి ఆమెను గుర్తించి ఇలా ప్రార్థించాను– "దివ్య యువతీ! నీ వలన నా ఆశ శక్తిని పొందినది. నా విముక్తికోసం నీవు నీ అడుగుజాడలను నరకంలో వదిలి కరుణతో నన్ను ఇంతదూరం నడిపించినావు. బానిస బ్రతుకు నుంచి నాకు స్వేచ్ఛామార్గాన్ని చూపినావు. నీ ఔదార్యంతో నా ఆత్మను పరిశుద్ధపరచినావు. నేను ఈ శరీరాన్ని విడిచి ఆత్మగా మారినప్పుడు నాకు ఈ లోకంలోకి స్వాగతం చెప్పగలవని విశ్వసిస్తున్నాను"

ఆమె నావంక చిరునవ్వుతో చూసి మరల తన దృష్టిని ఆ శాశ్వత కాంతి పుంజంవేపు మరల్చినది. నా పక్కనే ఉన్న దివ్యాత్మ నాతో పలికినాడు– "ప్రార్థన, ప్రేమ, రెండూ నన్ను నీ వద్దకు పంపినవి. నీ ప్రయాణం ముగింపుకు వచ్చింది. ఈ తోట చుట్టూ నీ దృక్కులను ప్రసరింపజేయి. దేవుని కిరణాలు నిన్ను సంసిద్ధుణ్ణి చేస్తాయి. స్వర్గపురాణి (The queen of Heaven) మేరీమాత మనలను తన కరుణతో అనుగ్రహిస్తున్నది. నేను ఆమెకు విశ్వాసపాత్రుడను. నాపేరు బెర్నార్డ్ (Saint Bernard). క్రీస్తు ముఖకవళికలున్న వస్త్రాన్ని చూసి – O my Lord Jesus Christ, true God, was then Your image like the image I see now - అని ఆశ్చర్యపోయింది నేనే!" – "కుమారా! అటుచూడు ఈ ఆనంద సామ్రాజ్యానికి అధినేత్రి, రాణి మేరీమాతను దర్శించు!"

ఆ అద్భుత తెల్లగులాబీ మధ్యలో ఉదయపు ఆకాశం కన్నా తెల్లగా, స్వచ్ఛంగా ఉన్న ప్రాంతంలో, వేయికన్నా ఎక్కువ సంఖ్యలో ఉన్న దేవదూతలు పండుగ సంబరంలో నృత్యగానాలతో అలరిస్తూ ఉండగా వాటిని తిలకిస్తూ చిరునవ్వు నవ్వుతున్న మనోహరమైన 'ప్రేమమూర్తి'ని సందర్శించాను. సాధుసంతుల కీర్తనలు ఏ మాతృమూర్తిని వేనోళ్ల పొగడుతాయో ఆ దయాళువు, ప్రేమకు ప్రతిరూపం అయిన ఆమెకు నమస్కరించాను. నా కళ్లు ఆ దేవతపై స్థిరపడి ఉండడాన్ని గమనించిన 'బెర్నార్డ్' తనుకూడా ఆమెవైపు తదేక దృష్టితో చూస్తూ ధ్యాన నిమగ్నుడైనాడు.

**పదవ స్వర్గం – ఎంపిరియాన్ – స్వర్గ సామ్రాజ్యం – ఆశీర్వదించబడిన వారి స్థానాలు – పూర్వ నిర్ణయ సిద్ధాంతం – చిన్న పిల్లల ఆత్మలు – మేరీ – గాబ్రియెల్ దేవదూత – ఎంపిరియాన్‌లో భాగాలు – మేరీమాతను ప్రార్థించిన డాంటీ.**

# స్వర్గ సామ్రాజ్యపు విభాగాలు

ధ్యానంలో ఉండికూడా సెయింట్ బెర్నార్డ్ నాతో పలికినాడు– "తన గాయాన్ని పరిశుద్ధం చేసి నయం చేయగా మేరీమాత పాదాల చెంత ఉన్న దివ్యాత్మ ఈవ్ (Eve). రెండవ ఈవ్, రెండవ ఆదాంలుగా మేరీమాత, క్రీస్తులు పిలువబడినా, ఆదాం, ఈవ్‌లు చేసిన పాపాన్ని, గాయాల్ని వారు సరిచేసినారు. మేరీమాతకు దిగువ ఈవ్, ఆమెకు దిగువ రాఛెల్ (Rachel), ఆమెకు కుడివేపు మూడవ వరుసలో బియాట్రైస్, నాలుగవ వరసలో సారా (Sarah), అయిదవ స్థానంలో రెబెక్కా (Rebecca), ఆరవ స్థానంలో జుడిత్ (అస్సిరియన్ల సైన్యాధిపతి హోలోఫెర్నెస్ శిబిరంలోకి ప్రవేశించి, సారాయి మత్తులో ఉన్న ఆతడి శిరచ్ఛేదం చేసి ఇజ్రాయేలులను విముక్తం చేసిన వీరనారి) (Judith); ఏడవ స్థానంలో రూత్ (Ruth) – ఈమె 'Miserere mei' అని గానం చేసిన 'డేవిడ్' ప్రభువుకు Great Grand mother. ఎనిమిదవ వరస నుంచి పై వరసలలో హీబ్రూస్త్రీలున్నారు. ఈ అర్ధవలయంలో ఒకప్రక్క రాబోయే క్రీస్తుపై విశ్వాసం ఉన్నవారు, మరోపక్క అక్కడక్కడా ఖాళీ సీట్లతో ఉన్న భాగంలో ఇప్పటికే వచ్చిన క్రీస్తును దర్శిస్తున్న వారితో నిండి వున్నది.

రెండవ అర్ధవలయంలో సెయింట్ జాన్ (Saint John the Baptist) (ఎడారిలో తిరిగి, హెరాడ్‌చే శిక్షింపబడి మృతి చెందినవాడై, రెండేళ్లు 'లింబొ' (Limbo)లో ఉండి క్రీస్తు విజయం అనంతరం ఎంపిరియాన్‌కు వచ్చినాడు. అతనికి దిగువగా ఫ్రాన్సిస్, బెనెడిక్ట్, ఆగస్టైన్ కూర్చొనగా, రెండు అర్ధవలయాల మధ్య చిన్నపిల్లల ఆత్మలున్నవి. ఆకలిదప్పులు, దుఃఖం లేని ఈ లోకంలో వారివారి సుగుణాలను బట్టి స్థానాలు కేటాయించబడినవి. ప్రతి ఆత్మ తనకున్న ప్రత్యేక గుణాలతో విభిన్నంగా సృష్టించబడినది, ఉదాహరణకు 'రెబెక్కా' గర్భంలోనే పోట్లాడుకున్న ఇసావు, జాకబ్ (Isau, Jacob) కవలల్లా, జాకబ్ జుట్టు నల్లగా ఉండగా, ఇసావు జుట్టు ఎర్రగా ఉండి శరీరమంతా గొంగళిలా కప్పి ఉండడం తెలిసినదే.

వెనకటి శతాబ్దాల్లో తల్లిదండ్రుల స్వచ్ఛత, అమాయకత్వాలు పిల్లలకు ముక్తినిచ్చేవి. తరువాత ప్రతి మగశిశువూ 'సున్నతి' (Circumcission) ద్వారా,

తదుపరి కాలంలో 'పవిత్రస్నానం' (Baptism) ద్వారా దేవునికి తన విధేయతను తెలియబరచేలా నిబంధనలు ఏర్పర్చబడినాయి. నీవిప్పుడు క్రీస్తు వదనంలా కనిపించే వదనాన్ని గుర్తించు. ఆ కాంతి ద్వారానే నీవు క్రీస్తును చూడగలవు" అని సెయింట్ బెర్నార్డ్ నాతో పలికినాడు.

నేను మేరీమాత వదనాన్ని గుర్తించి ప్రార్థిస్తున్నపుడే గాబ్రియేల్ దేవదూత – Ave Maria, Gratia Plena - అని గానం చేయగా మిగిలిన దేవదూతలు తమ గొంతు కలిపి పాడినారు.

సెయింట్ బెర్నార్డ్ నాతో చెప్పినాడు– "గాబ్రియేల్ దేవదూత (రక్షకుని ఆగమనాన్ని తెలిపినవాడు అతడే) చేతిలోని విజయసూచకమైన 'Palm' హస్తాన్ని చూసినావు కదా! మేరీమాతకు దగ్గరలో ఎడమపక్క పాత నిబంధన కాలపువారు, కుడిపక్క కొత్త నిబంధన కాలపువారు కూర్చుని ఉన్నారు. మేరీమాతకు ఎడమ వేపున ఉన్నది ఆదాం (తొలి మానవుడు – నిషేధఫలాన్ని తిని వారసులకు పాపాన్ని ఇచ్చినవాడు) – కుడిపక్కన వున్నది – క్రీస్తు తాళంచెవులు ఇచ్చిన సెయింట్ పీటర్. పీటర్‌కు కుడిపక్క సెయింట్ జాన్ (The Evangelist) (చర్చి ఉత్థానపతనాలను చూపినవాడు – బల్లెం, మేకులను కానుకగా పొందినవాడు); ఆదాంకు ఎడమ పక్కన ఎడారిలో దైవప్రసాదమైన 'మన్నా' తిన్న యూదుల నాయకుడు మోసెస్ (Moses); పీటర్‌కు ఎదురుగా మేరీమాత తల్లి 'అన్నా' (Anna) హోసన్నాలను గానం చేస్తున్నది. ఆదాంకు ఎదురుగా మేరీమాత పంపగా, బియాట్రైస్‌ను నీకొరకు పంపిన ల్యూసియా (Saint Lucy) కూర్చుని ఉన్నది.

వస్త్రాన్ని ఎంతవరకు కత్తిరించాలో తెలిసిన దర్జీ (Tailor)లా మనం ఇక్కడ ముగించాలి. నీవు క్రీస్తును చేరుకునే ముందు నీకు సాయం చేయగల ఆ మాతృమూర్తి, దయామయి మేరీమాతను ప్రార్థించు. నా మాటలు, నీ హృదయం ఒక్కరీతిగా స్పందించి ఆమె కరుణ నీపై జాలువారునుగాక!" అని సెయింట్ బెర్నార్డ్ మేరీమాతను ప్రార్థించుచుండగా నేను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆ మాతృమూర్తిని వేడుకున్నాను.

**Canto - 33**

**దశమ స్వర్గం – ఎంపిరియాన్ – మేరీకన్యను ప్రార్థించిన సెయింట్ బెర్నార్డ్. ఆతని ప్రార్థనను స్వీకరించిన మేరీమాత. శాశ్వత కాంతిపుంజాన్ని వీక్షించిన డాంటీ. త్రిమూర్తి తత్వపు కాంతివలయాలు – పునర్జన్మ – డాంటీ దర్శనం సంపూర్ణం.**

# ట్రినిటీని దర్శించిన డాంటీ

"కన్యామాతా! వినయం, నిరాడంబరత, మహనీయతలలో సాటిలేనిదానా! అనంతత్వాన్నుంచి వచ్చిన ఆదేశాన్ని శిరసావహించి నిర్దేశించబడిన గమ్యానికి తోడ్పడినావు. మానవజాతిని ఉన్నతశ్రేణికి ఎదిగేలా చేసి, సృష్టికర్త ఈ తెగను ఏవగించకొనకుండా కాపాడినావు. ఈ అద్భుత పుష్పాన్ని వికసింపజేసే ప్రేమవు నీవు. నీ గర్భకోశంలో వెలుగుజూసిన అగ్ని మా అందరికీ శాంతిని కరుణను ప్రసాదించినది.

నీవిక్కడ మిట్టమధ్యాహ్నపు కరుణా కాంతిపుంజానివి. భూలోకంలో మానవులకు ఆశా సెలయేటి ప్రవాహానివి. ఎంతో ఉన్నతంగా ఉన్న నిన్ను చూడడానికి ఉవ్విళ్లూరే నాబోటివాళ్లకు రెక్కలను ప్రసాదించేదానివి. అడగక మునుపే ఆకలిని తీర్చే మాతృమూర్తివి నీవు. దయవు నీవు, కరుణవు నీవు, జాలివి నీవు, ఔదార్యానివి నీవు. ప్రతి జీవిలోనూ కనిపించే మంచితనానికి ప్రతిరూపానివి నీవు.

ఈ మానవుడు ఈ విశ్వంలోని అట్టడుగు లోకం నుంచి ఈ ఎత్తులకు వచ్చినాడు. దివ్యాత్మల జీవితాలను శోధించినాడు. అతడు నిన్ను వేడుకుంటున్నాడు – తన దృష్టిని మరింత ఊర్ధ్వలోకాలకు కొనిపొమ్మని – అంతిమమైన ముక్తిస్థానాన్ని చేర్చమని, ప్రార్థిస్తున్నాడు.

నాకోసం ఏమీ కోరుకోని నేను ఈతడి కోసం ఈ విన్నపాన్ని చేస్తున్నాను. నా ప్రార్థనలను అంగీకరించి, ఈతని చుట్టూరా ఉన్న మరణమేఘాలను తొలగించి ఈతడు సచ్చిదానందాన్ని వీక్షించే వీలు కల్పించు.

స్వర్గలోకపు అధినేత్రీ! నీ దర్శనభాగ్యంతో ఈతడు పునీతుడైనాడు. ఇప్పుడు ఈతనిలోని మానవసహజ ఉద్వేగాలు నశించునుగాక!

అదుగో 'బియాట్రైస్!' ఆమెచుట్టూరా ఉన్న సాధుసంతులు! వారందరూ నా యీ ప్రార్థనలో తోడుపడెదరు గాక! వారు తమ కరతాళధ్వనులతో నిన్ను

వేడుకుంటున్నారు" – సెయింట్ బెర్నార్డ్ నా తరపున చేసిన ప్రార్థనను మేరీమాత స్వీకరించినది.

మేరీమాత తన కన్నులను ఆ శాశ్వత కాంతిపుంజం వేపు మరల్చినది. సెయింట్ బెర్నార్డ్ సూచనతో నేనూ అప్పటికే అటు చూస్తున్నాను. నేను చూస్తున్న ఆ అతిలోక దృశ్యాలను వర్ణించడానికి మాటలు చాలవు. స్వప్నంలో మనం దర్శించిన విషయాలలో కొన్ని మాత్రమే మనకు గుర్తున్నట్లు, నేను వీక్షించిన విశేషాలలో ఎన్నిటిని నేను లిఖితపూర్వకంగా వర్ణించగలుగుతానో చెప్పలేకున్నాను. మాటలకందరాని ఆ మధురానుభూతి నా హృదయంలో శాశ్వతంగా నిలిచిపోయింది.

ఎండ వేడిమికి కరిగిన మంచులా, గాలిలో ఎగిరిపోయే ఆకుల్లా, 'సిబిల్' (Sibyl) జోస్యాల్లా చాలా విషయాలు నా మనోఫలకం నుంచి మాయమయ్యాయి.

"ఓ ఉన్నత కాంతిదీపమా! గుర్తుండేందుకు నాకు జ్ఞాపకశక్తిని అనుగ్రహించు! నీ కీర్తిని, ఘనతను పొగిడేందుకు నా నాలుకకు శక్తినివ్వు! నీ విజయాన్ని ఈ మానవులు అర్థం చేసుకునేలా వ్రాసేందుకు తగిన పదజాలాన్ని నాకందించు!

నేను ఎదుర్కొన్న దుస్తర పరిస్థితులు నన్ను తప్పుదారిన నడిపించేలోపులే నా దృష్టి అత్యున్నతపు మంచికి నిలయమైన నీవేపు మళ్లింది. నీద్వారా నేను శాశ్వత కాంతిపుంజం వేపు తనివితీరా చూడదలుచుకున్నాను. నన్ను అనుగ్రహించు! నేను గ్రహించిన ఈ అపార జ్ఞానాన్ని, ప్రేమతో సంపాదించి బంధించిన ఈ సంపద (Substances, accidents, dispositions)లో నేను భవిష్యత్తరాలకు అందజేయ గలిగింది రేఖామాత్రంగానే!

ఆధ్యాత్మిక, భౌతిక సంపదలను ముడివేసే ముడి (Knot)ని చూసాను. ఆ ఒక్క విషయమే నాకు మరింత మరపును కలుగజేస్తున్నది. ఇరవై అయిదు శతాబ్దాలు గడచినా – బంగారు ఉన్నికోసం 'ఆర్గొ' (Argo) నౌకలో బయల్దేరిన ఆర్గొనాట్లు, నెప్ట్యూన్ మదిలో భయాన్ని రేకెత్తించిన విషయం ప్రజలకు గుర్తున్నది. నేను ఇప్పటి విషయాలనే మరచిపోతున్నాను.

